ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 30-4-2025 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 260
రూ. 6-50. పేజీలు 16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే • అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ

- త్రివిధ దళాల అధిపతులతో దిల్లీలో భేటీ
- రక్షణ మంత్రి, సీడీఎస్, జాతీయ భద్రతా సలహాదారు హాజరు
- మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఐరాస
- ఇరు దేశాలు సంయమనం పాటించాలి: చైనా
- ఐక్యరాజ్యసమితిలో భారత్, పాక్ ప్రతినిధుల పరస్పర ఆరోపణలు
- జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంట ఐదో రోజూ పాక్ ఆర్మీ కాల్పులు
- పహల్గాం ఉగ్రదాడి నిందితుల కోసం కొనసాగుతున్న వేట

దిల్లీ

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతోందా? ఆ మేరకు సైనిక దళాలను సన్నద్ధం చేస్తోందా? ముష్కర మూకలపై ఎప్పుడు, ఎలా చర్యలు తీసుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను సైన్యానికి ఇవ్వడం, అత్యున్నత స్థాయిలో వరుసగా పలు కీలక భేటీలు నిర్వహించడం ఈ విషయాన్నే స్పష్టంచేస్తున్నాయి.

ఉగ్రవాదాన్ని మట్టి కరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు మంగళవారం దిల్లీలోని తన నివాసంలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులు పలు దఫాలుగా సమావేశమై వ్యూహాల్ని సమీక్షించారు.



ప్రధాని మోదీతో సమావేశమైన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్. చిత్రంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, త్రిదళాధిపతి అనిల్ చౌహాన్, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠీ, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్

మరోవైపు సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలను కొనసాగిస్తూనే ఉంది. వరుసగా ఐదో రోజూ (సోమవారం అర్ధరాత్రి) నియంత్రణ రేఖ వెంట కాల్పులు జరపగా భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని సడలింపజేయటానికి మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెరస్ వెల్లడించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా సూచించింది. దక్షిణాసియాలో భారత్, పాకిస్థాన్ రెండూ ముఖ్యమైన దేశాలని, శాంతి, సుస్థిరత, అభివృద్ధి సాధనకు సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ ఓ మీడియా సమావేశంలో అభిలషించారు.

...మిగతా 13లో

నేడు కేంద్ర క్యాబినెట్ భేటీ

కేంద్ర క్యాబినెట్ బుధవారం సమావేశం కానుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరుగుతున్న తొలి భేటీ కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించనున్నారు. గత వారం మంత్రిమండలి సమావేశం జరగలేదు. 23న భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై ఉగ్రదాడిని ఖండించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

కరెంటు ఛార్జీల పెంపు లేదు



టారిఫ్ ఉత్తర్వు జారీచేసిన ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున్

- ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని డిస్కంల పిటిషన్
- విచారణ జరిపి రూ.13,499 కోట్లుగా నిర్ధారణ
- ఆ మొత్తాన్ని రాయితీగా ఇస్తామన్న ప్రభుత్వం



కరెంటు ఛార్జీల టారిఫ్ వివరాలు వెల్లడిస్తున్న జస్టిస్ నాగార్జున్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కరెంటు ఛార్జీల పెంపు లేదని, పాత పద్ధతిలోనే యథాతథంగా వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు గురువారం (మే 1) నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు.

రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్‌సీ తేల్చింది. ఈ ఏడాది ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని గత నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపగా.. అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు. వ్యవసాయ కరెంటు వినియోగం ఎక్కువగా ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్‌సీ విచారణలో నిర్ధారించినట్లు వివరించారు. మొత్తం ఆర్థికలోటు తీర్చడానికి రూ.13,499.41 కోట్లను రాయితీగా విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా తెలిపినందున

...మిగతా 6లో



నేడు పది ఫలితాలు

- మధ్యాహ్నం ఒంటి గంటకు విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం వెల్లడి కానున్నాయి. రవీంద్రభారతి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం ఒంటి గంటకు ఫలితాలను విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఎ.కృష్ణారావు తెలిపారు. ఈసారి జీపీఏ విధానాన్ని తొలగించినందున సబ్జెక్టుల వారీగా మార్కుల గ్రేడ్లు ఇవ్వనున్నారు.

...మిగతా 6లో

అసమర్థత.. అవినీతితోనే కాళేశ్వరం కూలింది


- లోపాలను బయటపెట్టిన ఎన్డీఎస్ఏ నివేదిక
- డీపీఆర్ కోసం ఓ పెద్దమనిషి తొందరపెట్టారు
- మేడిగడ్డ కట్టింది, కూలింది భారాస హయాంలోనే
- పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్



పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో మాట్లాడుతున్న ఉత్తమ్, పక్కన పొన్నం

ఈనాడు, హైదరాబాద్: "గత భారాస ప్రభుత్వం అవినీతి, అసమర్థతతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. నిర్మాణంలో డిజైన్లు, కన్‌స్ట్రక్షన్, నిర్వహణ లోపాలు పెద్ద ఎత్తున ఉన్నాయని, వీటివల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగటంతోపాటు.. ఇతర బ్యారేజీల్లో లోపాలు బయటపడ్డాయని సాక్షాత్తు దేశవ్యాప్తంగా ఆనకట్టలను పర్యవేక్షించే జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ (ఎన్డీఎస్ఏ) తన నివేదికలో వెల్లడించింది. రూ.లక్ష కోట్ల ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులు, గత ప్రభుత్వంలోని పెద్దలపై మా సర్కారు చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది" అని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

...మిగతా 12లో



లిబరల్ పార్టీకే ఆధిక్యం

- కెనడా ప్రధానిగా కొనసాగనున్న కార్నీ

టొరంటో: కెనడా పార్లమెంటు ఎన్నికల్లో అధికార లిబరల్ పార్టీకే ఆధిక్యం లభించింది. 343 సీట్లున్న పార్లమెంటులో ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ నేతృత్వంలోని ఆ పార్టీకి 168 సీట్లు దక్కాయి. అయితే ఆ పార్టీ ఇంకా మెజారిటీ మార్కును చేరుకోలేదు. ఇప్పటిదాకా పూర్తయిన కౌంటింగ్‌లో మెజారిటీకి అవసరమైన 172 సీట్లను ఆ పార్టీ సాధించలేకపోయింది.

...మిగతా 6లో

వేసవిలో.. వేద్దామా పునాది!



ప్రత్యేక కథనం... 12లో

వేసవి సెలవులు... చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసేందుకు ఓ అద్భుత అవకాశం. ఆటలేమైనా అన్నం పెడతాయా... అని నిట్టూర్చొద్దు. సెలవుల్లో కూడా చదువుల పేరుతో పిల్లలను బందీలను చేయొద్దు. ఆటలు ఆడడం ద్వారా పిల్లల్లో కష్టపడే తత్వం.. సవాళ్లకు ఎదురీదే ధైర్యం.. ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి. ఇంకెందుకాలస్యం... ఈ వేసవిలో వారిని క్రీడా మైదానాలవైపు నడిపించండి.

1న దోస్త్ షెడ్యూల్!

సీఎంఓ ఆరాతో మార్గం సుగమం

ఈనాడు, హైదరాబాద్: డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్, షెడ్యూల్‌ను మే 1న విడుదల చేయనున్నారు. ఇంటర్ ఫలితాలు విడుదలై వారం అవుతున్నా దోస్త్ నోటిఫికేషన్ వెలువడకపోవడంపై 'ఈనాడు'లో మంగళవారం దోస్త్ నోటిఫికేషన్ ఎప్పుడు? శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో సీఎం కార్యాలయ అధికారి మాణిక్యరాజ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తదితరులు విద్యామండలి అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. సమస్యను వివరించడంతోపాటు విద్యాశాఖలోని ఓ అధికారి జోక్యం ఎక్కువైందని విద్యామండలి అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. వారి సూచనలతో మే 1న షెడ్యూల్ జారీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

టెట్‌కు ఈసారి 1.50 లక్షల మందే!

- భారీగా తగ్గిన దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు

– లోపలి పేజీలో..

రూ.లక్ష కోట్లు వృథా అయితే.. నీళ్లెలా వస్తున్నాయి?

- కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా?
- ఖర్చు రూ.90 వేల కోట్లయితే.. రూ.లక్షల కోట్ల నష్టమెలా?
- మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదు
- దానికి త్వరగా మరమ్మతులు చేయండి: హరీశ్‌రావు

12లో

మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు
- సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం

6లో



ఇదీ సంగతి!



కొత్త నగ సరే! బీరువాలోని

పారిశ్రామిక పార్కులు అంతంతే

- ద్వితీయ శ్రేణి పట్టణాల్లో పడకేస్తున్న పరిస్థితి
- అరకొర మౌలిక వసతులు.. ఆసక్తి చూపని పారిశ్రామికవేత్తలు

ఈనాడు- నల్గొండ, నిజామాబాద్, వరంగల్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, ఖమ్మం: రాష్ట్రంలో పారిశ్రామిక వికేంద్రీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఎక్కడికక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని అవాంతరాల మూలంగా లక్ష్యం నెరవేరడం లేదు. వివిధ జిల్లాల్లో విరివిగా పండే వరి, పత్తి, పసుపు, మామిడి, బత్తాయి, మిరప, జొన్నలు, వేరుసెనగలతో ఉత్పత్తులు తయారు చేసి... విదేశాలకు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ఆహారశుద్ధి పరిశ్రమల జోన్ల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. మార్కెట్ ధర కంటే తక్కువకే భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా భూములను తీర్చి



వెలిమినేడులో ఆహారశుద్ధి పరిశ్రమ కోసం భూములు సేకరించాల్సిన ప్రాంతం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో రెండేళ్ల క్రితం ఆహారశుద్ధి పరిశ్రమల కోసం 355 ఎకరాలు సేకరించారు. 26 రకాల పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటివరకు నాలుగింటికి 30 ఎకరాలు కేటాయించినా.. ఒక్క పరిశ్రమ కూడా ప్రారంభం కాలేదు. రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్తు దీపాల ఏర్పాటుకు రూ.46 కోట్లు కేటాయించగా.. రూ.37 కోట్లు ఖర్చు చేశారు. పనులు కొనసాగుతున్నాయి.



గ్రామంలో విద్యుత్ తీగల్లా వేలాడుతున్న మంచినీటి పైపులు



బోర్లు ఉన్న ఇంటి నుంచి గ్రామంలో ఇళ్లకు ఇచ్చిన పైపు కనెక్షన్లు

వేలాడే నీటి పైపుల గ్రామం వడ్‌ఝరి

ఏ గ్రామంలోనైనా విద్యుత్ తీగలు గాలిలో వేలాడుతూ ఉంటాయి. కానీ నిర్మల్ జిల్లా తానూరు మండలం బోల్సా గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం వడ్‌ఝరిలో మాత్రం మంచినీటి పైపులైన్లు ఇళ్ల పైనుంచి వేలాడుతూ కనిపిస్తాయి. ఆ ఊరిలో బోర్లు ఉన్న ఇద్దరి దగ్గర నుంచి ప్రతి కుటుంబం ఏడాదికి రూ.4 వేలు ఇచ్చి మంచి నీటిని కొనుగోలు చేసుకుంటోంది. బోర్లు ఉన్న వారి ఇంటినుంచి గాలిలో వేలాడే పైపుల ద్వారా గ్రామంలో అందరి ఇళ్లకు తాగునీరు సరఫరా అవుతుంది. వడ్‌ఝరిలో 90 నివాసాలు ఉన్నాయి. 120 కుటుంబాలున్నాయి. పూర్వం నుంచి ఈ గ్రామవాసులు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల కిందట మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామంలో పెద్ద ట్యాంకు నిర్మించి నీటి సరఫరా చేపట్టినా.. పైపులు ఎక్కడికక్కడ పగిలి లీకవ్వడంతో నిలిపివేశారు. తరువాత పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ విషయమై తానూరు ఎంపీడీవో నసీరుద్దీన్‌ను వివరణ కోరగా.. నీటి సమస్య అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో కొత్త బోరు వేయిస్తామని తెలిపారు. అప్పటివరకు సాయం అందించాలని స్థానిక బోరు యజమానులను కోరినట్లు చెప్పారు.

– ఈనాడు, ఆదిలాబాద్
– న్యూస్‌టుడే, బైంసా (తానూరు)


JOS ALUKKAS
శుభప్రదమైన
ప్రతి
ఆరంభానికీ
బంగారం
Akshaya Tritiya
ఈరోజు
*షరతులు వర్తిస్తాయి
PUSH360
రూ.75,000 విలువగల
బంగారు ఆభరణాల కొనుగోలుపై
బంగారు నాణెం ఉచితం
వజ్రాలు
తగ్గింపు
రూ.15,000
తగ్గింపు ప్రతి క్యారట్‌కు
ఉచితం
వజ్రాల కొనుగోలుపై
ప్రతి క్యారట్‌కు 500 మి.గ్రా.ల
బంగారు నాణెం ఉచితం
ప్లాటినం
15% తగ్గింపు
తరుగు ఛార్జీలపై
వెండి
0% తరుగు
వెండి ఆభరణాలకు
30% వరకు
తగ్గింపు
బంగారు ఆభరణాల
తరుగు ఛార్జీలపై
మీ పాత బంగారు ఆభరణాలను
HUID బంగారు
ఆభరణాలకు
ఎక్స్ఛేంజ్ చేసుకోండి అధిక లాభాలతో
మా షోరూమ్‌లు ఈరోజు
ఉ. 8.30 ని॥ల నుంచి తెరిచి ఉంటాయి
UP TO
₹5,000 CASHBACK#
SBI card
#Min. Trxn.: ₹50,000; Max. Cashback: Upto ₹5,000 per card account.
Validity: 27 Apr - 03 May 2025. T&C Apply.
NIZAMABAD: Dwaraka Nagar, Hyderabad Road. Ph:08462– 234916 | KHAMMAM:
Wyra Road Ph: 08742 – 226916 | HANAMKONDA: Nakkala Gutta, Ph: 0870 – 2931916
జోస్ ఆలుక్కాస్



అయోధ్య రామాలయంలో
42 అడుగుల ధ్వజస్తంభం

అక్షయ తృతీయ వేళ అయోధ్య రామమందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన క్రతువు పూర్తిచేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. 42 అడుగుల పొడవైన ధ్వజస్తంభాన్ని వైశాఖ శుక్లపక్ష విదియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠించినట్లు తెలిపారు. సంబంధిత చిత్రాలను సోషల్ మీడియా వేదికగా ఆయన పంచుకున్నారు. రామమందిరంలో ఏడు మండపాల నిర్మాణం త్వరలోనే పూర్తికానున్నట్లు వెల్లడించారు. రామ్‌దర్బార్‌లోని విగ్రహాలు మే నెలలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఈశాన్య ప్రాంతంలో శివాలయం, నైరుతి మూలలో సూర్య దేవాలయం నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి అన్ని పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

–అయోధ్య

అవి పట్టా భూములే

భూదాన్ భూములంటూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయండి

- హైకోర్టులో ఐపీఎస్‌ల అప్పీళ్లు.. నేడు విచారణ

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 194లో తాము కొనుగోలు చేసిన భూములు భూదాన్‌వి కాదని, పట్టా భూములేనంటూ పలువురు ఐపీఎస్‌లు హైకోర్టుకు నివేదించారు. ఈ సర్వే నంబరులో 16, 20, 18 గుంటల విస్తీర్ణాలతో కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించిన విక్రయ ఒప్పందపత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. నాగారం గ్రామంలో సర్వే నం.181, 182, 194, 195లలో భూదాన్ భూములకు సంబంధించి పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో సహా ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణల నేపథ్యంలో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను పలువురు అధికారులు తాజాగా సవాల్ చేశారు. ఈ మేరకు ఐపీఎస్‌లు రవిగుప్తా, తరుణ్‌జోషి, బి.కె.రాహుల్ హెగ్డే, జితేందర్ కుమార్ గోయల్ భార్య రేణుగోయల్, ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కుమారుడు రాహుల్ బుసిరెడ్డి, ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, సౌమ్య మిశ్ర, స్వాతి లక్రా, ఉమేశ్ షరాఫ్ భార్య రేఖ షరాఫ్‌లతోపాటు ప్రైవేటు వ్యక్తి వీరన్నగారి గౌతంరెడ్డి హైకోర్టులో వేర్వేరుగా 4 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

'భూదాన్ జాబితాలో 194 సర్వే నంబరు లేదు'

నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదులైన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, పలువురు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేయడంతోపాటు సర్వే నం.181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. తమతోపాటు భూమి యజమానులకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోకుండానే సింగిల్ జడ్జి ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేశారంటూ అప్పీలుదారులు పేర్కొన్నారు. తాను అధికారులకు సమర్పించిన వినతి పత్రాలపై దర్యాప్తునకు సంబంధించి నివేదికలు తెప్పించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ అభ్యర్థించారని, అయితే దీనికి మించి ఉపశమనం కలిగిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 194, 195 సర్వే నంబర్లలో 30 ఎకరాలుండగా, అందులోని భూములను కొనుగోలు చేశామన్నారు. భూదాన్ భూములను ప్రైవేటు భూములుగా మార్చారన్న ఆరోపణలు అవాస్తవమన్నారు. 2023 నవంబరులో తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో. . సర్వే నం.181లోని 50 ఎకరాలను భూదాన్ భూమిగా పేర్కొందన్నారు. బోర్డు పేర్కొన్న జాబితాలో సర్వే నం.194 లేదన్నారు. 2019 ఫిబ్రవరిలో సర్వే నం.194, 195ల్లోని (సర్వే నం.195/2లో 95.25 ఎకరాలు మినహా) భూములను పట్టా భూములుగా పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారన్నారు. పిటిషనర్ ఈ ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన పత్రాలను సింగిల్ జడ్జికి సమర్పించలేదన్నారు. ఈ భూమికి సంబంధించి పిటిషనర్ మల్లేశ్ తల్లి కూడా కొన్ని విక్రయ ఒప్పందాలు చేశారని పేర్కొన్నారు.

'భూదాన్' కేసులో.. కార్లు, నగదు స్వాధీనం: ఈడీ

ఈనాడు, హైదరాబాద్: మహేశ్వరం మండలం నాగారం గ్రామ పరిధిలో ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి భూదాన్ భూములు కొల్లగొట్టిన కేసులో పెద్దఎత్తున సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం వెల్లడించింది. 'నిందితులు ఖదీరున్నీసా, మహ్మద్ మునావర్‌ఖాన్, మహ్మద్ లతీఫ్ షర్ఫాన్, మహ్మద్ అక్తర్ షర్ఫాన్, మహ్మద్ షుకూర్ తదితరుల ఇళ్లలో సోమవారం సోదాలు నిర్వహించాం. మునావర్ ఖాన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో పెద్దమొత్తంలో ప్రభుత్వ భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు చెందిన తప్పుడు ధ్రువపత్రాలు, రూ.23 లక్షల నగదు, 12వేల యూఏఈ దిర్హామ్స్, అనేక వింటేజ్ కార్లతో సహా పాతవి, కొత్తవి కలిపి 45 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటనలో పేర్కొంది.

ఈనాడు

అశ్లీల దృశ్యాల వరద!

అదుపు లేని గుర్రాలు అడవులను పట్టుకుని తిరిగినట్లు, సెన్సార్ పగ్గాలకు దొరకని ఓటీటీలు అసభ్య, అశ్లీల దృశ్యాల గుమ్మరింతలో పోటీపడుతున్నాయి. జుగుప్సాకర నేరాలను కథావస్తువులుగా మార్చి చూపించే వికార కాల్పనికత్వం, సహజత్వం పేరిట సంభాషణలను పచ్చి బూతులతో నింపేయడం, శృంగార సన్నివేశాల చిత్రీకరణలో విశృంఖలత్వం వంటివాటికి పేరుమోసిన ఓటీటీలు- నవతరాన్ని నైతికంగా పతనం చేస్తున్నాయి. సమాజ నడవడికను దెబ్బతీస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న వాదనలు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కొన్ని ఓటీటీలు అశ్లీల అంశాలకు పెద్దపీట వేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు- ఆయా కార్యక్రమాల నియంత్రణకు ఒక యంత్రాంగం ఉండాలని నాలుగేళ్ల నాడే అభిప్రాయపడింది. సామాజిక మాధ్యమాల్లో కట్టుతప్పుతున్న కంటెంట్‌కు కళ్లేలు బిగించాల్సిన ఆవశ్యకతను 'సుప్రీం' రెండు నెలల క్రితం ప్రస్తావించింది. ఓటీటీలు, సోషల్‌మీడియాలో పరవళ్లు తొక్కుతున్న రోత దృశ్యాల కట్టడికి అవసరమైన చట్టపరమైన ఏర్పాట్ల గురించి న్యాయపాలిక తాజాగా మరోమారు సర్కారుకు గుర్తుచేసింది. కాసులకక్కుర్తితో మనిషిలోని పశుప్రవృత్తిని రెచ్చగొడుతున్న అంతర్జాల వేదికలను నియంత్రించి తీరాల్సిందే!

కొవిడ్ రోజుల్లో జనమంతా ఇళ్లకే పరిమితమైన దరిమిలా వినోద రంగం తీరుతెన్నులే మారిపోయాయి. ఆ సమయంలో విపరీతమైన ప్రేక్షకాదరణకు నోచుకున్న ఓటీటీల్లో కొన్ని జుగుప్సాకర కంటెంట్‌ను కావాలని ప్రోత్సహిస్తూ ఆదాయాలను పెంచుకున్నాయి. కరోనా మహమ్మారి విజృంభణకు ముందు 2019లో భారతీయ ఓటీటీ మార్కెట్ విలువ సుమారు నాలుగువేల కోట్ల రూపాయలు. 2023లో దాని పరిమాణం రూ.17,496 కోట్లకు చేరిందని, 2028 నాటికి అది రూ.35వేల కోట్లకు పైబడుతుందని ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్ మొన్నామధ్య నివేదించింది. ఇంటర్‌నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, నిరుడు మనదేశంలో అంతర్జాల వినియోగదారుల సంఖ్య 88.6 కోట్లు. వారిలో 73.2 కోట్ల మంది ఓటీటీ యాప్‌లను వీక్షించారు. ఇలాంటివారి సంఖ్య రాబోయే రోజుల్లో ఇంకా పెరగబోతోంది. స్మార్ట్‌ఫోన్ల ద్వారా అంతమందికి చేరుతున్న కంటెంట్‌లో అశ్లీలత హద్దులు దాటితే అది విపరీత పరిణామాలకు దారితీస్తుంది. వెబ్‌సిరీస్‌లూ సామాజిక మాధ్యమాల్లో చూసి నేరాలకు పాల్పడుతున్న ప్రబుద్ధుల గురించి ఇప్పటికే అనేక కథనాలు వెలువడుతున్నాయి. సామాజిక సంక్షోభం తీవ్రతరం కాకమునుపే అంతర్జాల దృశ్యమాధ్యమాలకు నిర్దిష్ట సెన్సారింగ్ విధానాలను వర్తింపజేయాలి!

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో పేర్కొన్నట్లు, గౌరవప్రదమైన వ్యక్తులెవరూ కలిసి చూడలేనంత ఘోరంగా ఉంటున్నాయి కొన్ని ఓటీటీ కార్యక్రమాలు! ఇక సోషల్ మీడియాలో వరదలెత్తుతున్న కంటెంట్ వెనక ఎన్నో వికృత కోణాలు! వీటన్నింటికీ పిల్లలు వీక్షకులు అవుతుండటమే తీవ్రంగా కలవరపరుస్తోంది. లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 368 అర్బన్ జిల్లాల్లో నిర్వహించిన సర్వేలో 9-17 ఏళ్ల బాలబాలికల్లో చాలామంది రోజుకు 3-6 గంటల పాటు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నట్లు తేలింది. గ్రామీణ భారతంలో కూడా 14-15 ఏళ్ల పిల్లల్లో 76శాతం మంది సోషల్ మీడియా కోసమే స్మార్ట్‌ఫోన్లను వాడుతున్నట్లు 2024 'అసర్' నివేదిక వెల్లడించింది. అంతర్జాలానికి అలవాటుపడిన పిల్లలు తరచూ కోపతాపాలకు గురవుతూ సహనానికి దూరంగా, సోమరితనానికి దగ్గరగా రోజులు గడుపుతున్నారని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. కాబట్టి నెట్‌లో పిల్లలు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తుండాలి. అభ్యంతరకరమైన అంశాలేవీ ఓటీటీలు, సోషల్ మీడియా ద్వారా చిన్నారులకు చేరకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టం చేయాలి. అప్పుడే భావిభారత పౌరుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోగలం!



ఇప్పుడు చాలామంది మహిళలు న్యాయ రంగంలోకి వచ్చినప్పటికీ పురుషులతో పోలిస్తే వాళ్ల ప్రాతినిధ్యం తక్కువే. అయితే లా చదువుతున్న యువతుల సంఖ్య చూసినప్పుడు త్వరలోనే ఆ అంతరం పూడుతుందన్న ఆశ కలుగుతోంది.

– జస్టిస్ ఫాతిమా బీవీ
సుప్రీంకోర్టులో తొలి మహిళా న్యాయమూర్తి

చందనస్వామి వైభవం

దక్షిణ భారతదేశంలోని వైష్ణవాలయాల్లో ప్రముఖమైనది సింహాచలం. విశాఖ నగరానికి సమీపంలో సముద్రమట్టానికి దాదాపు వెయ్యి అడుగుల ఎత్తున తూర్పు కనుమల్లో ప్రాకృతిక సౌందర్య సీమలో వెలసిన ఈ గిరిక్షేత్రంలో కొలువైన దైవం శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి. అశేష భక్తకోటికి ఇలవేలుపు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ పరమార్థంగా భావించిన పరమాత్మ ఎన్నెన్నో అవతారాలు ధరించి భూలోకానికి విచ్చేసి లోక కల్యాణం జరిపించాడు. ఆ పరంపరలో వరాహ, నరసింహావతారాలు ఏకమైన స్వామికి నెలవు సింహగిరి. క్రీ.శ.9వ శతాబ్దంలో ఈ ఆలయ నిర్మాణం జరిగి ఉండవచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ తరవాత 13వ శతాబ్దంలో తూర్పు గంగరాజు నరసింహదేవుడు ఆలయాన్ని పునరుద్ధరించినట్లు తెలుస్తోంది.



అంతర్యామి

శ్రీమహావిష్ణువు వరాహ రూపంలో హిరణ్యాక్షుణ్ని, నరసింహ రూపంలో హిరణ్య కశిపుణ్ని సంహరించాడు. హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడి కోరికమీద స్వామి భూమ్మీద వెలిశాడని, ఇంద్రాది దేవతలతో బ్రహ్మ వచ్చి స్వామికి ఉత్సవం జరిపించాడని పురాణాలు చెబుతున్నాయి. ఇది కృతయుగం నాటి గాథ. ఒకసారి పురూరవ చక్రవర్తి గగన మార్గాన ఊర్వశితో విహరిస్తుండగా స్వామి ఉన్న కొండ ప్రాంతంలో విమానం ఆగిపోయింది. స్వామి స్వప్నంలో చక్రవర్తికి సాక్షాత్కరించి తాను పుట్టలో ఉన్నానని బయటికి తీయమని చెప్పాడు. పుట్టలోంచి మట్టి తొలగించి స్వామి వారిని గంగాధారతో, పంచామృతాలతో అభిషేకించాడు పురూరవుడు. తొలగించిన మట్టికి బదులుగా స్వామి ఆనతి ప్రకారం గంధం సమర్పించాడు. భూమికి గంధవతి అనే పేరుంది. అందువల్ల మట్టికి బదులుగా గంధాన్ని సమర్పించమన్నాడని ఒక భావన. ఇది స్థలపురాణం. హిరణ్యకశిపుడి వధానంతరం ఉగ్రమూర్తి అయిన నరసింహుణ్ని చల్లబరిచేందుకు దేవతలే చందనం పూశారని భక్తుల విశ్వాసం.

వైశాఖ శుద్ధ తదియనాడు తొలిసారి చందనం పూత జరగడం వల్ల ప్రతి ఏడాదీ ఆ రోజున చందనోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు గంధాన్ని ఒలిచి స్వామి నిజరూప దర్శనం కలిగిస్తారు. సంప్రదాయంగా 12 మణుగుల చందనం సమర్పిస్తారు. వైశాఖ శుద్ధ తదియనాడు, ఆ తరవాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మూడేసి మణుగుల చొప్పున సమర్పిస్తారు. 12 మణుగులంటే ఇప్పటి లెక్కల్లో దాదాపు 500 కిలోలు. సింహాచల స్వామిని 'గంధం వొలుపు దేవత' అంటారు. ఈ క్షేత్రంలో పూజా విధానం పాంచరాత్ర ఆగమన పద్ధతిలో జరుగుతుంది. గోవిందరాజస్వామి ఇక్కడ ఉత్సవమూర్తి. మదనగోపాలస్వామి శయనమూర్తి. వేణుగోపాలస్వామి స్వప్నమూర్తి. యోగ నారసింహుడు బలిమూర్తి. సుదర్శనుడు చక్రపెరుమాళ్. ఈ అయిదుగురు మూర్తులకు నిత్యం జరిగే ఆరాధనను పంచబేరి అంటారు.

సింహాచల దేవాలయంలో ఓఢ్ర, ద్రావిడ వాస్తు సంప్రదాయాలు కనిపిస్తాయి. శ్రీకృష్ణదేవరాయలు జైత్రయాత్రలో ఈ ఆలయాన్ని దర్శించి విరివిగా దానాలు చేశాడు. కోవెలలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుంటే కోరికలు నెరవేరతాయన్నది భక్తుల నమ్మకం.

– డాక్టర్ [illegible] వెంకట సూర్యారావు

సమస్యల జడిలో గ్రామీణ ఉపాధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదైన కార్మికుల్లో 2022-25 మధ్యకాలంలో రెండు కోట్ల మందికి పైగా పేర్లు తొలగిపోయాయి. ఆధార్, బ్యాంకు ఖాతా, జాబ్ కార్డులు అనుసంధానం కాకపోవడం, పల్లెల నుంచి తరలిపోవడం, పట్టణాల్లో గ్రామాల విలీనం వంటివెన్నో ఇందుకు కారణమయ్యాయి. పథకంపై కూలీల్లో అసంతృప్తి, అసౌకర్యాలు, అరకొర ఉపాధి, వేతనాల్లో జాప్యంతో పాటు ఆర్థిక అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు పార్లమెంటరీ స్థాయీసంఘం ఇటీవల నివేదించడం గమనార్హం.

పల్లెప్రాంత నిరుపేదలకు ఏడాదిలో వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం 'ఎన్‌ఆర్‌ఈజీఏ' పథకాన్ని 2005లో ప్రారంభించింది. ఏటేటా కూలీల సంఖ్య పెరిగి 2015 నాటికి 25.89 కోట్లకు చేరింది. ఆ తర్వాత క్రమేపీ ఆ సంఖ్య తగ్గుతోంది. ప్రస్తుతం 11.66 కోట్ల మంది కూలీలకు మాత్రమే పని దొరుకుతోంది. పథకంలో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడానికి అనువుగా ఏటా బడ్జెట్‌లో నిధులను కేటాయించాల్సి ఉంది. కానీ కేటాయింపులు ఉజ్జాయింపుగా జరుగుతున్నాయి. 2021-22 నాటికి ఈ పథకం అమలుకు రూ.1.80 లక్షల కోట్లు అవసరం కాగా రూ.98,468 కోట్లు మాత్రమే వెచ్చించారు. ఆ తర్వాత సంవత్సరంలో రూ.89,400 కోట్లకు కేటాయింపులు తగ్గాయి. 2023-24లో రూ.86 వేల కోట్లకు చేరాయి. అవి కూడా పూర్తిగా వినియోగం కాలేదు. 2025-26 బడ్జెట్‌లోనూ రూ.86 వేల కోట్ల కేటాయింపులే జరిపారు.

అనుసంధాన ప్రభావం

ఉపాధి హామీలో నమోదు చేసుకున్న వారందరికీ పనులు లభించడం లేదు. 2015-20 మధ్య కాలంలో ఒక్కొక్కరికి సగటున 48 రోజులే పని కల్పించగా, గత అయిదేళ్లలో 42 రోజుల సగటుతో ఉపాధి లభించింది. కనీస వేతనం గురించి ఉపాధి హామీ చట్టం స్పష్టంగా పేర్కొంది. 2015-16లో రోజుకు రూ.180 కనీస వేతనంగా నిర్ణయించారు. కానీ సగటున రూ.120 మాత్రమే అందింది. ప్రస్తుతం వేతనం రూ.307 కాగా సగటున రూ.260 మాత్రమే లభిస్తోంది. పని చేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కొరవడుతున్నాయి. తగిన వనరులు కల్పించకుండా పథకంలో అక్రమాల నిరోధానికి ఆధార్, బ్యాంకు ఖాతా, జాబ్ కార్డుల అనుసంధాన ఆధారిత చెల్లింపుల ప్రక్రియను అమలు చేయడం వల్ల కూలీలపై పెనుప్రభావం పడింది. 12.49 కోట్ల మందికి సంబంధించిన బ్యాంకు ఖాతా, జాబ్ కార్డులు మాత్రమే అనుసంధానమయ్యాయి. దాదాపు నాలుగు కోట్ల మందికి ఆ ప్రక్రియ పూర్తికాక పోవడంతో వారంతా పనులకు దూరమయ్యారు. చట్టప్రకారం ఉపాధి కూలీలకు 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, చాలా రాష్ట్రాల్లో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల నుంచి చెల్లింపులు జరపాల్సి ఉంది. కానీ, అలాంటి ప్రయత్నాలు చేయకపోవడంతో చేసిన పనికి వేతనాల కోసం కూలీలు నిరీక్షించాల్సి వస్తోంది.

సమన్వయమే సమస్య

ఉపాధి హామీ పథకానికి కేంద్రమే నిధులు సమకూరుస్తున్నా, రాష్ట్రాలతో సమన్వయం సమస్యగా మారుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14 రాష్ట్రాలకు రూ.6,157 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. నిధులు అందక పశ్చిమ్ బెంగాల్ కూలీలు ఉపాధి కోల్పోవడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలిగిందని పార్లమెంటరీ స్థాయీసంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎక్కువ పని దినాలను కల్పించాలనే రాష్ట్రాల వినతులపై సానుకూల స్పందన కొరవడుతోంది. కూలీల రేట్ల ఖరారులోనూ శాస్త్రీయ విధానాలను అవలంబించడం లేదు. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రేటు అమలవుతోంది. మరోవైపు, కొన్ని రాష్ట్రాలు పథకం అమలులో నిర్లక్ష్యం చూపుతున్నాయి. ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడం కూడా పథకం అమలుకు ఇబ్బందికరంగా మారుతోంది. సామాజిక తనిఖీలు మొక్కుబడిగా మారి అవినీతి పెచ్చుమీరుతోంది. పట్టణీకరణ విస్తృతి ఉపాధి హామీ కూలీలకు శాపంగా మారుతోంది. దేశవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో 8,952 గ్రామాలు విలీనం కావడంతో 42.30 లక్షల మంది పనులు కోల్పోయారు.



ఏజెన్సీ గ్రామాలు కొన్ని పురపాలికలుగా మారుతుండటంతో గిరిజనులకు అన్యాయం జరుగుతోంది. దేశవ్యాప్తంగా పథకం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైనందు వల్ల పట్టణాల్లో విలీనమైన పల్లెలకు చెందిన ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోంది.

మెరుగు పరిస్తే మేలు

పేదల ఆకలి బాధలను తీర్చడంతోపాటు గ్రామీణ ఆస్తుల సృష్టికి ఉపాధి హామీ ప్రధాన ఆధారంగా ఉంది. ఈ క్రమంలో కూలీలకు తెలంగాణ ఏడాదికి సుమారు 13 కోట్లు, ఆంధ్రప్రదేశ్ ఏటా సుమారు 22 కోట్ల పని దినాలను కల్పిస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో పలు సమస్యలు నెలకొన్న నేపథ్యంలో, ఫలితాలను సమీక్షించి మెరుగు పరచాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. వేతనాన్ని రోజుకి రూ.400 చేయాలని, పని దినాలను 100 నుంచి 150కి పెంచాలని అది సూచించింది. పథకానికి కేటాయించిన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని, సామాజిక తనిఖీలను ముమ్మరం చేయాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ సిఫార్సుల అమలుకు తక్షణం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అవసరమైన వారందరికీ పనులు లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. పట్టణాల్లో విలీనమయ్యే గ్రామాల కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలి. లేని పక్షంలో ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి. వ్యవసాయ రంగం ప్రస్తుతం కూలీల కొరతను ఎదుర్కొంటోంది. ఉపాధి హామీని సాగు రంగానికి అనుసంధానించడం ద్వారా విస్తృత ప్రయోజనాలను సాధించవచ్చు.

– ఆకారపు మల్లేశం



బ్యాంకులో ఏమున్నాయి?

వృత్తిలో ఉన్నతి, ఆస్తులు పోగేయడం, బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకోవడం, ఇల్లూ పిల్లలు, కెరీర్లు... ఇదే జీవితం! ఇవే లక్ష్యాలు! ఇవి సాధిస్తే చాలు- జీవితానికి ఇంతకన్నా ఇంకేం అక్కర్లేదనేది చాలామంది నమ్మకం. ఇవన్నీ ఒక స్థాయిలో సాధించేసరికి జీవితంలో సగం ఖర్చయిపోతుంది. అప్పటి దాకా అష్టకష్టాలు పడి సంపాదించిన ఆస్తిపాస్తులను అనుభవించేందుకు మిగిలే సమయమూ కొంతే! ఇక్కడ అసలుసిసలు ఆస్తి... ఆరోగ్యమే! కానీ, చాలామందికి అదసలు గుర్తించదగిన విషయమే కాదు. అంతంతమాత్రంగా ఉండే ఆరోగ్యంతో ఆర్థిక బలం ఎంతున్నా ఏమీ చేయలేమన్న సంగతి అర్థమయ్యేసరికే ఆలస్యమై పోతుంది.

మరి, ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే, మన వెనక మనీ బ్యాలెన్స్‌కన్నా, హెల్త్‌బ్యాంకులో ఏమున్నాయన్నదే ముఖ్యం. హెల్త్‌బ్యాంకులో ఆరోగ్యాన్ని డిపాజిట్ చేస్తూ ఆయుర్దాయమనే బ్యాలెన్స్‌ను అంతకంతకూ పెంచుకోవాలి. మంచి అలవాట్లు అనే పొదుపు చేయాలి. వ్యసనాల మీద ఇన్వెస్ట్‌మెంట్స్ ఆపేయాలి. ఫిజికల్, ఎమోషనల్, సామాజిక, స్పిరిచ్యువల్ వంటి ఖాతాలపై దృష్టిపెట్టాలి. ఫిజికల్ అకౌంట్‌లో శారీరక ఆరోగ్యాన్ని పెంచాలి. పోషకాహారం జమ చేయాలి. దురలవాట్లను, అనారోగ్యాన్ని విత్‌డ్రా చేయాలి. ఎమోషనల్ అకౌంట్‌లో ప్రశాంతమైన మానసిక స్థితిని నిల్వ చేయాలి. ఒత్తిడిని, భావోద్వేగాల నిల్వలను ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలి. సామాజిక ఖాతాలో నలుగురితో నడుచుకొనే నైపుణ్యాలకు కొరత లేకుండా చూసుకోవాలి. ఎంత వీలైతే అంతగా స్నేహితులు, చుట్టాలు, శ్రేయోభిలాషులను జమ చేసుకోవాలి. స్పిరిచ్యువల్ అకౌంట్‌లో నిన్ను నీవు అర్థం చేసుకోవడాన్ని, ఆత్మశోధనను, ఆధ్యాత్మిక పరిణతిని పోగెయ్యాలి. నిరంతర స్వీయసమీక్షతోనే ఇవన్నీ సాధ్యం.

చాలామందికి మంచి అలవాట్లను విత్‌డ్రా చేయడమే తప్పించి, పోగేయాలన్న ఆలోచన తక్కువే. వయసుతోపాటే హెల్త్‌బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు పెంచుకోకపోతే, విలువైన ఆరోగ్య నిధి తరిగిపోతుంది. దురలవాట్లను పెంచి పోషిస్తే, స్వస్థ సంపద ఊడ్చుకుపోయి, రోగాలనే అప్పులతో నిండిన లాకర్లే దర్శనమిస్తాయి. ఓవర్‌డ్రాఫ్టుల వంటి శరీర భారమూ పెరుగుతుంది. నిత్యం శారీరక శ్రమ చేస్తూ, పోషకాహారం తీసుకుంటూ, సమతౌల్య జీవనశైలిని పాటిస్తే- హెల్త్‌బ్యాలెన్స్ దండిగా పెరుగుతుంది. అప్పుడు నిజంగా సంపన్నులవడం ఖాయం. కూర్చొని తింటే కొండలైనా కరిగి పోతాయన్న సంగతి విన్నదేకదా! ఇక్కడ కూడా ఒళ్లు కదలకుండా తింటూ కాలం గడిపేస్తే- హెల్త్ బ్యాంకు బ్యాలెన్సులు మంచుకొండలా కరిగి నీరవుతాయి. శరీరం మాత్రం మట్టి కొండలా పెరిగి మోయలేనంతగా బరువవుతుంది! అందుకని ఆదాయ పెంపుపై పెట్టే శ్రద్ధలో పావువంతైనా ఆరోగ్యాన్ని, ఆయుర్దాయాన్ని పెంచుకోవడంపై చూపితే సంపూర్ణ జీవనం మీ సొంతమవుతుంది!

– శ్రీనివాస్ దరెగోని

పాక్ పన్నాగాలకు ప్రతివ్యూహాలు!

సంసిద్ధతలో ఎక్కడ?

కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలు సమాజంలో విశేష మార్పులకు కారణమవుతున్నాయి. ఆయా టెక్నాలజీలను అందిపుచ్చుకునే విషయంలో నిరుడు 170 దేశాలకు గాను భారత్ 36వ ర్యాంకు సాధించింది. నవీన సాంకేతికతల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఇండియా మూడో ర్యాంకులో నిలిచింది. చైనా మొదటి స్థానం ఆక్రమించింది. అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడం, వాటి వినియోగ సామర్థ్యం పరంగా ఆయా దేశాల ర్యాంకులు...

అమెరికా	1
స్వీడన్	2
యూకే	3
నెదర్లాండ్స్	4
సింగపూర్	5
స్విట్జర్లాండ్	6
దక్షిణ కొరియా	7
జర్మనీ	8
చైనా	21
రష్యా	33
ఇండియా	36
దక్షిణాఫ్రికా	52

(ఆధారం: టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ రిపోర్ట్ - 2025)

భారత దురాక్రమణపై పోరాడుతున్న కశ్మీరీలకు పాక్ మద్దతు ఎప్పుడూ ఉంటుందనీ, కశ్మీర్ తమకు జీవనాడి అనీ, భారత సైన్యం తమనేమీ చేయలేదంటూ బీరాలు పలికిన జనరల్ మునీర్- బలూచిస్థాన్‌లో తాము ఎదుర్కొంటున్న తిరుగుబాటు గురించి మాత్రం మాట్లాడకుండా దాటవేశారు. ఆయన వ్యాఖ్యల వెనక నిరాశా నిస్పృహలు, ధిక్కార స్వరం మిళితమై ఉన్నాయి. 2019లో భారత్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు పాక్ సైనిక గూఢచార సంస్థ ఐఎస్ఐకి జనరల్ మునీరే నాయకత్వం వహించారు. ఆ పాత భూతం ఆయనను వెంటాడుతున్నట్లుంది. ప్రస్తుతం బలూచిస్థాన్‌తో పాటు అఫ్గాన్ సరిహద్దుల్లో తిరుగుబాటుదారుల తాకిడిని పాక్ ఎదుర్కొంటోంది. అంతర్జాతీయంగా ఆ దేశం ఏకాకిగా మారింది. ఆర్థికంగా దివాలా తీసి ఐఎంఎఫ్ రుణం కోసం దేహీ అంటోంది. నిత్యావసరాలతో పాటు అన్ని వస్తువుల ధరలు పెరిగి పాక్ ప్రజలు సతమతమవుతున్నారు. ఆర్థిక అస్థిరతకు తోడు రాజకీయంగా కూడా కల్లోల పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ అనిశ్చిత వాతావరణంలో జనరల్ మునీర్ భారత్‌పై చేసిన దుందుడుకు వ్యాఖ్యలు ఉగ్రవాదులను రెచ్చగొట్టి పహల్గాం దాడికి పురిగొల్పాయి. లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ సభ్యులు 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' అనే కొత్త గ్రూపు కట్టి ఈ మరణకాండకు తెగబడ్డారు.

భగ్నం చేయడమే లక్ష్యం

జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామికంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగి, ప్రజాప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే కశ్మీర్ వెళ్లి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించే విషయంలో సానుకూలత వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగాక కశ్మీర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. పర్యాటకుల ప్రవాహం పెరుగుతోంది. అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఇలాంటి సానుకూల, ఆశావహ వాతావరణాన్ని భగ్నం చేయడమే ఉగ్రవాదుల లక్ష్యం అనడంలో సందేహం లేదు. మరోవైపు బంగ్లాదేశ్‌లోనూ పాక్ ఐఎస్ఐ నిగూఢ కార్యకలాపాలు పెరుగుతున్నాయి. అక్కడ మత ఛాందస శక్తులను రెచ్చగొడుతున్నారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ కూడా భారత్ పట్ల వ్యతిరేకతను బయట పెట్టుకుంటున్నారు. ఇలా భారత్‌ను రెండు వైపుల నుంచి కమ్మేయాలనే కుతంత్రం నడుస్తున్న సమయంలో అగ్నికి ఆజ్యం పోసినట్లుగా పహల్గాం దాడి జరిగింది. ఈ బీభత్సం అనంతరం



పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ అసిమ్ మునీర్ ఇటీవల ఇండియాపై నోరు పారేసుకున్నారు. తర్వాత కొద్ది రోజులకే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి తెగబడటం కాకతాళీయం కాదు. పరిస్థితి ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇదంతా ఎక్కడిదాకా వెళ్తుందనేది అందరినీ వేధిస్తున్న సందేహం.

ముష్కరుల పని పట్టేందుకు ఇండియా తీవ్రస్థాయిలో గాలింపు చేపట్టింది. ఐఎస్ఐ మార్గదర్శకత్వంలో పాకిస్థాన్ నుంచి పనిచేస్తున్న ఉగ్రవాద సూత్రధారులు చేతికి చిక్కడం లేదు. ప్రస్తుత పరిస్థితిలో భారత్ దౌత్యపరంగా, ఇతరత్రా గట్టి చర్యలు చేపట్టింది. మొదట సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. ఇది యుద్ధపరమైన చర్య అని పాకిస్థాన్ ఆక్షేపించింది. భారత నౌకాదళం అరేబియా సముద్రంలో పెద్దయెత్తున మోహరించింది. యుద్ధమే వస్తే పాక్‌ను దిగ్బంధిస్తామనే దిశగా హెచ్చరిక సంకేతం పంపుతోంది. నియంత్రణ రేఖ వెంబడి రెండు దేశాల సైనికులు కాల్పులు జరుపుతున్నారు. ఫిరంగులు గర్జిస్తున్నాయి. పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సరిహద్దులో సైన్యాన్ని మోహరించింది.

ఇండియా ముందున్న మార్గాలివే...

ప్రస్తుత పరిస్థితిలో ఇండియా మొదటి మార్గంగా, కశ్మీర్‌లో ఉగ్రవాదులను ఏరివేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలి. దాంతోపాటు, అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి పెంచాలి. కరాచీ రేవులో ఎగుమతులు, దిగుమతులను స్తంభింపజేయడానికి అరేబియా సముద్రంలో యుద్ధ నౌకలను దింపాలి. పాక్‌ను ఆర్థికంగా చక్రబంధంలో ఇరికించాలి. ఆచితూచి అడుగులు వేస్తూ పూర్తిస్థాయి చర్యలకు సరైన సమయం కోసం వేచి ఉండాలి. రెండో మార్గంగా, పాకిస్థాన్‌లో ఉగ్రవాద, సైనిక స్థావరాలపై విమానాలతో, క్షిపణులతో దాడులు చేయవచ్చు. ప్రతిగా పాకిస్థాన్ కూడా దాడులు చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకుని, దెబ్బ కాచుకోవడానికీ సన్నద్ధంగా ఉండాలి. మూడో మార్గంగా, పాకిస్థాన్ ప్రస్తుతం అంతర్గతంగా బలహీనపడింది. దీన్ని సావకాశంగా తీసుకుని పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడానికి ముందుకు కదిలే అంశాన్ని పరిశీలించాలి. దీనివల్ల కశ్మీర్‌లో సీమాంతర ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయవచ్చు. బలూచిస్థాన్‌లో, అఫ్గాన్ సరిహద్దులో తిరుగుబాట్లను ఎదుర్కొంటున్న పాకిస్థాన్ సైన్యం నేడు దుర్బల స్థితిలోకి జారిపోయింది. ప్రజల కనీస అవసరాల కోసం కూడా దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. కష్టకాలంలో చైనా ఒక్కటే పాకిస్థాన్‌కు కాస్తంత ఆధారంగా నిలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి పాక్‌కు ఏ మాత్రం సాయం అందుతుందో చెప్పలేం. మరోవైపు అమెరికా, ఐరోపా దేశాలు పాక్‌ను దూరం పెడుతున్నాయి. ఏతావతా దక్షిణాసియా సంక్షోభం అంచున ఉంది.



కర్నల్ (విశ్రాంత)
వెలిచేటి వెంకటేశ్వరరావు
ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లో అనుభవజ్ఞులు

హాయ్! బుజ్జీ!!

కుక్కపిల్లతో అంతరిక్ష యాత్ర!

నేస్తాలూ.. మీకు ఒకవేళ స్పైడర్‌మ్యాన్‌లా స్పెషల్ పవర్ ఉంటే.. ఏం చేస్తారు?' అంటే.. 'హాయిగా పక్షుల్లా గాల్లో ఎగురుతాం. చందమామపైకి వెళ్లడానికి ప్రయత్నిస్తాం' అంటూ మనం ఊహించుకున్నవన్నీ చెప్పేస్తాం. అలాగే ఒక నేస్తం ఈ ఊహలనే ఆసక్తికరమైన కథలుగా మార్చి రాశాడు. ఇంతకీ ఆ వివరాలేంటంటే..

ముంబయికి చెందిన శౌర్య మేంఘనికి ... ఉద్యోగరీత్యా ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్నాడు. శౌర్య ఒకసారి టీవీలో రాకెట్ లాంచ్ చేయడం చూశాడట. అది తనకు చాలా బాగా నచ్చేసింది. దాంతో తమ పెంపుడు కుక్కని అంతరిక్షంలోకి పంపిస్తే ఎలా ఉంటుందని ఊహించుకున్నాడట. ఆ ఆలోచనతోనే 'వెల్వెట్ ఎక్స్‌ప్లోర్స్ స్పేస్' పేరుతో మూడు పుస్తకాలు రాశాడు. తను, తన నేస్తమైన కుక్కపిల్ల వెల్వెట్.. అంతరిక్షంలోకి వెళ్తే ఎలా ఉంటుందో.. చాలా చక్కగా



కలిసి ఇస్రోకి వెళ్లడం, జోసెఫ్ అనే వ్యక్తి వెల్వెట్‌కి అంతరిక్షయాత్ర కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, అది వ్యాయామం చేసిన తీరు, రంగురంగుల స్పేస్ సూట్ వేసుకుని అంగారక యాత్రకు వెళ్లడం.. ఇలా చాలా విషయాలు ఆసక్తిగా వివరించాడు మన శౌర్య. చదువుతుంటేనే భలేగా అనిపిస్తుంది. ఆన్‌లైన్‌లో చాలా తక్కువ సమయంలోనే ఈ పుస్తకాలకు మంచి ఆదరణ లభించింది. పుస్తకం చదివిన చాలామంది.. 'మొదటి డాగ్ ఆస్ట్రోనాట్‌ని పరిచయం చేశాడు.. భలేగా ఉంది' అంటున్నారు. మొత్తానికి శౌర్య సంగతులు బాగున్నాయి కదా!

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే కొన్ని అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవి కూడా కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

చొక్కా	నక్షత్రం	ఆవు
జుట్టు	చేప	నీళ్లు
కుర్చీ	కుక్కపిల్ల	పువ్వు



Reliance
SMART BAZAAR
మన నినాదం ఇండియా మొత్తం చేస్తుంది ఫుల్ పైసా వసూల్
ఫుల్ పైసా వసూల్ సేల్
30th APR - 4th MAY
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
స్మార్ట్ ప్రైస్ ₹409 / ₹439
ఎమ్ఆర్‌పి ₹620 / ₹725
ఆదా చేసుకోండి ₹211 / ₹286
లూజ్ చక్కెర S / కంది పప్పు వెల్వా 1 kg
స్మార్ట్ ప్రైస్ ₹43 / ₹109
మార్కెట్ ధర ₹50 / ₹114
చక్కీ ఆటా 5 kg / ఫియానా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 5 L
స్మార్ట్ ప్రైస్ ₹205 / ₹649
ఎమ్ఆర్‌పి ₹270 / ₹950
ఆదా చేసుకోండి ₹65 / ₹301
స్మార్ట్ ప్రైస్ ₹999 / ₹1049
PL కర్నూలు సోనా మసూరి / గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
ఎమ్ఆర్‌పి ₹1650 / ₹1950
ఆదా చేసుకోండి ₹651 / ₹901
ఇమామి హెల్తీ అండ్ టేస్టీ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / గుడ్ లైఫ్ ఫిల్టర్డ్ వేరుశనగ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹135 / ₹149
ఎమ్ఆర్‌పి ₹165 / ₹210
ఆదా చేసుకోండి ₹30 / ₹61
కనీసం 25% తగ్గింపు
డైరీ, ఫ్రోజెన్ అండ్ బేకరి (ఎంపిక శ్రేణి)
ఎమ్ఆర్‌పి ₹25 మొదలుకుని
Scan & Unlock Secret Offers
కోల్డ్ డ్రింక్ అండ్ జ్యూసెస్ 250 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని /యూనిట్
BUY ANY 2 GET ANY 1 FREE
బిస్కెట్స్ / చాక్లెట్ / రస్క్ 118 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹100 మొదలుకుని /యూనిట్
తాజ్‌మహల్ టీ / టాటా చక్ర గోల్డ్ ప్రీమియం టీ 500 g
ఆదా చేసుకోండి ₹75
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹305 మొదలుకుని
హార్లిక్స్ / బూస్ట్ 1 kg
ఆదా చేసుకోండి ₹190
ఎమ్ఆర్‌పి ₹600 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹410 మొదలుకుని
సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹175 మొదలుకుని
షాంపు 580 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 55% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹890 మొదలుకుని
టూత్‌పేస్ట్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹208 మొదలుకుని
డిటర్జెంట్ పౌడర్ 5 kg మొదలుకుని / లిక్విడ్ 4 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹770 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹1999 మొదలుకుని
3 బర్నర్ గ్యాస్ స్టవ్
ఎమ్ఆర్‌పి ₹7560 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹999
18 పీసెస్ ఓపల్ వేర్ డిన్నర్ సెట్
ఎమ్ఆర్‌పి ₹2095 మొదలుకుని
2000+ ఫ్యాషన్ స్టైల్స్ ₹399 లోపు
టీ-షర్ట్స్ ₹199 | షర్ట్స్ ₹299
కుర్తాస్ ₹299 | షార్ట్స్ ₹299 | జీన్స్ ₹399
ఏదైనా ఉచితం ఎల్ఈడీ టివి 80 cm (32 inch)
ఎమ్ఆర్‌పి ₹55999 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹32990* మొదలుకుని
బ్రాండెడ్ 1.5 టన్ 3 స్టార్ ఇన్వర్టర్ ఎయిర్ కండిషనర్ (ఎంపిక శ్రేణి)
ఫ్లాట్ 70% తగ్గింపు
కాటన్ డబల్ బెడ్‌షీట్ సెట్ విత్ పిల్లో కవర్
ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹360 మొదలుకుని
క్రూయిజర్ హార్డ్ ట్రాలీ 2 సెట్
స్మార్ట్ ప్రైస్ ₹3999
ఏదైనా ఉచితం డఫల్ ట్రాలీ బ్యాగ్
ఎమ్ఆర్‌పి ₹12800
ఇప్పుడు తెరవబడింది మధిర: వాసవి థియేటర్, రంగాస్ మాల్, RV కాంప్లెక్స్ దగ్గర
మహబూబ్‌నగర్: ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా. నిజామాబాద్: కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు • వినాయకనగర్. బోధన్: సరస్వతి నగర్, RTC బస్ స్టేషన్ ఎదురుగా. నల్గొండ: రిలయన్స్ డిజిటల్ పక్కన, ప్రకాశం బజార్ రోడ్. జహీరాబాద్: పాత సుభాష్‌గంజ్, జహీరాబాద్ టౌన్. పాల్వంచ: అంబేద్కర్ సెంటర్, భద్రాచలం రోడ్డు. మిర్యాలగూడ: రిలయన్స్ ట్రెండ్స్ పక్కన, రెడ్డి కాలనీ. నర్సాపూర్: CCC X రోడ్ HP పెట్రోల్ బంక్ పక్కన. ఆర్మూర్: జీవన్ రెడ్డి మాల్ విద్యానగర్ కాలనీ. భువనగిరి: మెయిన్ రోడ్ ఎదురుగా. భువనగిరి కోర్టు. హన్మకొండ: ఏకశిలా పార్క్ దగ్గర, బాలసముద్రం • N.I.T. దగ్గర, R.E.C ఏరియా, రెవెన్యూ కాలనీ, సుబేదారి. కరీంనగర్: హాజీపూర్ రోడ్డు. ఖమ్మం: వై.ఎస్. టవర్స్, పాత రేవతి థియేటర్, బాలాజీ నగర్. నిర్మల్: ఇందిరా నగర్ వైన్ గేట్ పక్కన. సంగారెడ్డి: కల్వకుంట్ల, రెడ్లస్ హోటల్, అహ్మద్‌నగర్. సిద్దిపేట: ఖాదర్‌పూరా రోడ్డు, మహేష్‌పుర. వనపర్తి: ఓల్డ్ ఆంధ్రా బ్యాంక్, రాజీవ్ చౌక్. వరంగల్: పాత అలంకార్ థియేటర్, అలంకార్ చౌరస్తా, హన్మకొండ • మాడ్రాక్స్ మాల్ స్టేషన్ రోడ్. • వాసవికాలనీ రోడ్ యూనియన్ బ్యాంక్ పక్కన, పోచమ్మ మైదాన్. బాన్సువాడ: మహేశ్వరి మల్టీప్లెక్స్ ప్రక్కన, బిచ్కుండా బాన్సువాడ. నిజామాబాద్: పాత అశోక్ టాకీస్, గోడౌన్ రోడ్ బస్ స్టాండ్ దగ్గర. నేరేడుచర్ల: ఆర్‌టిసి బస్ స్టాండ్ దగ్గర, జన్పహాడ్ రోడ్డు, నేరేడుచర్ల. వరిగి: ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, అంబేద్కర్ విగ్రహం రోడ్డు, వరిగి
10% INSTANT DISCOUNT# SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Credit Card;
వద్ద కూడా లభ్యం
fresh Signature.
SMART SUPERSTORE
SMART BAZAAR



ఉత్పాదకత ఎక్కువుంటే.. నాయకుడిగా ఎదుగుతారనుకోవద్దు!

మీ ఉత్పాదకత ఎక్కువగా ఉంటే.. మీకు పదోన్నతి లభించడం సులువవుతుంది. అయితే ఉత్పాదకతను పెంచుకోవడానికి ఉపయోగపడ్డ నైపుణ్యాలే నాయకత్వంలోనూ మీరు విజయవంతమవడానికి దోహదపడతాయని మాత్రం భ్రమపడకండి. గొప్ప నాయకుడిగా ఎదగాలంటే- మీరు ఉత్తమంగా పని చేయడంతోపాటు ఇతరులూ ఉత్తమంగా పనిచేసేలా స్ఫూర్తినివ్వాలి. మీ బృంద సభ్యుల్లో విశ్వాసం నింపాలి. మీ పని సరైనదిగా మాత్రమే కాకుండా, ప్రభావవంతంగానూ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

- అమీ పెచాసెక్, లీడర్షిప్ ఎక్స్పర్ట్

రెండు కిలోల వరకు రూ.15కే తపాలా పార్సిల్

ఈనాడు, హైదరాబాద్: అతి తక్కువ వ్యయంతో సత్వరం డెలివరీ చేసే పార్సిల్ సర్వీసును టీజీఎస్ఆర్టీసీతో కలిసి తెలంగాణ పోస్టల్ సర్కిల్ ప్రారంభించినట్లు చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇండియా పోస్టు పార్సిల్- ఫైనల్ మైల్ అనే కొత్త విధానంలో 2 కిలోల వరకు పార్సిళ్లను కేవలం రూ.15 (జీఎస్టీ అదనం)తో డెలివరీ చేయనున్నట్లు పేర్కొంది. అదే రోజు లేదా మరుసటి రోజులోపు పార్సిళ్లు అందించనున్నట్లు వివరించింది.

పారిశ్రామిక పార్కులు అంతంతే

(మొదటి పేజీ తరువాయి)

తాగునీరు, కాలుష్య శుద్ధీకరణ ప్లాంట్లు, వీధి దీపాలు, విద్యుత్తు సరఫరా సదుపాయాలను టీజీఐఐసీ కల్పిస్తోంది. అయినప్పటికీ హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాలు మినహా ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పరిశ్రమల ఏర్పాటు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 28,458 ఎకరాల్లో 156 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశారు. వీటికి మరో 5,730 ఎకరాలు కేటాయించాల్సి ఉంది. టీజీఐఐసీ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1,45,682.99 ఎకరాల మేర ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించింది. ప్రభుత్వం 'ఇండస్ట్రియల్ లాండ్ బ్యాంకు'గా నోటిపై చేస్తే వాటిని పరిశ్రమలకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది.

పలు జిల్లాల్లో ఇదీ పరిస్థితి

◆ నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఐదేళ్ల క్రితం టీఎస్ఐఐసీ (ప్రస్తుత టీజీఐఐసీ) ఆధ్వర్యంలో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేశారు. పారిశ్రామిక అవసరాల కోసం 475.32 ఎకరాల ఎసైన్డ్, పట్టా భూములను ప్రభుత్వం గుర్తించింది. మొత్తం 180 యూనిట్ల కోసం రూ.146 కోట్లతో 162.28 ఎకరాలను అధికారులు సేకరించారు. ఇంకా 313.04 ఎకరాల సేకరణకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. 180 యూనిట్లకు గాను 24 యూనిట్లు ఇప్పటికే ఆన్లైన్లో కేటాయించారు. 26 యూనిట్లు కేటాయించాల్సి ఉంది. మిగిలిన వాటికి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా 530 మందికి, పరోక్షంగా మరో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటివరకు రహదారులు మాత్రమే నిర్మించారు. విద్యుత్తు ఉప కేంద్రం, కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్(సీఈటీపీ) ఏర్పాటు చేయాల్సి ఉంది.

◆ నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం లక్కంపల్లి వద్ద 2009లోనే ఫుడ్పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం 371.17 ఎకరాలు సేకరించింది. ఈ ఫుడ్పార్కును నోడల్ ఏజెన్సీ కింద ఓ సంస్థకు అప్పగించింది. ఒక పరిశ్రమ యాజమాన్యానికి రెండు యూనిట్ల కింద ఒకసారి 78 ఎకరాలు, మరోసారి 93.17 ఎకరాలు కేటాయించారు. 78 ఎకరాల్లో పసుపు ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేశారు. 93.17 ఎకరాల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో టీజీఐఐసీ 2024 నవంబరులో భూకేటాయింపులను రద్దు చేసింది. పరిశ్రమ యాజమాన్యం కోర్టును ఆశ్రయించగా.. తీర్పు అనుకూలంగా రావడంతో పరిశ్రమ అభివృద్ధికి మళ్లీ పనులు చేస్తున్నారు. ఫుడ్పార్కు కోసం సేకరించిన భూమిలో ఇంకా 200 ఎకరాల మేర ఖాళీగా ఉంది. పలు సంస్థలు పరిశీలిస్తున్నా. . పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావడం లేదు.

◆ కామారెడ్డి జిల్లా లింగంపల్లిలో 675 ఎకరాలు సేకరించారు. 2022లో అప్పటి ప్రభుత్వం రూ.50 కోట్లతో రహదారులు, విద్యుత్తు, మంచినీటి వసతులు కల్పించింది. 20 ఎకరాల్లో ఒక పరిశ్రమ నిర్వహిస్తున్నారు. మిగిలిన 655 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి.





బెల్లంపల్లిలో రహదారులకే పరిమితమైన పార్కు ★ రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెలలోని శీతల గిడ్డంగుల పరిశ్రమ ముఖద్వారం

◆ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర వద్ద మూడేళ్ల క్రితం 300 ఎకరాల్లో 43 పరిశ్రమలతో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో రూ.47 కోట్లతో మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పరిశ్రమలకు బ్యాంకు రుణాలు రాకపోవడం, మౌలిక వసతులను కల్పించడంలో జాప్యంతో ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు కాలేదు.

◆ కరీంనగర్ జోన్ పరిధిలో అంతర్గాం మండలం కుందనపల్లిలో ఆటోనగర్లో ఆటోమొబైల్ దుకాణాలు, మెకానికల్ షెడ్లు, గ్యారేజీల ఏర్పాటుకు 200 మందికి 200 స్థలాలు కేటాయించారు. ఒప్పందాలు చేసుకున్నా ఇప్పటివరకు ఒక్కరూ యూనిట్లు ఏర్పాటు చేయలేదు. 2017 మార్చి 31న టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి అరకొరగానే మౌలిక వసతులు కల్పించారు.

◆ ఖమ్మం జిల్లాలోని బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల్లో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.100 కోట్లకు పైగా కేటాయించినా మౌలిక వసతులు కల్పించలేదు.

◆ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం జిల్లెలలో ఐదెకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో శీతల గిడ్డంగితో పాటు పక్కనే 2500 టన్నుల సామర్థ్యంతో వేర్హౌస్ (ప్రాసెసింగ్ యూనిట్) నిర్మించారు. 2022లోనే పనులు పూర్తయ్యాయి. దీని నిర్వహణకు 2023 ఏప్రిల్లో ఎల్లోస్ అండ్ గ్రీన్స్ అగ్రి ఫ్రెష్ సంస్థ ముందుకొచ్చింది. కానీ, 2023 సెప్టెంబరులో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మామిడి, పసుపు, మిర్చి వంటి పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. పంట ఉత్పత్తులను రైతులు దళారులకు వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని.. మంచి ధరకు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది.

లాభాలు లేవంటున్నారు..

పరిశ్రమలకు 50 శాతం రాయితీపై 50 శాతం రాయితీపై స్థలాలు కేటాయిస్తున్నాం. హైదరాబాద్, వికారాబాద్, నాగర్కర్నూల్ జిల్లాల పరిధిలో విజయవంతంగా నడుస్తున్నాయి. మిగిలిన చోట్ల లాభాలు పెద్దగా లేవంటూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు.

-విష్ణువర్ధన్రెడ్డి, టీజీఐఐసీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్

నేడు 'పది' ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదుచేస్తారు. ఫలితాలను www.results.bsetelangana.org, rsults.bse.telangana.gov.in, results.eenadu.net, results.eenadupratibha.net తదితర వెబ్సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

మార్కులు	గ్రేడ్లు ఇలా...
91-100	ఏ1
81-90	ఏ2
71-80	బీ1
61-70	బీ2
51-60	సి1
41-50	సి2
35-40	డి

(గమనిక: ఆరు సబ్జెక్టులకు కలిపి మొత్తం 600 మార్కులు. ఒక్కో సబ్జెక్టులో రాత పరీక్షకు 80, ఇంటర్నల్స్కు 20 మార్కులు. రాత పరీక్షకు సంబంధించి హిందీలో 16(పాస్ మార్కులు 20), మిగిలిన సబ్జెక్టుల్లో 28 వస్తే(పాస్ మార్కులు 35) పాసైనట్లు పరిగణిస్తారు.)

తిరుమలలో కల్తీ నెయ్యికి సంబంధించిన కేసులో బోలేబాబా డెయిరీ జీఎం హరిమోహన్ (ఏ12) బెయిల్ పిటిషన్ను నెల్లూరు ఏసీబీ కోర్టు మంగళవారం తిరస్కరించింది. బెయిల్ కోరుతూ కొద్దిరోజుల క్రితం హరిమోహన్ పిటిషన్ వేయగా.. గత గురువారం సిట్ తరఫున అసిస్టెంట్ పీపీ జయశేఖర్ వాదనలు వినిపించారు. ఆధారాలతో పది పేజీల కౌంటర్ దాఖలు చేశారు.

లిబరల్ పార్టీకే ఆధిక్యం

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ రోజున సొంత జిల్లాల్లో లేనివారు వేసిన ప్రత్యేక ఓట్లను లెక్కించే విషయంలో ఏర్పడిన సందిగ్ధత కారణంగా 20 జిల్లాల్లో కౌంటింగ్ను కెనడా ఎన్నికల సంఘం నిలిపేసింది. వాటిపై నిర్ణయం తీసుకున్న తర్వాత కౌంటింగ్ ప్రారంభమయ్యే అవకాశముంది. ఆ ఫలితాలూ వెల్లడైతేనేగానీ లిబరల్ పార్టీకి సాధారణ మెజారిటీ వచ్చేదీ లేనిదీ తెలియదు. లిబరల్ పార్టీ ఆధిక్యం నేపథ్యంలో ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ పదవిలో కొనసాగనున్నారు.

ప్రతిపక్ష నేతలకు ఘోర పరాభవం

అట్టావాలో పోటీ చేసిన ప్రతిపక్ష నేత పియర్.. ఎన్నికల్లో ఓటమితో ఘోర పరాభవం ఎదుర్కొన్నారు. కొద్ది నెలల కిందట ప్రధాని పదవికి గట్టి పోటీదారుగా ఉన్న ఆయన సోదిలో లేకుండా పోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్లాగే పియర్కు ఫైర్బ్రాండ్గా పేరుంది. కెనడా ఫస్ట్ అనే నినాదాన్ని వినిపించారు. అయితే అదే నినాదం ఆయనను, ఆయన పార్టీని నిండా ముంచింది.

◆ ఖలిస్థానీ మద్దతుదారుగా ఉన్న న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్డీపీ) అధ్యక్షుడు 46 ఏళ్ల జగ్మీత్ సింగ్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. దీంతో అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ట్రూడో ప్రధానిగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి జగ్మీత్ మద్దతిచ్చారు. దానిని ఉపయోగించుకుని ఖలిస్థాన్కు అండగా నిలిచారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్ను ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించారు. 2021లో 25 సీట్లను గెలుచుకున్న జగ్మీత్ పార్టీ ఎన్డీపీ ఈసారి కేవలం 7 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

అమెరికా బెదిరింపులను ఎదుర్కొందాం: కార్నీ

అమెరికా బెదిరింపులను కలసికట్టుగా ఎదుర్కొందామని కెనడా ప్రజలకు ప్రధాని కార్నీ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయానంతరం ఆయన మాట్లాడారు. 'అమెరికా నమ్మక ద్రోహంతో షాక్లో ఉన్నాం. కానీ ఆ పాఠాలను మనం ఎన్నటికీ మరువబోం. గత కొన్ని నెలలుగా నేను హెచ్చరిస్తూనే ఉన్నా. మన భూమిని, మన వనరులను, మన నీటిని, మన దేశాన్ని అమెరికా కావాలని అంటోంది. ఇవి సాధారణ హెచ్చరికలు కావు. మనల్ని ట్రంప్ విడదీయాలనుకుంటున్నారు. అప్పుడు స్వాధీనం చేసుకోవచ్చునేది ఆయన ఆలోచన. అది ఎప్పటికీ జరగనీయం. కానీ మనం వాస్తవాన్ని గుర్తించాలి. మన ప్రపంచం సమూలంగా మారిపోయింది' అని కార్నీ స్పష్టంచేశారు.

మొత్తం సీట్లు:	343
మెజారిటీ మార్కు:	172
లిబరల్ పార్టీ:	168 (43.5%)
కన్జర్వేటివ్ పార్టీ:	144 (41.4%)
బ్లాక్ క్యూబెకోయిస్:	23 (6.4%)
ఎన్డీపీ:	7 (6.3%)
గ్రీన్ పార్టీ:	1 (1.2%)

(బ్రాకెట్లలో ఉన్నవి పోలైన ఓట్ల శాతం)



పియర్



జగ్మీత్ సింగ్

ప్రధాని మోదీ అభినందన

కెనడా పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన కార్నీకి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి కృషి చేయడానికి ఎదురు చూస్తున్నానని, ప్రజలకు గొప్ప అవకాశాలను కల్పించేందుకు ఇదో అవకాశమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ స్పందించారు.

మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

● అతిథులకు చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్ని చూపించాలి

● సమీక్షలో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్న మిస్వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు స్పష్టంచేశారు. మిస్ వరల్డ్ పోటీలపై మంగళవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్లో సమీక్షించారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మే 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులు సీఎంకు వివరించారు.



'విమానాశ్రయం, అతిథులు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి. అందాల పోటీల్లో పాల్గొనేవారికి తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలి. విభాగాల వారీగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి' అని సీఎం సూచించారు.

పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించాలి

హైదరాబాద్ నగరంలో పెండింగ్లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని రేవంత్రెడ్డి ఆదేశించారు. మిస్వరల్డ్-2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్రెడ్డి, డీజీపీ జితేందర్, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్రంజన్, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్భగవత్, హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు విజయవాడకు సీఎం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బుధవారం ఉదయం ఏపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు విజయవాడ వెళ్లనున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్కు చేరుకుంటారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

ఆదర్శ గ్రామం గంగదేవిపల్లికి విద్యుత్తు సరఫరా నిలిపివేత

గీసుకొండ, న్యూస్టుడే: జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో బకాయిల పేరుతో గ్రామంలో తాగునీటికి సంబంధించిన విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేక పన్నులు సకాలంలో వసూలు కాకపోవడంతో నిధుల కొరతతో పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గంగదేవిపల్లిలో తాగునీటికి సంబంధించిన బోరుబావుల ఐదు నెలల బిల్లు రూ.40 వేల వరకు బకాయి ఉంది. 4 నెలల కిందట పంచాయతీ నుంచి రూ.10 వేల చెక్కును విద్యుత్తు అధికారులకు అందించారు. ఫ్రీజింగ్ కారణంగా చెక్కులు పాస్ కావడం లేదని.. నగదు రూపంలో చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి పేరుతో మంచినీటికి సంబంధించిన విద్యుత్తు సరఫరా నిలిపివేస్తే గ్రామస్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్తు సరఫరా నిలిపివేతపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్తు ఏడీఈ మల్లికార్జున్ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలతో సరఫరా నిలిపివేసినట్లు చెప్పారు.



విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్న సిబ్బంది

'పెద్దవాగు' పూర్తిస్థాయి మరమ్మతులకు మోక్షం!

రూ.78.26 కోట్లు ఇచ్చేందుకు ఏపీ ఆమోదం

అశ్వారావుపేట, న్యూస్టుడే: పెద్దవాగు జలాశయానికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఏలూరు సూపరింటెండింగ్ ఇంజినీర్ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వులో వెల్లడించారు. పెద్దవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి మరమ్మతుల నిమిత్తం తెలంగాణకు రూ.78.26 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. గత ఏడాది జులై 18న భారీ వర్షం, వరదలకు పెద్దవాగు జలాశయానికి గండిపడి తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టేందుకు సమర్పించిన ప్రతిపాదనల ప్రకారం 82 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 18 శాతం తెలంగాణ ప్రభుత్వం భరించేలా ఏపీ ప్రభుత్వం అంగీకరించింది.

కరెంటు ఛార్జీల పెంపు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఛార్జీల పెంపునకు అనుమతించడం లేదని జస్టిస్ నాగార్జున్ వివరించారు.

ఉత్తర్వులోని ముఖ్యాంశాలు...

◆ గృహ వినియోగ కరెంటు ఛార్జీల్లో రాయితీలకు రూ.1,896.81 కోట్లు, వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నందుకు మరో రూ.11,602.60 కోట్లు ఇస్తామని ప్రభుత్వం వివరించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇచ్చిన రాయితీ సొమ్ము కన్నా ఇది 1999.89 కోట్లు (17.4%) అధికం.

◆ గృహజ్యోతి పథకంలో 50,52,167 ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత కరెంటు కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.1,922 కోట్లను చెల్లించనుంది.

◆ విద్యుత్ వాహనాల(ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ కాంట్రాక్టులోడు పరిమితి ఇంతకాలం 56 కిలోవాట్లు ఉండగా దానిని 150 కిలోవాట్లకు పెంచడానికి ఈఆర్సీ అనుమతించింది.

◆ గ్రిడ్ సపోర్టు రుసుం ప్రస్తుతం నెలకు కిలోవాట్కు రూ.18.48 ఉండగా.. మే 1 నుంచి రూ.20.04కి పెంచడానికి అనుమతించింది.

◆ ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు 24 గంటల ముందు నోటీసు ఇవ్వకుండా... కాంట్రాక్టు డిమాండుకన్నా అదనంగా కరెంటు వాడుకుంటే 10% అదనంగా ఛార్జీలను వసూలుచేస్తారు.

కరెంటు ప్రమాదాలపై అవగాహన పెరగాలి

కరెంటు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలకు సూచించినట్లు జస్టిస్ నాగార్జున్ చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తవుతుందని, అప్పటివరకూ పూర్తిగా 4 వేల మెగావాట్ల కరెంటు రాదని, దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పగటిపూట సౌరవిద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటున్నందున, రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ రాత్రిపూట థర్మల్ విద్యుత్ ఎక్కువగా అవసరమని.. డిస్కంలు బయట కొనాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో కరెంటు కొరత ఏర్పడుతుందన్నారు. దాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్కేంద్రాలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలన్నారు.

ఈఆర్సీ ఆమోదం ప్రకారం... ప్రస్తుత ఏడాదిలో డిస్కంల ఆదాయ, వ్యయాలు (రూ.కోట్లు)

అంశం	ఉత్తర డిస్కం	దక్షిణ డిస్కం
మొత్తం ఆదాయం	9,358.18	36,147.87
మొత్తం వ్యయం	17,499.87	41,128.21
లోటు	8,141.69	4,980.34

గ్రహం అనుగ్రహం

30–4–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్లపక్షం

తదియ: సా. 6-23 తదుపరి చవితి; **రోహిణి:** రా. 8-27 తదుపరి మృగశిర; **వర్జ్యం:** మ. 12-56 నుంచి 2-26 వరకు; తిరిగి రా. 1-47 నుంచి 3-18 వరకు; **అమృత ఘడియలు:** సా. 5-27 నుంచి 6-57 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 11-31 నుంచి 12-21 వరకు; **రాహుకాలం:** మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.5.39; సూర్యాస్తమయం: సా.6.14

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఆదిలాబాద్	43.6	29.0
కడప	43.0	27.0
నిజామాబాద్	42.8	28.2
రాజమహేంద్రవరం	41.5	26.0
రామగుండం	41.0	27.7
నల్గొండ	41.0	23.0
కర్నూలు	40.6	28.2
మెదక్	40.6	23.2
ఖమ్మం	40.0	26.0
కరీంనగర్	40.0	24.0
విజయవాడ	39.5	27.6
తాడేపల్లిగూడెం	39.3	28.1
మహబూబ్నగర్	39.0	27.5
హనుమకొండ	39.0	24.5
తిరుపతి	38.8	27.6
అనంతపురం	38.3	26.6
హైదరాబాద్	38.2	26.2
గుంటూరు	38.0	28.0
విజయనగరం	38.0	26.0
నెల్లూరు	37.8	27.4

అప్రమత్తత అవసరం : సీపీ

కరీంనగర్ నేరవార్తలు: ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. కమిషనరేట్‌లో అధికారులతో మంగళవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఓపీఎస్ అమలు చేయాలి : ఎమ్మెల్సీ

తెలంగాణచౌక్ (కరీంనగర్): డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) త్వరగా అమలు చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు.

















భూ భారతి చట్టంపై నేడు ఫోన్‌ఇన్

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పేరుతో ప్రవేశపెట్టిన కొత్త రెవెన్యూ చట్టంపై సందేహాల నివృత్తికి ఇది మంచి అవకాశం. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం 'ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ (రెవెన్యూ) మీ సందేహాలను నివృత్తి చేస్తారు. ఎదుర్కొంటున్న భూమి సమస్యలు.. భూ భారతి ద్వారా పరిష్కార మార్గాలపై వివరాలు అడిగి తెలుసుకోవచ్చు.

సంప్రదించాల్సిన నంబరు : 80085 73536
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య

ఖజానా చుట్టూ.. కాసుల గుట్టు!



● పైసలిస్తేనే దస్త్రం కదలిక ● ఉమ్మడి జిల్లాలో విపరీతంగా ఆరోపణలు

● కోరుట్లకు చెందిన కోర్టు కానిస్టేబుల్ తన సీపీఎస్ ఫండ్ నుంచి రూ.లక్ష తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. డబ్బు చేతికొచ్చాక తనకు రూ.7 వేలు ఇవ్వాలని జగిత్యాల ఖజానా శాఖలో పని చేసే జూనియర్ సహాయకుడు డిమాండ్ చేశారు. పని పూర్తయిన తరువాత పదే పదే ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని వేధించడంతో కానిస్టేబుల్ అవినీతి నిరోధకశాఖ అధికారుల్ని ఆశ్రయించారు. దీంతో ఈ నెల 11న లంచం డబ్బులు తీసుకుంటున్న జూనియర్ సహాయకుడిని అనిశా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

● ఉమ్మడి జిల్లాలోని ఓ జిల్లా ఖజానా శాఖలోని ఉన్నతాధికారిపై తరచూ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈయన పని చేసిన ఓ జిల్లాలో అక్కడి ఖజానా శాఖ సిబ్బందిని ప్రతి పనికి డబ్బులు అడగాలని ఒత్తిడి చేయడంతో సిబ్బంది అంతా ఆయన వైఖరిపై ఆందోళన చేపట్టిన సందర్భాలున్నాయి. బదిలీ వేటుతో ఇక్కడికి వచ్చినా.. ఆ సారు తీరు మారలేదని సొంత శాఖలోనే చర్చ జరుగుతోంది. కుటుంబ, వితంతు పింఛన్‌దారులకు లేనిపోని మెలికలు పెడుతూ వారిని కార్యాలయం చుట్టూ తిప్పించుకుని కాసులు దండుకుంటారన్న పేరు ఉంది.

● కరీంనగర్ ఖజానా శాఖలో ఇలాగే ఓ కుటుంబ పింఛన్ డబ్బుల విషయంలో లేనిపోని కొర్రీలు పెట్టారు. బాధితురాలిని ఇరకాటంలో పెట్టే విధంగా గుర్తుతెలియని వ్యక్తి పేరిట ఓ లేఖను సృష్టించి ఆ ఫిర్యాదు ఆధారంగానే ఆమెకు రావాల్సిన పెద్ద మొత్తం డబ్బును రాకుండా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ ఉదంతంపై ఉన్నతాధికారులు గతేడాది సెప్టెంబరులో విచారణ చేపట్టారు. కింది స్థాయి ఉద్యోగి ఒకరు ఆ అబాండాన్ని తనపై వేసుకున్నారన్న చర్చ ఆ శాఖలో సాగుతోంది.

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాలోని ఖజానా శాఖ ఉద్యోగుల్లో కొందరికి పైసల జబ్బు పట్టుకుంది. సహచర ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులనే జాలి, కరుణ లేకుండా అందినకాడికి దండుకుంటున్నారు. ఇటీవల జగిత్యాలలో ఓ ఉద్యోగి పట్టుబడిన ఉదంతంతో ఈ శాఖలో జరుగుతున్న తంతు వెలుగులోకి వచ్చింది. కొందరు ఉద్యోగుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా ఇదంతా తమకు షరా'మామూళ్ల' వ్యవహారమేనని వారు తేలిగ్గా తీసిపారేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, గుత్తేదారులు, పింఛన్‌దారులు ఇలా ఎవరినీ వదలకుండా కమీషన్ల రూపంలో కాసులను దండుకుంటున్నారు.

ఎవరినీ వదలరూ!

ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారి సర్వీసు ఎంట్రీ, ఐడీ, ప్రాన్ నంబర్ కేటాయింపు కోసం ఒక్కొక్కరి వద్ద రూ.1500 వసూలు చేశారనే ఆరోపణలు కొన్ని జిల్లాల్లో వినిపించాయి. పని కావాలంటే ఇవ్వక తప్పదనే తీరుతో అడిగినంతా ఇచ్చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సప్లిమెంటరీ జీతాలు, ఇంక్రిమెంట్లు, ఏరియర్స్, సరెండర్ పీఎఫ్, జీపీఎఫ్‌లు ఇతర చెక్కులు, బిల్లుల పాసుల విషయంలో కొర్రీలు పెడుతున్నారు. మంజూరు కావాల్సిన మొత్తం ఆధారంగా 2-3 శాతం కమీషన్లు అడుగుతున్నారు. ఇక గుత్తేదారుల బిల్లులకు సంబంధించిన వాటి విషయంలో చేతివాటాలు ఎక్కువగా ఉంటున్నాయి. కళాశాలలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల మంజూరు సమయంలో కమీషన్ ఇవ్వడం ఆధారంగానే బిల్లులు మంజూరు అవుతాయని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా కలెక్టరేట్‌లలో కొలువుదీరి ఉన్న ఈ ఖజానా శాఖల్లోని వ్యవహారాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగితేనే వారి చేతివాటాల జోరు తగ్గే అవకాశముంటుంది.

భూభారతితో సమస్యల సత్వర పరిష్కారం

సైదాపూర్, చిగురుమామిడి న్యూస్‌టుడే: గత హయాంలో ధరణితో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆవేదనతో తహసీల్దార్ కార్యాలయాలను తగలపెట్టిన దుస్థితిని చూసామని.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం అమలుతో భూ సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సైదాపూర్, చిగురుమామిడిలో భూభారతిపై నిర్వహించిన అవగాహన సమావేశాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. భూధార్ సంఖ్యను కేటాయించి రైతులకు సులభంగా, జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించామని ఆయన పేర్కొన్నారు. జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ.. ధరణి చట్టంలో ఎన్నో లోపాలు ఉండేవని, రెవెన్యూ అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఉండేదన్నారు. అనంతరం రూ.7 కోట్ల నిధులతో పెర్కపల్లి, వెన్కేపల్లి గ్రామాలకు సంబంధించిన హైలెవల్ వంతెనల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. వెన్కేపల్లి, సైదాపూర్ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సంఘం నూతన భవన సముదాయం, కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో రమేశ్, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వెన్కేపల్లిలో సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం. చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి



సోమారం-ఎగ్లాస్‌పూర్ మధ్య ఏటా తప్పని వరద ముప్పు(పాత చిత్రం)

బాబ్బాబు.. వంతెనలు కట్టండి

న్యూస్‌టుడే, సైదాపూర్

సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కల్వర్టులపై వంతెన నిర్మాణాలు లేక ఏళ్ల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఇక్కడి కల్వర్టుల తలరాతలు మారడం లేదు. ఏటా వర్షాకాలంలో వరదల ప్రవాహ తాకిడికి రోజుల తరబడి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా వ్యాపారులు, విద్యార్థులు, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా వంతెనల నిర్మాణం జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు ఏటా కష్టాలే!

సైదాపూర్-జాగీర్‌పల్లి గ్రామాల మధ్యనున్న సమ్మక్క గుట్ట వద్ద గల కల్వర్టుపై వంతెన లేక భారీ వర్షాలు, వరదల కారణంగా కల్వర్టు దాటలేని దుస్థితి నెలకింది. ఇదే మార్గం మీదుగా హుజూరాబాద్ ప్రధాన రహదారి కావడంతో విద్యార్థులు ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగ్లాస్‌పూర్-సోమారం, సోమారం-బూడిదపల్లి, సోమారం-మొలంగూర్, రాములపల్లి-గొడిశాల, బొమ్మకల్-గొడిశాల, ఆకునూర్-పెర్కపల్లిల మధ్య కల్వర్టులపై వంతెనలు లేవు.

నిధుల ఊసే లేదు

అతి భారీ వర్షాలు నమోదైతే ఇక మండలానికి దూర ప్రాంతాలతో సమాచారం పూర్తిగా నిలిచిపోతుంది. విద్యార్థులు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి. రైతుల కార్యకలాపాలు ముందుకు సాగవు. గతంలో కొంతమంది రైతులు, మహిళా కూలీలు సాహసించి వరదలో కల్వర్టు దాటుకుంటూ ప్రవాహ దాటికి కొట్టుకుపోయి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ ఏడాదైనా నిధులు మంజూరవుతాయనుకుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మరో రెండు నెలల్లో వర్షాకాలం ఆరంభం కానుంది. ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి నిధుల మంజూరుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో 12 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

ఈనాడు స్పందనకు వందనం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని విద్యార్థుల కోసం మే 12 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలిక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రకటించారు. 'నగర పిల్లలకు ఆటలు వద్దా?' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ఆమె స్పందించి కార్యాలయంలో డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. శిబిరంలో భాగంగా అర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడలపై 4వ తరగతి నుంచి 12వ తరగతి లోపు పిల్లలకు నెలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు మే 2 నుంచి 9 వరకు అంబేడ్కర్ స్టేడియంలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్, ఒలింపిక్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గాసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు టి.రమేశ్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పెటా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం మే 4న జరిగే నీట్ యూజీ ప్రవేశ పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2975 మంది విద్యార్థుల కోసం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన వసతులు కల్పించామన్నారు. నీట్ పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ పంకజ్‌కుమార్, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి వెంకటరమణ, ఎన్పీడీసీఎల్ ఏడీఈ లావణ్య, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, ఏసీపీ మాధవి, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చెత్తే కదా అని పారబోస్తే..

● నిండిన డంపింగ్ యార్డు ● మంటలు, పొగతో అవస్థలు

న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్

కరీంనగర్ నగరానికి చెత్త సవాల్‌గా మారింది. ట్రాక్టర్ల కొద్ది వస్తున్న చెత్తను నిల్వ చేసేందుకు చోటు దొరకడం లేదు. ఏకైక డంపింగ్ యార్డు పూర్తిగా నిండింది. చెత్త మీద చెత్త పేర్చుకుంటూ పోవడం తప్ప ప్రత్యామ్నాయం లేకుండా పోతోంది. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 34 నెలల కిందట రూ.16.50 కోట్లతో ప్రారంభించిన బయోమైనింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం ఆ పనులు కూడా నిలిపివేశారు. ఒకవైపు శుద్ధీకరణ లేకపోగా, మరోవైపు డంపింగ్ యార్డు కోసం స్థలాలు చూసినా స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంకేముంది చెత్త పెరగడం తప్ప, తగ్గకపోవడంతో అధికారులకు సవాల్‌గా మారింది.

మండుతున్న డంపింగ్ యార్డు

చెత్త నిల్వలు డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోగా ఆ చెత్త మండుతోంది. నాలుగైదు రోజులుగా పొగ విపరీతంగా వస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు, సమీప దుకాణ యజమానులు, కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలి ఏ వైపు వీస్తే ఆ వైపు దుర్వాసన, పొగ వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కూడా మంటలు చెలరేగడంతో ఫైరింజన్ రప్పించి మంటలు ఆర్పించారు. జెట్టింగ్ మిషన్‌తో నీటిని పట్టిస్తున్నారు.

ఏ ట్రాక్టర్‌లోనైనా చెట్ల కొమ్మలే

విద్యుత్తు శాఖ అధికారులు చెట్ల కొమ్మలను కొట్టి రోడ్ల మీద పడేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులు తీసుకొచ్చి డంపింగ్ యార్డులో పడేస్తున్నారు. ఏ ట్రాక్టర్‌లో చూసినా ఈ చెట్ల కొమ్మలే ఉన్నాయి. ఆకులు ఎండిపోయి చెత్త కాలుతోంది.

నిలుస్తున్న వాహనాలు

రోజూ డివిజన్ల వారీగా వస్తున్న ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు డంపింగ్‌యార్డు దగ్గర గంటల తరబడి క్యూలో ఉంటున్నాయి. ఒక్కో ట్రాక్టర్ చెత్త గుట్టను ఎక్కి తిరిగి వచ్చే సరికి అధిక సమయం పడుతోంది. రెండు ట్రిప్పులు చేయాల్సిన ట్రాక్టర్ ఒక ట్రిప్పు చేసే సరికే మధ్యాహ్నం దాటుతోంది. స్వచ్ఛ ఆటోల పరిస్థితి అలాగే ఉండటంతో రెండు రోజులుగా చెత్తను షెడ్డులో పోయిస్తున్నారు. వారం రోజులుగా చెత్తను పక్కకు జరిపే జేసీబీ యంత్రం పాడైంది. దాంతో కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. దీని ప్రభావం డివిజన్‌లలో చెత్త సేకరణపై పడుతోంది.



నగరంలోని డంపింగ్ యార్డులో కమ్ముకున్న పొగ

ఆలోచనలు.. ప్రతిపాదనలు

- డంపింగ్ యార్డులో చెత్తను తగ్గించేందుకు, సమస్యను నివారించేందుకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యామ్నాయం వైపు ఆలోచన చేస్తూ ముందుకెళ్తున్నారు.
- మంటలు రాకుండా, పొగ వ్యాపించకుండా ఉండేందుకు నాలుగు వైపులా నాలుగు బోర్లు వేసి ఎప్పటికి నీటి తడి ఉంచేందుకు ప్రతిపాదనలు చేశారు.
- సిమెంట్ కంపెనీతో మాట్లాడి కొంతమేర చెత్తను ఇక్కడి నుంచి తరలించేలా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
- అగ్నిమాపక శాఖ అధికారులు నిరంతరంగా నీటిని పట్టేందుకు చొరవ చూపాలని ఆదేశాలు ఇచ్చారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.31 లక్షలు మంజూరు

రామడుగు: రామడుగులోని పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.31 లక్షల నిధులు మంజూరు చేసిందని స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.













మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
కరీంనగర్ - 8008573500
గంగాధర - 8008573508
మానకొండూర్- 8008573527
హుజూరాబాద్-8008573513
కరీంనగర్ గ్రామీణ- 8008573536

కార్పొరేషన్: హనుమాన్‌నగర్‌లోని ఇం.నం.8-7-294/1/బి వైపు మురుగు కాలువ నిర్మించాలి. **- కె.రవి**

సమాధానం: రాతపూర్వకంగా ఇస్తే పరిశీలించి అంచనాలు తయారు చేస్తాం. **- ఇంజినీరింగ్ అధికారి, నగరపాలిక**

సుభాష్‌నగర్: వావిలాలపల్లిలోని ఓ చిట్‌ఫండ్ లైన్‌లో టీఎం/13/3/2ఎల్ విద్యుత్తు స్తంభానికి వీధి దీపం వెలగడం లేదు. **- ఎస్.వేణు**

సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. **- వీధి దీపాల విభాగం అధికారి, నగరపాలిక**

శంకరపట్నం: కేశవపట్నం గ్రామ ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేసి ఇరువైపులా మట్టి చదును చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. **- మోయిన్, కాలనీవాసి**

సమాధానం: అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం. **- నర్సయ్య, కార్యదర్శి**

వీణవంక: నర్సింగాపూర్‌లో బస్టాండు ఆవరణలో శివాలయం పక్కన డ్రైనేజీలో మురుగు పేరుకుపోయింది. **- రవీందర్, గ్రామస్థుడు**

సమాధానం: శుభ్రం చేసేలా చూస్తాం. **- సురేశ్, కార్యదర్శి**

పరిసరాలు శుభ్రం

ఈనాడు స్పందనకు వందనం

కార్పొరేషన్: జగిత్యాల రోడ్డులోని వివేకానందపురి రోడ్డు నం.2లో రోడ్డుపై పడేసిన చెత్తాచెదారాన్ని, చెట్ల ఆకులను తొలగించి శుభ్రం చేశారు. 'మేమున్నాం.. మీకు తోడుగా..'లో ఈ నెల 29న వచ్చిన సమస్యకు సహాయ కమిషనర్ వేణుమాధవ్ స్పందించి ఇన్‌స్పెక్టర్ కుమారస్వామికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కార్మికులతో ఆ ప్రాంతంలో పనులు చేయించారు.

ఆక్రమణలు తొలగించాలి

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని కశ్మీర్‌గడ్డ అగ్నిమాపక శాఖ కార్యాలయం పక్కన రోడ్డును ఆక్రమించడంతో ఆ వైపు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా అలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ తగ్గిపోవడంతో రహదారి ఇరుకుగా మారిందని, వెంటనే ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్ష నేరం

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని.. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ప్రకటించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. వైద్యాధికారులు సన జవేరియా, ఉమాశ్రీ, వసంతకుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

కరీంనగర్ పట్టణం, మానకొండూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణులకు మొదటి కాన్పులో సాధారణ ప్రసవం జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మానకొండూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బాధితులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

కుడికాలువ మరమ్మతులకు నిరీక్షణ

- తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సరఫరా
- రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, చిగురుమామిడి

మధ్య మానేర్ నుంచి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సాగు నీరందించే కుడిగట్టు కాలువ ఏటా అధిక వర్షాలకు గట్టు తెగిపోయి పంటలు మునుగుతున్నాయి. కొందరి పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. దీంతో కాలువ మరమ్మతులకు సంబంధించి.. అదనపు పనులకు రూ.1.50 కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ శాఖ డీఈఈ సదయ్య తెలిపారు. ఈ కాలువ ద్వారా చిగురుమామిడి, తిమ్మాపూర్, సైదాపూర్ మండలాల్లో 44 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ రబీ సీజన్‌లో 34 వేల ఎకరాలకు అందించినట్లు పేర్కొన్నారు.

41 కిలోమీటర్ల మేర..

41 కిలోమీటర్ల మేర ఈ కాలువ విస్తరించి ఉంది. కొన్నిచోట్ల కాలువ పైభాగం నుంచి వరద నీరు పోయేలా కట్టడాలు నిర్మించాల్సి ఉంది. కాలువ సామర్థ్యం 700 క్యూసెక్కులు కాగా.. అందులో 400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. వర్షాలు అధికంగా కురిసినపుడు కోతకు గురవుతుంది.


కోతకు గురైన కాల్వ గట్టును పరిశీలిస్తున్న అధికారులు (పాత చిత్రం)

పొలాల్లో ఇసుక మేటలు

వర్షాకాలంలో వరదనీరు అధికంగా ప్రవహించినపుడు కాలువ తెగిపోయి.. రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీచపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి రైతులు మాట్లాడుతూ.. కాల్వ గట్టు తెగిపోయి పంటలు నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రచార బోర్డులు.. రోడ్లపై బారులు



నగరంలోని ప్రధాన రహదారి కమాన్ నుంచి కోతిరాంపూర్ ఎన్టీఆర్ చౌరస్తా వరకు రోడ్ల మీదనే సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. దుకాణాలకు సంబంధించి ప్రచారం కోసం వీటిని ఏర్పాటు చేసుకోగా, రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో నడకదారులు ఆక్రమించుకోవడం, దుకాణాల ముందు ఫుట్‌పాత్ వరకు షెడ్లు వేసుకోవడం, సామగ్రి నిల్వ చేయడంతో స్థానికులు నడిచేందుకు దారి లేకుండా పోతోంది. **- న్యూస్‌టుడే, కార్పొరేషన్**

అంతిమ యాత్ర రథానికి చోదకులేరి?



హుజూరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో కొంతకాలంగా అంతిమ యాత్ర రథం కార్యాలయానికే పరిమితమైంది. అవసరరీత్యా గ్రామాలకు రథాన్ని కేటాయించగా ప్రస్తుతం వాహనాన్ని నడిపే చోదకుడు లేక అక్కడే నిలిచి ఉంటుంది. ఈ విషయమై ఎంపీడీవో సునీతను న్యూస్‌టుడే చరవాణిలో సంప్రదించగా.. అవసరాల మేరకు ఆయా గ్రామస్థులు తీసుకెళతారని, డ్రైవర్‌ను వారే సమకూర్చుకుంటారని వివరణ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, హుజూరాబాద్ పట్టణం**

అక్రమాల ఆరోపణలు.. లబ్ధిదారుల ఆందోళనలు


జమ్మికుంట పుర కార్యాలయంపై దివ్యాంగుడి నిరసన

జమ్మికుంట, న్యూస్‌టుడే: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించలేదని ఆగ్రహించిన ఆబాది జమ్మికుంటకు చెందిన దివ్యాంగుడు డొంకటి కోటేశ్వర్.. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎక్కి నిరసన చేపట్టారు. మరోవైపు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు నీటి ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తమ కాలనీలో అధికారులు 10 మంది లబ్ధిదారులను గుర్తించారని.. కనీసం తన పేరు దివ్యాంగుల కోటాలో లేదని సదరు దివ్యాంగుడు వాపోయారు. సిరిసేడులో 380 మంది లబ్ధిదారుల పేర్లను పరిశీలించి 27 మందికి కేటాయించారని పలువురు మహిళలు ఆగ్రహిస్తూ.. కేటాయింపులో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నిబంధనల ప్రకారమే ఇళ్లను మంజూరు చేస్తున్నామని పుర కమిషనర్ ఎండీ అయాజ్ తెలిపారు. వార్డుకు 11 నుంచి 12 దాకా ఇళ్లను మొదటి విడతగా కేటాయించామని.. మిగతా వారికి రెండో దశలో పరిశీలిస్తామన్నారు. నిబంధనల ప్రకారం 5 శాతం దివ్యాంగులకు ఇళ్లు కేటాయించామని తెలిపారు.

శంకరపట్నం: ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు చోటు దక్కలేదని శంకరపట్నం మండలం మొలంగూర్‌లో దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ జాబితాపై పరిశీలన చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అర్హులకు అన్యాయం జరిగితే ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు భాజపా జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి మండల కేంద్రంలో మంగళవారం ప్రకటించారు. భాజపా మండలాధ్యక్షుడు అనిల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొమురయ్య, నాయకులు సారయ్య, నరేందర్, రాములు, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుత్తు ఉప కేంద్ర సిబ్బంది ఆందోళన



భగత్‌నగర్: నగరంలోని హౌసింగ్‌బోర్డ్‌లో విద్యుత్తు ఉప కేంద్రం ప్రహరీకి ఆనుకొని నగరపాలిక సంస్థ సిబ్బంది చెత్త డంపింగ్‌ను ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యుత్తు సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. కేంద్రం పక్కనే నిప్పు రాజేయడంతో ఆందోళన పడాల్సి వస్తోందన్నారు.

భక్తిశ్రద్ధలతో శత చండీయాగం

నగునూరు (కరీంనగర్ గ్రామీణం): నగర శివారులోని నగునూరులోగల శ్రీదుర్గాభవాని ఆలయంలో ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శతచండీ మహాయాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితులు పురాణం మహేశ్వరశర్మ పారాయణం చేశారు. భక్తులు, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో మంటలు

శంకరపట్నం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తాకి ఏర్పడిన మంటలతో వరి పొలాలకు ప్రమాదం తప్పిన ఘటన శంకరపట్నం మండలం మక్త శివారులో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ముత్తారం వెళ్లే దారి పక్కన 11 కేవీ విద్యుత్ తీగలు తాకి పొలాల్లోని పశుగ్రాసంపై మంటలు వ్యాపించాయి. దీంతో రైతులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుత్‌శాఖ అధికారులకు అగ్ని ప్రమాద సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.


మక్త శివారులో మంటలు ఆర్పివేస్తున్న రైతు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో బుధవారం మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతోపాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

కరీంనగర్ సాంస్కృతికం: కరీంనగర్ ఇస్కాన్ దేవాలయం నేతృత్వంలో బుధవారం శ్రీరాధా గోవింద మందిర ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు నరహరి ప్రభుజీ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్వింటాలుకు రూ.3200 చెల్లించండి

హుజూరాబాద్ గ్రామీణం: విత్తన వ్యాపారులు వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.3200 చెల్లించాలని భాజపా జిల్లా కార్యదర్శి కరుణాకర్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ధర నిర్ణయించకుండానే రైతుల నుంచి ధాన్యాన్ని ఎలా కొనుగోలు చేస్తున్నారో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తే ఒక్కో రైతుకు ఎకరాకు రూ.10 వేల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

నిలకడగా పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర నిలకడగా ఉంది. యార్డుకు 5 ట్రాలీల పత్తి విక్రయానికిరాగా.. బిడ్డింగ్‌లో క్వింటాలుకు కనిష్ఠ ధర రూ.6,700 గరిష్ఠంగా రూ.7,500 పలికింది. సోమవారం పలికిన గరిష్ఠ ధరే తాజాగా వ్యాపారులు నిర్ణయించారు. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి మల్లేశం పర్యవేక్షించారు.

సంక్షిప్తం

పౌరహక్కుల దినోత్సవ సమావేశాలు నేడు

రాంపూర్ (కరీంనగర్): పౌర హక్కుల దినోత్సవ సమావేశాలను జిల్లాలోని ప్రతి మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో బుధవారం నిర్వహిస్తారని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకులు పవన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్, పోలీస్ సిబ్బంది, ఎస్సీ వసతి గృహ సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సామాజిక న్యాయమే పార్టీ లక్ష్యం

శంకరపట్నం: తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సామాజిక న్యాయమే జన సమితి లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. మండలంలోని మొలంగూర్‌లో మంగళవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఉచిత అంబలి కేంద్రాన్ని జిల్లా కన్వీనర్ మోరె గణేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. నాయకులు శ్యామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో గ్రామ యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చ రమేశ్, తిరుపతిరెడ్డి, రవి, శ్రీనివాస్, వేణు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నంలో..

శంకరపట్నం: ప్రజల దాహార్తి తీర్చడానికి గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల ప్రసాద్ అన్నారు. కేశవపట్నం జాతీయ రహదారి సమీపాన చలి వేంద్రాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. అలాగే వారంలో రెండు రోజులపాటు పెరుగన్నం ఏర్పాటు చేయనున్నట్లు మండల నాయకుడు కంటె రాకేశ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గంగాధర: మండలంలోని కురిక్యాలకు చెందిన యువ రైతు ఒగ్గరి ప్రశాంత్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేశంలు రూ.65 వేలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఒగ్గరి రాజు, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవి భత్యం ఇవ్వాలి

భగత్‌నగర్: ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యం (సమ్మర్ అలవెన్స్) ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

వక్ఫ్ ఆస్తుల రక్షణకే సవరణ బిల్లు

చొప్పదండి: వక్ఫ్ ఆస్తుల రక్షణకే వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం రూపొందించిందని మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ అన్నారు. మంగళవారం చొప్పదండిలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నాయకులు కృష్ణారెడ్డి, జగన్‌రెడ్డి, కోటేష్, భూంరెడ్డి, సారయ్య, రవి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

శంకరపట్నం: వెలుగు బాట మహిళా సమాఖ్య మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా మందాడి సబిత(ఆముదాలపల్లి), కార్యదర్శిగా కస్తూరి అనిత(కేశవపట్నం), కోశాధికారిగా నూనె శ్యామల(ముత్తారం) ఎన్నికైనట్లు ఏపీఎం సుధాకర్ తెలిపారు. గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ విద్యా చైతన్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను ఎన్నుకున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ తెలిపారు. కరీంనగర్‌లో మంగళవారం జరిగిన వేదిక రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్లు తీర్మానం చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.సదానందం తెలిపారు. ఎ.మల్లేశం, ఎం.జనార్దన్, జాన్వలి.వి.సతీష్, శ్రీలత, శ్రీనివాసరావు, ఎన్.సంపత్, దామోదర్, పవన్‌కుమార్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


తీర్మాన ప్రతిని మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్‌కు అందజేస్తున్న వేదిక నాయకులు

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం


గంగాధరలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి పథకంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధరలో మంగళవారం సాయంత్రం 131 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసి మాట్లాడారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రజిత, సింగిల్‌విండో అధ్యక్షుడు తిర్మలరావు, వైస్ ఛైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనోహర్, సత్తు కనకయ్య, అంజి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు

చైతన్యపురి, న్యూస్‌టుడే: నూతనంగా కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శివకుమార్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాసిక్యూటర్లకు సంబంధించిన సమస్యలు, వివరాలను జిల్లా న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లక్ష్మీప్రసాద్, జూలూరి శ్రీరాములు, కుమారస్వామి, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రంజిత్, వీరస్వామిలు పాల్గొన్నారు.


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రాసిక్యూటర్లు

పక్కాగా తడి, పొడి చెత్త సేకరించాలి


స్వచ్ఛ ఆటోను తనిఖీ చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అపార్టుమెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇళ్లు, వేడుక మందిరాల నుంచి పక్కాగా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని నగరపాలిక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మీనగర్‌లో అపార్టుమెంట్‌వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వారంలో మార్పు రాకపోతే రెండు కలిపి ఇచ్చే చెత్తను అక్కడే వేరు చేయిస్తామన్నారు. డీఆర్‌సీసీ కేంద్రంలో పొడి వ్యర్థాల వేరు విధానాన్ని ఆరా తీశారు. కార్యక్రమంలో శానిటరీ ఉద్యోగులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సహాయ ఆచార్యుల నిరసన

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన వర్సిటీలో కాంట్రాక్ట్, పార్ట్‌టైంగా విధులు నిర్వహిస్తున్న సహాయ ఆచార్యులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ పరిధిలో వారం రోజులుగా నిరసన చేపడుతున్నారు. మంగళవారం దీక్ష శిబిరానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సూరెపల్లి సుజాత వచ్చి సహాయ ఆచార్యులకు మనోధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్, సైన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ, గోదావరిఖని పీజీ సెంటర్ నుంచి కాంట్రాక్ట్, పార్ట్‌టైం సహాయ ఆచార్యులు నిరసనలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుజాత

బకాయిలు చెల్లించాలని వినతి

తెలంగాణచౌక్ (కరీంనగర్), న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ కరీంనగర్‌లో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, బెలం నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళులు

కరీంనగర్ సాంస్కృతికం, తెలంగాణచౌక్ (కరీంనగర్): జమ్మూకశ్మీర్‌లో అమరులైన పర్యాటకులకు రుద్రమ సాహితీ సంస్థ, అభయాంజనేయ యూత్ అసోసియేషన్ వారు రాంనగర్‌లోని అభయాంజనేయ ఆలయ సమీపంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. డా.అడువాల సుజాత, బొమ్మకంటి కిషన్, చిందం సునీత, మూల నారాయణ, వేణు, పద్మ, తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్‌లో న్యాయవాదులు నివాళులు అర్పించారు. అనంతరం సాయిని మల్లేషం ఆధ్వర్యంలో ఒకే దేశం..ఒకే ఎన్నికపై చర్చాగోష్ఠి నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, కోమాల ఆంజనేయులు, చందూరి భూంరెడ్డి, దాసరి రామిరెడ్డి, రఘునందన్‌రాజు, బండారు శ్రీనివాస్, గంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న రుద్రమ సాహితీ సంస్థ ప్రతినిధులు

తెలంగాణచౌక్ (కరీంనగర్): ఉగ్రవాదుల కాల్పులు హేయమని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రవీందర్, కిషన్, రాజేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట, న్యూస్‌టుడే: విద్యార్థుల అకడమిక్స్‌తోపాటు కంప్యూటర్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సు పూర్తి చేసిన 65 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఓదెలు కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, కంప్యూటర్ విభాగం ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లారీ-కారు ఢీ.. తప్పిన ప్రమాదం

క్రైం కార్నర్

శంకరపట్నం, న్యూస్‌టుడే: కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం లారీ-కారు ఢీకొన్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళుతున్న ఓ కారు కేశవపట్నం చేరుకోగానే రహదారిపై వేగ నిరోధకాల వద్ద లారీ వేగం తగ్గించడంతో వెనకాల నుంచి కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని.. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా..

జమ్మికుంట: మండలంలోని తనుగుల సమీపంలో మంగళవారం ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. సీడ్ ధాన్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో సాంకేతిక లోపంతో ధాన్యం ట్రాలీ జమ్మికుంట-వావిలాల రోడ్డు వద్ద బోల్తా పడగా.. ప్రమాద సమయంలో పరిసర ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

12 మోటార్లలోని రాగి తీగ చోరీ

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూరాబాద్ మండలంలోని కందుగుల శివారు కాకతీయ ప్రధాన కాలువ వెంట ఉన్న విద్యుత్ మోటార్లను దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు.. ప్రధాన కాలువలోకి మోటార్లను అమర్చారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొందరు 12 మంది రైతుల మోటార్ల రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఒక్కో మోటారు రాగి తీగ విలువ సుమారు రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.



గుట్టపై సొరంగంలో పురావస్తు శాఖ అధికారులు

గట్టుసింగారంలో శాతవాహనుల శాసనాలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం గట్టుసింగారం గుట్టల్లో శాతవాహనుల కాలం నాటి శాసనాలను పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఈ శాఖలోని ఎపిగ్రఫీ (శాసనాలపై పరిశోధన చేసే) విభాగం సంచాలకుడు మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం గుట్టలను పరిశీలించారు. ఇక్కడి సీతమ్మలొద్ది వద్ద 11 శాసనాలను గుర్తించారు. ఇవి క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దం నుంచి 6వ శతాబ్దం మధ్య కాలానికి చెందినవిగా చెబుతున్నారు. బోధన్ కేంద్రంగా ఈ ప్రాంతాన్ని పాలించిన హస్మక రాజ్యాధిపతి కుమార అక్కుసిరి గురించి అప్పటి బౌద్ధ సన్యాసులు ఈ శాసనాలను వేయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలు ఆ రాజ్యం పరిధిలోనే ఉండేవని మునిరత్నం రెడ్డి వివరించారు. అప్పట్లో గుహలో నివసించిన బౌద్ధ సన్యాసులు బ్రహ్మలిపిలో ప్రాకృతిక భాషలో శాసనాలను వేయించి రాతిపై చెక్కినట్లు చెప్పారు. వీటిలో త్రిశూలం, ఢమరుకం చిత్రాలతో వేయించిన శాసనం చారిత్రక ఆసక్తిని కలిగిస్తోందన్నారు. ఎపిగ్రఫీ అధికారులు రాఘవేంద్రవర్మ, శ్రీనివాసరావు, బీఎం రెడ్డిలతో పాటు స్థానికుడు రవీందర్‌రెడ్డి ఉన్నారు.



గోడలపై త్రిశూలం, ఢమరుకం బొమ్మలతో కూడిన శాతవాహనుల శాసనం

లారీకి ఇంత.. తరుగు పేరిట కోత

ధాన్యం కొనుగోళ్లలో అన్నదాత శ్రమ దోపిడీ

న్యూస్‌టుడే, గంగాధర

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారు. రోజుల తరబడి ధాన్యం అమ్ముకునేందుకు నిరీక్షించిన అన్నదాతలను కొనుగోలు చేసే సమయంలో ఎక్కువ తూకం వేసి తర్వాత, మిల్లుల్లో దింపే సమయంలోనే తరుగు పేరిట కోత విధిస్తున్నారు. వాస్తవానికి సంచి బరువు 600 గ్రాములు ఉండగా, సంచి బరువుపోగా 40.600 కిలోల తూకం వేయాలి. కానీ.. ధాన్యం శుభ్రం చేయడం లేదని జిల్లా అంతటా బస్తాకు 42.200 చొప్పున తూకం వేస్తున్నారు. ఇందుకు రైతులు కూడా చేసేదేమి లేక మిన్నకుంటున్నారు.

● గంగాధరలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం ఈనెల 23న లారీలో 814 బస్తాలు లోడింగు చేసి మిల్లుకు పంపించారు. మిల్లులో ధాన్యం దింపాక తరుగు పేరుతో ట్రక్‌షీట్‌లో కొట్టివేసి 13 బస్తాలు తగ్గించి రాశారు. అంటే 5.20 క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. ఈ లెక్కన రైతులకు రూ.12,064 నష్టం జరిగింది. తరుగు పేరుతో దోపిడీకి పాల్పడ్డారని గంగాధరకు చెందిన రైతు చిరుత కిషన్ ఆందోళన వ్యక్తం చేశారు.

● మిల్లుకు పంపించాక అదనంగా తరుగు, ఇతర కారణాలతో లారీకి ఇన్ని బస్తాల చొప్పున అంటూ కోత విధిస్తున్నారు. క్వింటాలుకు తక్కువలో తక్కువ 4 నుంచి 6 కిలోలు అదనంగా దోచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.10 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు నిర్ణయించగా, ఎంత పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతుందో ఊహించుకోవచ్చు. కొన్ని చోట్ల కామన్ కింద ధాన్యం దింపుకొని క్వింటాలుకు రూ.20 తక్కువ చెల్లిస్తున్నారు. విచిత్రమేమిటంటే మిల్లుల్లో కోత పెట్టిన ధాన్యం బస్తాలకు కొనుగోలు కేంద్రాల్లో హమాలీలకు రైతుల నుంచి ఖర్చులు మాత్రం వసూలు చేయడం కొసమెరుపు.



42.200 కిలోల తూకం వేస్తున్న ధాన్యం

నమోదులో జాప్యం.. పైకానికి పాట్లు

● ధాన్యం అమ్ముకోవడంలో అపసోపాలు పడ్డ రైతులు పైకానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మిల్లులో దింపాక రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆయా కేంద్రాల నిర్వాహకులు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినా రైతులు రోజుల తరబడి ధాన్యం డబ్బులు జమకాక ఇబ్బందులకు గురవుతున్నారు. విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తామని పాలకులు, ఉన్నతాధికారులు చెబుతున్నా. అందుకు విరుద్ధంగా జరుగుతోంది.

● కరీంనగర్ జిల్లాలో 339 కేంద్రాల ద్వారా 3.60 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 329 కేంద్రాల ద్వారా 4.50 మె.ట, సిరిసిల్లలో 246 కేంద్రాల ద్వారా 3.00 మె. ట, జగిత్యాలలో 424 కేంద్రాల ద్వారా 5.00 మె.ట. ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 30 శాతం ధాన్యం సేకరించగా, వచ్చే నెల 15 వరకు కొనుగోళ్లు సాగనున్నట్లు తెలుస్తోంది. ధాన్యంలో కోతలు విధించకుండా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని రైతులు కోరుతున్నారు.

జన, మరణ ధ్రువపత్రం కావాలంటే..

మీ కోసం

ప్రస్తుతం అనేక సందర్భాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రం అడుగుతుంటారు. పుట్టిన పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే ముందుగా ఆసుపత్రి ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను ఆసుపత్రి నిర్వాహకులు మున్సిపాల్టీలకు పంపించాల్సి ఉంటుంది. పుట్టిన వెంటనే తల్లిదండ్రులు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వస్తుంది. వారం రోజుల్లో మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ ద్వారా అనుమతి లభిస్తుంది. ఆ తర్వాత మళ్లీ మీసేవ ద్వారానే సర్టిఫికెట్ పొందవచ్చు. ఆసుపత్రిలో చనిపోతే ఆధార్‌కార్డు ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే సులువుగా మరణ ధ్రువీకరణపత్రం పొందే వీలుంది. ఒక వేళ ఇంటి వద్ద, మార్గమధ్యలో చనిపోతే మాత్రం పలు రకాల ధ్రువీకరణ పత్రాలు జత చేసి మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత సర్టిఫికెట్ జారీ చేస్తారు.

- న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్

ఆలోచన అదిరిండబ్బా



అవసరం కోసం తెచ్చుకున్న ఓ డీసీఎం వ్యాన్ పాడయితే ఇంజిన్ తొలగించి కిరాణ దుకాణంగా వినియోగిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన జంగిలి సంపత్ రవాణా వాహనాలు అద్దెకు నడుపుతుంటారు. ఆయన వద్ద ఓ డీసీఎం పాతదై బాడీ పాడవడంతో ఇంజిన్‌ను ఇతర అవసరాలకు వినియోగించుకున్నారు. డబ్బాను వృథాగా తుక్కు సామగ్రికి విక్రయించడం ఎందుకని 2016లో భార్య అనితతో అందులో కిరాణ దుకాణం ఏర్పాటు చేయించారు. అలా మలచుకోవడానికి రూ.లక్ష వెచ్చించినట్లు చెప్పారు. కొత్తగా గ్రామానికి వచ్చిన వారు ఈ డబ్బా ఆలోచన అదిరింది అని చర్చించుకుంటుంటారు. - న్యూస్‌టుడే, శంకరపట్నం

యువతకు బాసటగా నా భారత్

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడావిభాగం

యువత అన్ని రంగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ 'నా భారత్' పేరిట పోర్టల్ అందుబాటులోకి తేవడంతో 15-29 ఏళ్లలోపు యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకొని ఇందులో భాగస్వాములవుతున్నారు. ఈ పోర్టల్‌లో చేరిన యువత భవితకు బాటలు వేయనుంది. నిరుద్యోగ యువతను అభివృద్ధి వైపు మళ్లించడం, సాధికారత సాధించడంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంచేందుకు ఈ పోర్టల్ ఎంతో ఉపయోగపడనుంది. దేశ వ్యాప్తంగా విద్య, ఉద్యోగావకాశాలు, పలు రకాల కోర్సులు, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు.

29 ఏళ్లలోపు వారికి అవకాశం

ఇప్పటివరకు ఇలా..

జిల్లా	పోర్టల్‌లో నమోదు
కరీంనగర్	10,691
జగిత్యాల	2460
పెద్దపల్లి	3047
సిరిసిల్ల	1632
మొత్తం	17,830

ఈ పోర్టల్‌లో నమోదైన యువతను నాలుగు ప్రధాన అంశాలతో అనుసంధానం చేస్తున్నారు.

నాలుగు అంశాల్లో..

✦ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన, సద్వినియోగం చేసుకొనేందుకు అవసరమైన అర్హతలపై అవగాహన కల్పించడం.

✦ ఎంచుకున్న రంగంలో ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందించుకొనేందుకు ఉన్న అవకాశాలు, నైపుణ్య సాధనకు అందుబాటులో ఉన్న వసతులను వివరించడం.

✦ మూడో అంశంగా సామాజిక బాధ్యతను చేర్చారు. యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా ముందుకు సాగుతున్న వివిధ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు.

✦ వ్యాపారాల్లో యువత రాణించేందుకు ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)లో రాయితీ ఎలా పొందాలన్న సమాచారం పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. వ్యాపార, పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలు నివృత్తి చేస్తారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

డిగ్రీ, పీజీ పూర్తిచేసిన కొంతమంది యువతలో నైపుణ్యం ఉన్నటిప్పటికీ.. ప్రోత్సాహకం కరవైంది. ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నా పొందలేకపోతున్నారు. ఆర్థిక స్తోమత లేక పరిశ్రమలు స్థాపించడంలో ఔత్సాహికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు 'నా భారత్' పోర్టల్ వేదిక కానుంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గ నిర్దేశనం చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మై భారత్ పోర్టల్ ప్రయోజనాలపై విద్యా సంస్థల్లో ప్రచారం కల్పిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకులు ఇందులో పేర్లు నమోదు చేసుకొని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకట్ రాంబాబు, కరీంనగర్ జిల్లా యువజన అధికారి

మెట్టు దిగని ప్రభుత్వం..
పట్టు వీడని ప్రైవేటు యాజమాన్యాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్

'ప్రభుత్వం మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పడింది. కళాశాలలను నిర్వహించటం కష్టంగా మారింది. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల'ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు శాతవాహన యూనివర్సిటీ (ఎస్‌యూ) అధికారుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నా ప్రభుత్వ పెద్దల నుంచి సానుకూలత లభించలేదు. వర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించటానికి ఏప్రిల్ 25 గడువు విధించారు. రూ.300 అపరాధ రుసుంతో ఏప్రిల్ 29 వరకు చెల్లించొచ్చని ప్రకటించారు. ఈ మేరకు విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నా చేయలేదు. వసూలు చేసిన ఫీజులను రెండు రోజుల్లో వర్సిటీకి చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యాల నుంచి అంతంత మాత్రమే స్పందన కనిపిస్తుండటం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ఎస్‌యూ పరిధిలో..
ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు : 66
ప్రభుత్వ కళాశాలలు : 24
విద్యార్థులు : 30 వేల మంది

ముంచుకొస్తున్న పరీక్షలు

మే 13 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ప్రకటించింది. జూన్ 1న ఎడ్‌సెట్, 6న లాసెట్, జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ చూపి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయం తేల్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఓ వైపు ప్రవేశ పరీక్షలు సమీపిస్తుండగా మరోవైపు డిగ్రీ పరీక్షలకే అతీగతి లేకపోవటం ఆందోళన కలిగించే అంశమని వాపోతున్నారు.

ప్రభుత్వం సుముఖంగానే ఉంది

- ఆచార్య ఉమేశ్‌కుమార్, ఉప కులపతి, శాతవాహన వర్సిటీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉంది. త్వరలోనే విడతల వారీగా బకాయిలు చెల్లించనుందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఫోన్‌లో తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి దగ్గర పెట్టుకోవటం సరికాదు.

ప్రశాంతంగా ఆర్టీసీ పరీక్ష

కరీంనగర్ రవాణా విభాగం, న్యూస్‌టుడే: టీజీఎస్-ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలో 59 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయడానికి మంగళవారం నిర్వహించిన శాఖాపరమైన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 1240 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1,169 మంది హాజరైనట్లు కరీంనగర్ జోన్ డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ విలాస్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను రెండు రోజుల్లో ప్రకటించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

రీజియన్	అభ్యర్థులు	హాజరు
ఆదిలాబాద్	150	146
నిజామాబాద్	208	200
ఖమ్మం	254	229
కరీంనగర్	341	323
వరంగల్	287	271

నేటితో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపు గడువు

పురపాలికల్లో రాష్ట్రంలోనే పెద్దపల్లిలో అత్యధికం

న్యూస్‌టుడే, పెద్దపల్లి: స్థలాల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) కింద ప్రభుత్వం ఇచ్చిన 25 శాతం రాయితీ గడువు బుధవారం ముగియనుంది. మొదట నిర్దేశించిన మార్చి నెలాఖరు వరకు స్థలాల యజమానుల నుంచి స్పందన కనిపించలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించగా ఈ నెల 30న ముగియనుంది. 2020లో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారినే అనుమతించడం, కొత్తగా దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ సాంకేతికంగా ఇబ్బందులు ఎదురుకావడంతో మొదటి నుంచీ ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపుల ప్రక్రియ అంతంతమాత్రంగానే ఉంది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ నగరపాలికలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం 6,914 మంది రూ.34.20 కోట్లు చెల్లించారు. పురపాలికల్లో పెద్దపల్లి అత్యధిక వసూళ్లతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జీహెచ్‌ఎంసీ, సమీపంలోని పురపాలికలు మినహా రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి పురపాలికలోనే అత్యధికంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.10.33 కోట్లు వసూలైంది. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, జిల్లా కేంద్రాల్లో వసూలైన రుసుం వివరాలు ఇవీ..

నగర/ పురపాలిక	దరఖాస్తులు	ఫీజు చెల్లించిన వారు	ఆదాయం (రూ.కోట్లలో)
కరీంనగర్	39,011	6,914	34.20
రామగుండం	7,092	1,188	7.03
పెద్దపల్లి	10,366	2,882	10.33
జగిత్యాల	8,790	1,520	5.30
సిరిసిల్ల	10,526	1,484	5.26

పరువు తీస్తున్నాడని అంతమొందించారు

పెద్దపల్లి హత్య కేసులో నిందితుల అరెస్టు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఏసీపీ కృష్ణ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన వేల్పుల సంతోష్ భార్య శైలజతో సమీప బంధువు, పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పొలం కుమార్ సన్నిహితంగా ఉండేవాడు. భార్య తరచూ ఫోన్‌లో అతడితో మాట్లాడుతుండటంతో వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని సంతోష్ అనుమానించాడు. ఈ విషయమై ఆమెను మందలించాడు. కుమార్ తన వెంట పడుతున్నాడని చెప్పిన శైలజ అప్పటి నుంచి అతడిని దూరం పెట్టింది. అనంతరం తన భార్య జోలికి రావద్దంటూ కుమార్‌ను సంతోష్ బెదిరించాడు. ఈ విషయాన్ని కుమార్ బంధువులకు చెప్పడంతో పాటు వద్దని చెప్పినా శైలజకు ఫోన్ చేస్తుండటంతో బంధువుల వద్ద పరువు పోతోందని సంతోష్ అతడిపై కోపం పెంచుకున్నాడు. పథకం ప్రకారం 'మాట్లాడుకుందామ'ంటూ పెద్దపల్లి మార్కెట్ యార్డుకు కుమార్‌ను పిలిచాడు. సంతోష్ కత్తి తీసుకొని భార్య శైలజతో కలిసి అక్కడికి వచ్చాడు. వ్యూహం ప్రకారం కుమార్‌తో గొడవపడిన సంతోష్ కత్తితో అతడి మెడపై పొడిచాడు. ఆ సమయంలో కుమార్ ఎదురుతిరగకుండా శైలజ అతడి చేతులు పట్టుకుంది. అనంతరం కుమార్ ముఖంపై, ఛాతిపై సంతోష్ పొడిచాడు. కుమార్ తప్పించుకునే క్రమంలో శైలజతో పాటు సంతోష్‌కు కూడా గాయాలయ్యాయి. కింద పడిపోయిన కుమార్‌ను సంతోష్ మరోసారి పొడిచి, మెడ, పొట్టపై నిలుచొని, చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. నమ్మదగిన సమాచారం ప్రకారం సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో కలిసి దొంగతుర్తికి వెళ్లి నిందితులు సంతోష్, శైలజలను వారి ఇంటి వద్దే అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తం మరకలు కలిగిన దుస్తులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

చెట్టు కొమ్మ తొలగిస్తుండగా ఘటన

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: ఓ వసతి గృహ నిర్వాహకుడి నిర్వాకంతో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయ సమీపంలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో వికాస్‌రెడ్డి, భాను బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరితో వసతిగృహ నిర్వాహకుడు మంగళవారం పక్కనే ఉన్న చెట్టు కొమ్మలు తొలగించాలని చెప్పాడు. వికాస్‌రెడ్డి చెట్టు ఎక్కి కొమ్మలు నరికే క్రమంలో తెగిపడిన కొమ్మకు 11 కేవీ విద్యుత్ తీగలు తాకాయి. చెట్టుకు విద్యుత్ షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భాను అప్రమత్తమై ప్రాణాలతో బయటపడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్‌ఎండీ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వికాస్‌రెడ్డిది జగిత్యాల జిల్లా అని తోటి విద్యార్థులు తెలిపారు. విద్యార్థి మృతికి కారణమైన సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



వికాస్‌రెడ్డి

ధాన్యం లారీపై నుంచి పడి హమాలీ కార్మికుడి...

ధర్మారం, న్యూస్‌టుడే: ధాన్యం బస్తాలు లారీలో నింపుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి హమాలీ కార్మికుడు మృతి చెందిన ఘటన ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం మండలకేంద్రానికి చెందిన మేడవేని రాజేశం(57) సోమవారం రాత్రి మార్కెట్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్నాడు. అదే సమయంలో డ్రైవర్ లారీని ముందుకు పోనిచ్చాడు. రాజేశం అదుపు తప్పి కింద పడ్డాడు. వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి మంగళవారం ఫిర్యాదు మేరకు డ్రైవర్ గుర్రాల మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



రాజేశం

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

కూలి తల్లీ.. తల్లడిల్లి

భానుడి భగభగలకు జనాలు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా ఉదయం 6 గంటలకల్లా ఉపాధి పని కోసం వివిధ ప్రాంతాల్లోకి వెళ్లి వచ్చే వారు ఎండ వేడిమికి తల్లడిల్లక తప్పడం లేదు. కరీంనగర్ రూరల్ మండలంలోని దుబ్బపల్లి వద్ద కూలీ పనులు ముగించుకొని మిట్ట మధ్యాహ్నం ట్రాక్టర్‌లో ఇళ్లకు వెళ్తున్న కూలీలు తలకు నిండుగా వస్త్రాలు చుట్టుకొని వెళ్తున్న దృశ్యం 'ఈనాడు' కెమెరా కంటపడింది. - ఈనాడు, కరీంనగర్



బీఎస్సీ పరీక్ష ఫీజు గడువు మే 6

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ బీఎస్సీ (హానర్స్) రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించుటకు చివరి గడువు మే 6 అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. రూ.300 వందల అపరాధ రుసుంతో మే 9 వరకు చెల్లించొచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోండి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోలీసు అధికారులు, సిబ్బంది సమాజంలో జరిగే మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ మహేష్ బి.గితె అన్నారు. మంగళవారం సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్, జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాలు, పరిశోధనలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. సైబర్ నేరాల నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. నిపుణులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకొని సైబర్ నేరగాళ్లకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేసే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయా ఠాణాల పరిధిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సీడీటీఐ కోర్సు కో ఆర్డినేటర్, డీఎస్పీ రాజ్ కుమార్, భీమ్ క్రిష్ణ నాయక్, జాతీయ సైబర్ నిపుణులు అఖిలేష్ రావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ స్థాయికి ఎంపిక

హుజూరాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: హుజూరాబాద్ కబడ్డీ అసోసియేషన్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సారయ్య తెలిపారు. బాలికల విభాగంలో బి.పావెల్, జి.శివాణి.. బాలుర విభాగంలో జి.భరత్, ఎం.అరవింద్‌లు ఖమ్మంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వచ్చేనెల 9 నుంచి మహారాష్ట్రలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నారు. జిల్లా అధ్యక్షుడు సారయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సంయుక్త కార్యదర్శి అంజయ్య, కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు ఎం.రవీందర్, టి.దామోదర్,



క్రీడాకారులతో కమిటీ నిర్వాహకులు

వసుంధర

vasundhara@eenadu.in

శాకాహారంతో మెనోపాజ్ లక్షణాలకు చెక్!

మెనోపాజ్ దశలో రుతుక్రమం ఆగడం, వేడి ఆవిరులు, నిద్రలేమి, బరువు పెరగడం, భావోద్వేగాల్లో మార్పులు... తదితర లక్షణాలు ఉంటాయి. జీవక్రియలోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. శాకాహారానికి ప్రాధాన్యమిస్తే ఈ మెనోపాజ్ లక్షణాల తీవ్రతను తగ్గించవచ్చు అంటోందో పరిశోధన. పప్పుదినుసులు, ఆకుకూరలూ కూరగాయల్ని అధిక మోతాదులో తీసుకోవడంతోపాటు, భిన్నమైన రకాలు ఉండేలా చూసుకోవాలంటున్నారు లండన్‌లోని కింగ్స్ కాలేజీ పరిశోధకులు. ఒక ఆరోగ్య, పోషకాహార యాప్‌ని ఉపయోగించే 7వేల మంది మహిళలను ఈ పరిశోధనకు ఎంపిక చేసింది.



వాళ్లంతా శాకాహారానికి మారిన ఏడు నెలల తర్వాత మెనోపాజ్ లక్షణాల్లో తీవ్రత మూడో వంతు తగ్గినట్టు తెలిపారు. పోస్ట్ మెనోపాజ్ దశలోని మహిళల్లో ఈస్ట్రోజన్ స్థాయిలు తగ్గడం మూలాన చక్కెరలూ, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకుంటే పొట్టలోని సూక్ష్మజీవుల వ్యవస్థ మారుతుంది. బదులుగా ఈ దశలో ఉండే మహిళలు ప్రొటీన్ అధికంగా ఉండే నట్స్, విత్తనాలు, బీన్స్, పప్పులు తీసుకోవడం మేలంటున్నారు పరిశోధకురాలు ఫెడెరికా అమాటి. 'పై విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వారంలో 30 విభిన్న శాకాహార పదార్థాల్ని తీసుకుంటే, ఎంతో మేలు' అంటారీమె.



పరీక్షే తప్పారు... జీవితాన్ని కాదు

తెలుగురాష్ట్రాల్లో పది, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మంచి మార్కుల్ని సాధించిన విద్యార్థులు ఆనందంలో మునిగితేలుతుంటే... కొందరు అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయామంటూ బాధపడుతున్నారు. ఫెయిల్ అయ్యి ఇంకొందరు తల్లిదండ్రులు, సమాజం నుంచి ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనంతటికీ కారణం మానసిక ఒత్తిడే. 'ఫెయిల్ అయిన వాళ్లు దేనికీ పనికిరారు' అన్నట్లు చూస్తోంది సమాజం. దాన్నుంచి బయట పడలేక... ఆ ఒత్తిడిని తట్టుకోలేక... విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఒక పరీక్షా ఫలితం జీవితాన్ని నిర్ణయిస్తుందా... అలా అయితే ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉన్న వారంతా టాప్ ర్యాంకర్లేనా... చరిత్రపుటలను తిరగేస్తే, సగానికిపైగా చదువులో ఎప్పుడో ఒకసారి వెనకబడిన వారే. విద్యుత్ బల్బ్‌ను కనిపెట్టి... ప్రపంచానికే వెలుగు అందించిన థామస్ ఎడిసన్‌ని బుద్ధిమాంద్యం కారణంతో చిన్నప్పుడే స్కూల్ నుంచి పంపేశారు. తల్లి సహాయంతో ఇంట్లోనే చదువుకున్నారాయన. కమ్యూనికేషన్స్, గణితం సబ్జెక్టుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పెప్సికో మాజీ సీఈఓ ఇంద్రానూయి వ్యాపార రంగంలో చెరగని ముద్ర వేశారు. జీవితంలో ఎదగడానికి మార్కులే కొలమానం అయితే వీళ్లూ ఫెయిల్ అయిన వాళ్లే. మరి ఉన్నత స్థానాల్ని ఎలా అధిరోహించగలిగారు? వీరంతా విజయాన్ని సొంతం చేసుకోవడానికి అవకాశాల కోసం వెతికారు. ఆ ఒక్క ఛాన్స్ మీకూ వస్తుంది. కాకపోతే దాని కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి. ఈ క్రమంలో ఎదురయ్యే జయాపజయాలు మనకు పాఠాలు మాత్రమే... అవే జీవితం కాదన్న విషయాన్ని గమనించుకోవాలి.

ఒక్కక్షణం...

'పక్కింటి అమ్మాయిని చూడు ఎంత మంచి మార్కులు వచ్చాయో. తను కూడా నీతోటిదే కదా. నువ్వెందుకు వెనకబడ్డావు' అంటూ చెడా మడా తిట్టింది ఓ తల్లి. కాసేపటికి తన ప్రవర్తనకు బాధపడి కూతురి గదిలోకి వెళ్లి చూస్తే, ఆ పిల్ల శవమై తేలింది... ఇది తల్లిదండ్రుల్లో అవగాహనకు సోషల్ మీడియాలో చేసిన ఓ వీడియో. నిజ జీవితంలోనూ ఇలాంటి సంఘటనలెన్నో. పరిస్థితులు చేజారిపోయాక బాధపడిన తల్లిదండ్రులెందరో. అందుకే మనం చెప్పే విషయమేదైనా వాళ్లలో పోటీతత్వాన్నీ, మార్గనిర్దేశాన్నీ సూచించేవిగా ఉండాలే గానీ చిన్నారి జీవితాన్ని చిదిమేసేలా ఉండకూడదు.

అది పాఠమే...

సింహం వేటాడే సమయంలో ఏ జింకో కనిపించగానే... ఒక్క అడుగు వెనక్కి వేసి, మరింత వేగంతో ముందుకు దూకి దానిపై దాడిచేస్తుంది. పరీక్షల్లో మీకు ఎదురయ్యే అపజయం కూడా అలాంటిదే. మీరు ఒక అడుగు వెనక్కి వేశారంటే... అది మీకు పాఠం అవుతుందే తప్ప, వైఫల్యం కాదు. మీ కెరియర్‌కు అది మచ్చా కాదు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకున్నప్పుడే జీవితం, కెరియర్ మీద మరింత అవగాహన పెరిగేది. కాబట్టి ఫెయిల్యూర్స్ చూసి భయపడకండి. ఆత్మన్యూనతతో మీరు చేసే పొరపాటు మీ తల్లిదండ్రులకు వేసే అతిపెద్ద శిక్ష అని మరచిపోకండి.

సాయం తీసుకోండి

సాయం అడగడం బలహీనత కాదు. ఆందోళనలో మీరున్నప్పుడు... ఈ కింది నంబర్లకు ఫోన్ చేయండి.

టెలీ-మానస్: అకడమిక్, పోటీ పరీక్షలు, ర్యాగింగ్, కుల వివక్ష లాంటి కారణాలతో ఒత్తిడికి గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి పనిచేస్తోన్న కార్యక్రమం ఇది. 14416, 18008914416 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయండి. క్లినికల్ సైకాలజిస్టులు, సామాజిక కార్యకర్తలు అందుబాటులోకి వచ్చి, మీ సమస్య వినడమే కాదు. అవసరమైన మార్గనిర్దేశమూ చేస్తారు.

- వన్‌లైఫ్...7893078930, జీవన్ ఆస్థా... 18002333330, స్నేహ సూసైడ్ ప్రివెన్షన్ హెల్ప్‌లైన్... 04424640050, ఆసరా... 9820466726 లాంటి చాలా ఎన్జీవోలు మానసిక సమస్యల నుంచి బయటపడేందుకు పరిష్కారాన్ని చూపిస్తున్నాయి.

అభద్రతా భావం వద్దు...


మంచి మార్కులు, అంచనాలు, బెదిరింపులు, తోటి వారితో పోలిక లాంటి రకరకాల కారణాలతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పరీక్ష రాశాక కూడా ఈ ఆలోచనలే వాళ్లను వెంటాడుతున్నాయి. అవే డిప్రెషన్‌కు కారణమై... ఆత్మహత్యలకూ దారితీస్తున్నాయి. ఈ విషయంలో పేరెంట్స్, పిల్లలూ ఇద్దరికీ కౌన్సెలింగ్ అవసరం. పరీక్షల్లో ఒకవేళ ఫెయిల్ అయినా, ఇదేం పెద్ద సమస్య కాదని, ఈసారి బాగా కష్టపడి మంచిమార్కులు తెచ్చుకోవచ్చని ధైర్యం చెప్పండి. పిల్లల హావభావాల్లో వచ్చే మార్పుల్ని గమనిస్తూ... అవి ఎక్కువైతే వెంటనే సైకాలజిస్టుల్ని సంప్రదించండి.



- డా. మండాది గౌరీదేవీ
మానసిక నిపుణురాలు

మీకు తెలుసా?

తల్లి కడుపులో శిశువు ప్రాణం పోసుకోవడం ఓ అద్భుతం. అయితే, గర్భస్థ శిశువుకి మొదట డెవలప్ అయ్యే సెన్స్... స్పర్శ అట. బిడ్డ కడుపులో పడ్డ 8 వారాలకే ఇది అభివృద్ధి చెందుతుందట. ముందుగా నోరు, ముఖంలో ఈ సెన్స్ డెవలప్ అయ్యి, తరవాత మిగతా శరీర భాగాల్లో జరుగుతుందట.



ముగ్గురు నలుగురితోనే మాట్లాడతారు...

ప్రతి నెలా మా బాస్‌తో స్టాఫ్ అందరికీ 2–3గంటలు మీటింగ్ ఉంటుంది. మాలో సగం మందికి దీంతో సంబంధమే ఉండదు. ముగ్గురు నలుగురు కీలక వ్యక్తులతో మాట్లాడతారంతే. ఓసారైతే 45 నిమిషాలపాటు అందరూ ఫొటోలు తీసుకోవడంతోనే గడిచిపోయింది. నేను ఓ టీమ్‌ను లీడ్ చేస్తాను. వాళ్లు కూడా దీని గురించే ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయం మా బాస్‌తో ఎలా చెప్పొచ్చు? – ఓ సోదరి

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

కొంతమంది బాస్‌లు సమయం లేకపోవడం వల్లనో లేదా మరే ఇతర కారణాల వల్లనో మీటింగ్‌కు సరిగ్గా సిద్ధమవ్వలేరు. ఇలాంటప్పుడు మీరు ముందుగా ఆయన ప్రిపేర్ అవడంలోనూ, మీటింగ్ అయ్యాక ఫాలోఅప్ చేయడంలోనూ సాయం చేయొచ్చు. నిజంగానే సమావేశం ఉపయోగకరంగా లేదనిపిస్తే... దాని గురించి ప్రస్తావించే హక్కు మీకు ఉంది. కాబట్టి, ముందుగానే మీరు సమావేశ అజెండా గురించి మీ బాస్‌ను అడగండి. సమావేశం వల్ల వృథా అయ్యే సమయంలో మీరు ఏయే పనులు పూర్తి చేసుకుంటారో కూడా వివరించి చెప్పండి. చాలామంది మీటింగ్ ఉపయోగకరంగా లేదంటున్నారు కాబట్టి, వారి తరఫున కూడా మీరు బాధ్యత తీసుకుని సమావేశాన్ని సరైన దారిలో నడిపించే ప్రయత్నం చేయండి.

బంగారం-వెండి



29న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	98,890	89,900	1,00,090
విజయవాడ	95,855	89,800	99,000
ప్రొద్దుటూరు	97,500	89,700	99,000
రాజమహేంద్రవరం	98,000	89,180	99,000
విశాఖపట్నం	97,600	89,800	1,06,000
తమిళనాడు	-----	89,800	1,11,000



"నాయకత్వం అంటే అన్ని ప్రశ్నలకూ మన దగ్గర సమాధానాలు ఉండటం కాదు. సరైన ప్రశ్నల్ని లేవనెత్తడం, వాటికి మెరుగైన పరిష్కారాలు చూపేలా బృందాన్ని తీర్చిదిద్దడం.
- స్మితా జాటియా, వైస్ ఛైర్‌పర్సన్, వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్

వేసవి నోదం జ్ఞానం



గురి కుదిరితేనే గెలుపు!

ఒకప్పుడు వేసవి సెలవులంటే చాలు... అటకమీద పెట్టిన క్యారమ్‌బోర్డులు కిందకి తీసేవారు. కాస్త పెద్దపిల్లలు ఆడుతోంటే 'మరి మేము...?' అంటూ చిన్నవాళ్లు పోటీ పడేవారు. వీరికేమో కాయిన్ కొట్టడం సరిగా రాదు. పక్కనే ఉన్న రంధ్రంలోకి తోసేస్తుంటే చిన్నపాటి తగాదాలు. కానీ ఆద్యంతం సరదాగా సాగుతుంది. అయితే దీన్ని కేవలం ఆటగానే పరిగణించలేం. ఇతర లాభాలూ చాలానే. ఇది కన్ను- చేయి సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. ఏకాగ్రతనీ పెంచుతుంది. ఈ ప్రయోజనాలు మీ పిల్లలకీ కావాలనిపిస్తే హాకీ లేదా ఫుట్‌బాల్ బోర్డ్ గేమ్ కొనివ్వండి. ఇదీ క్యారమ్ బోర్డులానే ఉంటుంది. కానీ కాస్త భిన్నం.




ఇందులో బోర్డు రెండు విభాగాలుగా విడిపోతుంది. రెండు వైపులా బ్లాక్ అండ్ వైట్ కాయిన్లు ఉంటాయి. వాటిని స్ట్రైకర్‌తో కాకుండా బోర్డు చివరల్లో ఇచ్చిన రబ్బరుకు కాయిన్‌ని ఆన్చి వెనక్కి లాగి వదలాలి. బోర్డు మధ్యలో చిన్న రంధ్రం ఉంటుంది. కాయిన్‌ని ఆ రంధ్రం నుంచి అవతలి వైపునకు పంపడమే ఆట. ఇద్దరు ఆడే ఆట ఇది. ఇరువైపులా 5-10 వరకు కాయిన్లు ఇస్తారు. ఎవరు ముందుగా కాయిన్లన్నింటినీ అవతలి వైపునకు పంపుతారో వారే విజేత. ఆటకి ఆట... మెదడుకీ వ్యాయామం. ఇంకేం తెచ్చి మీ పిల్లలకు ఇచ్చేయండి మరి!

బోటు పేరే ఆమె బ్రాండ్!

చదువుకి తగ్గ ఉద్యోగం చేస్తే.... మంచి జీతం వస్తుంది. కానీ, ఆత్మసంతృప్తి కావాలంటే... మనసుకి నచ్చింది చేయాలంటారామె. ఆ ప్రయత్నంలో గిరిజన తెగల సంప్రదాయ నేత కళల పరిరక్షణకు నడుం కట్టారు. వాటికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిపెట్టారు. కళాకారులకు వారి ప్రతిభకు తగ్గ ఉపాధి కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి ఫ్యాషన్ డిజైనర్‌గా మారిన రిచా మహేశ్వరి కథ ఇది.

రిచా పుట్టిపెరిగింది ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌లో అయినా స్వరాష్ట్రం మాత్రం ఒడిశా. అందుకే ఈ ప్రాంతమంటే ఆమెకు ప్రత్యేకాభిమానం. ఇంజినీరింగ్ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారామె. పదిహేనేళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేసి మంచి జీతం అందుకున్నారు. అయినా ఆమెను ఏదో అసంతృప్తి వెంటాడేది. ముఖ్యంగా తనకి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయనీ, యాంత్రికంగా పనిచేయాల్సి వస్తోందనీ బాధపడేవారు. అందుకే, నచ్చిన పని ఏదైనా చేయాలనుకున్నారు. అది వెతుక్కోవడానికి మొదట ఉద్యోగమే మానేయాలనుకున్నారు రిచా. కానీ, తర్వాత మనసు మార్చుకుని ఏడాది పాటు లీవ్ పెట్టి ఒడిశాలోని గ్రామీణ ప్రాంతాల పర్యటన ఆరంభించారు. అప్పుడే స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న ఎన్నో కళలు, నేతలు గురించి తెలిసింది. ముఖ్యంగా పిప్లీ అప్లిక్ వర్క్, నుపట్నాలోని ఖండువా ఇకత్ రిచాను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదనంగా సంబల్‌పూర్, సోనేపూర్, బర్పల్లి... వంటివాటితో పాటు సహజ రంగులతో తీర్చిదిద్దే కోరాపుట్ కోట్‌పాడ్ శాలువాలు ఇలా గిరిజన తెగల సంప్రదాయ నేత రకాలెన్నో ఉన్నాయని అర్థమైంది. వాటిల్లో కొన్ని ప్రాచుర్యంలో ఉన్నా... మరికొన్నింటికి తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉంది. అందుకే, వాటిని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నారు. స్థానిక గిరిజన నేత సంఘాల వారితో మాట్లాడారు.





ఇందుకు వేదికగా 'బోయిటో' పేరుతో డిజైనర్ స్టూడియో ఏర్పాటుచేశారు. కళింగ చరిత్రలో పత్తి వ్యాపారం, పట్టు సేకరణ ప్రధానవాణిజ్యంగా ఉండటాన్ని గుర్తించారు. బోట్ ద్వారా ఇదంతా జరగడం, ఆ బోటునే బొయిటో అని పిలుస్తారని తెలిసి తన బ్రాండ్‌కి ఈ పేరే పెట్టారు. అంతేకాదు, ఈ అరుదైన చేనేత నైపుణ్యాలు భవిష్యత్తులో మరుగున పడిపోకుండా డాక్యుమెంటేషన్ కూడా చేస్తున్నారు రిచా.

ఇబ్బందులెన్నో...

నిజానికి ఈ ప్రయాణం అంత సులువుగా జరగలేదు. ఈ పనులన్నీ ఆచరణలోకి రావడానికి రిచాకు ఆరునెలలకు పైగానే సమయం పట్టింది. 'నా ఆలోచనల్ని చెప్పినప్పుడు వాళ్లంతా శ్రద్ధగా వినేవారు కానీ పెద్దగా స్పందించేవారు కాదు. మొదట ఈ పరిస్థితి నాకు అర్థమయ్యేది కాదు. అలాగని వెనక్కి తిరిగి వెళ్లాలనుకోలేదు. తరచూ ఆ గిరిజనులతో మాట్లాడుతూ ఉండటం వల్ల క్రమంగా అనుబంధం పెరిగింది. నేనూ వారి సంస్కృతిని అర్థం చేసుకోగలిగాను. అయినా సరే ఎప్పటికప్పుడు బోలెడు సవాళ్లు ఎదురయ్యేవి' అంటారామె. మొదట ఒక 'రింగా' నేయడానికి బోండా కమ్యూనిటీకి చెందిన నలుగురు ఒడియా మహిళలు ఒప్పుకొన్నారు అదే రిచా మొదటి విజయం. అది మొదలు క్రమంగా... మరింత మంది ముందుకు వచ్చారు. ఇప్పుడు బొయిటో నుంచి చిన్న చిన్న మార్పులతో ట్రెంచ్‌కోట్లు, ప్యాంట్లు, కిమోనో జాకెట్లు... వంటి అనేక ఉత్పత్తులను తీసుకువచ్చాం. క్రమంగా వారికి ఉపాధి దొరికింది. బోయిటో ఫస్ట్ కలెక్షన్... 'ది బోయిటో బిగినింగ్స్' పేరుతో భువనేశ్వర్, ముంబయిలతో పాటు దిల్లీలోని బికనేర్ హౌస్, గోవాలోని వేల్సాంగ్ ఆర్ట్ అండ్ డిజైన్ గ్యాలరీలో ప్రదర్శించారు. గొప్ప ఆదరణ లభించింది. నేత కళల సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించడమే లక్ష్యంగా సాగుతున్నా' అంటారామె.

కన్యాదానం చేయకూడదా?

ఒకప్పటిలా కాదు... చాలావరకూ ఆడవాళ్లూ స్వతంత్రంగా ఆలోచిస్తున్నారు. ఏ కారణంతోనైనా భర్తకి దూరమైనా ఆ బాధ, విషాదం నుంచి బయటపడి ధైర్యంగా తమ కాళ్ల మీద తాము నిలబడుతున్నారు, పిల్లలనూ తీర్చిదిద్దుతున్నారు. పెళ్లిళ్లు చేసి సాగనంపుతున్నారు. అమ్మాయికి అత్తింట్లో మాట రావొద్దని అడిగినవన్నీ అమరుస్తున్నారు. కన్నబిడ్డను పరాయి ఇంటికి పంపడం ఏ తల్లికైనా కష్టమే. కానీ ఆమె భవిష్యత్తుకోసం గుండె దిటవు చేసుకుంటుంది. 'జాగ్రత్తగా కాపాడు' అంటూ ఆ అయ్య చేతిలో పెట్టాలనుకుంటుంది. కానీ కన్యాదానం దగ్గరికి వచ్చేసరికే 'మీ బంధువుల్లో వరసైన దంపతులతో చేయించండి' అని చెబుతారు. ఆమె పెంచిన పిల్లలు పనికొస్తున్నారు. ఆమె ఇచ్చే కట్నకానుకలూ కాదనట్లేదు. కానీ కన్యాదానం దగ్గరికి వచ్చేసరికే ఆ ఒంటరి తల్లి పనికి రాదు! అది ఆ తల్లిని ఎంతగా బాధిస్తుందో గమనించారా? బిడ్డకోసం ఎన్ని కలలు కంటుందా తల్లి? ఆమె నుంచి ఆ హక్కును లాగేయడం న్యాయమేనా? ఆలోచించండి.

అలాంటి చోట పనిచేయలేం!

వాతావరణంలో మార్పులు, పర్యావరణ విధ్వంసం... ఈ అంశాలు జెన్‌జీ, మిలీనియల్స్‌ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికే ఎకో- యాంగ్జైటీ అని పేరు. ఆఖరికి కార్యాలయాలూ పర్యావరణ హితంగా ఉంటేనే ఉద్యోగాలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. లేకపోతే ప్రత్యామ్నాయాలు చూసుకునేందుకూ వెనకాడటంలేదు.

జీతాలూ, పదోన్నతులూ, పని సంస్కృతి... లాంటి అంశాల కంటే పర్యావరణాన్ని కాపాడటమే ప్రధానమని భావిస్తున్నారు జెన్‌జీలూ, మిలీనియల్స్. ఏదైనా సంస్థ దీని గురించి పట్టించుకోకపోతే, అక్కడ పనిచేయడానికి వారి మనసు అంగీకరించడంలేదట. పర్యావరణ హితమైన కార్యాలయాలు భూమికే కాదు, ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికీ, తద్వారా ఉత్పత్తి పెరిగేందుకూ మేలు చేస్తాయి.



'పనిచేసే చోట సహజమైన వెలుగు, గాలి రావాలి. పర్యావరణ హితమైన పరికరాలు వాడాలి. అప్పుడే వారికి వృత్తిలోనూ సంతృప్తి ఉంటుంది. ఇలాంటి చోట మానసిక అలసటా తక్కువే. అంతేకాదు, తామూ పర్యావరణానికి మేలు చేస్తున్నామన్న భావనతో బాగా పనిచేసుకుంటారు' అని చెబుతున్నారు మానసిక నిపుణులు. అలాకాకుండా కృత్రిమ వెలుగు, స్క్రీన్‌టైమ్, కర్బన ఉద్గారాల విడుదల ఎక్కువగా ఉండేచోట వారికి మనశ్శాంతి కరవవుతుందట.

- పర్యావరణ పరిరక్షణకు కంపెనీలు తీసుకునే చర్యలు, ఫలితాలు సుస్పష్టంగా ఉండాలనీ కోరుతున్నారు. ప్రజా రవాణాలో వచ్చేవారికి ప్రోత్సాహకాలు, ఈవీలు కొనేవారికి రాయితీల్లాంటివీ ఇవ్వాలంటున్నారు. రవాణా తగ్గడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి కాబట్టి... హైబ్రిడ్, రిమోట్ వర్క్‌కూ చోటివ్వాలట. సంస్థలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, కాగితం వాడకాన్ని తగ్గించడం. రీయూజబుల్ కట్లెరీ, క్యాంటీన్‌లో శాకాహారానికి ప్రాధాన్యం ఇవ్వడం... లాంటి మార్పుల్ని జెన్ జీలు కోరుకుంటున్నారు.

వంట చేసి సంపాదిస్తారా?

అవకాశాలు లేక తమ వంట నైపుణ్యాలను ఇంటికే పరిమితం చేసే మహిళలు అనేకమంది. ఇలాంటి వారికి ఉచిత సేవలు అందిస్తూ... ఆర్థిక స్వేచ్ఛ సాధించుకునేలా చేస్తోంది 'క్రేవింగ్లీ' ప్లాట్‌ఫామ్. ఆ వివరాలు మనతో పంచుకున్నారు నిర్వాహకురాలు పీవీఎస్ఎల్ అనూష.



అనూష



మాది హైదరాబాద్. వాక్స్‌సేన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశాను. చేసే పని... మనకు మాత్రమే కాదు, నలుగురికీ ఉపయోగపడినప్పుడే దానికి సార్థకత. అందుకే, మహిళా సాధికారతకోసం పనిచేసే ప్రాజెక్టులో భాగం అయ్యా. రకరకాల అవసరాలతో ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఇంటి భోజనాన్ని ఆస్వాదించలేని వాళ్లు కొందరు. అలానే, పాకశాస్త్రంలో పట్టు ఉన్నా... అవకాశాలు లేక తమ వంట నైపుణ్యాలను ఇంటికే పరిమితం చేసే మహిళలూ ఇంకొందరు. వీళ్లిద్దరి మధ్య వారధిలా పనిచేయాలనే లక్ష్యంతో 'క్రేవింగ్లీ'ను ప్రారంభించాం. మహిళలు ఆర్థిక స్వేచ్ఛ పొందాలనేదే మా సంకల్పం. ఇంట్లో ఉండే అమ్మలు, అమ్మాయిలు... ఇలా వంట తెలిసిన వారు ఎవరైనా కుక్‌గా మారొచ్చు. మీలోని నైపుణ్యాలను వ్యాపారంగా మలచుకోవచ్చు. ఆదాయాన్ని పొందొచ్చు. ఫుడ్ డెలివరీ, మార్కెటింగ్ లాంటి సేవలను ఉచితంగానే అందిస్తాం. హైదరాబాద్ కేంద్రంగా సాగుతోన్నా... దేశవ్యాప్తంగానూ సేవలందిస్తున్నాం. తాజాగా ఇండియా బిజినెస్ అవార్డ్స్ 2025లో 'కమ్యూనిటీ ఇంపాక్ట్' అవార్డునూ అందుకున్నాం. పరిశుభ్రమైన ఇంటి భోజనం అందించడంతోపాటు, మహిళా సాధికారతకు కృషి చేయడమే ప్రస్తుత మా ధ్యేయం.

వంటగదిలో భద్రతకోసం...

వంటకు కావాల్సిన పాత్రలు, వస్తువులు ఉండటమేకాదు, వాటిని సురక్షితంగా వాడుకునేందుకు కొన్ని పరికరాలూ అవసరమే. అప్పుడే భద్రత కూడా. అవేంటో చూద్దామా...

స్మార్ట్ కిచెన్

ప్రమాదం లేకుండా....

స్టవ్‌ను శుభ్రం చేసేటప్పుడు నీళ్లు ఒక్కోసారి నాబ్‌లలోకి వెళ్తుంటాయి. దాని చుట్టూ చేరుకున్న మురికి, జిడ్డును వదిలించడమూ అంత సులువుకాదు. పైగా, ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే వాటిని ఆన్/ఆఫ్ చేస్తూ ఉంటారు. రెగ్యులేటర్ ఆన్ చేసి ఉంటే గ్యాస్ లీకయ్యే ప్రమాదమూ ఉంది. ఈ ఇబ్బందులన్నీ లేకుండా 'స్టవ్ నాబ్ కవర్లు' ఉపయోగపడతాయి. నీళ్లు, దుమ్ము, ధూళి పోవు సరికదా... పారదర్శకంగా చూడ్డానికీ అందంగా కనిపిస్తాయి.







సింక్ కోసం...

కూరగాయలు, పాత్రలు... వంటివి శుభ్రం చేసిన తరవాత ఆ నీళ్లన్నీ పోవడానికి ప్రత్యేకించి ఓ డ్రైనర్‌లో వేయాల్సి వస్తుంది. ఆ అవసరం లేకుండా 'సింక్ ప్రొటెక్టర్ కమ్ డ్రైనర్' సాయపడుతుంది. దీన్లో గ్లాస్‌వేర్, డిన్నర్‌వేర్ వంటివి ఆరబెట్టుకోవచ్చు. కూలింగ్, డీఫ్రాస్ట్ ర్యాక్‌గానూ ఉపయోగపడుతుంది. సింక్‌నూ రక్షిస్తుంది.





కాలకుండా...

వంట చేసేటప్పుడు ఒక్కోసారి తెలీకుండానే చేతులు కాలుతుంటాయి. ఆ ఇబ్బంది లేకుండా చేస్తాయి ఈ 'సిలికాన్ పాట్ హ్యాండ్లర్లు'. నాన్‌స్టిక్, స్టీల్ పాన్లు, కుక్కర్లు... ఇలా అన్నింటికీ సెట్ అయ్యేలా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయివి. చేయి కాలకుండా, వంట పాత్రలు అటూఇటూ కదలకుండా పట్టుకునేలా గ్రిప్‌తో ఉంటాయి. క్లాత్‌వీ దొరుకుతున్నాయి. బాగున్నాయి కదూ!







కొత్త సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

14న ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి



దిల్లీ: భారత నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. మే 14న ఆయన చేత రాష్ట్రపతి ప్రమాణం చేయిస్తారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో 52వ సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ని రాష్ట్రపతి నియమించినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం నోటిఫికేషన్ వెలువరించింది. 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పుల్ని వెలువరించారు. సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు.

ప్రధానితో ఆరెస్సెస్ అధినేత భేటీ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ మంగళవారం దిల్లీలో భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో ప్రధాని నివాసంలో ఈ భేటీ జరిగింది. హోం మంత్రి అమిత్ షా కూడా ఇందులో పాల్గొన్నట్లు సమాచారం. ఉగ్ర దాడికి ప్రతిగా ఉగ్రవాదులపై చేపట్టనున్న చర్యలపై సమాలోచనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. త్రివిధ దళాల అధిపతులతో మోదీ సమావేశం పూర్తయ్యాక ఈ భేటీ జరిగింది.



ముందునుంచీ అనుకూల పరిస్థితులు లేకున్నా..

హ్యారీ పోటర్ నవలను రాసే సమయానికి జె.కె.రౌలింగ్ సింగిల్ పేరెంట్‌గా చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. స్టార్‌బక్స్‌ను ప్రారంభించిన హోవర్డ్ షల్ట్స్ చిన్నప్పుడు కడు పేదరికంలో పెరిగారు. టెలివిజన్ దిగ్గజం ఓప్రా విన్‌ఫ్రే తన బాల్యంలో ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నారు. జీవితంలో విజయం సాధించాలంటే మీకు ముందునుంచీ పూర్తి అనుకూల పరిస్థితులు ఉండాల్సిన అవసరం లేదు. లక్ష్యం దిశగా శ్రమించడమే అన్నింటికంటే ముఖ్యం.

– టిమ్ స్టోడర్ట్, కంటెంట్ రైటర్

కాబోయే అల్లుడితో మరో అత్త పలాయనం

గోండా (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ఇటీవల కాబోయే అల్లుడితో పారిపోయి అతడితోనే జీవితమన్న అత్త బాటలో.. అదే రాష్ట్రంలోని మరో అత్త పయనించింది. ఈ సారి గోండా జిల్లా ఈ ఉదంతానికి వేదికైంది. ఈ జిల్లాలోని ఖొడారే పోలీస్‌స్టేషను పరిధిలో గల గ్రామానికి చెందిన యువతికి బస్తీ జిల్లాకు చెందిన యువకుడి (25)తో మే 9వ తేదీన వివాహం జరిగేలా నాలుగు నెలల కిందట పెద్దలు నిశ్చయించారు. ఈ సంబంధం కుదిరిన నాటి నుంచీ వధువు తల్లికి, కాబోయే అల్లుడికి మధ్య ఫోను సంభాషణలు ఎక్కువయ్యాయి. 'అలీగఢ్' పరిస్థితి తలత్తుతుందేమో అనే భయంతో యువతి కుటుంబం ఈ పెళ్లిని రద్దు చేసుకొని, మరో సంబంధం కూడా కుదుర్చుకొంది. అయినా వారి ఫోను సంభాషణలు ఆగలేదు. ఈ నేపథ్యంలో శనివారం వారిద్దరూ అదృశ్యం అయ్యారు. రెండువైపులా కుటుంబసభ్యులు పలుచోట్ల వెదికి చివరకు పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారి ప్రబోధ్‌కుమార్ తెలిపారు.

మే 29న ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా



దిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర ప్రయాణ తేదీ ఖరారైంది. యాక్సియం-4 (ఏఎక్స్-4) మిషన్‌లో భాగంగా మే 29న ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనం కానున్నారు. ఈ యాత్రలో శుక్లాతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) కూడా పాలుపంచుకుంటారు. వీరు రెండు వారాలపాటు ఐఎస్ఎస్‌లో గడపనున్నారు. భారత కాలమానం ప్రకారం మే 29న రాత్రి 10.30 గంటలకు ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో నలుగురు వ్యోమగాములు నింగిలోకి పయనమవుతారు. అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా, భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో)లు సంయుక్తంగా ఈ మిషన్‌ను చేపడుతున్నాయి. రోదసిలో శుభాంశు శుక్లా ఏడు ప్రయోగాల్లో పాల్గొంటారు. అంతరిక్షంలో పంటల సాగు, టార్డిగ్రేడ్ (నీటి ఎలుగుబంటి)ల గురించి అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా భారతీయ ఆహారంతో ముడిపడ్డ పంటలపై ప్రయోగాలను చేపట్టడానికి ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేసింది. మెంతి, పెసల మొలకలపై పరిశీలనల వంటివి ఇందులో ఉంటాయి. వాటిని భూమికి తీసుకొచ్చి.. నేలపై ఎలా ఎదుగుతాయన్నది పరిశీలిస్తారు. ఏదైనా కారణంవల్ల ఈ యాత్రలో శుభాంశు పాలుపంచుకోలేకపోతే.. ఆయన స్థానాన్ని భారత్‌కు చెందిన మరో వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ భర్తీ చేస్తారు.

అష్టదిగ్బంధంలో పాకిస్థాన్

- ఔషధ, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు నిలిపివేసే యత్నాల్లో భారత్
- ఇతర దేశాల మీదుగా కొనసాగుతున్న ఈ వాణిజ్యాన్ని అడ్డుకొనే యోచన



అటారీ సరిహద్దు వద్ద పాకిస్థాన్‌కు వెళ్లిపోతున్న సాబా వైపు దీనంగా చూస్తున్న ఆమె కుమార్తె

ఇంటర్నెట్‌డెస్క్: సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తోన్న పాకిస్థాన్‌పై ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన భారత్....మరిన్ని కఠిన చర్యల దిశగా అడుగులేస్తోంది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత, దౌత్యసంబంధాల స్థాయి తగ్గింపు, పాక్ పౌరులకు వీసాల రద్దుతో ముప్పేట దాడి ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పటికే ఆర్థికపరమైన చిక్కుల్లో సతమతమవుతోన్న పాక్‌ను మిగిలిన అన్ని వైపుల నుంచి దిగ్బంధించేలా చర్యలు తీసుకుంటోంది. కీలకమైన ఔషధాల ఎగుమతులు ఆ దేశానికి నిలిచిపోయేలా చేయనుంది. ఈ క్రమంలో పాక్‌కు ఎగుమతి చేసే ఔషధాలు, ఫార్మా సంబంధిత ఉత్పత్తుల వివరాలను ఔషధ విభాగం సేకరిస్తోంది. ఆ వివరాలను అత్యవసరంగా పంపాలని ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలిని కోరినట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. భారత ఫార్మా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న 219 దేశాల్లో పాక్ 38వ స్థానంలో ఉంది.

"పాకిస్థాన్‌కు దుబాయ్ ఒక ప్రధాన వాణిజ్య కేంద్రం. భారత్ నుంచి యూఏఈకి ఎగుమతయ్యే ఔషధాలను పాకిస్థాన్ దిగుమతి చేసుకుంటుంది. ఈ వాణిజ్య సంబంధాలను భారత్ తెంచుకోవడం ద్వారా పాక్‌పై తీవ్ర ప్రభావం పడనుంది" అని మరో అధికారి అంచనా వేశారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపైనా ఆంక్షలు?

పాకిస్థాన్‌కు ఎలక్ట్రానిక్స్, ఈ-కామర్స్ వస్తువుల ఎగుమతిని పరిమితం చేయాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్-పాక్ మధ్య నేరుగా జరిగే వాణిజ్యం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండదు. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల మీదుగా భారత్ వస్తువులు పాక్‌కు చేరుతుంటాయి. వాటిలో బంగారం, విలువైన రంగురాళ్లు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్ ఉత్పత్తులున్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ డేటా ప్రకారం.. ఈ తృతీయ పక్ష దేశాల ద్వారా పది బిలియన్ డాలర్లకుపైగా విలువైన భారత వస్తువులు దాయాదికి ఎగుమతి అవుతున్నాయి.

భారత్‌లో పాక్ రక్షణ మంత్రి 'ఎక్స్' ఖాతా నిలిపివేత

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ ఎక్స్ ఖాతాను భారత ప్రభుత్వం నిలిపేసింది. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత జమ్మూ కశ్మీర్‌పై ఆయన తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

రెండ్రోజుల ముందే బైసరన్‌లో ఉగ్ర దాడికి పన్నాగం?

ఉగ్రవాదులు పక్కా ప్రణాళికతోనే బైసరన్ లోయలో దారుణానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. వారు ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ లోయను సందర్శించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత మరో వారంపాటు ఆ ప్రదేశాల్లోనే తిరిగి సమాచారం సేకరించుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఏప్రిల్ 22 కంటే రెండ్రోజుల ముందే అక్కడ ఈ దాడి జరగాల్సింది. కానీ ఆ రోజు వాతావరణం అనుకూలించకపోవడంతో వాయిదా పడింది. 20వ తేదీన అక్కడ భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో చాలా మంది పర్యాటకులు తమ సందర్శనను వాయిదా వేసుకున్నారు.

ఉగ్రవాదులపై స్పైవేర్ వాడితే తప్పేంటి?

- పెగాసస్ నిఘా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: ఉగ్రవాదులపై స్పైవేర్ (రహస్య నిఘా సాఫ్ట్‌వేర్) వాడితే తప్పేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వ్యక్తులెవరైనా తమ గోప్యతకు భంగం కలిగిందని ఆందోళన వ్యక్తంచేస్తే తాము దానిని పరిశీలించగలమని, సాంకేతిక కమిటీ నివేదికపై మాత్రం వీధుల్లో చర్చించలేమని పేర్కొంది. జాతీయ భద్రత ప్రయోజనాల కోసం దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటంలో తప్పులేదని తేల్చి చెప్పింది. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం మంగళవారం ఈ వ్యాఖ్యలు చేసింది. స్పైవేర్‌ను ఉపయోగిస్తున్నారా లేదా అనేది కేంద్రం స్పష్టంగా చెప్పాలని ఒక పిటిషనర్ తరఫు న్యాయవాది దినేశ్ ద్వివేది కోరారు. ఆరోపణలపై దర్యాప్తు జరిపిన సాంకేతిక నిపుణుల బృంద నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ- స్పైవేర్‌ను ఎలా, ఎవరిపై ఉపయోగించారనేదాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పౌర సమాజంపై కాకుండా దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని ఉపయోగిస్తే తప్పులేదని స్పష్టంచేసింది. ప్రైవేటు వ్యక్తుల గోప్యతకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కును మాత్రం పరిరక్షిస్తామని తెలిపింది. దేశ భద్రత, సార్వభౌమత్వాలకు సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బిల్డర్లు-బ్యాంకుల కుమ్మక్కుపై కేసులు పెట్టండి

- సీబీఐని ఆదేశించిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో ఇళ్ల కొనుగోలుదారుల్ని మోసగించిన బిల్డర్లపై కేసులు నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నొయిడా, గ్రేటర్ నొయిడా, గురుగ్రాం, యమునా ఎక్స్‌ప్రెస్‌వే, మొహాలీ, ముంబయి, కోల్‌కతా, అలహాబాద్‌లలో బిల్డర్లు, బ్యాంకులు కుమ్మక్కైనట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దాఖలు చేసిన ప్రమాణ పత్రాన్ని పరిగణనలో తీసుకుని యూపీ, హరియాణా డీజీపీలకు ఆదేశాలు జారీచేసింది. దర్యాప్తులో పురోగతిని నెలవారీగా సమీక్షిస్తామని తెలిపింది. ఇళ్ల కొనుగోలుదారుల్ని మోసగించడంలో సూపర్‌టెక్ లిమిటెడ్ ప్రధానమైనదని కేసులో కోర్టు సహాయకునిగా సేవలందిస్తున్న న్యాయవాది (అమికస్ క్యూరీ) రాజీవ్ జైన్ పేర్కొన్నారు. 1998 నుంచి ఆ ఒక్క సంస్థే రూ.5,157 కోట్ల రుణాలు పొందిందని, ఆరు రాష్ట్రాల్లో 21 ప్రాజెక్టులు చేపట్టిందని తెలిపారు. ఆ సంస్థకు బ్యాంకులతో లోపాయికారీ సంబంధంపై విచారణ జరిపించాలన్నారు.

ఎన్నికల అధికారులకు ఆధార్ ఇవ్వడం స్వచ్ఛందమే

- దానిలో మార్పులేమీ లేవు: కేంద్రం

దిల్లీ: ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో నకిలీల తొలగింపునకు కృషి చేస్తున్న క్రమంలో చట్టంలో నిర్దేశించిన విధంగా ఓటర్లు స్వచ్ఛంద ప్రాతిపదికన ఆధార్‌ను పంచుకోవడంలో ఎటువంటి మార్పు ఉండదని ప్రభుత్వ వర్గాలు మంగళవారం స్పష్టం చేశాయి. ఎన్నికల నియమావళి సవరణ చట్టం- 2021 ప్రకారం ఆధార్ వివరాలను ఎన్నికల అధికారులతో పంచుకోవడం స్వచ్ఛందంగా ఉంటుందని, అది అలాగే కొనసాగుతుందని వారు నొక్కిచెప్పారు. దీనికి సంబంధించి చట్టాన్ని లేదా సంబంధిత నిబంధనలను మార్చే ప్రణాళికేదీ లేదని పేర్కొన్నాయి. ఓటర్ల జాబితా స్వచ్ఛతపై చర్చ నడుస్తుండగా జనన, మరణాల నమోదు అధికారుల సమన్వయంతో ఓటరు జాబితా సాధారణ నవీకరణ ప్రక్రియను బలోపేతం చేస్తామని ఎన్నికల సంఘం గత నెలలో తెలిపిన విషయం తెలిసిందే. ఓటరు జాబితా-ఆధార్ అనుసంధానంపై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ), ఈసీ నిపుణుల మధ్య సాంకేతిక సంప్రదింపులు త్వరలో ప్రారంభమవుతాయని, కేటాయించిన పోలింగ్ బూత్‌లో మాత్రమే ఒక ఓటరు ఓటు వేయగలడని, మూడు నెలల్లో దేశవ్యాప్తంగా నకిలీ ఓట్లను తొలగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

కాంగ్రెస్, భాజపా మధ్య ఫొటోల యుద్ధం!

దిల్లీ: పహల్గాం ఉగ్ర దాడి ఘటనపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం.. ఆ స్థాయిని దాటి ఫొటోల యుద్ధానికి చేరుకుంది. ఉగ్ర దాడి ఘటనపై నిర్వహించిన కీలక సమావేశానికి ప్రధాని మోదీ గైర్హాజరును తప్పుబడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ఓ ఫొటోను కాంగ్రెస్ ఉంచింది. దీనిని ఖండించిన భాజపా.. కాంగ్రెస్ వ్యవహార శైలిని తప్పుబట్టింది. రాహుల్ గాంధీ పోలికలతో కూడిన ఓ ఫొటోతో బదులిచ్చింది. పహల్గాం దాడి ఘటనపై తొలుత అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించిన కేంద్రం.. మరుసటి రోజు అఖిల పక్ష సమావేశం జరిపింది. ఈ సమావేశానికి ప్రధాని మోదీ రాలేదు. అదే రోజు బిహార్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. దీనిని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. ఇదే అంశంపై సోమవారం ఆ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ఫొటోను ఉంచింది. 'బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయంలో గాయబ్' అనే వ్యాఖ్యను జోడించింది. నేరుగా ప్రధాని మోదీ పేరునుగానీ, ఫొటోనుగానీ ప్రస్తావించనప్పటికీ.. దుస్తులు, ఆహార్యం మోదీని పోలి ఉండడంతో భాజపా ప్రతి విమర్శలకు దిగింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్.. 'పాకిస్థాన్ స్నేహితుడు' అనే ట్యాగ్‌లైన్‌తో ఓ ఫొటోను పోస్టు చేశారు. రాహుల్ గాంధీ పేరును ఎక్కడా ప్రస్తావించనప్పటికీ.. తెలుపు రంగు టీ షర్ట్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి చేతిలో కత్తి పట్టుకున్న ఫొటోను తన ఎక్స్ ఖాతాలో ఉంచారు. ఇలా విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతుండగానే కాంగ్రెస్ పార్టీ తాను పోస్టు చేసిన ఫొటోను తొలగించింది.

అబ్దుల్ కలాం వ్యక్తిగత పత్రాలు నేషనల్ ఆర్కైవ్స్‌కు అందజేత

దిల్లీ: మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలాం పాస్‌పోర్ట్, ఆధార్, పాన్‌కార్డు, ఉత్తర ప్రత్యుత్తరాలు, వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో చేసిన ప్రసంగాలు తదితర పత్రాలను ఆయన సమీప బంధువులు 'భారత జాతీయ ప్రాచీనపత్ర భాండాగారం' (నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా-ఎన్ఏఐ)కు అందజేశారు. ఇందులో పలు ఫొటోలు కూడా ఉన్నాయి. ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారత క్షిపణి పితామహుడిగా పేరొందిన అబ్దుల్ కలాం 2002 నుంచి 2007 వరకు రాష్ట్రపతిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన సమీప బంధువు మరైకయార్‌తో ఓ ఒప్పందంపై ఎన్ఏఐ డైరెక్టర్ జనరల్ అరుణ్ సింఘాల్ సంతకం చేశారు.



మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలాంకు సంబంధించిన పత్రాలను అందుకుంటున్న 'భారత జాతీయ ప్రాచీనపత్ర భాండాగారం అధికారులు

సొంత నియోజకవర్గంలో రాహుల్‌గాంధీ పర్యటన

- పేదలకు సౌర వాహనాల అందజేత



లఖ్‌నవూ విమానాశ్రయంలో ఓ చిన్నారితో రాహుల్ గాంధీ

రాయ్‌బరేలీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ తన సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో సౌర వాహనాలను పేదలకు అందజేశారు. రెండు రోజుల రాయ్‌బరేలీ-అమేఠీ పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన ఇక్కడికి వచ్చారు. స్థానికంగా ఉన్న 'విశాకా ఇండస్ట్రీస్'లో 2 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్లాంటును, విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలు సమకూర్చిన సౌర వాహనాలను పలువురికి అందజేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ కేవలం మీడియాలో కనిపించేందుకు మాత్రమే ఇక్కడికి వచ్చారని ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ ఎద్దేవాచేశారు.

ఇంటర్నెట్ ఉపగ్రహాలను ప్రయోగించిన అమెజాన్

కేప్ కెనావెరాల్: అమెజాన్ సంస్థ తన తొలి బ్యాచ్ ఇంటర్నెట్ ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. దీంతో స్పేస్‌ఎక్స్ ఆధిపత్యమున్న ఈ మార్కెట్‌లోకి మరో సంస్థ లాంఛనంగా ప్రవేశించినట్లయింది. కైపర్ పేరుతో ఇంటర్నెట్ శాటిలైట్ ప్రాజెక్టును అమెజాన్ చేపట్టింది. ఇందులో భాగంగా అట్లాస్-5 రాకెట్ ద్వారా తాజాగా 27 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇవి అంతిమంగా భూమికి 630 కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి చేరుకుంటాయి. అమెజాన్ సంస్థ 2023లో రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. తాజాగా ప్రయోగించిన శాటిలైట్లు మరింత మెరుగైనవి. పరావర్తనం చెందిన సూర్యకాంతిని చెల్లాచెదరు చేయడం కోసం వీటికి ప్రత్యేక పూత పూశారు. నేల మీద నుంచి ఖగోళ శాస్త్రవేత్తలు సాగించే పరిశీలనలకు అవరోధం కలగకుండా చూడటానికి ఈ ఏర్పాటు చేశారు. దిగువ భూకక్ష్యలో ఇంటర్నెట్ ఉపగ్రహ సమూహాలు పెరిగిపోతున్నాయని ఔత్సాహిక ఖగోళ వీక్షకులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రద్దీ పెరిగిపోయి ఉపగ్రహాలు పరస్పరం ఢీకొట్టుకునే పరిస్థితి ఉత్పన్నం కావొచ్చన్న భయాలూ ఉన్నాయి. జెఫ్ బెజోస్‌కు చెందిన అమెజాన్ సంస్థ.. 3200 ఉపగ్రహాలను ప్రయోగించాలనుకుంటోంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వేగవంతమైన, చౌకైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ.. ఇంటర్నెట్ సేవల కోసం ఇప్పటికే 8వేలకుపైగా 'స్టార్‌లింక్' ఉపగ్రహాలను ప్రయోగించింది.

వక్ఫ్ సవరణ చట్టంపై తాజా పిటిషన్ల విచారణకు సుప్రీం నిరాకరణ



దిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన తాజా పిటిషన్ల విచారణకు సుప్రీం కోర్టు మంగళవారం నిరాకరించింది. ఇదే అంశంపై ఇప్పటికే విచారిస్తున్న వ్యాజ్యాలకు మరికొన్నింటిని జతచేయడం వల్ల తమకు కష్టతరమవుతుందని, అందుకని కొత్త వాటిని కలపబోమని స్పష్టం చేసింది. 'ఇప్పుడు పిటిషన్ల సంఖ్యను పెంచబోవడం పోతాయి. దాని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం పేర్కొంది. అయితే వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేసేందుకు అదనపు కారణాలు ఉంటే ప్రధాన పిటిషన్లో జోక్యం చేసుకోవచ్చని ఫిరోజ్ ఇక్బాల్ ఖాన్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం న్యాయవాదుల

భారత్, కెనడాల మధ్య విభేదాలు తొలగనున్నాయా?

- ట్రూడో శత్రుత్వాన్ని కార్నీ పక్కనబెడతారా..
- ఎన్నికల్లో విజయంతో ఆసక్తి





ఇంటర్నెట్ డెస్క్: కెనడా ఎన్నికల్లో లిబరల్స్ పార్టీ మరోసారి విజయం సాధించడంతో ప్రధానిగా మార్క్ కార్నీ కొనసాగనున్నారు. ఇదే పార్టీకి చెందిన మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో.. భారత్‌కు వ్యతిరేకంగా వెళ్లినప్పటికీ కార్నీ అధికారం చేపట్టినప్పటి నుంచి భారత్‌కు కొంత సానుకూలంగానే ఉన్నారు. మళ్లీ ఆయనే ప్రధానిగా కొనసాగనుండటంతో కెనడా- భారత్‌ల మధ్య విచ్ఛిన్నమైన సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భారత్‌తో దౌత్య, వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నాలు చేస్తామని అనేక సార్లు బహిరంగంగానే కార్నీ ప్రకటించారు. భారత్‌తో సంబంధాలు తెగిపోవడానికి కారణమైన విభేదాలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కెనడియన్లు వ్యక్తిగతంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భారత్‌తో సంబంధాలు కలిగి ఉంటారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మితమవుతున్న సమయంలో భారత్, కెనడా వంటి దేశాలు భాగస్వామ్య ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని తాను నమ్ముతున్నానని వెల్లడించారు. తాము అధికారం చేపట్టగానే భారత్‌తోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

భారత్‌పై ట్రూడో అక్కసుతో విభేదాలు..

దశాబ్దాల తరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య 2013 నుంచి సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడంతో.. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. భారత నిఘా సంస్థలకు ఎటువంటి ఆధారాలు చూపకుండానే కెనడా సర్కారు నిందలు మోపింది. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. దీంతో ఇరు దేశాలు పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. అనంతరం కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడా భద్రత, నిఘా విభాగం డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య దూరం మరింత పెరిగింది.

నా శరీర ఛాయపై వ్యాఖ్యలు చేసింది ఉన్నతస్థాయి వ్యక్తే

కేరళ సీఎస్ శారదా మురళీధరన్

తిరువనంతపురం: తన శరీర ఛాయ గురించి అవమానకర రీతిలో వ్యాఖ్యానించింది ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తేనని కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శారదా మురళీధరన్ వెల్లడించారు. బుధవారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆమె మంగళవారం ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడారు. వర్ణ, లింగవివక్షపై ఇటీవల ఫేస్‌బుక్‌లో తాను పోస్టు పెట్టడానికి దారితీసిన పరిస్థితులను ఆమె వివరించారు. "ఉన్నత స్థానంలో ఉన్న ఒక వ్యక్తి నా పనిని, నా ముందు సీఎస్‌గా పనిచేసిన నా భర్త వేణు పనిని పోలుస్తూ.. 'మీ భర్త ఎంత తెల్లగా ఉంటారో అంత నల్లగా ఈ పని ఉంద'ని వ్యాఖ్యానించారు" అని శారద వెల్లడించారు. ఆ తర్వాత తాను బాధపడి ఆ పోస్ట్ పెట్టానని, దానిని అభినందిస్తూ చాలా సందేశాలు వచ్చాయని చెప్పారు. ఈ పరిణామాల తర్వాత ఆ వ్యక్తి, తాను స్నేహంగానే ఉన్నామని, అయితే ఎప్పుడూ తనకు క్షమాపణలు చెప్పలేదని తెలిపారు. ఆ వ్యక్తి రాజకీయ నాయకుడా లేక సహచర అధికారా అన్నది ఆమె బయటపెట్టలేదు.

ప్రతికూల వాతావరణం..

చైనా వ్యోమగాముల రాక ఆలస్యం!

బీజింగ్: వాతావరణంపై ప్రతికూలంగా ఉండటం వల్ల చైనాకు చెందిన ముగ్గురు వ్యోమగాముల తిరుగు ప్రయాణం వాయిదా పడింది. కై షుజె, సాంగ్ లింగ్‌డాంగ్, వాంగ్ హోజే అనే ఈ ఆస్ట్రోనాట్‌లు చైనా అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌లో ఆరునెలలు గడిపారు. వీరికి బదులు విధులు నిర్వర్తించే బృందం ఇప్పటికే రోదసి కేంద్రానికి చేరుకుంది. దీంతో పాత టీమ్ మంగళవారం మంగోలియా ప్రాంతంలోని డాంగ్‌ఫెంగ్‌లో దిగాల్సింది. అంతరిక్ష కేంద్రంలో వీరు పలు ప్రయోగాలు నిర్వహించారు. షుజె, సాంగ్‌లు 9 గంటల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘ స్పేస్‌వాక్.

దోషులు పార్టీలను స్థాపించకుండా అడ్డుకోవాలన్న పిటిషన్ వాయిదా

దిల్లీ: వివిధ నేరాల్లో దోషులుగా తేలిన వ్యక్తులు రాజకీయ పార్టీలను స్థాపించకుండా, వాటిలో పదవులు పొందకుండా నిరోధించాలన్న పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మంగళవారం వాయిదా వేసింది. తిరిగి విచారణను ఆగస్టు 11న చేపడతామని స్పష్టం చేసింది. న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్) తుది విచారణకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం తిరస్కరించింది. 'నేను ఏ తీర్పును రిజర్వు చేయదలచుకోలేదు'అని తుది విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ సంజీవ్ ఖన్నా విస్పష్టం చేశారు. అయితే లిఖితపూర్వక వాదనలు సమర్పించేం

భార్యాభర్తల న్యాయపోరాటాల్లో పిల్లల శ్రేయస్సే పరమావధి

- కేరళ హైకోర్టు తీర్పును రద్దు చేసిన సుప్రీం

దిల్లీ: విడిపోయిన భార్యాభర్తలు తమ పిల్లలపై హక్కు కోసం చేసే న్యాయపోరాటాల్లో ఆ పిల్లల శ్రేయస్సే పరమావధి అని సుప్రీంకోర్టు పేర్కొంది. పిల్లల అప్పగింతలో ఈ అంశాన్నే పరిగణనలో తీసుకోవాలని చెప్పింది. తల్లితండ్రుల చిత్తశుద్ధి, వారు చూపించే ప్రేమాభిమానాలు వంటివి ప్రాతిపదిక కాజాలవని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మంగళవారం స్పష్టంచేసింది. కేరళ హైకోర్టు 2014 డిసెంబరు 11న ఒక కేసులో ఇచ్చిన తీర్పును ధర్మాసనం రద్దుచేసింది. ఆ కేసులో ఇద్దరు మైనర్ పిల్లలు నెలలో 15 రోజులు తండ్రివద్ద ఉండేందుకు హైకోర్టు అనుమతించింది. ఇది ఆచరణసాధ్యం కాదని, పైగా పిల్లల శ్రేయానికి హానికరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

తండ్రి తపననూ విస్మరించలేం

విడివడిన జంటకు 2014లో వివాహం కాగా 2016లో పాప, 2022లో బాబు పుట్టారు. భార్య సాఫ్ట్‌వేర్ నిపుణురాలు. భర్త సింగపూర్‌లో ఓ నిర్మాణ సంస్థలో జనరల్ మేనేజరు. తిరువనంతపురం కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైకోర్టు వెలువరించిన తీర్పును పిల్లల తల్లి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై ధర్మాసనం తరఫున తీర్పును జస్టిస్ మెహతా రాశారు. "హైకోర్టు తీర్పు ప్రకారం చేసిన తాత్కాలిక ఏర్పాట్లు ఈ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు వీలు కల్పించేలా లేవు. ముఖ్యంగా వారి పోషకాహారం, భావోద్వేగపూరిత రక్షణ అవసరాలను పరిగణనలో తీసుకోవడంలో ఈ ఏర్పాట్లు విఫలమయ్యాయి. ప్రతివాదిగా ఉన్న తండ్రి తన పిల్లల పెంపకంలో సమాన పాత్ర ఉండాలని ప్రేమపూర్వకంగా పరితపిస్తున్న విషయాన్నీ మేం పట్టించుకోకుండా వదిలేయలేం. అందువల్ల పిల్లలను ఆయనవద్ద ఉంచడానికి వీల్లేదని పూర్తిగా నిరాకరించడం న్యాయం కాదు. కుటుంబ బంధానికి ఉన్న అవకాశాలను అది నాశనం చేస్తుంది. అందువల్ల ప్రతినెలా వారం విడిచి వారం చొప్పున శని, ఆదివారాల్లో కుమార్తెను తన వద్దకు తీసుకువెళ్లవచ్చు. అదే రోజుల్లో కుమారుడిని నాలుగు గంటలసేపు కలవవచ్చు. ప్రతి మంగళ, గురు వారాల్లో పావుగంట చొప్పున పిల్లలకు వీడియో కాల్స్ చేయవచ్చు" అని తీర్పు చెప్పారు.

పాకిస్థాన్‌కు సీఆర్‌పీఎఫ్ జవాను భార్య

జమ్మూ: సీఆర్‌పీఎఫ్ జవాను మునీర్ ఖాన్‌ను పెళ్లాడిన పాకిస్థాన్ జాతీయురాలైన మినల్ ఖాన్‌ను అధికారులు స్వదేశానికి పంపుతున్నారు. జమ్మూ నుంచి ఆమె వాఘా సరిహద్దుకు చేరుకున్నారు. అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లనున్నారు. ఆమె వెంట సరిహద్దు వరకూ భర్త

జవానును విడుదల చేయకపోవడంపై బీఎస్ఎఫ్ నిరసన

దిల్లీ, అమృత్‌సర్: పొరపాటున సరిహద్దు దాటిన తమ జవానును వారం దాటినా ఇంకా విడుదల చేయకపోవడంపై పాకిస్థాన్ రేంజర్ల వద్ద బీఎస్ఎఫ్ నిరసన వ్యక్తం చేసింది. గతంలో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఇరు వర్గాలు వెంటనే విడుదల చేసేవని, ఈసారి ఆలస్యం కావడంతోపాటు పాకిస్థాన్ హామీ ఇవ్వడం లేదని

చైనా రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

22 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలో విషాదం చోటుచేసుకుంది. లియోనింగ్ ప్రావిన్స్‌లోని లియోయాంగ్ నగరంలో మంగళవారం ఓ రెస్టారెంట్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 22 మంది మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. మధ్యాహ్నం 12.25గంటల సమయంలో రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రమాదం సంభవించింది. దుర్ఘటనకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. క్షతగాత్రులకు చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

స్పెయిన్, పోర్చుగల్‌లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మాడ్రిడ్: భారీ విద్యుత్ అంతరాయానికి గురైన తర్వాత స్పెయిన్, పోర్చుగల్‌లో మంగళవారం తిరిగి విద్యుత్ దీపాలు వెలిగాయి. విమానాలు, మెట్రో రైళ్లు పునఃప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటల సమయం నాటికి దేశంలో 99 శాతం విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు స్పెయిన్ అధికారులు వెల్లడించారు. పోర్చుగల్‌లో 89 శాతం విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో ఇరుదేశాల్లో నెమ్మదిగా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయి. కానీ భారీ విద్యుత్ అంతరాయం ఏర్పడటానికి గల కారణం రహస్యంగానే

వేసవిలో.. వేద్దామా పునాది!

సెలవుల్లో పిల్లలకు క్రీడా మంత్రం



'ఏరా ఆడుకోవట్లేదా?' అని అడిగితే..
'అమ్మ ఫోన్ ఇవ్వట్లేదు' అనే పిల్లలు ఎక్కువైన కాలమిది.
తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని మార్కుల కోసం ఆరాటపడే యంత్రాల్లా తయారు చేస్తున్నారు.
చురుకుగా ఉండే చిన్నవయసులోనే ఆటలకు దూరం చేస్తే.. వారికి శారీరకంగానే కాదు... మానసికంగానూ నష్టం చేసినట్లే.
ఆరోగ్యానికి, క్రమశిక్షణకు, కలివిడితనానికి, వ్యూహాత్మకతకు బాటలు వేసే శక్తి క్రీడలకే ఉంది. అందుకే పిల్లలను ఈ సెలవుల్లో క్రీడా మైదానాల వైపు నడిపించండి. వారి వికాసానికి పునాదులు వేయండి. కుటుంబ ప్రణాళికలో ఆటలను కూడా భాగం చేయండి.
ఏ బడిలోనూ, ఏ కాలేజీలోనూ.. ఏ టీచరూ నేర్పని జీవిత నైపుణ్యాలను నేర్పుతుంది క్రీడాంగణం.

పిల్లల దృష్టి ఆటలవైపు మరల్చడానికి వేసవి సరైన సమయం. వారిని పొద్దున్నే నిద్రలేపి.. మీతోపాటు వాకింగ్‌కు తీసుకెళ్లండి. వ్యాయామం చేయించండి. మీకూ సెలవుంటే సొంతూళ్లకు పిల్లలను తీసుకెళ్లండి. మీ బాల్యంలో ఆటలాడుకున్న జ్ఞాపకాలను వారితో పంచుకోండి. వారితో కలిసి మీరూ ఆటలాడండి. వేసవిని ఉపయోగించుకోవాలి కదా అని ఉష్ణోగ్రతలను లెక్కచేయకుండా మధ్యాహ్నం వరకూ ఎండల్లో ఉండొద్దు. శరీరం డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదముంటుంది. ఉదయం 8 వరకు, తిరిగి సాయంత్రం వేళల్లో మైదానాల్లో ఉంటే ఉత్తమం.

ఆడించండి.. ఎందుకంటే...

- ఆటలు.. పిల్లలకు ఆరోగ్య, శారీరక పెరుగుదల, ఎముకల వృద్ధి, కండరాలు బలంగా తయారవడానికి ఉపయోగపడతాయి.
- శారీరక శ్రమతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. మానసిక స్థితి మెరుగవుతుంది.
- బరువు అదుపులో ఉండటానికి ఆటలు ప్రధానం. ఊబకాయం లాంటి సమస్యలు రాకుండా నివారిస్తాయి.
- క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన పెంపొందుతుంది.
- క్రీడల్లో పాల్గొనడంతో టీం మేనేజ్‌మెంట్ బాగా అర్థమవుతుంది. బృంద స్ఫూర్తిపై అవగాహన కలుగుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగవుతాయి.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఎండలు కదా...

ఉదయం, లేదా సాయంత్రం వేళల్లోనే వారితో ఔట్‌డోర్ ఆటలు ఆడించాలి. ఆడే సమయంలో డీహైడ్రేట్ కాకుండా పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలి. మధ్యాహ్నం వేళల్లో ఇంట్లోనే ఆడే చెస్, క్యారమ్స్ వంటి ఆటలతో పాటు సంప్రదాయ ఆటలు కూడా నేర్పించవచ్చు.. తద్వారా మెదడుకు కూడా వ్యాయామం అందుతుంది.

దినచర్యగా...

ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకోవడం, బ్రష్ చేసుకోవడం, టిఫిన్ చేయడం లాగానే శారీరక శ్రమను కూడా దినచర్యలో భాగం చేయాలి. దీంతో జీవితాంతం అది అలవాటుగా మారిపోతుంది. యుక్త వయసులోకి వచ్చాక వారు శారీరకంగా దృఢంగా, చలాకీగా ఉండడానికి ఉపయోగపడుతుంది. భావోద్వేగాలు అదుపు చేసుకునే సామర్థ్యం వారిలో పెంపొందుతుంది.

ప్రోత్సహించండి.. బలవంతం వద్దు..

ఏదైనా ఆట ఆడటానికి పిల్లల్ని ఎప్పుడూ బలవంతం చేయొద్దు. దీంతో వారు మారాం చేయడం మొదలు పెడతారు. చిన్న పనిచేసినా వారిని ప్రోత్సహించాలి. ఇది వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా చేస్తుంది. వారితో కూర్చుని ఆటలపై వారి ఇష్టాయిష్టాలను తెలుసుకోవాలి. కొందరికి టీంతో ఆడే ఆటలంటే ఇష్టముంటుంది. మరికొందరు ఒంటరిగా ఆడేందుకు మొగ్గు చూపుతారు. ఇలా వారి ఆసక్తి ఏంటో తెలుసుకోవాలి.

ఆసక్తి పెంచేందుకు

ఐదేళ్ల లోపు పిల్లలకు రోజుకు కనీసం 180 నిమిషాల పాటు ఆటపాటలు అవసరం. దీని కోసం గ్రౌండ్‌కే వెళ్లనవసరం లేదు. ఇంట్లో ఉన్న స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చు కూడా.

సమ్మర్ క్యాంపులతో ఉపయోగం..

చిన్న వయసులో చేసిన పనుల వల్లే పెద్దయ్యాక మంచి ఫలితాలు వస్తాయి. తల్లిదండ్రులు తమ పిల్లల్ని కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడలను అలవాటు చేయాలి. ప్రస్తుతం క్రీడల్లో రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. క్రీడల్ని కూడా జీవిత లక్ష్యాలుగా ఎంచుకోవాలి. చాలా పాఠశాలల్లో ఆటస్థలాలు లేక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటివారు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి.

- విస్లావత్ రాజు, ఫిజికల్ డైరెక్టర్



నైపుణ్య శిక్షణకు రాష్ట్రంలో ఆస్ట్రేలియా వర్సిటీ!

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రతినిధుల చర్చ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ అందించే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆస్ట్రేలియా వాణిజ్య ప్రతినిధులు ముందుకు వచ్చారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయానికి తోడు మరో ఉన్నతస్థాయి టెక్నాలజీ క్యాంపస్ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్నందున గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లలో పనిచేస్తున్న 3 లక్షల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు, చదువులు పూర్తిచేసుకునే విద్యార్థులకు నూతన నైపుణ్యాలపై శిక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "తమ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని ఆస్ట్రేలియా ప్రతినిధులు చెబుతున్నారు. శాటిలైట్ల నిర్మాణం, డ్రోన్ టెక్నాలజీ, 3-డి డిజైనింగ్, బయో సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర రంగాల్లో శిక్షణ అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని వారు చెప్పారు. స్పష్టమైన, నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని వారికి సూచించాం" అని శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇస్లామాబాద్ స్వరాలకు కాంగ్రెస్ నృత్యం: బండి సంజయ్

ఈనాడు, హైదరాబాద్: ఒకవైపు రాహుల్‌గాంధీ జాతీయవాదం గురించి మాట్లాడుతున్నారు.. మరోవైపు కాంగ్రెస్ ఇస్లామాబాద్ స్వరాలకు నృత్యం చేస్తోందని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'దేశం బాధలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎగతాళి చేస్తోంది. ఇది రాజకీయ దివాలా కాదు. ఇది జాతీయ ద్రోహం. దాని ముసుగు బయటపడింది. లోపల ఉన్న శత్రువు బహిర్గతమవుతోంది' అని పేర్కొన్నారు.

పర్యాటకంలో నా వంతు కృషి చేశా: స్మితా సభర్వాల్

ఈనాడు, హైదరాబాద్: పర్యాటక శాఖలో తాను నాలుగు నెలలపాటు పనిచేశానని, పర్యాటకాభివృద్ధికి తన వంతు కృషి చేశానని సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ తెలిపారు. మంగళవారం 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. "కర్మణ్యే వాధికారస్తే.. మా ఫలేషు కదాచన.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పర్యాటక విధానం 2025-2030ని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి అందుబాటులోకి తీసుకొచ్చా. దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైన పర్యాటక సర్క్యూట్‌ను పెట్టుబడుల దిశగా నడిపించా. శాఖలో మెరుగైన పనిశైలిని పునరుద్ధరించా. జవాబుదారీతనం నింపడానికి ప్రయత్నించా. ప్రపంచ అందాల పోటీలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించా. ఇది నాకు ఆనందాన్ని, గౌరవాన్ని కలిగిస్తోంది" అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో న్యాయం చేయండి



పురపాలకశాఖ కార్యదర్శి శ్రీదేవికి వినతిపత్రం అందించిన అనంతరం మొక్క బహూకరిస్తున్న ప్రభాకర్, వెంకటగోపాల్, శ్రీనివాసగౌడ్

ఈనాడు, హైదరాబాద్: పురపాలకశాఖలో ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల్లో న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటగోపాల్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసగౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో పురపాలకశాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పురపాలకశాఖలోని మేనేజర్లు, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని, త్వరలో చేపట్టనున్న మున్సిపల్ కమిషనర్ కేటగిరీ-3 పదోన్నతులు ఆపాలని కోరుతూ సంఘం తరఫున హైకోర్టును ఆశ్రయించామని పేర్కొన్నారు. న్యాయస్థానం తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేసిందని, అప్పటి వరకూ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.



ఐక్యత చాటుతున్న నరేందర్, రాజేందర్, మల్లేశ్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, గుజ్జ సత్యం, ఆర్.కృష్ణయ్య, వెంకటేశ్, జ్ఞానేశ్వర్

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే యుద్ధమే: కృష్ణయ్య

కాచిగూడ, న్యూస్‌టుడే: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే జరగబోయేది రాష్ట్ర ప్రభుత్వంతో యుద్ధమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలను రోడ్లపై తిరగనీయమని, వెయ్యి మందితో రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ కాచిగూడలోని ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో '42 శాతం బీసీ రిజర్వేషన్లు.. భవిష్యత్తు కార్యాచరణ' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో ఏ సీఎం చేయని విధంగా రేవంత్‌రెడ్డి బీసీ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే సాహసానికి పాల్పడుతున్నారు. ఆయా రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రాతినిధ్యం కల్పించకుండా రాష్ట్ర సమాచార కమిషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. వెంటనే ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి" అని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంఘాల నేతలు నీల వెంకటేశ్, జ్ఞానేశ్వర్, రాజేందర్, గొరిగె మల్లేశ్, నరేందర్, సూర్యనారాయణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట శాస్త్రవేత్తగా డాక్టర్ శైలజ

- ఐఐసీటీ విశ్రాంత శాస్త్రవేత్తకు అరుదైన గౌరవం



ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శైలజ విశిష్ట శాస్త్రవేత్తగా నియమితులయ్యారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) 80 ఏళ్ల చరిత్రలో ఒక మహిళ ఈ హోదా పొందడం ఇదే మొదటిసారి. సాధారణంగా పదవీ విరమణ చేసిన అత్యంత నిపుణుల సేవలను వినియోగించుకునేందుకు విశిష్ట శాస్త్రవేత్త పదవి ఇస్తుంటారు. ఐదేళ్ల సర్వీసు లేదా 70ఏళ్ల వయస్సు.. వీటిలో ఏది ముందైతే అంతవరకు డాక్టర్ శైలజ పదవిలో ఉంటారు. దిల్లీలోని సీఎస్ఐఆర్ ప్రధాన కార్యాలయంలో బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ హెడ్‌గా ఈ నెల 28న ఆమె బాధ్యతలు చేపట్టారు.

రేపటి నుంచి వేసవి శిబిరాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 18జిల్లాల్లో మే 1నుంచి 15వరకు పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు నిర్వహించడం ఇదే తొలిసారి. మొత్తం 656 శిబిరాలు ప్రారంభించేందుకు సమగ్ర శిక్షా, పీఎం శ్రీ పథకాలనుంచి రూ.3.28 కోట్లు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఒక్కో శిబిరానికి రూ.50 వేలు చొప్పున కేటాయించారు. ఒక్కో దాంట్లో 100మంది విద్యార్థు



మీతో మీరు స్నేహితుడిలా మాట్లాడుకోండి

మీ వల్ల ఏదైనా పొరపాటు జరిగినప్పుడు మిమ్మల్ని మీరు ఎక్కువగా నిందించుకోకండి. అలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో మీ ప్రియ స్నేహితుడు ఉండి ఉంటే అతడితో మీరెలా మాట్లాడేవారో.. అలా మీతో మీరు మాట్లాడుకోండి. దానివల్ల- ఎదురుదెబ్బలను అవమానంగా భావించడం తగ్గుతుంది. పరిస్థితిని మీరు మెరుగ్గా అర్థం చేసుకోగలుగుతారు.

– నీర్ ఎయాల్, రచయిత

తొలిరోజు ఎప్‌సెట్‌కు 93 శాతం హాజరు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎప్‌సెట్ అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు విడతల్లో మొత్తం 57,664 మందికిగాను 53,705 మంది(93 శాతం) హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఉదయం ప్రశ్నపత్రాల కోడ్‌ను నిర్ణయించే క్రతువులో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్ కుమార్‌రెడ్డి, రెక్టార్ కె.విజయకుమార్‌రెడ్డి, విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎంఆర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని బాలకిష్టారెడ్డి తనిఖీ చేశారు.

తడారిన నేలలకు సాగర్ జలాలు!

- రఘునాథపాలెం మండల రైతులకు మంచు'కొండ'
- 100 రోజుల్లోనే 'ఎత్తిపోతల' ఫలాలు



మంచుకొండ గుట్టపై అవుట్‌లెట్‌లోకి ఎత్తిపోస్తున్న సాగర్ జలాలు ✦ నిన్నటివరకు ఎండిపోయి.. ప్రస్తుతం సాగర్ జలాలతో నిండుతున్న రేగులకుంట చెరువు

ఈటీవీ, ఖమ్మం – న్యూస్‌టుడే, రఘునాథపాలెం: తలాపునే కృష్ణమ్మ పారుతున్నా.. చుక్క నీరందక తడారిన నేలలవి. బోర్లు, బావులు, వర్షాధారంగానే రైతులు పంటలు పండించేవారు. ఇంతవరకు ఒక్క సాగునీటి ప్రాజెక్టూ లేని మండలమైన రఘునాథపాలెం చరిత్రలో సరికొత్త శకం మొదలైంది. సాగర్ జలాలను మళ్లించి మండలంలోని పంటపొలాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకం ఫలాలు అందడం ప్రారంభం కావడంతో అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

రూ.66.33 కోట్లతో పనులు

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని 37 చెరువులను నింపి 4 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే లక్ష్యంతో మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను రూ.66.33 కోట్లతో చేపట్టారు. వి.వెంకటాయపాలెంలో సాగర్‌కాల్వ డీప్‌కట్ వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా జలాలు తరలించేలా దీనికి రూపకల్పన చేశారు. 450 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన మూడు విద్యుత్తు మోటార్లు ఏర్పాటుచేసి, ఒక్కోదాని ద్వారా 20 క్యూసెక్కులు చొప్పున నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. మంచుకొండ వద్ద గుట్టపై అవుట్‌లెట్ ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి నాలుగువైపులా పంటకాల్వలు తవ్వి గ్రావిటీ ద్వారా నీటిని చెరువులకు తరలిస్తారు.

✦ ఈ ఏడాది జనవరి 13న భోగి పండగ రోజు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో పనులు పూర్తిచేసేందుకు నిర్మాణసంస్థతో ఒప్పందం కుదిరింది. అయితే.. దాదాపు 100 రోజుల్లోనే ప్రధాన పైపులైన్ నిర్మించి ట్రయల్ రన్ చేపట్టాలనే లక్ష్యంతో మంత్రి తుమ్మల అధికార యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించారు. దీంతో 9 కి.మీ. ప్రధాన పైపులైను పనులు పూర్తయ్యాయి. చెరువులకు లింకు పైపులైన్ల నిర్మాణ పనులు సుమారు 25 కి.మీ.లకు గాను సగంమేర ఇప్పటికే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. పైపులైన్ పనులను రైతుల పొలాల్లో యంత్రాలతో చేపట్టాల్సి వచ్చింది. మొదట్లో రైతులు అభ్యంతరం తెలపగా.. మంత్రి తుమ్మల స్వయంగా వారందరితో మాట్లాడి ఒప్పించారు. భూములకు పరిహారం లేకుండానే 2 మీటర్ల లోతులో పైపులు వేశారు. మొత్తం మూడు మోటార్లు బిగించాల్సి ఉండగా.. సకాలంలో మోటార్లు రాలేదు. పాలమూరు రంగారెడ్డి పథకానికి తెప్పించిన ఒక మోటార్‌ను తీసుకొచ్చి బిగించి.. ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. వానాకాలం సీజన్ ఆరంభం నాటికి పనులు పూర్తిచేసి పంటలకు సాగు నీరందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఇక రెండు పంటలు..



నల్లకుంట చెరువు కింద నాకు రెండెకరాల పొలం ఉంది. ఇప్పటి వరకు వర్షాధారంతోనే పంటలు పండించాను. ఒక్కోసారి వరిపైరు ఎండిపోయేది. ఈ పథకం ద్వారా మా చెరువుకు నీళ్లొస్తున్నాయి. ఇక రెండు పంటలు పండించుకోవచ్చు.

– గుర్రం వెంకటేశ్వర్లు, బాబోజీతండా

బతుకులు మారుతాయి!



30 ఏళ్లుగా బోరు, బావులు, వర్షాధారంతోనే పంటలు సాగు చేస్తున్నాం. పత్తి, మిర్చి, వరి పండిస్తున్నాం. వేసవిలో కనీసం పశువులకు నీళ్లు దొరికేవి కావు. మంచుకొండ ఎత్తిపోతల పథకం మండల రైతుల బతుకులను మారుస్తుంది.

– బోడ మోతీలాల్, రాములుతండా

అసమర్థత.. అవినీతితోనే కాళేశ్వరం కూలింది

(మొదటి పేజీ తరువాయి)

ఎన్డీఎస్‌ఏ తుది నివేదికలోని అంశాలపై మంత్రి మంగళవారం సచివాలయంలో మీడియాకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఉత్తమ్ మాట్లాడారు.

బ్యారేజీ స్థలం మార్పు ఘోర తప్పిదం

"ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కాదని.. కేసీఆర్ ప్రభుత్వం కమీషన్ల కోసం బ్యారేజీని మేడిగడ్డకు మార్చింది. ఐదుగురు సభ్యుల విశ్రాంత ఇంజినీర్ల సంఘం కూడా మేడిగడ్డ వద్దని, తుమ్మిడిహెట్టి మేలని చెప్పినా వినకుండా రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. బ్యారేజీ స్థలాన్ని మార్చి దేశచరిత్రలో ఎన్నడూ లేనంత ఘోర విపత్తును సృష్టించి భారాస పాలకులు అపఖ్యాతిని మూటగట్టుకున్నారు" అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వచ్చాక జరిగినవి కాదు కదా..

"మేడిగడ్డ బ్యారేజీ భారాస అధికారంలోనే నిర్మించగా.. వారి హయాంలోనే కూలిపోయింది. అందుకు డిజైన్లు, నిర్మాణపరమైన లోపాలే కారణమని వారి ప్రభుత్వం ఉన్నప్పుడే ఎన్డీఎస్‌ఏ తొలి నివేదికలో వెల్లడించింది. ఇప్పుడు పూర్తిస్థాయి నివేదికలోనూ అవే వివరాలను స్పష్టంగా పేర్కొంది. బ్యారేజీలకు సంబంధించిన ఏ ఘటనా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరిగినవి కాదు కదా. అది ఎన్డీఏ నివేదిక అంటూ భారాస నాయకులు విమర్శిస్తుండటం దారుణం. పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన ప్రామాణిక సంస్థ ఎన్డీఎస్‌ఏ అని గుర్తుంచుకోవాలి. 2023, అక్టోబరు 21న మేడిగడ్డ ఏడో బ్లాకులో కుంగుబాటు చోటుచేసుకోగా.. 25న ఎన్డీఎస్‌ఏ, ఈఎన్సీ (ఓఅండ్ఎం) పియర్స్‌ను సందర్శించి సమావేశం నిర్వహించారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రామగుండం ఈఎన్సీ 28న ఎన్డీఎస్‌ఏను కోరారు. నవంబరు 1న ఎన్డీఎస్‌ఏ ప్రాథమిక సమాచారం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో 2024, ఫిబ్రవరి 23న ఆ సంస్థ కమిటీని ఏర్పాటు చేసింది. 2025, ఏప్రిల్ 24న ఎన్డీఎస్‌ఏ తుది నివేదికను అందజేసింది" అని మంత్రి వివరించారు.

బాధ్యులపై తప్పనిసరిగా చర్యలు

ఎన్డీఎస్‌ఏ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు అందజేయనున్నామని, బాధ్యులపై తప్పనిసరిగా చర్యలుంటాయని ఉత్తమ్ తెలిపారు. ఎన్డీఎస్‌ఏ ఇన్వెస్టిగేషన్స్ చేస్తుండగానే మేడిగడ్డ గోతులను గ్రౌటింగ్ చేయడంతో సమగ్ర అధ్యయనానికి వీలు లేకుండా పోయిందని ఆ సంస్థ పేర్కొన్న విషయంపై ప్రశ్నించగా.. వరదల నుంచి బ్యారేజీని కాపాడేందుకే ఆ ప్రక్రియ చేపట్టామని మంత్రి సమాధానమిచ్చారు.

✦ "కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైన ఆరు నెలల తరువాత ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) సీడబ్ల్యూసీకి అందజేయడం సిగ్గుచేటు కాదా? డీపీఆర్ రూపకల్పనకు ఏడాదైనా సమయం తీసుకోకుండా నాలుగు నెలల్లోనే పూర్తి చేసేలా ఒక పెద్దమనిషి తొందర పెట్టారు. ఇతర దేశాల్లో ఇంత మానవ తప్పిదాలు జరిగితే ఒప్పుకొంటారా?

✦ డీపీఆర్‌లో పేర్కొన్నదానికి విరుద్ధంగా.. అన్నారం 2.2 కి.మీ., సుందిళ్ల 5.4 కి.మీ. దిగువకు మార్చారు. బోర్ రంధ్రాలు వేసి భూ పరీక్షలు ఒక చోట చేసి, మరోచోట నిర్మాణాలు చేపట్టారంటే వారిని ఏమనాలి? హైపవర్ కమిటీ నిర్ణయం మేరకు నిర్మాణాలు జరిగాయి.

✦ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) నదిపై తేలే నిర్మాణానికి డిజైన్ ఇస్తే మరొకటి నిర్మించారు. బ్యారేజీ అంటే రెండు, మూడు టీఎంసీలు నిల్వ చేసుకోవాల్సింది పోయి 10 టీఎంసీలకు పైగా నిల్వ ఉండేలా నిర్మించారు. నీటిని నిల్వ చేయడం, విడుదల చేయడం అంతా పై నుంచి ఆదేశాలు వస్తేనే చేసేవాళ్లమని ఇంజినీర్లు చెప్పారు. నిర్మాణాల నుంచి నిర్వహణ వరకు నాటి ప్రభుత్వ పాలకులు మితిమీరి జోక్యం చేసుకోవడం నష్టానికి కారణమైంది.

✦ 2019లో ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా బ్యారేజీల దిగువన నిర్మాణాలు కొట్టుకుపోయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. నాడే మరమ్మతులు చేసినా ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదేమో" అని ఉత్తమ్ అన్నారు.

రూ.లక్ష కోట్లు వృథా అయితే.. నీళ్లెలా వస్తున్నాయి?

- మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ధ్వజం



కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు డీపీఆర్ లేదని పత్రాలు చూపుతున్న హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: "కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 16 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 231 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్... ఇవన్నీ బాగున్నాయి. కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ నుంచి ఇప్పటికీ సాగునీరు వస్తోంది. ఇవన్నీ కాళేశ్వరంలో భాగం కాదా? అసలు కాళేశ్వరం నిర్మాణానికి అయిన ఖర్చే రూ.90 వేల కోట్లయితే.. మరి రూ.లక్ష కోట్లు వృథా ఎలా అయినట్లు? అదే నిజమైతే నీళ్లు ఎలా వస్తున్నాయి?" అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్‌ఏ నివేదికలో ఎక్కడా చెప్పలేదు. అయినా అవినీతి జరిగిందని చెప్పడానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పడిన ప్రయాస, ఆపసోపాలు చూస్తే జాలి కలిగింది. ఏడో బ్లాక్ తప్ప.. మిగతా అంతా బాగుందని, దాన్ని తిరిగి కట్టడం ద్వారా మేడిగడ్డను ఉపయోగంలోకి తీసుకురావచ్చని ఎన్డీఎస్‌ఏ చెప్పింది. మాపై కక్షతో రాజకీయాల కోసం రైతులకు అన్యాయం చేయొద్దు. తొందరగా మేడిగడ్డకు మరమ్మతులు చేయండి. డీపీఆర్‌ను 4 నెలల్లోనే తయారు చేశారని మంత్రి విమర్శిస్తున్నారు. అసలు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి డీపీఆర్ ఉందా? అవేవీ లేకుండానే టెండర్లు పిలిచి, ప్రాజెక్టు కడుతున్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన సమాధానం ప్రకారం.. కొడంగల్ ప్రాజెక్టుకు ఇప్పటికీ డీపీఆర్ లేదు. మీకో నీతి? మాకో నీతా? 2007లో ప్రాణహితకు టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి, రూ.వేల కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చారు. దానికి 2010లో డీపీఆర్ అందజేశారు. మాపై విమర్శలు చేసే ముందు.. మీరేం చేశారో, ఏం చేస్తున్నారో తిరిగి చూసుకోండి" అని హరీశ్‌రావు విమర్శించారు.

అవసరాలను బట్టి లొకేషన్ మారుతుంది

"అన్నారం, సుందిళ్ల లొకేషన్ మారాయి. నిజమే. జియలాజికల్ సర్వే ప్రకారమే వాటిని మార్చాం. మీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రదేశం ఏలేశ్వరం నుంచి నందికొండకు మారలేదా? ఎస్సారెస్పీ ప్రాజెక్టు కుస్తాపురం నుంచి పోచంపాడుకు మారలేదా? పరిస్థితులు, ముంపు, అవసరాలను బట్టి లొకేషన్లు మారుతాయి. అది కూడా హైలెవెల్ కమిటీ నిర్ణయం మేరకు డిపార్ట్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల పరీక్షలు నిర్వహించాకే, డిజైన్ల ఆధారంగానే ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఐదుగురు సభ్యుల కమిటీ మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడం నాట్ ఫీజిబుల్ అని చెప్పలేదు. మేడిగడ్డ నుంచి మిడ్ మానేర్ డైరెక్ట్ లిఫ్ట్ సాధ్యం కాదని చెప్పింది. అందుకే అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చాం. ఎన్డీఎస్‌ఏ నివేదిక ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేశారు. పోలవరం కడుతున్నది ఎన్డీఎస్‌ఏనే. మరి అక్కడ డయాఫ్రం వాల్, గైడ్ వాల్ కుప్పకూలితే.. ఇదే ఎన్డీఎస్‌ఏ ఎందుకు సందర్శించలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? కాంగ్రెస్, భాజపాలు కుమ్మక్కై ఎన్డీఎస్‌ఏను సీబీఐ, ఈడీల మాదిరిగా వాడుతున్నారు" అని హరీశ్‌రావు మండిపడ్డారు.

ఉద్యమ ఆకాంక్షల సాధనే లక్ష్యం: తెలంగాణ జన సమితి



జెండా ఆవిష్కరిస్తున్న తెలంగాణ జన సమితి నేతలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే తమ లక్ష్యమని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు అన్నారు. సమితి ఏడో ఆవిర్భావ వేడుకలు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 'తెలంగాణ జన సమితి పలు ఉద్యమాలు, ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో కీలక భూమిక పోషించింది. ప్రొ.కోదం... వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించింది' అని వెల్లడిం

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక నిజమేనని నిరూపించాలి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక నిజమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిరూపించాలని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈరోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో ఉత్తమ్ లెక్క చెప్పాలి. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలి? లేదంటే మంత్రి అబద్ధాలు చెబుతున్నట్లే. కేసీఆర్ మీకు ఏడాదిన్నర సమయం ఇచ్చారు. ఎల్కతుర్తి బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి పేరు కేసీఆర్ చెప్పలేదని సీఎం బాధపడుతున్నట్లున్నారు. సీఎంను కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలే గుర్తుపెట్టుకోవడం లేదు. కేసీఆర్ అసెంబ్లీకి ఏ సమయానికి, ఎలా రావాలో అలా వస్తారు" అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.



వంట చేయడం నేర్చుకోండి

మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకునేందుకు మీరు చేయగల అత్యుత్తమ పనుల్లో ఒకటి- వంట! మీరు తీసుకునే పోషకాహారం మీ శరీరానికి, మనసుకు ఇంధనంలా పనిచేస్తుంది. మీరు స్వయంగా వంట చేసుకోగలిగితే- మీకు అన్ని పోషకాలూ సమపాళ్లలో అందేలా చూసుకోవచ్చు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం కూడా తేలికవుతుంది.

– జేమ్స్ కల్విక్, పర్ఫార్మెన్స్ కోచ్

సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మన సైనిక దళాల సామర్థ్యాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగింది. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరి, జాతీయ భద్రతా దళం డీజీ భృగు శ్రీనివాసన్, అస్సాం రైఫిల్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేడా, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదనపు డైరెక్టర్ జనరల్ అనుపమా నీలేకర్ చంద్ర తదితరులు హాజరయ్యారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు బయటకు తెలియరాలేదు.

అఖ్నూర్ సెక్టార్‌లో కాల్పులు

పాకిస్థాన్ సైన్యం వరుసగా ఐదో రోజు రాత్రి కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి, కుప్వారా, బారాముల్లా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద పాక్ కాల్పులకు తెగబడినట్లు భారత సైనిక వర్గాలు తెలిపాయి. పాక్ ఆర్మీ దుశ్చర్యను బలంగా తిప్పికొట్టామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నాయి.

జమ్మూకశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాల మూసివేత

పహల్గాం ఉగ్రదాడి నిందితులను పట్టుకునేందుకు భారత భద్రతా బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. దీనికి ప్రతీకారంగా కశ్మీర్‌లో మరిన్ని విద్రోహ ఘటనలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్రమూకలకు సంబంధించిన నిద్రాణ శక్తులు క్రియాశీలం అయినట్లు తెలిపాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్‌లో ఉన్న మొత్తం 87 పర్యాటక కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి.

రాడార్ వ్యవస్థలను తరలిస్తున్న పాక్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58కి.మీ. దూరంలో ఉన్న ఖోర్ కంటోన్మెంట్ వద్ద టీపీఎస్-77 రాడార్ సైట్‌ను ఏర్పాటుచేసింది. టీపీఎస్-77 మల్టీ-రోల్ రాడార్ (ఎంఆర్ఆర్) అత్యంత సామర్థ్యం గల వ్యవస్థ.

పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత?

తమ గగనతలంపై భారత దేశ విమానాల రాకపోకలపై పాకిస్థాన్ నిషేధం విధించిన నేపథ్యంలో న్యూదిల్లీ కూడా ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పాక్ విమానాలు...కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణ సమయం పెరగడంతో పాటు నిర్వహణకు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతం కానుంది.

సివిల్స్ విజేతకు డీజీపీ జితేందర్ సన్మానం



శ్రీనికేశ్‌నాయక్‌కు మొక్కను బహూకరిస్తున్న డీజీపీ డా.జితేందర్. చిత్రంలో అదనపు డీజీపీ మహేశ్‌భగవత్

ఈనాడు, హైదరాబాద్: యూపీఎస్సీ 2024 పరీక్షలో 938వ ర్యాంకు సాధించిన బానోత్ శ్రీనికేశ్‌నాయక్‌ను డీజీపీ డా.జితేందర్, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్ భగవత్ మంగళవారం సన్మానించారు. శ్రీనికేశ్ హనుమకొండ ఠాణాలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సక్రమ్ తనయుడు. యూపీఎస్సీ ఇంటర్వ్యూకు సంబంధించిన అంశాల్లో ఆయనకు మహేశ్ భగవత్ మెంటార్‌గా వ్యవహరించారు. మరోవైపు శ్రీనికేశ్ టీజీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లోనూ సత్తాచాటారు. ఇటీవలే ప్రకటించిన ఫలితాల్లో 117వ ర్యాంకు సాధించి డీఎస్పీ పోస్టుకు ఎంపిక కావడం విశేషం.

సీఎంను కదిలించిన పర్శ సాయి దీనగాథ

- తగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు ఆదేశం



యువకుడి తల్లి నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో గోపీరాం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

ఈనాడు, హైదరాబాద్: జనగామలోని కుర్మవాడకు చెందిన పర్శ సాయి దీనస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి కుటుంబానికి తగిన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. 30 ఏళ్లుగా మంచానికే పరిమితమైన కుమారుడిని సాకలేకపోతున్నామంటూ సోమవారం జనగామ కలెక్టరేట్‌కు వచ్చిన పర్శ సాయి తల్లిదండ్రులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. ఈ ఘటనపై వచ్చిన వార్తలకు సీఎం స్పందించారు. 'పర్శ సాయి దీనస్థితి నా దృష్టికి వచ్చింది' అని సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి, తల్లిదండ్రుల ఆర్థిక స్థితిపై వివరాలు తెలుసుకుని ప్రభుత్వం వైపు నుంచి సహాయ సహకారాలు అందించాలని సీఎం జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషాను ఆదేశించారు. కలెక్టర్ సూచనతో జనగామ ఆర్డీవో గోపీరాం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పర్శ సాయి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, ఉపాధికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సాయం లభిస్తుందని భరోసా ఇచ్చారు. సాయికి నిమ్స్ లో వైద్య సహాయం అందించాలని నిర్ణయించారు.

కాళేశ్వరం న్యాయ కమిషన్ గడువు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ గడువు మరో నెల రోజులు అంటే మే నెలాఖరు వరకు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది మార్చిలో జస్టిస్ పీసీ ఘోష్ ఛైర్మన్‌గా న్యాయ విచారణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదట వంద రోజుల గడువు ఇవ్వగా విచారణ పూర్తి కాలేదు. ప్రతి రెండు నెలలకోమారు గడువు పొడిగిస్తూ రాగా ఈ దఫా నెల రోజులు పొడిగించింది.

✦ కాళేశ్వరం బ్యారేజీల న్యాయ విచారణ కమిషన్ ఎదుట నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ మంగళవారం హాజరయ్యారు. బీఆర్కే భవన్‌లో ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ముందు హాజరయ్యారు.

ఐపీఎల్‌లో ఈనాడు
చెన్నై × పంజాబ్
వేదిక: చెన్నై, రా॥ 7.30


రఘువంశీ 44

ఛాంపియన్స్

కోల్‌కతా ప్లేఆఫ్స్ ఆశలు సజీవం. రేసులో ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన పోరులో ఆ జట్టు.. దిల్లీని మట్టికరిపించింది. రఘువంశీ, ఇతర బ్యాటర్ల మెరుపులతో గట్టి లక్ష్యాన్ని నిర్దేశించిన కేకేఆర్.. నరైన్ మాయాజాలంతో దిల్లీకి కళ్లెం వేసింది. డుప్లెసిస్, అక్షర్‌ల శ్రమ వృథా అయింది. కోల్‌కతాకు పది మ్యాచ్‌ల్లో ఇది నాలుగో విజయం కాగా.. దిల్లీ అన్నే మ్యాచ్‌ల్లో నాలుగో ఓటమిని చవిచూసింది.

నరైన్ మాయాజాలం

- దిల్లీ క్యాపిటల్స్‌పై కోల్‌కతా విజయం
- డుప్లెసిస్, అక్షర్ పోరాటం వృథా

దిల్లీ

కోల్‌కతా నైట్‌రైడర్స్ అదరగొట్టింది. సునీల్ నరైన్ (27, 3/29) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మంగళవారం 14 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. మొదట కోల్‌కతా 9 వికెట్లకు 204 పరుగులు చేసింది. రఘువంశీ (44; 32 బంతుల్లో 3×4, 2×6), రింకు సింగ్ (36; 25 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. ఛేదనలో డుప్లెసిస్ (62; 45 బంతుల్లో 7×4, 2×6), అక్షర్ పటేల్ (43; 23 బంతుల్లో 4×4, 3×6) మెరిసినా.. దిల్లీ 9 వికెట్లకు 190 పరుగులే చేయగలిగింది. నరైన్‌తోపాటు వరుణ్ (2/39), అనుకుల్ రాయ్ (1/27) బంతితో రాణించారు. గత నాలుగు మ్యాచ్‌ల్లో దిల్లీకి ఇది మూడో ఓటమి.

తిప్పేసిన నరైన్: ఛేదనలో డుప్లెసిస్, అక్షర్ బ్యాట్ ఝళిపించడంతో ఓ దశలో దిల్లీ లక్ష్యం దిశగా సాగినా.. కీలక సమయంలో తడబడి ఓటమివైపు నిలిచింది. నరైన్ తన మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. దిల్లీ తొలి ఓవర్లోనే పోరెల్ (4)ను కోల్పోయింది. కరుణ్ నాయర్ (15) కూడా బ్యాట్ ఝళిపించకుండానే నిష్క్రమించాడు. డుప్లెసిస్ ధాటిగా ఆడడంతో పవర్‌ప్లే ఆఖరికి దిల్లీ 58/2తో నిలిచింది. కానీ ఏడో ఓవర్లో రాహుల్ (7) రనౌట్ కావడంతో చిక్కుల్లో పడింది. అయితే ఆ దశలో డుప్లెసిస్‌కు తోడైన అక్షర్ ధాటైన బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. డుప్లెసిస్ కూడా వీలైనప్పుడల్లా బంతిని బౌండరీ దాటించాడు. ఫలితంగా 13.1 ఓవర్లలో 136/3తో దిల్లీ లక్ష్యంపై కన్నేసింది. కానీ అనూహ్యం. అద్భుతంగా బౌలింగ్ చేసిన నరైన్.. జోరుమీదున్న అక్షర్‌తో పాటు స్టబ్స్ (1)ను ఒకే ఓవర్లో ఔట్ చేసి మ్యాచ్ గమనాన్నే మార్చాడు. తన తర్వాతి ఓవర్లో డుప్లెసిస్‌ను కూడా ఔట్ చేసి కోల్‌కతాను పైచేయిలో నిలిపాడు. ఓ దశలో విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించిన దిల్లీ.. పది పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి చతికిల పడింది. ఆ జట్టుకు చివరి మూడు ఓవర్లలో 46 పరుగులు అవసరం కాగా.. అశుతోష్ క్రీజులో ఉండడంతో చిన్న ఆశ. కానీ వరుణ్ ఎనిమిది పరుగులే ఇచ్చి అశుతోష్ (7)తో పాటు స్టార్క్‌ను వెనక్కి పంపడంతో ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. విప్రాజ్ (38; 29 బంతుల్లో 5×4, 2×6) ధాటైన బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డా.. అతడి ప్రయత్నం సరిపోలేదు.

కోల్‌కతా ధనాధన్: కోల్‌కతా చేసిన స్కోరు చిన్నదేమీ కాదు కానీ.. ఆరంభం చూస్తే ఆ జట్టు ఇంకా ఎక్కువ చేయాల్సింది. కోల్‌కతా.. ఇన్నింగ్స్‌ను కళ్లు చెదిరే రీతిలో ఆరంభించింది. కానీ బంతితో పుంజుకుని ఆ జట్టును కాస్త కట్టడి చేసిన దిల్లీ.. లక్ష్యం మరీ పెద్దది కాకుండా చూసుకుంది. టాస్ ఓడి కేకేఆర్ బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు గుర్బాజ్, నరైన్ విధ్వంసం సృష్టించారు. నరైన్ (27; 16 బంతుల్లో 2×4, 2×6) రెండు సిక్స్‌లు, ఫోర్.. గుర్బాజ్ (26; 12 బంతుల్లో 5×4, 1×6) ఫోర్ దంచడంతో ఇన్నింగ్స్ రెండో ఓవర్లో చమీర ఏకంగా 25 పరుగులు సమర్పించుకున్నాడు. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన గుర్బాజ్ అదే ఓవర్లో ఆఖరి బంతికి నిష్క్రమించాడు. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రహానె (26; 14 బంతుల్లో 4×4, 1×6) కూడా ఎడాపెడా బౌండరీలు బాదేయడంతో పవర్‌ప్లే ముగిసే సరికి 79/1తో నిలిచింది కేకేఆర్. అయితే విప్రాజ్, అక్షర్ వరుస ఓవర్లలో నరైన్, రహానెలను ఔట్ చేయడంతో దిల్లీ కాస్త ఊపిరిపీల్చుకుంది. ఆ దశలో రఘువంశీ.. విప్రాజ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు దంచేశాడు. కానీ బంతితో పుంజుకున్న దిల్లీ బౌలర్లు కోల్‌కతా దూకుడుకు అడ్డుకట్ట వేయగలిగారు. వెంకటేశ్ అయ్యర్ (7)ను అక్షర్ ఎక్కువసేపు నిలువనివ్వలేదు. కుల్‌దీప్ కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కొన్ని ఓవర్లపాటు కేకేఆర్‌కు స్వేచ్ఛగా పరుగులు రాలేదు. కానీ ఎదుర్కొన్న తొలి 14 బంతుల్లో 14 పరుగులే చేసిన రింకు.. కుల్‌దీప్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ కొట్టాడు. 15 ఓవర్లకు 159/4తో బలంగా నిలిచింది కోల్‌కతా. కానీ ఆఖర్లో ఆ జట్టు జోరు పెంచలేకపోయింది. దిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చివరి అయిదు ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 45 పరుగులే చేసింది. రింకు 18వ ఓవర్లో, రసెల్ (17; 9 బంతుల్లో 2×4, 1×6) ఆఖరి ఓవర్లో ఔటయ్యారు. చమీర, విప్రాజ్, స్టార్క్ చక్కగా బౌలింగ్ చేశారు.


నరైన్ 27, 3/29


అనుకుల్ రాయ్ క్యాచ్‌ను అద్భుత రీతిలో అందుకుంటున్న చమీర

కోల్‌కతా ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) పోరెల్ (బి) స్టార్క్ 26; నరైన్ ఎల్బీ (బి) విప్రాజ్ 27; రహానె ఎల్బీ (బి) అక్షర్ 26; రఘువంశీ (సి) కరుణ్ (బి) చమీర 44; వెంకటేశ్ అయ్యర్ (సి) విప్రాజ్ (బి) అక్షర్ 7; రింకు సింగ్ (సి) స్టార్క్ (బి) విప్రాజ్ 36; రసెల్ రనౌట్ 17; రోమన్ పావెల్ ఎల్బీ (బి) స్టార్క్ 5; అనుకుల్ రాయ్ (సి) చమీర (బి) స్టార్క్ 0; హర్షిత్ రాణా నాటౌట్ 0; వరుణ్ చక్రవర్తి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **204; వికెట్ల పతనం:** 1-48, 2-85, 3-91, 4-113, 5-174, 6-177, 7-203, 8-203, 9-203; **బౌలింగ్:** స్టార్క్ 4-0-43-3; చమీర 3-0-46-1; ముకేశ్ 2-0-17-0; విప్రాజ్ నిగమ్ 4-0-41-2; అక్షర్ పటేల్ 4-0-27-2; కుల్‌దీప్ యాదవ్ 3-0-27-0

దిల్లీ ఇన్నింగ్స్: అభిషేక్ పోరెల్ (సి) రసెల్ (బి) అనుకుల్ 4; డుప్లెసిస్ (సి) రింకు (బి) నరైన్ 62; కరుణ్ నాయర్ ఎల్బీ (బి) అరోరా 15; రాహుల్ రనౌట్ 7; అక్షర్ పటేల్ (సి) హర్షిత్ (బి) నరైన్ 43; స్టబ్స్ (బి) నరైన్ 1; విప్రాజ్ (బి) రసెల్ 38; అశుతోష్ (సి) నరైన్ (బి) వరుణ్ 7; స్టార్క్ (సి) గుర్బాజ్ (బి) వరుణ్ 0; చమీర నాటౌట్ 2; కుల్‌దీప్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **190; వికెట్ల పతనం:** 1-4, 2-43, 3-60, 4-136, 5-138, 6-146, 7-160, 8-160, 9-189; **బౌలింగ్:** అనుకుల్ రాయ్ 4-0-27-1; వైభవ్ అరోరా 2-0-19-1; హర్షిత్ 4-0-49-0; వరుణ్ 4-0-39-2; నరైన్ 4-0-29-3; రసెల్ 2-0-22-1

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబయి	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
దిల్లీ	10	6	4	0	12	0.362
పంజాబ్	9	5	3	1	11	0.177
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఆరెంజ్ క్యాప్


సుదర్శన్ (గుజరాత్)
456 పరుగులు
ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ఇచ్చే టోపీ

పర్పుల్ క్యాప్


హేజిల్‌వుడ్ (బెంగళూరు)
18 వికెట్లు
ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే టోపీ

షూటింగ్ ప్రపంచకప్‌నకు మను బాకర్, కుశాలె


మను

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్/పిస్టల్ ప్రపంచకప్‌లో భారత స్టార్లు మను బాకర్, స్వప్నిల్ కుశాలె బరిలో దిగనున్నారు. జూన్ 8న మ్యూనిక్‌లో ప్రారంభంకానున్న ఈ టోర్నీలో మహిళల 10 మీటర్లు, 25 మీ పిస్టల్ ఈవెంట్లలో మను తన అదృష్టం పరీక్షించుకోనుంది. పురుషుల ఎయిర్ రైఫిల్‌లో సందీప్‌సింగ్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సందీప్, స్వప్నిల్ కలిసి బరిలో దిగుతుండటం ఇదే తొలిసారి. ఇటీవల అర్జెంటీనా, పెరూలో జరిగిన ప్రపంచకప్‌లలో భారత్ 6 స్వర్ణాలు సహా 15 పతకాలు సాధించింది. అర్జెంటీనాలో రెండు, పెరూలో మూడో స్థానంలో భారత్ నిలిచింది. ఈ రెండు టోర్నీల్లో పాల్గొన్న 13 మందికి మ్యూనిక్ ప్రపంచకప్ జట్టులో చోటు లభించింది. మహిళల 50 మీ రైఫిల్ 3 పొజిషన్, 25 మీ పిస్టల్ జట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. జాతీయ ఛాంపియన్ అనన్య నాయుడు, ఆదిత్య మల్రా, నిశాంత్ రావత్ ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్నారు.

లక్ష్మణ్ గుర్తిస్తే.. ద్రవిడ్ సానబట్టాడు!


లక్ష్మణ్


ద్రవిడ్


వైభవ్

జైపుర్

వైభవ్ సూర్యవంశీ.. ఇప్పుడు భారత క్రికెట్ అభిమానుల చర్చలన్నీ ఈ కుర్రాడి చుట్టూనే తిరుగుతున్నాయి. కేవలం 14 ఏళ్లకే ఐపీఎల్ అరంగేట్రం చేయడమే కాదు.. మూడో మ్యాచ్‌లోనే మెరుపు శతకం (35 బంతుల్లో) సాధించి ఔరా అనిపించాడు. స్కూల్లో పాఠాలు చదువుకునే వయసులో ఐపీఎల్ లాంటి ప్రపంచ స్థాయి లీగ్‌లో మేటి బౌలర్లను ఎదుర్కొంటూ ఇలాంటి ఇన్నింగ్స్ ఆడడం సంచలనంగా మారింది. భారత్ భవిష్యత్ తారగా కితాబులందుకుంటున్నాడు వైభవ్. త్వరలోనే అతణ్ని టీమ్‌ఇండియాలో చూడగలమనే అభిప్రాయాలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఈ కుర్రాడు ఇంత వేగంగా ఐపీఎల్‌లో అవకాశం అందుకుని, మెరుపులు మెరిపించడం వెనుక తన కోచ్ మనీశ్ ఓజాతో పాటు భారత క్రికెట్ దిగ్గజాలు వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్‌ల పాత్ర కీలకం.

చిన్న వయసులోనే వైభవ్ ప్రతిభను గుర్తించి అతడికి శిక్షణ ఇచ్చి మనీశ్ ఓజా కాగా.. తర్వాత అతడి కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడంలో వీవీఎస్, రాహుల్ తమ వంతు పాత్ర పోషించారు. బీసీసీఐ అండర్-19 ఛాలెంజర్ టోర్నీలో వైభవ్ ఆటను చూసిన జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) అధిపతి లక్ష్మణ్.. అతడికి ప్రోత్సాహాన్నిచ్చాడు. లక్ష్మణ్ హాజరైన ఆ మ్యాచ్‌లో సూర్యవంశీ 36 పరుగుల వద్ద రనౌటయ్యాక డ్రెస్సింగ్ రూంలో ఏడుస్తూ కనిపించాడట. అప్పుడు లక్ష్మణ్ అతడి దగ్గరికెళ్లి.. "మేం కేవలం పరుగులు మాత్రమే చూడం. దీర్ఘ కాలం ఆడగల నైపుణ్యం ఉందా లేదా అన్నదే చూస్తాం" అని చెప్పినట్లు మనోజ్ ఓజా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. తర్వాత లక్ష్మణ్.. వైభవ్‌ను అండర్-19 నాలుగు దేశాల టోర్నీలో తలపడే భారత జట్టులోకి ఎంపిక చేశాడు. జాతీయ క్రికెట్ అకాడమీలోనూ వైభవ్ ఆటపై ప్రత్యేకంగా దృష్టి సారించాడు. తన మాజీ సహచరుడు, రాజస్థాన్ రాయల్స్ కోచ్ ద్రవిడ్‌కు ఈ కుర్రాడి గురించి లక్ష్మణ్ చెప్పాడు. ఈ సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ ట్రయల్స్‌లో వైభవ్ సూర్యవంశీ ఆటను పరిశీలించిన రాహుల్ ద్రవిడ్ వేలంలో అతడిని దక్కించుకున్నాడు. మరో ఫ్రాంఛైజీ రూ.కోటికి వైభవ్‌ను కొనడానికి సిద్ధమవగా, రూ.10 లక్షల అదనపు బిడ్‌తో అతణ్ని రాయల్స్ సొంతం చేసుకునేలా చూశాడు ద్రవిడ్. ఆపై రాయల్స్ శిబిరంలో వైభవ్ మీద రాహుల్ ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి అతడి ఆట మెరుగు పడడానికి తోడ్పడ్డాడు.


2017లో ఐపీఎల్ సందర్భంగా తండ్రితో చిన్నారి వైభవ్

ఆ ఘనత వారిద్దరిదే

జైపుర్: తనను క్రికెటర్‌గా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు ఎంతో శ్రమించారని.. త్యాగాలు చేశారని భారత క్రికెట్ యువ సంచలనం, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చెప్పాడు. ఉదయాన్నే తనను కోచింగ్‌కు సిద్ధం చేయడానికి అమ్మ చాలా త్వరగా లేచేదని.. మూడు గంటలే నిద్రపోయేదని ఈ బిహార్ కుర్రాడు తెలిపాడు. "క్రికెట్లో ఈరోజు ఏది సాధించినా అది నా తల్లిదండ్రుల ఘనతే. ప్రాక్టీస్‌కు సన్నద్ధం చేయడానికి అమ్మ చాలా త్వరగా లేచేది. మూడు గంటలే నిద్రపోయేది. ఆహారాన్ని సిద్ధం చేసేది. క్రికెట్లో ఎదగడానికి నాన్న ఉద్యోగాన్ని వదిలేశారు. పూర్తిగా నాతోనే ఉండేవారు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. 'లక్ష్యాన్ని సాధించగలవ్' అని నాన్న వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ఉండేవారు. అప్పుడు వాళ్లు పడిన కష్టానికి ఈనాడు ఫలితం వస్తోంది" అని వైభవ్ తెలిపాడు. ఐపీఎల్-18లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతూ గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాదేసిన వైభవ్ (38 బంతుల్లో 101).. ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. టీ20 చరిత్రలోనే సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా కూడా నిలిచాడు. ఈ చిన్నోడిని రాజస్థాన్ జట్టు రూ.1.1 కోట్లతో సొంతం చేసుకుంది. ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న పిన్న వయస్కుడు కూడా వైభవే.

భారత్‌కు వైభవ్ సుదీర్ఘ కాలం ఆడతాడు: రాథోడ్

జైపుర్: రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక ప్రతిభ కలిగిన ఆటగాడంటూ ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ ప్రశంసించాడు. వైభవ్ ఇదే ఏకాగ్రతను కొనసాగిస్తే భారత జట్టుకు సుదీర్ఘ కాలం సేవలు అందించగలడని తెలిపాడు. "గత కొన్ని నెలలుగా నెట్స్‌లో వైభవ్‌ను గమనిస్తున్నాం. అతని సామర్థ్యమేంటో.. ఎలాంటి షాట్లు ఆడగలడో మాకు తెలుసు. కానీ భారీ సంఖ్యలో ఉన్న ప్రేక్షకుల ముందు.. మంచి బౌలింగ్ దాడి కలిగిన జట్టుపై అలాంటి ఇన్నింగ్స్ ఆడటం చాలా ప్రత్యేకం. ఈ ఘనత పూర్తిగా అతని సొంతం. వైభవ్ ప్రత్యేక ప్రతిభావంతుడు. టెక్నిక్ పరంగా అతని బ్యాటింగ్‌లో గొప్ప డౌన్‌స్వింగ్ ఉంది. శక్తిని ఉత్పత్తి చేయడానికి అది దోహదపడుతుంది. అతను ఎంత గొప్ప ఆటగాడో అందరికీ చూపించాడు. 14 ఏళ్ల కుర్రాడు ఈ స్థాయిలో ఆడటం కచ్చితంగా ప్రత్యేకమే. నాలుగు నెలల కిందట ట్రయల్స్‌కు వచ్చినప్పుడు వైభవ్‌ను మొదటిసారిగా చూశాం. ప్రత్యేక ప్రతిభను కనుగొన్నట్లు ఆరోజే అర్థమైంది. అతడిని సానబెట్టి ఈ స్థాయికి తీసుకొచ్చే బాధ్యతను మేం తీసుకున్నాం" అని రాథోడ్ వివరించాడు.

వైభవ్‌కు రూ.10 లక్షల నజరానా

పట్నా: గుజరాత్ టైటాన్స్‌తో ఐపీఎల్ మ్యాచ్‌లో 14 ఏళ్లకే సెంచరీ కొట్టి టీ20 క్రికెట్లో ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి బిహార్ ప్రభుత్వం రూ.10 లక్షల నజరానా ప్రకటించింది. తమ రాష్ట్రానికి చెందిన వైభవ్‌ను అభినందిస్తూ బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 'ఎక్స్'

సత్తా చాటిన స్నేహ్, ప్రతీక

- దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు
- బ్రిట్స్ శతకం వృథా


స్నేహ్ రాణా

కొలంబో: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ బృందం వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం 15 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. బౌలింగ్‌లో స్నేహ్‌రాణా (5/43).. బ్యాటింగ్‌లో ప్రతీక రావల్ (78; 91 బంతుల్లో 7×4, 1×6) టీమ్‌ఇండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. సఫారీ జట్టు ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ (109; 107 బంతుల్లో 13×4, 3×6) శతకం వృథా అయింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 5 వికెట్లకు 276 పరుగులు సాధించింది. ఫామ్‌ను కొనసాగించిన ఓపెనర్ ప్రతీక.. మొదటి వికెట్‌కు స్మృతి మంధాన (36; 54 బంతుల్లో 5×4)తో 83 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసింది. హర్మన్‌ప్రీత్ (41), జెమీమా రోడ్రిగ్స్ (41), హర్లీన్ డియోల్ (29), రిచా ఘోష్ (24) తలో చేయి వేయడంతో భారత్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంలబా (2/55) రాణించింది. బదులుగా దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో బ్రిట్స్ జట్టును ముందుకు నడిపించింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (43)తో ఆమె తొలి వికెట్‌కు 140 పరుగులు జత చేయడంతో సఫారీ జట్టు లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. వోల్వార్ట్‌ని ఔట్ చేయడం ద్వారా దీప్తిశర్మ (1/40) ఈ జోడీని విడగొట్టింది. అయినా 33 ఓవర్లకు 170/2తో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితిలో నిలిచింది. భారత స్పిన్నర్లు విజృంభించడంతో ఆ జట్టు 80 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయి ఓటమి కొనితెచ్చుకుంది. ఆఫ్ స్పిన్నర్ స్నేహ్‌రాణా ఆ జట్టు పతనంలో కీలకపాత్ర పోషించింది. సెంచరీ చేసి జోరు మీద కనిపించిన బ్రిట్స్.. ఎండకు తాళలేక 33వ ఓవర్ తర్వాత రిటైర్ కావడం దక్షిణాఫ్రికాను దెబ్బతీసింది. 48వ ఓవర్లో బ్రిట్స్ మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చినా.. జట్టును గెలిపించలేకపోయింది. ఆమె తన స్కోరుకు ఒక్క పరుగే జోడించగలిగింది. 48వ ఓవర్ వేసిన స్నేహ్.. డిక్లెర్క్ (0), డెర్క్‌సెన్ (30)తో పాటు బ్రిట్స్‌ను ఔట్ చేసి అయిదు వికెట్ల ఘనతను పూర్తి చేయడమే కాక విజయాన్ని ఖాయం చేసింది.

సంక్షిప్త స్కోర్లు... భారత్: 276/6 (ప్రతీక 78, స్మృతి 36, హర్లీన్ 29, హర్మన్‌ప్రీత్ 41, జెమీమా 41; ఎంలబా 2/55) **దక్షిణాఫ్రికా:** 49.2 ఓవర్లలో 261 ఆలౌట్ (బ్రిట్స్ 109, వోల్వార్ట్ 43, డెర్క్‌సెన్ 30; స్నేహ్‌రాణా 5/43, దీప్తి 1/40, అరుంధతి 1/59, శ్రీచరణి 1/51)

అజహర్ విషయంలో కఠిన చర్యలు వద్దు: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ పేరు తొలగింపు వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోవద్దంటూ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)ను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. నార్త్ స్టాండ్‌కు తన పేరును తొలగించాలంటూ హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఇచ్చిన ఆదేశాల్ని సవాల్ చేస్తూ అజహర్ హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

భారత్ నిష్క్రమణ


సింధు

షియామెన్ (చైనా): బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్ నుంచి భారత్ నిష్క్రమించింది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి ఇంటిముఖం పట్టింది. మంగళవారం గ్రూపు-డి పోరులో భారత్ 1-4తో ఇండోనేసియా చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ 10-21, 21-18, 21-19తో రెహాన్ నౌఫాల్- గ్లోరియా ఇమాన్యుయెల్లీ జంటను చిత్తుచేసి భారత్‌కు శుభారంభాన్ని అందించింది. అయితే స్టార్ క్రీడాకారిణి పి.వి.సింధు 12-21, 13-21తో పుత్రి కుసుమ వర్దని చేతిలో ఓడటంతో 1-1తో స్కోరు సమమైంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 21-19, 14-21, 12-21తో జొనాథన్ క్రిస్టీ చేతిలో పరాజయం చవిచూడటంతో ఇండోనేసియా 2-1తో ఆధిక్యం సంపాదించింది. మహిళల డబుల్స్‌లో ప్రియా- శ్రుతి మిశ్రా జోడీ 10-21, 9-21తో లానీ మయసరి- సితి రమధంతి జంట చేతిలో ఓడటంతో భారత్‌కు భంగపాటు తప్పలేదు. నామమాత్రమైన పురుషుల డబుల్స్‌లో హరిహరన్- రుబన్ కుమార్ జోడీ 20-22, 18-21తో మహ్మద్ ఫిక్రి- డానియెల్ మార్తిన్ జంట చేతిలో ఓడింది. గ్రూపు-డి తొలి పోరులో భారత్ 1-4తో డెన్మార్క్ చేతిలో పరాజయం చవిచూసింది.

ముంబయి లీగ్ దిగ్గజాలుగా సూర్య, అయ్యర్, రహానె

ముంబయి: ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీ20 లీగ్‌లో భారత స్టార్ ఆటగాళ్లు బరిలో దిగనున్నారు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, అజింక్య రహానె, సర్ఫరాజ్ ఖాన్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబె, పృథ్వీ షాలను లీగ్‌కు దిగ్గజ ఆటగాళ్లుగా ఎంసీఏ ప్రకటించింది. 8 జట్లు పాల్గొనే ఈ లీగ్ కోసం త్వరలోనే ఆటగాళ్ల వేలం నిర్వహించనుంది. మే 26 నుంచి జూన్ 8 వరకు వాంఖడే స్టేడియంలో ఈ లీగ్ మూడో సీజన్ జరగనుంది. కొవిడ్-19కు ముందు రెండు సీజన్‌లు నిర్వహించారు.

బంగ్లాదేశ్‌కు ఆధిక్యం

జింబాబ్వేతో రెండో టెస్టు

చట్టోగ్రామ్: జింబాబ్వేతో రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఆధిక్యం సంపాదించింది. ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్ (120) సెంచరీ కొట్టడంతో రెండో రోజు, మంగళవారం ఆట ముగిసే సమయానికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. ముష్ఫికర్ (40), అనాముల్ హక్ (39) రాణించారు. మసెకెసా మూడు వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్ ఇప్పటికే 64 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 227/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే.. అదే స్కోరు వద్ద ఆలౌటైంది. తొలి టెస్టులో గెలిచిన జింబాబ్వే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది.

మే నెలలో పది ప్రాంతాల్లో పైలట్ 'సర్వే'!



- రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ జత చేసే ప్రక్రియపై అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: భూ యాజమాన్య హక్కుల విషయంలో కీలక సంస్కరణలకు తెరతీసిన ప్రభుత్వం మరో కొత్త విధానానికి సిద్ధమవుతోంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాప్ జోడింపు తప్పనిసరి చేస్తూ భూ భారతి చట్టంలో ప్రత్యేక సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. తొలుత 10 ప్రాంతాల్లో పైలట్ సర్వే కింద ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీన్ని అమలు చేయాలంటే చాలాచోట్ల పక్కాగా సర్వే మ్యాప్‌లు లేవు. 1936లో చేసిన సర్వే ఆధారంగానే రెవెన్యూ రికార్డులు కొనసాగుతున్నాయి. అంతటా రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ జోడించడాన్ని అమలు చేయడం వల్ల కొన్ని ప్రాంతాల్లో సరిహద్దుల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఈ విధానాన్ని చాలా ఏళ్లుగా అమలు చేస్తున్నారు. ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేయడం కన్నా ఈ విధానంతో కాలక్రమేనా సర్వే పూర్తవుతుందని భూ చట్టాల నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే తీరులో తెలంగాణలోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో కొత్త చట్టంలో సెక్షన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్త ప్రక్రియ ప్రారంభిస్తే సమస్యలు వస్తాయని భావించి 6 వేల మంది ప్రైవేటు లైసెన్సుడు సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇది చేపడుతూనే పైలట్ ప్రాజెక్టు కింద 10 మైదాన, గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసి అనుభవాలు నమోదు చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. మే రెండో వారంలో ఈ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి కార్యాచరణ సిద్ధంచేసినట్లు తెలుస్తోంది.

11.70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు



- రైతులకు రూ.817 కోట్లు చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వరి కోతలు ఊపందుకోవడంతో కొనుగోలు కేంద్రాలకు పెద్దఎత్తున ధాన్యం వస్తోంది. రబీ(యాసంగి) సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.37 కోట్ల టన్నుల దిగుబడి వస్తుందన్నది అంచనా కాగా, 70.13 లక్షల టన్నులు కొనుగోలు చేయాలన్నది పౌరసరఫరాల సంస్థ లక్ష్యం. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో మొత్తం 7,981 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు మొత్తం 11.70 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఏప్రిల్ 24వ తేదీ నాటికి రైతుల నుంచి సేకరించిన వడ్ల విలువ రూ.2,714.26 కోట్లు. ఇందులో రూ.817.86 కోట్లను రైతులకు పౌరసరఫరాల సంస్థ చెల్లించింది. మిగతా మొత్తం త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్న నేపథ్యంలో దొడ్డు, సన్న వడ్లకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

◆ ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్, నల్గొండ, కామారెడ్డి జిల్లాలు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. నిజామాబాద్‌లో అత్యధికంగా రూ.1,094.07 కోట్ల విలువైన వడ్లు కొన్నారు. ఇక్కడ 7.09 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా.. 24 నాటికి 4.71 లక్షల టన్నులు కొన్నారు. నల్గొండలో రూ.502.45 కోట్ల విలువైన 2.16 లక్షల టన్నుల వడ్లు సేకరించారు. కామారెడ్డిలో రూ.261.39 కోట్ల విలువైన 1.12 లక్షల టన్నుల కొనుగోళ్లు జరిగాయి.

◆ ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. నాగర్‌కర్నూల్, భూపాలపల్లి జిల్లాల్లో కేంద్రాలు తెరిచినా వివిధ కారణాల వల్ల ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు.

హైవేలపై కొత్త వంతెనలు.. అండర్‌పాస్‌లు



- 28.97 కి.మీ. నిర్మాణానికి కేంద్రం సన్నద్ధత

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో జాతీయ రహదారులు-44, 163, 65 పరిధిలోని మొత్తం 28.97 కిలోమీటర్ల మేర రూ.825 కోట్లతో కొత్త వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించడానికి కేంద్రం సన్నద్ధమవుతోంది. మే 5న కేంద్రమంత్రులు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

■ ఎన్‌హెచ్-44 పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుడిహత్నూర్ వద్ద కిలోమీటరు మేర అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు. మావల చెక్‌పోస్ట్ వద్ద 1.4 కి.మీ. మేర సర్వీస్ రోడ్డు, రిటైనింగ్ వాల్, సీతాగొంది వద్ద రూ.26.17 కోట్లతో కిలోమీటరు మేర 6 వరుసల అండర్‌పాస్, ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని ముప్కాల్ క్రాస్‌రోడ్స్ వద్ద కిలోమీటరు మేర సర్వీస్ రోడ్డు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. సీఎంసీ జంక్షన్ వద్ద అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు, చిట్టాపూర్ జంక్షన్ వద్ద 2.7 కి.మీ. మేర సర్వీస్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ వద్ద 1.26 కి.మీ. మేర 6 వరుసల అండర్‌పాస్ నిర్మాణంతో పాటు వల్లూరు, కోమటిపల్లి జంక్షన్ల అభివృద్ధి, 3.45 కి.మీ. మేర 6 వరుసల అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు.

■ హైదరాబాద్-భూపాలపట్నం ఎన్‌హెచ్-163పైన ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని అంకుశాపూర్ వద్ద 2.77 కి.మీ. మేర 6 వరుసల అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్ జంక్షన్ వద్ద 1.7 కి.మీ. మేర 6 వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతారు.

■ హైదరాబాద్-విజయవాడ పరిధిలోని ఎన్‌హెచ్-65పై ధర్మోజీగూడ వద్ద 6 వరుసల అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణం.. టేకుమట్ల సమీపంలో జంక్షన్ తొలగింపుతోపాటు ప్రయాణికుల సౌలభ్యంపై దృష్టి సారించనున్నారు.

సికింద్రాబాద్-కాజీపేట మధ్య రైల్వే లైన్ల విస్తరణ!



- 3, 4 లైన్ల నిర్మాణానికి పూర్తయిన తుది సర్వే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన సికింద్రాబాద్- కాజీపేట రైల్వే మార్గంలో రద్దీ సమస్యకు పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఈ మార్గంలో ఘట్‌కేసర్ నుంచి కాజీపేట వరకు 110.46 కి.మీ. దూరం రెండు లైన్లే ఉండగా.. మరో రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి తుది సర్వే పూర్తయింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ద.మ.రైల్వే... ఇటీవల రైల్వేబోర్డుకు పంపింది. ఈ అదనపు లైన్ల నిర్మాణానికి రూ.2,837 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. బోర్డు ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు మంజూరవుతుంది. మంజూరు తేదీ నుంచి నాలుగేళ్లలో నిర్మాణాన్ని పూర్తిచేయనున్నారు.

ద.మ.రైల్వే జోన్ ప్రధాన కేంద్రమైన సికింద్రాబాద్ నుంచి దిల్లీ, చండీగఢ్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, లఖ్‌నవూ సహా ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లాలంటే కాజీపేట మీదుగానే రాకపోకలు సాగించాలి. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కతాలకు వెళ్లే రైళ్లకూ వయా కాజీపేటనే ప్రధానమార్గం. దీంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సు బండ్లతో ఈ మార్గం కిటకిటలాడుతోంది. సెక్షన్ ట్రాక్ కెపాసిటీ వినియోగం 100 శాతంలోపు మాత్రమే ఉండాల్సి ఉండగా.. ఇక్కడ 128 శాతంగా ఉంది. మూడు, నాలుగు లైన్ల నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారంతో పాటు రైళ్లు చకచకా పరుగులు తీసే అవకాశం ఉంటుంది. గూడ్సు బండ్లకు ప్రత్యేక మార్గం అందుబాటులోకి వస్తుంది.

సికింద్రాబాద్ నుంచి ఘట్‌కేసర్ వరకు రైల్వే ట్రాక్ నాలుగు లైన్లలో ఉంది. ఘట్‌కేసర్-రాయగిరి వరకు యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు కోసం మూడో లైను ఇప్పటికే మంజూరైంది. ఘట్‌కేసర్-రాయగిరి వరకు నాలుగో లైను, రాయగిరి నుంచి కాజీపేట వరకు 3, 4 లైన్లు నిర్మించాలని ప్రతిపాదించారు.

గ్రామీణ యువతకూ నైపుణ్య శిక్షణ



- ఎన్ఎస్‌డీసీ ఒప్పందానికి ఉన్నత విద్యామండలి ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: యువతలో ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రణాళికలు రూపొందిస్తోంది. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌డీసీ) సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యం. అందుకు త్వరలో ఆ సంస్థతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకునేందుకు సన్నాహాలు చేస్తోంది.

ఎన్ఎస్‌డీసీ అంటే: కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఎన్ఎస్‌డీసీలో మొత్తం 39 సెక్టార్ కౌన్సిళ్లు ఉన్నాయి. ఒక్కో కౌన్సిల్ ఒక్కో రంగంపై పనిచేస్తూ నైపుణ్యాలను పెంచేందుకు దేశవ్యాప్తంగా కృషి చేస్తోంది. గత ఏడాది విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఏరోస్పేస్, అగ్రికల్చర్, ఆటోమోటివ్, ఆభరణాలు, బ్యూటీ అండ్ వెల్‌నెస్, డొమెస్టిక్ వర్కర్స్, ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్, ఐటీ, రిటైలర్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, టెక్స్‌టైల్ లాంటివి 39 స్కిల్ కౌన్సిళ్లు ఉంటాయి. ఎన్ఎస్‌డీసీతో ఒప్పందం కుదుర్చుకుంటే ఆయా రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు సహకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పది, ఇంటర్ తప్పిన వారితోపాటు ఇతర యువతను గుర్తించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ శిక్షణ ఉద్దేశం. తొలుత జిల్లాల్లో నైపుణ్యాల కొరత(స్కిల్ గ్యాప్)పై ఎన్ఎస్‌డీసీ అధ్యయనం చేస్తుంది. ఆ తర్వాత ఏ జిల్లాలో ఎలాంటి శిక్షణ అవసరమో గుర్తించి కేంద్రాలను ఏర్పాటుచేస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎన్ఎస్‌డీసీతో ఒప్పందం కుదుర్చుకునేందుకు.. సీఎం కార్యాలయ అధికారులను సంప్రదించబోతున్నామని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి అన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామకృష్ణారావు ★సీఎంతో జస్టిస్ శివశంకర్‌రావు

నేడు బాధ్యతలు స్వీకరించనున్న నూతన సీఎస్

ఈనాడు, హైదరాబాద్- నారాయణగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావు మంగళవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

★ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ నూతన ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, డా.బి.కిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన జస్టిస్ శివశంకర్‌రావు సీఎంను కలిశారు. సీఎం కార్యాలయంలో పరిశ్రమలు, పెట్టుబడి సెల్, స్మార్ట్ ప్రొయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ(స్పీడ్) నూతన సీఈఓ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇవే విభాగాలకు అదనపు సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఈవీ నరసింహారెడ్డి కూడా సీఎంను కలిశారు. వారిద్దరినీ సీఎం అభినందించారు.

కేసీఆర్ ఎప్పుడూ ప్రతిపక్షంలోనే ఉండాలి: జగ్గారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్ ఎప్పుడూ ప్రతిపక్షంలోనే ఉండాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రం అంతా సమస్యలే ఉన్నాయని అంటున్న కేసీఆర్ వాటిపై పోరాడకుండా 16 నెలలుగా ఇంట్లోనే ఎందుకున్నారని ప్రశ్నించారు. "సన్న బియ్యం ఇస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు శభాష్ అంటున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం అమలుచేయాలా.. వద్దా.. అనే ప్రశ్నకు కేసీఆర్ సమాధానం చెప్పాలి. రైతులను తప్పుదోవ పట్టించేలా కేసీఆర్ మాట్లాడుతున్నారు'' అని జగ్గారెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.ఎ.ఫహీం మాట్లాడుతూ వరంగల్ సభలో కేసీఆర్ కాంగ్రెస్ పార్టీపై అక్కసు వెళ్లగక్కారని, భారాస అధికారంలో ఉన్న పదేళ్లలో చేయలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో చేసి చూపిందన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై హైకోర్టు స్టే



ఈనాడు, హైదరాబాద్: న్యాయస్థానంలో పెండింగులో ఉన్న రివ్యూ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యేదాకా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులెవరికీ పదోన్నతులు ఇవ్వవద్దని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు పదోన్నతులపై స్టే విధించింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తేదీ నుంచి విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలిచ్చాయి. అయినా విద్యుత్ సంస్థల సీఎండీలు ఆ ఆదేశాలను అమలుచేయడం లేదంటూ గతంలో హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలైంది. దానిపై విచారణ పూర్తికాకముందే అడహాక్ పేరుతో మళ్లీ పదోన్నతులు ఇస్తున్నారంటూ తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి, బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది గోడ శివ వాదనలు వినిపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను లెక్కచేయకుండా విద్యుత్ సంస్థల సీఎండీలు అడహాక్ పద్ధతిలో మళ్లీ పదోన్నతులు ఇస్తున్నారని, ఫలితంగా వందల మంది బీసీ, ఓసీ ఉద్యోగులు నష్టపోతున్నారని తెలిపారు. విద్యుత్ సంస్థల యాజమాన్యాల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పదోన్నతులను సమీక్షించాలంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ 2018లో ఉత్తర్వులు ఇచ్చినా అమలుచేయకపోవడాన్ని తప్పుపట్టారు. రివ్యూ పిటిషనుపై విచారణ పూర్తయ్యేవరకు విద్యుత్ సంస్థల్లో ఎలాంటి పదోన్నతులు ఇవ్వవద్దని పేర్కొంటూ(స్టే విధిస్తూ)

కాళేశ్వరంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి

- ఎన్డీఎస్ఏ నివేదికపై భారాస వ్యాఖ్యలు తగవు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: "కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు జరిగాయన్నది వాస్తవం. ఆ విషయం పక్కన పెట్టి ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను 'ఎన్‌డీఏ' నివేదిక అంటూ భారాస మాట్లాడటం తగదు'' అని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మంగళవారం భాజపా రాష్ట్ర బాధ్యుడు సునీల్‌బన్సల్, నాయకులతో కలిసి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. పహల్గాం మృతులకు సంతాప సూచకంగా నిమిషం మౌనం పాటించారు. సమావేశంలో పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా తీర్మానం ఆమోదించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

"కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయా లేదా అనేది ముఖ్యం. నివేదిక ఎన్‌డీఏ ఇచ్చిందని భారాస అనడం మంచి పద్ధతి కాదు. ప్రాజెక్టులో అనేక లోపాలున్నాయని 'ఎన్‌డీఎస్ఏ' నివేదిక ఇచ్చింది. ఆ సంస్థ చట్టబద్ధంగా ఏర్పాటైంది. బాధ్యులపై కాంగ్రెస్ ఏడాదిన్నరగా చర్యలు తీసుకోలేదు. ఆ పార్టీకి కాళేశ్వరంపై మాట్లాడే నైతిక హక్కు లేదు. దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి. ఎల్కతుర్తి సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణకు కేంద్రం ఏమీ ఇవ్వలేదన్నారు.. కేంద్రం నుంచి ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయి. స్వయంగా ప్రధాని మోదీ వచ్చి అభివృద్ధి పనులను ప్రారంభించినా కేసీఆర్ హాజరుకాలేదు. పహల్గాం ఘటన తర్వాత యావద్భారత ప్రజలు, ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని అంతం చేయాలని నినదిస్తున్న సమయంలో.. రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బాధ్యత మరచి, ప్రధాని మోదీని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రధానికి, భారత సైన్యానికి అండగా ఉండాల్సిన కాంగ్రెస్ బాధ్యత మరిచి ఉగ్రవాదులు మాట్లాడుతున్న భాషలో మాట్లాడటం అత్యంత హేయం. మోదీ వచ్చాక ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపారు'' అని కిషన్‌రెడ్డి అన్నారు. సమావేశంలో భాజపా నేతలు గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మర్రి శశిధర్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సునీల్ బన్సల్, గరికపాటి మోహన్‌రావు, కాసం వెంకటేశ్వర్లు, మర్రి శశిధర్‌రెడ్డి

నేతలపై సునీల్ బన్సల్ ఆగ్రహం!

క్రియాశీల సభ్యత్వం విషయంలో తప్పుడు సమాచారంతో పార్టీని మోసం చేశారని భాజపా రాష్ట్ర బాధ్యుడు సునీల్ బన్సల్ సమావేశంలో నేతలపై మండిపడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సుమారు 9 వేల మంది క్రియాశీల సభ్యత్వం చేయకున్నా చేసినట్లు చూపారని ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

వరంగల్ రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు

'అమృత్ భారత్' పథకంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ పునరభివృద్ధి పనులు తుది దశకు చేరాయని కిషన్‌రెడ్డి తెలిపారు. సరికొత్త ముఖద్వారంతోపాటు, లిఫ్టులు, ఎస్కలేటర్లు వంటి పలు రకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు.

కేసీఆర్ కపటప్రేమ చూపారు

- రెవెన్యూ మంత్రి పొంగులేటి ధ్వజం



కరీమాబాద్(వరంగల్), నేలకొండపల్లి-న్యూస్‌టుడే; ఈనాడు-కామారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు దుఃఖం వస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం వరంగల్ నగరంలోని ఉర్సుగుట్టలో, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని శెట్పల్లిలో, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మంత్రి మాట్లాడారు. భారాస రజతోత్సవ సభలో తెలంగాణ ప్రజలపై కేసీఆర్ కపట ప్రేమ చూపారని విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వస్తామంటూ భారాస నాయకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 57 వేల ఉద్యోగాలిచ్చామని.. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భారాస పాలనలో రెండు పడకగదుల ఇళ్లు ఎన్ని ఇచ్చారని మంత్రి ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 18 కిపైగా రాష్ట్రాల్లోని భూచట్టాలను అధ్యయనం చేసి, విశ్రాంత కలెక్టర్లు, భూచట్టాల నిపుణుల సాయంతో ప్రజల సమస్యల ఆధారంగా భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు భూ భారతి సదస్సులు నిర్వహించి.. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూ భారతి చట్టాన్ని పైలట్ కార్యక్రమంగా అమలు చేస్తున్నామని, రెవెన్యూ యంత్రాంగం రైతుల వద్దకు వెళ్లి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తోందని తెలిపారు. ఈ సమస్యలను నెల రోజుల్లోపు పరిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 10 నుంచి 15 రోజుల్లో రాష్ట్రంలోని 10,956 రెవెన్యూ గ్రామాలకు రెవెన్యూ అధికారులను పంపిస్తామన్నారు.

* ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల జాబితాలను వచ్చే నెల 5లోపు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు నాగరాజు(వర్ధన్నపేట), మదన్‌మోహన్‌రావు(ఎల్లారెడ్డి), పలువురు నేతలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అక్టోబరు నాటికి యాదాద్రి ప్లాంటు పూర్తి

'ఈనాడు' కథనానికి జెన్‌కో స్పందన

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణం అక్టోబరు నాటికి పూర్తవుతుందని జెన్‌కో మంగళవారం తెలిపింది. ఈ ప్లాంటులో ఒక్కోటీ 800 మెగావాట్ల స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంతో 5 యూనిట్లు నిర్మిస్తున్నామని పేర్కొంది. 2వ యూనిట్‌లో ఉత్పత్తి మొదలైనట్లు తెలిపింది. ఒకటో యూనిట్ మార్చి చివరికల్లా, 4వ యూనిట్ ఏప్రిల్ నెలాఖరుకల్లా పూర్తిచేస్తామని గత నెలలో అసెంబ్లీకిచ్చిన 'విధానపత్రం'లో రాష్ట్ర ఇంధనశాఖ తెలిపినా పనులు కాలేదని 'అదే నిర్లక్ష్యం... అందుకే వైఫల్యం' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి స్పందించి వివరణ ఇస్తున్నట్లు జెన్‌కో ప్రాజెక్ట్స్ విభాగం డైరెక్టర్ సచ్చిదానందం ఓ ప్రకటనలో వివరించారు. మార్చిలో పూర్తికావాల్సిన ఒకటో యూనిట్‌లో త్వరలో వాణిజ్య ప్రాతిపదికన విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో పూర్తికావాల్సిన 4వ యూనిట్‌ను జూన్ నాటికి, 3వ యూనిట్‌ను జులైలో, చివరిదైన 5వ యూనిట్‌లో వచ్చే అక్టోబరులో వాణిజ్య ప్రాతిపదికన విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని వెల్లడించారు. దీని ప్రకారం అసెంబ్లీలో తెలిపిన గడువు జూన్‌తో పోలిస్తే 4 నెలలు ఆలస్యమవుతుందని వివరణ ఇచ్చారు.

కర్రెగుట్టల్లో కొనసాగుతున్న 'కగార్'!

- 8వ రోజుకు చేరుకున్న ఆపరేషన్
- గల్గం నుంచి బలగాల మోహరింపు

న్యూస్‌టుడే - చర్ల, వెంకటాపురం: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపుర్ జిల్లా ఊసూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కర్రెగుట్టల కేంద్రంగా 'కగార్' ఆపరేషన్ 8వ రోజైన మంగళవారం కొనసాగింది. గల్గం నుంచి మరిన్ని బలగాలను హెలికాప్టర్లో తరలిస్తున్నారు. 'ఆపరేషన్'లో అలసిన బలగాలను వెనక్కి రప్పిస్తూనే.. బ్యాకప్ పార్టీలను ఆ ప్రాంతానికి తరలిస్తున్నారు. నంబి, గలగం, పూజారికాంకేర్, నడిపల్లి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాంబుల శబ్దాలు వినిపించినట్లు స్థానికులు తెలిపారు. కొండపైకి చేరుకుంటున్న బలగాలు అక్కడ పాతిన ఐఈడీలను తొలగిస్తున్నాయి. మరోవైపు మావోయిస్టు కీలకనేతలను లక్ష్యంగా చేసుకొని ఈ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం.

రాయ్‌పుర్‌కు ఐబీ చీఫ్..

కర్రెగుట్టల ఆపరేషన్‌పై చర్చించేందుకు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ దేకా రాయ్‌పుర్ చేరుకున్నారు. మావోయిస్టుల సమస్యపై ఆయన కీలక సమావేశం నిర్వహించనున్నారు. పోలీసు హెడ్‌క్వార్టర్లో ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. డీజీపీ అరుణ్‌దేవ్ తదితరులతో భేటీ అయ్యారు. ఓవైపు ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో దేశంలో నిఘాసంస్థలు అప్రమత్తంగా ఉన్న తరుణంలో ఛత్తీస్‌గఢ్‌లో ఐబీ చీఫ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న నక్సల్స్ ఆపరేషన్ నిర్ణయాత్మక యుద్ధంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు.

అడవుల్లోకి అదనపు బలగాలు..

ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాలు.. బీజాపుర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అదనపు బలగాలు రంగంలోకి దిగాయి. ప్రత్యేక వాహనాల్లో వచ్చిన దాదాపు 2 వేల మంది జవాన్లు పలు మార్గాల్లో అడవుల్లోకి దూసుకెళ్లారు. మావోయిస్టుల ఏరివేతలో అనుభవం కలిగిన ఝార్ఖండ్‌కు చెందిన బలగాలను రప్పించినట్లుగా తెలుస్తోంది.

■ వెంకటాపురం కేంద్రంగా మళ్లీ హెలికాప్టర్ల సంచారం కొనసాగింది. రెండు రోజుల పాటు విరామం ఇచ్చిన భద్రతా బలగాలు మంగళవారం ఆరుసార్లు రెండు ఛాపర్లను వినియోగించాయి. గుట్టలపైకి చేరిన కేంద్ర పారామిలటరీ, సీఆర్పీఎఫ్, కోబ్రా, ఛత్తీస్‌గఢ్ ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్‌కు అవసరమైన ఆహారం, మంచినీరు, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చేరవేసినట్లుగా తెలుస్తోంది. ఓ విడతలో 60 మందికి పైగా జవాన్లను సైతం తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. అభయారణ్యంలోని పామునూరుకు 8 కి.మీ. దూరంలో ఎత్త...



వెంకటాపురం మండలంలోని తాపాల గుట్టల వైపు వెళుతున్న జవాన్లు

...టింగ్ బేస్)ని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది.

■ ఉపగ్రహ ఛాయాచిత్రాలు, డ్రోన్ల సాయంతోనే బలగాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. ఆపరేషన్ కర్రెగుట్టలకు ముందుగానే మావోయిస్టులు ఆహారం, సామగ్రిని వెంకటాపురం, ఊసూరు, చర్ల ప్రాంతాల నుంచి తెప్పించుకున్నట్లుగా నిఘావర్గాలకు కీలక ఆధారాలు చిక్కినట్లు తెలుస్తోంది. ఆ నిల్వలను మావోయిస్టులు ఎక్కడకు చేర్చారు? ఏ ప్రాంతంలో మకాం వేశారో నిగ్గుతే...

లేదు లేదంటూనే.. ఇద్దరి సర్వీసు పొడిగింపు

- ఒకరికి సీఈగా అదనపు బాధ్యతలు.. మరొకరికి ఓఎస్డీగా అవకాశం
- అభ్యంతరం వ్యక్తంచేస్తున్న ఇంజినీర్ల సంఘాలు

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగ విరమణ అనంతరం ఇకపై సర్వీసు పొడిగించే పద్ధతిని కొనసాగించబోమని ప్రభుత్వం చెబుతుండగా..నీటిపారుదల శాఖలో ఇద్దరి సర్వీసు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. గత నెలలో నాగర్‌కర్నూల్ ఈఎస్‌గా(అదనపు బాధ్యతలతో సీఈ, అదనపు బాధ్యతలతో ఓఅండ్ఎం ఈఎన్సీగా కొనసాగుతూ) ఉద్యోగ విరమణ చేసిన విజయ భాస్కర్ రెడ్డిని అదే ప్రాంతంలో ఎస్ఈగా కొనసాగించడంతోపాటు సర్కిల్ ఇంజినీర్(సీఈ)గా అదనపు బాధ్యతలు ఇస్తూ ఏడాది కాలంపాటు పొడిగింపును ఇచ్చారు. అలాగే ఎస్ఈగా ఉద్యోగ విరమణ చేసిన ఎస్.భీం ప్రసాద్‌కు ఏడాది కాలంపాటు కొనసాగింపును ఇస్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఓఎస్డీగా అవకాశం ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

గత భారాస ప్రభుత్వంలో నీటిపారుదల సహా అనేక శాఖల్లో సర్వీసు పొడిగించి మరీ అనేక మందిని కొనసాగించారు. దీనిపై ఉద్యోగ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తంచేసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించింది. అలా కొనసాగుతున్న వారిని తొలగించింది. కొందరు మళ్లీ సర్వీసు పొడిగించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం అంగీకరించలేదు. తాజాగా నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇద్దరి సర్వీసు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేషన్ ఇంజినీర్ల సంఘం, హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘం, ఇరిగేషన్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం ఆందోళన వ్యక్తంచేశాయి. 'మిషన్ భగీరథ శాఖలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పదవీ విరమణ చేసిన కృపాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖలో ఈఎన్సీగా పనిచేసిన కనకరత్నంలకు ఈ నెలలోనే సర్వీసు కొనసాగింపు అవకాశం ఇచ్చారు. ఇదే నెలలో మళ్లీ ఇద్దరికి పొడిగింపు ఇవ్వడం ఆశ్చర్యం కలిగించింది. ఈ విధానం పునరావృతమైతే ఏఈఈ నుంచి సీఈ వరకు సర్వీసుపరమైన అవకాశాలకు గండిపడుతుంది' అని ఆయా సంఘాలు మంగళవారం ఓ ప్రకటనలో ఆక్షేపణ తెలిపాయి. సర్వీసులో ఉన్న ఇంజినీర్లకు మాత్రమే పూర్తిస్థాయి బాధ్యత, కార్యదక్షత ఉంటుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని సూచించాయి.

నేడు.. రేపు ఓ మోస్తరు వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు పడతాయని పేర్కొంది. గురువారం కూడా పైన పేర్కొన్న ప్రాంతాలతోపాటు మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయంది.


వడదెబ్బతో ముగ్గురి మృతి

బయ్యారం, ఆత్మకూర్(ఎస్), ఐనవోలు- న్యూస్‌టుడే: వడదెబ్బతో రాష్ట్రంలో వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు మరణించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరినగర్‌లో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు కేలోతు రంగ్యా(57), సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి తలారి నర్సయ్య(59) మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన యాకర సాలమ్మ(71) గ్రామంలో తిరుగుతూ కూరగాయలు విక్రయించి అస్వస్థతకు గురై మంగళవారం మరణించింది.

కగార్‌ను తక్షణం నిలిపివేయాలి: సీతక్క

ఈనాడు, హైదరాబాద్: ఆదివాసీల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని, మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. భారత్ బచావో సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, గోపీనాథ్, రమేశ్ బాబు తదితరులు మంగళవారం సీతక్కను ప్రజాభవన్‌లోని ఆమె నివాసంలో కలిసి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసేలా చొరవ చూపాలని కోరారు. వారి వినతిపై మంత్రి స్పందిస్తూ.. "ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయొద్దు. ఆ జాతి బిడ్డగా వారికి అండగా నిలుస్తా. బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కరించేలా కేంద్రం వ్యవహరించాలి'' అని సీతక్క కోరారు.

బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలి: వామపక్షాలు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు పక్కన జూలకంటి రంగారెడ్డి

ఆపరేషన్ కగార్ నిలిపివేయడంతోపాటు తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కర్రెగుట్టల నుంచి పోలీసు క్యాంప్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరాయి. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రం తీరును తప్పుబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పరాయి దేశంపై యుద్ధం చేస్తున్నట్లు దేశ పౌరులైన మావోయిస్టులను వేటాడటం దుర్మార్గమన్నారు. ఈ అంశాన్ని న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని కోరారు.

మే 2న హైదరాబాద్‌లో సదస్సు: మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మే 2న హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణను రూపొందించను...



సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ. చిత్రంలో పశ్య పద్మ, చాడ వెంకట్‌రెడ్డి, విజయసారథిరెడ్డి, కూనంనేని సాంబశివరావు

భాజపాకు అధికార వాంఛ తప్ప దేశంపై ప్రేమ లేదు

- ఎవరూ ప్రశ్నించకూడదనే న్యాయవ్యవస్థపై దాడి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఈనాడు, హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలో భాజపా ప్రభుత్వం దేశానికి నష్టం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. దేశం విచ్ఛిన్నమైనా పర్లేదుకానీ తామే అధికారంలో ఉండాలనే కాంక్షతో పనిచేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో జరిగాయి. సమావేశంలో నారాయణ మాట్లాడుతూ 'భాజపాకు అధికార వాంఛే తప్ప దేశంపై కానీ, ప్రజలపై కానీ ఎలాంటి ప్రేమ లేదు. తమను ఎవరూ ప్రశ్నించకూడదని కేంద్ర ప్రభుత్వం చివరికి న్యాయవ్యవస్థపై సైతం దాడికి తెగబడుతోంది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఉపరాష్ట్రపతి సైతం సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఇందులో భాగమేనన్నారు. దేశం ఒక్కటిగా ఉండాలని అన్ని మతాలు, వర్గాల ప్రజలకు సమాన హక్కులు ఉండే విధంగా రాజ్యాంగ రూపకల్పన జరిగిందని.. నేడు రాజ్యాంగాన్నే నిర్వీర్యం చేసేందుకు భాజపా కుట్రలు పన్నుతోందని విమర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన 11 ఏళ్లుగా దేశంలో ప్రజాస్వామ్యం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి అధ్యక్షత వహించారు.



అవేమీ పరిమిత వనరులు కావు!

విజయాలు, సంతోషాలు.. పరిమిత వనరులేమీ కావు. మనం శ్వాసించే గాలిలాగే ఈ ప్రపంచంలో అవి అపరిమితంగా అందుబాటులో ఉంటాయి. వాటిని ఎవ్వరైనా పొందవచ్చు. మీ గెలుపు, ఆనందం కోసం శత్రుత్వం, వదంతుల ద్వారా ఇతరులకు విజయావకాశాలను, సంతోషాలను దూరం చేయకండి.

– క్రిస్టోఫర్ వోస్, రచయిత

టెట్‌కు ఈసారి 1.50 లక్షల మందే!

- భారీగా తగ్గిన దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు
- పరీక్ష కేంద్రాలను అనేక జిల్లాలకు ఆవల కేటాయిస్తుండడంపై అభ్యర్థుల అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2025)కు ఈసారి దాదాపు సగం వరకు దరఖాస్తులు తగ్గనున్నాయి. దరఖాస్తు గడువు బుధవారంతో ముగియనుండగా.. మంగళవారం రాత్రి వరకు 1.36 లక్షల మందే ఫీజు చెల్లించారు. వారిలో 1.34 లక్షల మంది దరఖాస్తు సమర్పించారు. ఇక ఒక రోజు మాత్రమే గడువు ఉన్నందున మొత్తం దరఖాస్తులు 1.50 లక్షలకు మించకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) ఉద్యోగాలకు అర్హత పొందేందుకు పేపర్-1, ఉన్నత పాఠశాలల్లో (6-10 తరగతులు) బోధనకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. టెట్‌లో వచ్చిన మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు. మొత్తం 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఓసీలకు-90, బీసీ-75, మిగిలిన వారికి 60 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. జూన్ 15-30వ తేదీ మధ్యలో ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి.

పరీక్ష కేంద్రం దూరాభారమూ కారణమే!

ఈసారి దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గడానికి పలు కారణాలు ఉన్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. గతేడాది రెండుసార్లు పరీక్షలు నిర్వహించారు. చివరిసారిగా గత జనవరిలో జరిగిన టెట్-2024 చివరి విడత పరీక్షకు 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 2,05,278 మంది పరీక్ష రాశారు. మళ్లీ నాలుగు నెలలకే పరీక్ష జరుపుతుండటం... కొత్తగా డీఈడీ, బీఈడీ పాసైన వారు లేకపోవడం, ఎన్నిసార్లు రాసినా మార్కులు పెరిగే అవకాశం కనిపించకపోతుండటం, ఫీజు రూ.750గా నిర్ణయం.. తదితర వాటిని కారణాలుగా చెబుతున్నారు. అయితే పరీక్షా కేంద్రాలను ఎన్నో జిల్లాల ఆవల ఇస్తుండటమే దరఖాస్తులు తగ్గడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. కేంద్రాలు దూరంగా ఉంటుండడంతో అభ్యర్థులు ముఖ్యంగా యువతులు ఇబ్బందులు పడుతున్నారు. పరీక్ష రాసే వారిలో సగానికిపైగా యువతులు, మహిళలే ఉంటున్నారు. చిన్న పిల్లలున్నవారు, గర్భిణులు, అనారోగ్య సమస్యలున్న వారు టెట్ పరీక్షా కేంద్రాలను తలచుకుంటేనే భయపడుతున్నారు. ఒక రోజు ముందే వెళ్లి... హోటల్‌లో ఉండటం తదితర వాటికి భారీగా ఖర్చవుతోంది. అందుకే గత జనవరిలో జరిగిన పరీక్షకు ఏకంగా 70 వేల మంది గైర్హాజరవడం గమనార్హం. సొంత జిల్లాలో లేదా పక్క జిల్లాలో పరీక్షా కేంద్రం కేటాయించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

వ్యవసాయంలో 4.0 దశ ప్రారంభం కావాలి

- సీఐఐ వ్యవసాయ సదస్సులో ఎన్ఆర్ఎస్ఏ డైరెక్టర్ వేమూరి చౌదరి



సీఐఐ సదస్సులో ప్రవీణ్‌రావు, ఆర్ఎస్ రెడ్డి, వేమూరి చౌదరి

ఈనాడు, హైదరాబాద్: డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధల సమ్మిళితంగా వ్యవసాయ రంగంలో 4.0 దశ ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్ఏ) అగ్రి సైన్సెస్ అధ్యయనాల విభాగం డైరెక్టర్ వేమూరి చౌదరి అభిప్రాయపడ్డారు. అధునాతన విధానాలతో భవిష్యత్తులో దేశంలో సేద్యం ఉజ్వలంగా మారుతుందని చెప్పారు. "డిజిటల్ వ్యవసాయంతో ఉత్పాదకత పెంపు, స్థిరత్వం' అనే అంశంపై భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'డిజిటల్ సాంకేతికత పంటల సాగు ఖర్చును తగ్గించడంతోపాటు దిగుబడులను పెంచడానికి ఇది దోహదపడుతుంది. ఉపగ్రహాల ద్వారా పంటల పర్యవేక్షణ, దిగుబడి అంచనాలను ముందే వెల్లడిస్తూ రైతులకు లాభం చేకూరుస్తుంది" అని అన్నారు. కొండాలక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి మాట్లాడుతూ..వర్సిటీలు, పరిశోధన సంస్థల్లో భారీ ఎత్తున పరిశోధనలు, ఆవిష్కరణలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అంకురాలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని అగ్రిహబ్ సీఈవో విజయ్ ఆకాంక్షించారు. సీఐఐ తెలంగాణ వ్యవసాయ, ఆహారశుద్ధి విభాగం సలహాదారు ప్రవీణ్‌రావు, సీఐఐ తెలంగాణ విభాగం ఛైర్మన్ ఆర్ఎస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గౌతంరెడ్డి, సదరన్ రీజియన్ మాజీ ఛైర్మన్ అనిల్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. వ్యవసాయంలో సుస్థిరత సాధించే, ప్రపంచంతో పోటీపడే వ్యూహాలను అన్వేషించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సదస్సులో నిపుణులు సుబ్బారెడ్డి, ఆదర్శ్‌సూరి, ప్రేమ్‌కుమార్ అమిత్ వాత్సాయన్, ఎస్‌బీఐ, నాబార్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు, అంకుర సంస్థల వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం డబ్బు తీసుకున్న రైల్వే ఉద్యోగిపై సీబీఐ కేసు

ఈనాడు, హైదరాబాద్: పెద్దఎత్తున ముడుపులు స్వీకరించి రైల్వేలో ఉద్యోగాలు ఇచ్చిన కేసులో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌కు కార్యదర్శిగా ఉన్న సయ్యద్ మునావర్ బాషాపై హైదరాబాద్ సీబీఐ అధికారులు తాజాగా కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, చీఫ్ కంట్రోలర్ల ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయంటూ 2024 నవంబరు 14న ద.మ. రైల్వే సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ విజిలెన్స్ బ్రాంచి డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(డిప్యూటీ సీవీవో) రాకేష్ సీబీఐకి ఫిర్యాదు చేశారు. తాము తనిఖీలు నిర్వహించినప్పుడు ఉద్యోగాలకు ఎంపికైన వారిలో గడేకారి శేఖర్ నుంచి రూ.50 వేలు, కొయ్యాడ సజిత్‌గౌడ్ నుంచి రూ.30 వేలు, యు.దినేశ్ నుంచి రూ.25 వేలు, సలివేంద్ర సందీప్ నుంచి రూ.20 వేలు చొప్పున యూపీఐ ద్వారా మునావర్ కుమారుడు షేక్ సమీర్ హుస్సేన్ ఖాతాలో జమైనట్లు తేలిందని ఆయన వివరించారు. దీంతోపాటు గడేకారి శేఖర్ నుంచి రూ.20 వేలు, నరేష్ కుమ్మర నుంచి రూ.20 వేలు నగదు రూపంలో మునావర్ తీసుకున్నట్లు కూడా తేలిందని చెప్పారు. తదుపరి విచారణలో భాగంగా తండ్రీకుమారుల బ్యాంకు లావాదేవీలు తనిఖీ చేసినప్పుడు 2022 జనవరి నుంచి 2023 అక్టోబరు మధ్య మొత్తం రూ.31,62,500 వీరి ఖాతాల్లో జమైనట్లు తేలిందన్నారు. ఈ డబ్బంతా మునావర్ ఆదాయానికి మించిన ఆస్తిగానే పరిగణిస్తున్నామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని సీబీఐని రాకేష్ కోరారు. ఈ మేరకు సీబీఐ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు.

తల్లీబిడ్డలకు పరీక్షలు నిర్వహించి నివేదిక ఇవ్వండి

మహిళా శిశుసంక్షేమ శాఖకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తమ కుమార్తెకు ఆమె భర్త సైకోథెరపీ చేయిస్తున్నారని, దానివల్ల ఆమె ప్రాణాలకు ప్రమాదం ఉందని ఆరోపిస్తూ పోలీసులకు ఓ యువతి తల్లిదండ్రులు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో.. గర్భిణిని, ఆమె రెండేళ్ల కుమారుడికి గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేయించి వారిద్దరి ఆరోగ్యంతోపాటు గర్భంలో ఉన్న పిండం పరిస్థితిపై నివేదిక సమర్పించాలంటూ మహిళా శిశుసంక్షేమ శాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తమ కుమార్తెను కాపాడాలని మియాపూర్ పోలీసులకు తాము ఇచ్చిన వినతిపత్రంపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ తెలంగాణ హైకోర్టులో గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు, ఆయన భార్య వాసవి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ టి.వినోద్‌కుమార్... వాస్తవ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక సమర్పించాలని హైకోర్టు న్యాయసేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ మేరకు యువతి ఇంటికి వెళ్లి సంస్థ కార్యదర్శి పరిశీలించారు. ఆమె 8 నెలల గర్భిణి అని, బలహీనంగా ఉందని, నరాల సమస్య, రక్తహీనతతో బాధపడుతున్నట్లు కోర్టుకు నివేదిక సమర్పించారు. ఆమె రెండేళ్ల కుమారుడు కూడా బలహీనంగా ఉన్నాడని పేర్కొన్నారు. యువతికి సంబంధించిన వైద్య పరీక్షల నివేదికలను ఆమె భర్త అందించారని, ఆమెకు తగిన వైద్యచికిత్స చేయిస్తున్నామని, కోర్టుకు వివరాలు సమర్పిస్తామని చెప్పారని నివేదికలో వివరించారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తి... తల్లి గర్భంలోని పిండానికీ జీవించే హక్కు ఉందని పేర్కొన్నారు. యువతికి, ఆమె కుమారుడికి తగిన వైద్యం అందించి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు. తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఆమె వివాహం చేసుకున్నందువల్ల కక్షసాధింపు అవకాశాలున్న నేపథ్యంలో ఆసుపత్రిలో తగిన రక్షణ కల్పించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వారిని చూడటానికి యువతి భర్తను మినహా ఇతరులెవర్నీ అనుమతించరాదని స్పష్టం చేశారు.





పేలుడు ధాటికి ధ్వంసమైన కర్మాగారంలోని పరికరాలు ★ మృతుడు నరేశ్

బాంబుల ముడిసరకు తయారీ పరిశ్రమలో భారీ పేలుడు

- కార్మికుడి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల్లో మరో ఇద్దరు!

మోటకొండూరు, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసరకును ఈ పరిశ్రమలో తయారీ చేస్తారు. ఘటన సమయంలో భవనంలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కల్వాల నరేశ్(30)ను హైదరాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన బి.శ్రీకాంత్, పెద్దకందుకూరుకు చెందిన ఎస్.మహేందర్, వలిగొండ మండలం పులిగిల్లకు చెందిన బి.లింగస్వామి, మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన ఆర్.శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలు కాగా.. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన జి.సందీప్, మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన సీహెచ్.దేవీచరణ్ శిథిలాల్లో చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఘటనలో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్ కుమార్ పరిశీలించారు.

కొత్త విత్తన చట్టం రూపకల్పనకు కృషి

- భూ భారతిపై అవగాహన సదస్సులు
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టడానికి కొత్త విత్తన చట్టం రూపకల్పనకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ నిర్ణయించింది. మంగళవారం కమిషన్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఛైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షత వహించగా సభ్యులు గడుగు గంగాధర్, కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, రాములునాయక్, భూమి సునీల్, వెంకన్నయాదవ్‌లు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు, సమావేశాలు విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు. రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం అవసరమని ఇప్పటికే ప్రభుత్వానికి సిఫార్సు చేశామని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దీనిపై సమావేశం నిర్వహించామని కోదండరెడ్డి తెలిపారు. భూ భారతిపై ఊరూరా రైతులను జాగృతం చేసేందుకు సదస్సులు, సమావేశాలు జరుపుతామని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బంది నిరసనలు

మూడు నెలల జీతాలు అందించాలని కలెక్టర్లకు వినతిపత్రాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ ఉద్యోగులు మూడు నెలల వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం నిరసనలు తెలిపారు. ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లు, జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయాల వద్దకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల వేతనాలు ఇప్పటి వరకు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉపాధి పనులు నిలిపివేసి హైదరాబాద్‌లో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

EENADU Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Door No. 5-13/2, Alugunoor Village, Thimmapur Mandal, Karimnagar District - 505 527, Telangana State. Editor: D N Prasad. Founder

అగ్రరాజ్య వైఫల్యం.. ఉగ్రవాదులకు ఆయుధం!

పహల్గాంలో ఉగ్రవాద దాడిలో పాల్గొన్న ముష్కరులు అమెరికా తయారీ ఎం4 కార్బైన్ తుపాకులనూ వాడినట్లు వెల్లడైంది. అమెరికా సైనికులు వాడే ఈ ఆయుధాలు ఉగ్రవాదుల చేతికి ఎలా వచ్చాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనికి వేళ్లన్నీ అఫ్గానిస్థాన్, తాలిబన్ వైపు చూపిస్తున్నాయి. దీనివెనుక అమెరికా ప్రణాళిక, వ్యూహరచన లోపం, నిర్లక్ష్యం ప్రస్ఫుటం.



శక్తిమంతమైన ఎం4లతో నెత్తుటేళ్లు పారిస్తున్న ముష్కరులు

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదులు, మిలిటెంట్లు, తిరుగుబాటు ముఠాలు.. రష్యా తయారీ ఏకే శ్రేణి తుపాకులను ఉపయోగిస్తుంటాయి. వాడటానికి సులువుగా ఉండటం, విశ్వసనీయత, చౌకలో లభ్యం వంటివి దీనికి కారణం. అమెరికన్ ఆయుధాల తీరు భిన్నం. వీటిని వాడటానికి మెరుగైన శిక్షణ అవసరం. ఈ ఆయుధాలకు సరైన నిర్వహణ కూడా ఉండాలి. అయితే రష్యన్ ఆయుధాలతో పోలిస్తే వీటి బరువు తక్కువ. కచ్చితత్వం ఎక్కువ. పహల్గాం దాడిలో ముష్కరులు ఎం4లతోపాటు ఏకే శ్రేణి తుపాకులనూ వాడారు.

ఏమిటీ తుపాకీ?

1960లలో ఎం16 రైఫిల్‌ను తన ప్రామాణిక ఆయుధంగా మార్చుకుంటూ అమెరికా సైన్యం నిర్ణయం తీసుకుంది. దీంతో అదే తుపాకీ ఆధారంగా సమర్థమైన కార్బైన్‌ను అభివృద్ధి చేయడానికి అగ్రరాజ్యం రెండు దశాబ్దాలు శ్రమించింది. ఈ క్రమంలో ఎం4 కార్బైన్‌ను రూపొందించింది.



ఎం4 బరువు 3.5 కిలోలు

ప్లాస్టిక్ మ్యాగజైన్, మడమ కలిగిన ఆధునిక ఏకే తుపాకీ కన్నా దీని బరువు తక్కువ. అనేక వేరియంట్లలో ఇది లభ్యం.

- ప్రామాణిక రైఫిల్ కన్నా కార్బైన్ తేలిగ్గా ఉంటుంది. దాని గొట్టం కూడా చిన్నగా ఉంటుంది. ఎక్కువ దూరం గస్తీ తిరిగే దళాలు దీన్ని సులువుగా మోసుకెళ్లవచ్చు. పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే ఆపరేషన్లలో వినియోగానికి ఈ ఆయుధం అనువుగా ఉంటుంది.

నిమిషానికి 950 తూటాలను పేల్చగలదు.

- 500-600 మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. అయితే గరిష్ఠంగా ఈ తూటా 3,600 మీటర్ల దూరం ప్రయాణించగలదు.
- ఎం4 తుపాకీలో పికాటినీ రెయిల్ వ్యవస్థ ఉంటుంది. దీనివల్ల ఈ ఆయుధానికి నైట్ విజన్ వ్యవస్థలు, లేజర్ గైడ్‌లు, గ్రెనేడ్ లాంచర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

అఫ్గాన్ చేతులెత్తేసిన ఫలితం..

2021లో అమెరికా బలగాలు వైదొలిగాక అఫ్గానిస్థాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు అమెరికా.. ఎంతో ఖర్చుపెట్టి అఫ్గాన్ సైన్యాన్ని ఏర్పాటు చేసింది. వారికి శిక్షణ ఇచ్చి, దాదాపు 10 లక్షల ఆయుధాలు, వాహనాలు, ఇతర సైనిక సాధన సంపత్తిని సమకూర్చింది. అమెరికా నిష్క్రమణ తర్వాత అఫ్గాన్ సేన తాలిబన్లతో తలపడలేకపోయింది. ఆ సైనికులు తాలిబన్లకు లొంగిపోవడమో, ఆయుధాలు వదిలేసి పారిపోవడమో జరిగింది. వీటిలో అమెరికా తయారీ ఎం4, ఎం16 వంటి తుపాకులతోపాటు దశాబ్దాలుగా అఫ్గాన్ వద్ద పోగుపడ్డ పాత ఆయుధాలు కూడా ఉన్నాయి. ఇవి తాలిబన్లు, ఉగ్రవాదుల చేతిలోపడకుండా అమెరికా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు.

- అఫ్గాన్ పునర్నిర్మాణ వ్యవహారాల ప్రత్యేక ఇన్‌స్పెక్టర్ జనరల్ 2023లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ దేశంలో 700 కోట్ల డాలర్లకుపైగా విలువైన అమెరికా సైనిక సాధనసంపత్తి ఉంది. ఇందులో 2.5 లక్షలకుపైగా రైఫిళ్లు, చీకట్లో వీక్షణకు ఉపయోగించే 18 వేల నైట్ విజన్ గాగుల్స్ ఉన్నాయి.
- ఐరాస నివేదిక ప్రకారం.. చేజిక్కించుకున్న అమెరికన్ ఆయుధాల్లో 20 శాతాన్ని వెంట ఉంచుకోవడానికి స్థానిక కమాండర్లకు తాలిబన్ అగ్రనాయకత్వం అనుమతించింది. మిగతావాటిని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించింది.
- తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్, ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఉజ్బెకిస్థాన్, ఈస్ట్రన్ తుర్కిస్థాన్ ఇస్లామిక్ మూవ్‌మెంట్, యెమెన్‌లోని అన్సారుల్లా మూవ్‌మెంట్ వంటి అల్‌ఖైదా అనుబంధ ముఠాలు వీటిని కొనుగోలు చేశాయి.

కొన్ని సందర్భాల్లో స్థానిక తాలిబన్ కమాండర్లు.. ఇతర ఉగ్రవాద ముఠాలకు వాటిని కానుకలుగా అందించారు.

పాక్‌కు ఇలా..?

పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ తోడ్పాటుతో ఉగ్రవాదులు బ్లాక్ మార్కెట్‌లో అమెరికన్ ఆయుధాలను కొనుగోలు చేసినట్లు భారత నిఘా సంస్థలు పేర్కొంటున్నాయి. అనంతరం వీటిని కశ్మీర్‌కు చేరవేసినట్లు వివరించాయి.



కశ్మీర్‌లో ఎం4 జాడలివీ..



- 2017లో పుల్వామాలో భద్రతా దళాలు.. జైషే మహ్మద్ ముష్కర ముఠా అధిపతి మసూద్ అజార్ మేనల్లుడు తల్హా రషీద్ మసూద్‌ను హతమార్చాయి. ఘటనా స్థలిలో తొలిసారిగా ఎం4 భద్రతా దళాల కంటపడింది.
- 2018లో అజార్‌కు చెందిన మరో మేనల్లుడు ఉస్మాన్ ఇబ్రహీంను భద్రతా దళాలు పుల్వామాలో మట్టుబెట్టాయి. అక్కడ ఎం4 రైఫిల్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.
- 2022 జులైలో జమ్మూకశ్మీర్‌లోని అవంతిపురా ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్ కమాండర్ కైజర్ కోకా, మరో ఉగ్రవాది హతమయ్యారు. అక్కడ ఒక ఎం4 లభ్యమైంది.
- 2023 డిసెంబరులో పూంచ్‌లో నలుగురు సైనికులను బలితీసుకున్న ఉగ్రవాద దాడికి పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ (పీఏఎఫ్ఎఫ్) బాధ్యత వహించింది. ఈ సందర్భంగా ఆ ముష్కర ముఠా.. సామాజిక మాధ్యమాల్లో ఎం4ను ప్రదర్శించింది.
- గత ఏడాది జూన్ 9న ఉగ్రవాదులు ఎం4 తుపాకులతో ఒక పర్యాటక బస్సుపై దాడి చేసి, 9 మందిని బలితీసుకున్నారు.
- జూన్ 26న దోడా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఎం4ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.
- జులై 8న కఠువాలో ఈ తుపాకీతో దాడిచేసి.. ఐదుగురు సైనికులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు.

\- ఈనాడు ప్రత్యేక విభాగం

ఆ పాక్ జాతీయుల్లో శౌర్యచక్ర గ్రహీత తల్లి



రాష్ట్రపతి నుంచి శౌర్యచక్ర స్వీకరిస్తున్న ముదాసిర్ తల్లిదండ్రులు (పాత చిత్రం)

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ నుంచి 60 మంది పాకిస్థానీయులను స్వదేశానికి తిప్పి పంపేందుకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఆ జాబితాలో శౌర్యచక్ర గ్రహీత తల్లి ఉన్నారని అధికారులు తెలిపారు. కానిస్టేబుల్ ముదాసిర్ అహ్మద్ షేక్ 2022లో ఉగ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం శౌర్యచక్ర పురస్కారాన్ని ప్రకటించింది. దానిని 2023లో ఆయన తల్లి షమీమా అఖ్తర్, తండ్రి మక్సూద్ కలిసి రాష్ట్రపతి నుంచి స్వీకరించారు. అయితే 'షమీమాది పాక్ ఆక్రమిత కశ్మీర్. అది మన భూభాగం. ఆమె అక్కడి నుంచి 20 ఏళ్ల వయసులోనే ఇక్కడకు వచ్చారు. 45 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నారు. పాకిస్థానీలను మాత్రమే బహిష్కరించాలని మోదీ, అమిత్ షాను కోరుతున్నా' అని ముదాసిర్ బంధువు మీడియా ఎదుట అభ్యర్థించారు. గతంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లెఫ్టినెంట్ గవర్నర్.. ముదాసిర్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 1990లలో మహమ్మద్ మక్సూద్‌ను షమీమా వివాహం చేసుకున్నారు. మక్సూద్ విశ్రాంత పోలీసు అధికారి. ముదాసిర్ జ్ఞాపకార్థం బారాముల్లాలోని ప్రధాన పట్టణ కూడలికి షహీద్ ముదాసిర్ చౌక్ అని పేరు కూడా పెట్టారు.

డిస్కౌంట్లు అడగొద్దు బ్రదర్స్..

- భారత్, పాక్, బంగ్లాదేశ్ వాసులను ఉద్దేశిస్తూ బోర్డు

ఇంటర్నెట్ డెస్క్: తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో ఉన్న ఓ దుకాణంలో పెట్టిన బోర్డు వివాదానికి దారి తీసింది. డిస్కౌంట్లు అడగొద్దంటూ భారత్, పాకిస్థాన్ వాసులను ఉద్దేశించి పెట్టిన ఈ బోర్డు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఆ దుకాణంపై పలువురు యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సోదరులారా.. దయచేసి డిస్కౌంట్లు అడగొద్దు' అని రాసి ఉన్న నోట్‌ను ఓ దుకాణం కౌంటర్ దగ్గర పెట్టారు. దీనిని ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఇస్తాంబుల్‌లో దక్షిణాసియా ప్రజలకు ప్రత్యేకంగా ఎలాంటి తగ్గింపులు లేవని రాసి ఉన్న నోట్‌ను గుర్తించానని ఆ వ్యక్తి పేర్కొన్నారు.

ఆ ఉగ్రవాది పాక్ మాజీ పారా కమాండో

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషీమ్ మూసా.. పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం అతడు కరడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తయ్యిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు పేర్కొన్నాయి. 'అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోంది' అని దర్యాప్తు బృందానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఉగ్రవాదులకు, పాక్ సైన్యానికి మధ్య ఉన్న సంబంధాలను ఇది తెలియజేస్తోందని పేర్కొన్నారు.

సంభల్‌లో ఆ బావి మసీదుకు వెలుపల ఉంది

- సుప్రీంకోర్టుకు స్పష్టంచేసిన ఉత్తర్‌ప్రదేశ్ సర్కారు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభల్‌లో మొగలుల కాలంలో నిర్మించిన జామా మసీదు ఎదుటనున్న వివాదగ్రస్తమైన బావి మసీదు స్థలంలో లేదని, అది పూర్తిగా మసీదుకు వెలుపల ఉందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తేల్చింది. మసీదుకు సమీపంలో ఒక పోలీసు చౌకీని దాటిన తరవాత ఈ బావి వస్తుందని, అది పూర్తిగా మసీదుకు వెలుపల ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టుకు తెలిపారు. జామా మసీదు నిర్వహణ కమిటీ దీనిపై రెండు వారాల్లో సమాధానాన్ని ఇవ్వాలని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం ఆదేశించింది. మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలీ ప్రస్తుతం జైలులో ఉన్నారు కాబట్టి ఆయన్ను సంప్రదించి మూడు వారాల్లో సమాధానమిస్తామని మసీదు కమిటీ న్యాయవాది హుజేఫా అహ్మది కోర్టుకు తెలిపారు. అయితే రెండు వారాల్లోనే సమాధానం దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.

దాడికి పాక్ సైబర్ మూకల విఫల యత్నం

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ మరింతగా రెచ్చిపోతోంది. ఓవైపు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంట నిరంతరాయంగా కాల్పులకు తెగబడుతున్న పాక్.. మరోవైపు భారత్ సైన్యానికి చెందిన డిజిటల్ వేదికలపై సైబర్ దాడులు చేయిస్తోంది. భారత సైన్యానికి చెందిన జాతీయ స్థాయి పోర్టల్స్‌ను హ్యాక్ చేయడం అసాధ్యమని గుర్తించిన పాక్ సైబర్ మూకలు సైన్యం సంక్షేమ సంస్థలు, విద్యా సంస్థలకు చెందిన వెబ్‌సైట్లపైకి తెగబడుతున్నారు. 'ఇంటర్నెట్ ఆఫ్ ఖిలాఫా' అనే పేరు కలిగిన హ్యాకింగ్ గ్రూపు ఈ సైబర్ దాడులను చేస్తోందని భారత సైనిక వర్గాలు గుర్తించాయి. ఆర్మీ పబ్లిక్ స్కూల్ శ్రీనగర్, ఆర్మీ పబ్లిక్ స్కూల్ రాణీఖేత్, ఆర్మీ వెల్ఫేర్ హౌసింగ్ ఆర్గనైజేషన్, భారత వైమానిక దళం ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ పోర్టల్‌లను ఈ గ్రూప్ హ్యాక్ చేసింది. అయితే భారతదేశపు లేయర్డ్ సైబర్ సెక్యూరిటీ ఆర్కిటెక్చర్ వెంటనే ఈ హ్యాకింగ్ వ్యవహారాలను గుర్తించి అడ్డుకుంది. నాలుగు వెబ్‌సైట్లలో ఉన్న సమాచారాన్ని మాయం చేసేందుకు, వాటి సేవలకు అంతరాయం కలిగించడానికి, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి పాక్ సైబర్ మూకలు విఫల యత్నం చేశాయి.

పాక్ మోసపూరిత దేశమని మళ్లీ స్పష్టమైంది

- ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రే చెప్పారు
- ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో భారత్ ప్రతినిధి యోజనా పటేల్

ఐరాస: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్‌లో హింసకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై భారత్ ఎండగట్టింది. ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో పహల్గాం ఉగ్రదాడిని లేవనెత్తి.. దాయాదిపై విరుచుకుపడింది. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో సోమవారం జరిగిన 'ఉగ్రవాద అనుబంధ నెట్‌వర్క్ బాధితుల' కార్యక్రమంలో ఐరాస భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధి యోజన పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పహల్గాం దాడి ఘటనను ప్రస్తావిస్తూ పాక్‌ను దుయ్యబట్టారు. "సీమాంతర ఉగ్రవాదానికి కొన్ని దశాబ్దాలుగా మేం బాధితులం. ఉగ్ర చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబాలతో పాటు సమాజంపై ఎలాంటి దీర్ఘకాల ప్రభావం ఉంటుందో మాకు తెలుసు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని, ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరిస్తున్నామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ చెప్పిన మాటలను యావత్ ప్రపంచం వింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా అంగీకరించినా.. ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాక్ ఎలాంటి మోసపూరిత దేశమో దీన్ని బట్టి మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. ఉగ్రవాదం అంశంలో ప్రపంచం ఇకపై కళ్లు మూసుకుని కూర్చోదు" అని ఆమె హెచ్చరించారు. భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి ఐరాసను పాక్ దుర్వినియోగం చేస్తోందని పటేల్ మండిపడ్డారు. పహల్గాంలో ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచ దేశాధినేతలు భారత్‌కు మద్దతు పలికాయని, ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం ఎన్నటికీ అంగీకరించబోదని అన్నారు.



యోజనా పటేల్

భారత్-పాక్ మధ్య చర్చలకు మద్దతిస్తాం: గుటెరస్

భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఫోన్లో విడివిడిగా మాట్లాడారు. మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత తగ్గింపు, చర్చలను తిరిగి ప్రారంభించడానికి దోహదపడే అన్ని రకాల చర్యలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుటెరస్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. "భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. ఎలాంటి సమస్యలైనా నిర్మాణాత్మక చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చు. అందుకోసం ఎలాంటి మద్దతు ఇవ్వడానికైనా ఐరాస సిద్ధంగా ఉంది" అని అందులో పేర్కొంది.

భారత్ నా ఇల్లు.. పాక్‌కు వెళ్లాలని లేదు

- యూపీ వ్యక్తి భార్య

బులంద్‌శహర్: దేశంలో నివసిస్తున్న పాకిస్థాన్ పౌరులు భారత్‌ను వదిలి వెళ్లేందుకు కేంద్రం విధించిన గడువు బుధవారంతో పూర్తి కానుంది. ఇప్పటికే వందల మంది పాకిస్థానీయులు దేశాన్ని వీడారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరు తప్ప మిగిలిన పాకిస్థాన్ పౌరులందరిని తిరిగి ఆ దేశానికి పంపించినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. మిగిలిన ఒక్కరి వివరాలు తెలుపలేదు. ఈ నేపథ్యంలో యూపీ వ్యక్తిని పెళ్లాడిన ఓ ఇస్లామాబాద్ మహిళ మరియం తాను భారత్‌ను వీడనని అంటోంది. ఆమెకు మూడేళ్ల క్రితమే బులంద్‌శహర్ జిల్లాలోని ఖుర్జాకు చెందిన అమీర్ అనే వ్యక్తితో వివాహమైంది. రెండు నెలల క్రితం నుంచి తాత్కాలిక వీసాతో ఆమె భారత్‌లో ఉంటున్నారు. "నేను ఇస్లామాబాద్ వాసిని. కానీ నాకు ఇక్కడి వ్యక్తితో వివాహం జరిగింది. నా దేశాన్ని వదిలిపెట్టి నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ఇది నా దేశం. నాకు తిరిగి వెళ్లిపోవాలని లేదు. నా భర్త ఎక్కడ నివసిస్తే అదే నా ఇల్లు. నేను ఇక్కడే ఆయనతో పాటు ఉండిపోవాలి అనుకుంటున్నాను" అని మరియం అభ్యర్థించారు. ఆమె ఇప్పటికే అధికారులకు దరఖాస్తులు సమర్పించారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. కాగా జిల్లాలో పాకిస్థాన్‌కు చెందిన నలుగురు మహిళలను వారి దేశానికి చేర్చామని, మరియం ఒక్కరు మాత్రమే మిగిలి ఉన్నారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. యూపీలో ఇంకా మిగిలి ఉన్న ఒక్క పాక్ జాతీయురాలు మరియమేనా? లేదా మరొకరు కూడా ఉన్నారా? అన్న విషయంపై స్పష్టత లేదు.

అయోధ్యకు అక్షయ తృతీయ ధగధగలు

అయోధ్య: అక్షయ తృతీయ పండుగ కోసం అయోధ్య రామాలయం అందంగా ముస్తాబవుతోంది. బుధవారం ఈ పర్వదినాన రామమందిరం సహా అయోధ్యలోని దాదాపు 5,000 ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రామ్‌లల్లాకు 56 రకాల వంటకాలు, సీజనల్ పండ్లను సమర్పిస్తారు. అయోధ్య రామాలయానికి భక్తులు పోటెత్తే అవకాశం ఉండటంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్ర తెలిపారు. అక్షయ తృతీయ నాడు బంగారం, వెండి కొనడం.. దానధర్మాలు చేయడం శుభప్రదంగా హిందువులు భావిస్తారు. రైతులు పొలాలు దున్నడం, నాట్లు వేయడం వంటి పనులను ప్రారంభిస్తారు. ఇదే సందర్భంగా అయోధ్యలోని హనుమాన్‌గఢీ ఆలయ ప్రధాన అర్చకుడు మహంత్ ప్రేమ్‌దాస్ 70 ఏళ్లలో తొలిసారిగా అయోధ్య బాలరాముడిని దర్శించుకోనున్నారు.

కెనడాలో ఆప్ నేత కుమార్తె అనుమానాస్పద మృతి

ఒట్టావా: కెనడాలో ఓ భారతీయ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అదృశ్యమైన మూడు రోజుల తర్వాత విగతజీవిగా కనిపించింది. మృతురాలిని పంజాబ్‌కు చెందిన వంశిక సైనీ (21)గా గుర్తించారు. ఆమె తండ్రి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) పార్టీ బ్లాక్ నేత దేవిందర్ సైనీ. వంశిక మృతిని కెనడాలోని భారత హైకమిషన్ సోమవారం నిర్ధారించింది. తన కుమార్తె మృతదేహాన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు సాయం చేయాలని దేవిందర్ కేంద్రాన్ని అభ్యర్థించారు. వంశిక రెండేళ్ల క్రితం పైచదువుల కోసం కెనడాకు వెళ్లారు. ఏప్రిల్ 25, శుక్రవారం రాత్రి అద్దె ఇంటిని వెతికేందుకు బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. 11.40 గంటల సమయంలో ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. మరుసటి రోజు జరిగిన పరీక్షకూ ఆమె గైర్హాజరయ్యారు. అక్కడి సన్నిహితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఆమె మృతదేహం ఓ బీచ్‌లో లభ్యమైంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు

సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తలు

- నిజనిర్ధారణ చేసిన పీటీఐ

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత అసత్య వార్తలను కట్టడి చేయాలన్న ఉద్దేశంతో కేంద్రం 16 పాకిస్థానీ యూట్యూబ్ ఛానళ్లపై నిషేధం విధించినా నకిలీ వార్తలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అసత్యాలు ప్రచారం అవుతున్నాయి. వీటిపై పీటీఐ నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెక్) బృందం కన్నేసి పది వీడియోలను నకిలీవని తేల్చింది. అవి...

✦ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని లీపా లోయలో రెండు భారత చెక్‌పోస్టులను పాక్ ఆర్మీ ధ్వంసం చేసిందని, పర్వతాల్లో పొగ కమ్ముకున్న ఓ ఫొటో వైరల్‌గా మారింది. అయితే, అది సైన్యానికి సంబంధించింది కాదని, ఉత్తర ఐర్లాండ్‌లోని కార్చిచ్చుదని తేల్చింది.

✦ పాకిస్థానీయులతో మాట్లాడటానికి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్మీ అధికారులతో ఓ జర్నలిస్టు వాగ్వాదానికి దిగాడని పేర్కొంటూ ఓ వీడియో వైరల్‌గా మారింది. ఇది నకిలీదని.. అది ఈ ఏడాది మార్చిలో పంజాబ్ డీజీపీ ప్రెస్ మీట్‌కు సంబంధించిన వీడియో అని తేల్చింది.

✦ నియంత్రణ రేఖ వెంట పాక్ మిలిటరీ పోస్టులకు భారీ నష్టం సంభవించిందని పేర్కొంటూ.. దాడుల దృశ్యాలున్న వీడియో వైరల్‌గా మారింది. అది మే 2023లో పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ పార్టీ మద్దతుదారులు భద్రతా బలగాలతో ఘర్షణకు దిగినదని తెలిపింది.

✦ సరిహద్దు వైపున ఉన్న భారత ఆర్మీ పోస్టుపై పాకిస్థాన్ సైన్యం దాడి చేసిందని తెలుపుతూ...ఓ పర్వతంపై పేలుడు సంభవించినట్లు ఓ వీడియోను పోస్టు చేశారు. ఇది కూడా అవాస్తవమని, నిజానికది 2020 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని, దానికి సైన్యంపై దాడులకు సంబంధం లేదని పీటీఐ తేల్చింది.

✦ పాక్‌కు అండగా నిలుస్తున్న చైనా.. భారత్‌కు వచ్చే నదులను అడ్డుకుంటుందనే ఓ వాదనా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. అయితే, ఈ వార్తల్లో వాస్తవం లేదని తెలిసింది.

✦ పీవోకేలో ఓ భవనంపై భారత్ క్షిపణి దాడి చేసిందని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో వ్యాప్తి జరుగుతోంది. వాస్తవానికి అది 2024లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి ఫుటేజీ అని తేలింది.

✦ పౌరుల ఇళ్లను భారత సైన్యం లక్ష్యంగా చేసుకొని కూల్చివేస్తోందనే వార్తలు కూడా అవాస్తవం. పాక్ ఉగ్రవాదుల మద్దతుగా స్థానికంగా ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్న వారి నివాసాలనే కూల్చేస్తున్నారని పీటీఐ ఫ్యాక్ట్‌చెక్ విభాగం పేర్కొంది.

✦ భారత పౌరులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సర్జికల్ దాడులు చేసిందని పేర్కొంటూ ఓ వీడియో విస్తృతంగా వ్యాప్తి అవుతోంది. నిజానికి అది 25 ఏప్రిల్ 2025న మధ్యప్రదేశ్‌లో ప్రమాదవశాత్తు ఐఏఎఫ్ విమానం నుంచి పేలని వస్తువు జారిపోయింది. దాంతో ఓ ఇల్లు ధ్వంసం అయినప్పటికీ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు కూడా ధ్రువీకరించారు.



పహల్గాం దాడి నేపథ్యంలో అటారీ సరిహద్దును మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో.. స్వదేశానికి వెళ్లేందుకు మంగళవారం అమృత్‌సర్‌లోని ఆ సరిహద్దుకు ఓ పాకిస్థానీ మహిళ తన కుమారుడితో వచ్చారు. కుమారుడు భారతీయుడు అయినందున అతడిని పాక్‌కు తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతించలేదు. దీంతో ఆమె ఇలా కుమారుడిని పట్టుకుని

బేతాబ్ వ్యాలీలోనూ ఉగ్రవాదుల సంచారం?

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాంలోని బైసరన్ లోయలో దాడికి కొన్నాళ్ల ముందు నుంచీ ఉగ్రవాదులు పర్యాటక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించారన్న అనుమానాలు బలపడుతున్నాయి. తాజాగా బేతాబ్ లోయలో మలయాళ పర్యాటకులు తమ కుమార్తె కోసం చిత్రీకరించిన వీడియోలో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. పుణెలో స్థిరపడిన మలయాళీ సామాజిక ఉద్యమకారుడు శ్రీజిత్ రమేశన్ ఇటీవల కుటుంబంతో కలిసి జమ్మూ కశ్మీర్‌లో పర్యటించారు. ఏప్రిల్ 18న తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆయన బేతాబ్ లోయకు వెళ్లారు. ఇది పహల్గాంకు దాదాపు 7.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ పిల్లలను వీడియో తీశారు. అనంతరం ఆ కుటుంబం శ్రీనగర్, గుల్మార్గ్‌లో పర్యటించి తిరుగు ప్రయాణమైంది. ఈ నెల 22వ తేదీన బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో.. రమేశన్ బంధువులు, మిత్రులు ఆయనకు ఫోన్ చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అదే సమయంలో నిందితుల ఊహా చిత్రాలు విడుదల కావడంతో రమేశన్‌కు అనుమానం వచ్చి తమ పర్యటనలో చిత్రీకరించిన వీడియోలను పరిశీలించారు. బేతాబ్ లోయలో షూట్ చేసిన రీల్‌లో ఇద్దరు వ్యక్తులు.. ఊహా చిత్రాల్లోని వారిని పోలి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రమేశన్.. జాతీయ దర్యాప్తు సంస్థను (ఎన్ఐఏ) సంప్రదించి ఆ వీడియో క్లిప్ అందజేశారు. అయితే దీనికి ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించి.. ఉగ్రవాదులు వీరూ ఒకరేనని తేల్చాల్సి ఉంది.

ఎన్‌కౌంటర్‌లో దొరికిన ఫోన్‌లో మూసా ఫొటో

ఇంటర్నెట్‌డెస్క్: కొన్ని నెలల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఓ ఉగ్రవాది వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న ఫోన్ నుంచి పహల్గాం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మూసా ఫొటో బయటకు వచ్చింది. బైసరన్ లోయ ఉగ్రదాడిలో పాల్గొన్న విదేశీ ముష్కరులు జమ్మూకశ్మీర్‌లోకి చాలాకాలం క్రితమే ప్రవేశించినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. ఏడాదిన్నర క్రితమే ఒక ఉగ్ర బృందం సాంబా-కథువాల మధ్య సరిహద్దు కంచెను కత్తిరించింది. ఆ బృందంలో పహల్గాం దాడిలో పాల్గొన్న అలీభాయ్ అలియాస్ తాలా, హషీమ్ మూసా అలియాస్ సులేమానీ ఉన్నట్లు తెలుస్తోంది. ముష్కరులు పాల్గొన్న ఇతర దాడులపై దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో చొరబాటు అంశం బయటకు వచ్చింది. బైసరన్ దాడిలో ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సీసీ కెమెరా దృశ్యాలు, స్థానిక గైడ్లు, పర్యాటకుల నుంచి సేకరించిన సమాచారంతో ఉగ్రవాదులను తాజాగా గుర్తించారు. కశ్మీర్ లోయలో చురుగ్గా ఉన్న ఉగ్రవాదుల ఫొటోలను వారికి చూపగా మూసాను గుర్తించారు. ఎదురుకాల్పుల ఘటనలో స్థానిక ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను మట్టుబెట్టిన భద్రతా దళాలు అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. దానిలో మూసా గుర్తింపునకు వాడిన ఫొటో భద్రతా దళాలకు దొరికింది. ... దృశ్యాల్లో కూడా మూసా ఉన్నాడు. జునైద్ నుంచి స్వాధీనం చేసుకొన్న ఫోన్‌లో ఇతర ఉగ్రవాదుల చిత్రాలు కూడా ఉన్నాయి. అలీభాయ్ ఫొటో దళాలకు లభించింది.

తప్పించుకోవడానికి వీల్లేకుండా ఉగ్రదాడి: ప్రత్యక్ష సాక్షులు

పహల్గాంలోని బైసరన్ లోయలో సందర్శకులు తప్పించుకొనే మార్గం లేకుండా చేసి ఉగ్రమూక దాడికి పాల్పడిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రవేశం, తిరిగి వెళ్లే మార్గాల్లో ఉగ్రవాదులు ఉన్నారని వారు వెల్లడించారు. ఈ విషయాన్ని దర్యాప్తు సంస్థలకు బాధితులు తెలియజేశారు. ఈ దాడి సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు ఎంట్రీ గేటు నుంచి లోపలికి ప్రవేశించగా.. ఒకడు ఎగ్జిట్ గేటు వద్ద కాపలా ఉన్నాడు. ఈ దాడిలో తొలిసారి కాల్పులు మొదలైంది ఎగ్జిట్ గేటు వద్దే. దీంతో సందర్శకులు ప్రాణభయంతో ఎంట్రీ గేటు వైపు పారిపోయారు. అక్కడ ఉగ్రవాదులు వారిపై దాడి చేశారు. మరో ఉగ్రవాది తన సహచరులకు రక్షణ కల్పించేలా సమీపంలోని అడవిలో దాక్కొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. వీరిలో ఇద్దరు సైనిక దుస్తులు ధరించగా..

అణ్వాయుధాలున్న పాక్‌పై ఎవరూ దాడి చేయలేరు

- మరియం నవాజ్ వ్యాఖ్య



లాహోర్: భారత్-పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె మరియం నవాజ్ తెలిపారు. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన దేశం కనుక ఇతరులు దాడి చేయడం అంత సులువు కాదని ఆమె అభిప్రాయపడ్డారు. లాహోర్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో మరియం ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. "సార్వభౌమాధికారం కాపాడుకోగల సత్తా పాకిస్థాన్‌కు ఉంది. అల్లా దయ వల్ల పాకిస్థాన్ సైన్యానికి ఆ బలం సమకూరింది. మన మధ్య రాజకీయ భేదాభిప్రాయాలు ఎన్ని ఉన్నా దేశ రక్షణ కోసం ఉక్కు గోడ మాదిరిగా సైన్యం వెనుక దృఢంగా నిలబడాలి. అణ్వాయుధ దేశం కనుక మనపై దాడికి ఎవరూ సాహసించలేరు' అని మరియం నవాజ్ పేర్కొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు నిరసనగా నేడు లైట్లు స్విచ్ఛాఫ్ చేయండి

- ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు

దిల్లీ: వక్ఫ్ చట్టంలో సవరణలకు నిరసనగా బుధవారం రాత్రి 9.00 నుంచి 9.15 గంటల మధ్య ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో లైట్లు స్విచ్ఛాఫ్ చేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు దేశ ప్రజలను కోరింది. వక్ఫ్ చట్టానికి రాజ్యాంగ విరుద్ధంగా వివక్షతో చేసిన సవరణలపై తాము ఏప్రిల్ 10 నుంచి దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించినట్లు బోర్డు అధికార ప్రతినిధి ఎస్.క్యూ.ఆర్.ఇలియాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధితులకు సంఘీభావంగా మధ్యలో మూడు రోజులపాటు ఉద్యమానికి విరామం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి, అణచివేతకు నిరసనగా బుధవారం కేవలం 15 నిమిషాలసేపు లైట్లు ఆర్పివేసి ప్రజలు తమకు



ఓలో ఓలో.. ఓలమ్మో!

మన కళ్లు సుమారు కోటి రంగుల ఛాయలను చూడగలవు! అలాంటిది మనమెన్నడూ చూడని ఒక రంగు ఉందంటేనే ఆశ్చర్యం కలుగుతుంది. పైగా మామూలు కంటికి కనిపించని దాన్ని 'చూడటం', 'అనుభవించటం' మరింత ఆశ్చర్యకరం కదా. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు దాన్నే సుసాధ్యం చేశారు. ఓలో అనే ఈ రంగును గుర్తించటమే కాకుండా, దాన్ని చూడగలిగేలా చేసి ఔరా అనిపించారు. ఈ రంగు ముదురు నీలం, ఆకుపచ్చ మిశ్రమ ఛాయ (టీల్)లో కనిపిస్తుందని చూసినవారు చెబుతున్నారు. ముందెన్నడూ తాము దీన్ని చూడలేదనీ అబ్బురపడుతున్నారు.

ఊదా (వయలెట్), ముదురు నీలం (ఇండిగో), నీలం (బ్లూ), ఆకుపచ్చ (గ్రీన్), పసుపుపచ్చ (ఎల్లో), నారింజ (ఆరెంజ్), ఎరుపు (రెడ్). మనకు తెలిసిన సప్త వర్ణాలు ఇవే. సమస్త ప్రపంచమూ ఈ రంగులు, వీటితో ముడిపడిన ఛాయలతోనే మనకు కనిపిస్తుంటుంది. అన్ని రంగులనూ చూడగలమనే భావిస్తుంటాం. కానీ ఇకపై ఈ అభిప్రాయాన్ని మార్చుకోవాలేమో. ఇటీవలే శాస్త్రవేత్తలు మామూలు కంటికి కనిపించని ఓ కొత్త రంగును గుర్తించారు మరి. దీని పేరు ఓలో. ఇప్పటివరకూ దీన్ని ఐదుగురు మాత్రమే చూశారు. అదీ లేజర్ టెక్నాలజీ సాయంతో. ఇంతకీ ఇదెలా ఉంటుంది? ఎలా ఉపయోగపడుతుంది? అసలు మనం రంగులను ఎలా చూస్తాం?

ప్రత్యేక పద్ధతి సాయంతో

కంటికి కనిపించని రంగును ఎలా చూశారబ్బా? ఇలాంటి సందేహం కలగటంలో ఆశ్చర్యమేమీ లేదు. శాస్త్రవేత్తలు కూడా దీన్ని మామూలుగా ఏమీ గుర్తించలేదు. ఆజ్ అనే ప్రత్యేక పద్ధతి సాయంతో చూసేలా చేయటంలో విజయం సాధించారు. ఒకప్పటి పిల్లల ఆంగ్ల నవల వండర్‌ఫుల్ విజార్డ్ ఆఫ్ ఆజ్ నవల స్ఫూర్తితోనే ఈ పద్ధతికి ఆ పేరు పెట్టారు. ఆ నవలలో ఆజ్ అనే కాల్పనిక ప్రదేశంలో ఒకతను తాను మంత్రగాడినని నమ్మించటానికి ప్రజలను మాయోపాయాలతో బురిడీ కొట్టిస్తుంటాడు. ఆజ్‌కు రాజధానిగా భావించే ఎమరాల్డ్ పట్టణం చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. రంగురంగులతో శోభిల్లుతుంటుంది. వాటిని కళ్లు తట్టుకోవాలంటే ప్రత్యేకమైన కళ్లద్దాలు ధరించాలి. మంత్రగాడి ఉపాయాల్లో ఈ కళ్లద్దాలూ ఒకటి. ఇవి ఆ పట్టణం పచ్చగా, అద్భుతంగా కనిపించేలా చేస్తాయి. మన కంటిని 'బురిడీ' కొట్టించి, ఓలో రంగును చూసేలా చేస్తుంది కాబట్టే ఈ పద్ధతికి ఆజ్ అని పేరు పెట్టారన్నమాట.

మనకు రంగులెలా కనిపిస్తాయి?

మన కంట్లోని రెటీనాలో రంగులను గుర్తించే ప్రత్యేకమైన కోన్ కణాలుంటాయి. వీటి మీద కాంతి పడినప్పుడు మన కళ్లు రంగుల ఛాయలను పసిగడతాయి. ఈ కోన్లలో ఎస్, ఎల్, ఎం అని మూడు రకాలున్నాయి. ఎస్ కోన్లు పొట్టి కాంతి తరంగదైర్ఘ్యాలను గ్రహిస్తాయి. నీలి రంగు కనిపించటానికి కారణం ఇవే. ఎమ్ కోన్లు మధ్యమ స్థాయి కాంతి తరంగదైర్ఘ్యాలను పసిగడతాయి. ఆకుపచ్చ రంగును చూపిస్తాయి. ఎల్ కోన్లు పొడవైన కాంతి తరంగదైర్ఘ్యాలతో ప్రేరేపితమవుతాయి. ఇవి ఎరుపు రంగును పసిగడతాయి. వీటి నుంచి వచ్చే సంకేతాలు రెటీనాలోని సంక్లిష్ట కణాల గుండా ప్రయాణించే క్రమంలో సమ్మిళితమవుతాయి. అనంతరం దృశ్యనాడి ద్వారా మెదడుకు చేరుకుంటాయి. వాటిని మెదడులోని విజువల్ కార్టెక్స్ విశ్లేషించి, ఆయా రంగులు కనిపించేలా చేస్తుంది. మనం రంగులను చూడటం వెనక ఇంత తతంగం నడుస్తుందన్నమాట.

ఎలా కనుగొన్నారు?

సాధారణంగా ఎమ్ కోన్లు వాటి చుట్టుపక్కల ఎస్, ఎల్ కోన్ల మీద విస్తరించి (ఓవర్‌ల్యాప్) ఉంటాయి. అందువల్ల ఎమ్ కోన్లను ప్రేరేపించే ఏ కాంతి అయినా ఎస్, ఎల్ కోన్లనూ ఉత్తేజితం చేస్తాయి. ఎమ్ కోన్లు ఒంటరిగా పనిచేయవు. ఒక్క ఎమ్ కోన్లనే ప్రేరేపించే తరంగదైర్ఘ్యమేదీ ప్రపంచంలో లేదు. కేవలం వీటినే ప్రేరేపితం చేస్తే ఏమవుతుంది? మనమెన్నడూ చూడని అత్యంత గాఢమైన ఆకుపచ్చ రంగు కనిపిస్తుందా? దీన్ని గుర్తించటానికే పరిశోధకులు ఆజ్ పద్ధతిని వాడుకున్నారు. రెటీనాలోకి చూడటానికి తోడ్పడే దీన్ని ఒక మైక్రోస్కోప్ అనుకోవచ్చు. ఇది సూక్ష్మ మోతాదుల్లో లేజర్ కాంతిని ఉపయోగించుకొని, కంట్లో ఆయా కాంతి గ్రాహకాలను లక్ష్యంగా చేసుకుంటుంది. కంటి జబ్బుల అధ్యయనాల కోసం ఇప్పటికే దీన్ని వాడుకుంటున్నారు. తాజాగా కొత్త రంగును గుర్తించేందుకు ఉపయోగించుకున్నారు. దీని సాయంతో రెటీనాలో ఎమ్ కోన్ల మీదే లేజర్ కాంతి పడేలా చేయగలిగారు. అప్పుడు వీటి నుంచి వచ్చే సంకేతాలను మెదడు గ్రహించి మొత్తం రంగు తీరు కనిపించేలా చేసింది. దీని ఫలితంగానే కొత్త రంగు ప్రత్యక్షమైంది.

కొత్త రంగు ఎలా ఉంటుంది?

ఓలో రంగు ఇలా ఉంటుందేమో?

ఇప్పటివరకూ ఐదుగురు మాత్రమే కొత్త ఓలో రంగును చూశారు. అది టీల్ లేదా నీలం, ఆకుపచ్చ మిశ్రమ ఛాయలో కనిపిస్తోందని వీళ్లు వర్ణించారు. అయితే దాన్ని తాము ఇంతకు ముందెన్నడూ చూడలేదని చెప్పటం గమనార్హం. ఇది అతి చిత్రంగా ఉందని.. బాగా నీలం-ఆకుపచ్చ రంగులో ఉన్నదాన్ని చూస్తే ఎలా కనిపిస్తుందో అలా ఉంటుందని మరొకరు చెప్పారు. అయితే ఈ రంగును మాటల్లో వర్ణించేలా చేయటానికి శాస్త్రవేత్తలు చాలానే కష్టపడ్డారు. ఓలో రంగు టీల్ రంగుకు అతి దగ్గరగా ఉంటుందని, అయితే ఓలో ఛాయ మామూలు కంటికి కనిపించదని పరిశోధకులు చెబుతున్నారు. దీన్ని పెయింట్, పిక్సెల్స్, లేదా కాంతి రూపంలోకి మార్చటం సాధ్యం కాదంటు న్నారు. ఇప్పుడప్పుడే స్మార్ట్‌ఫోన్లు, టీవీల డిస్‌ప్లేలో చూడటమూ సాధ్యం కాదు. వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్ పరిజ్ఞానానికి చేరుకోవటానికి ఇంకా చాలా సమయం పట్టొచ్చని పరిశోధకులు వివరిస్తున్నారు.

వర్ణ అంధత్వం గలవారికి ఉపయోగపడుతుందా?

ఆజ్ టెక్నాలజీ వర్ణ అంధత్వం గలవారికి ఉపయోగపడుతుందో లేదో తెలుసుకోవటానికి శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఇది ఆయా వ్యక్తుల్లో సమస్యకు కారణమవుతున్న అంశాన్ని బట్టి ఉంటుంది. వర్ణ అంధత్వంలో ఆకుపచ్చ రంగు గ్రాహకత్వం తగ్గటం (డ్యూటెరానమలీ) ఎక్కువ. ఇలాంటివారికి ఆజ్ పద్ధతితో నేరుగా కోన్లను ప్రేరేపించగలిగితే సరైన రంగు కనిపించగలదని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే ఈ పద్ధతిని సూక్ష్మస్థాయిలో తీర్చిదిద్ది, వాడుకునేలా చేయటానికి చాలా కృషి జరగాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. సరైన కోన్లను లేజర్ కాంతి స్థిరంగా తాకేలా చేస్తేనే కోన్లు ప్రేరేపితమవుతాయని, కాబట్టి చూపును సరిచేయటం సాంకేతికంగా సాధ్యం కాకపోవచ్చని చెబుతున్నారు.

మనం రంగులను ఎలా 'చూస్తాం?'

ఇది అసమంజసమైన ప్రశ్నగా అనిపించొచ్చు గానీ లోతుగా పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతుంది. రంగుల భావనలో మూడు కీలకమైన అంశాలున్నాయి. ఒకటి- శారీరకం. అంటే తరంగదైర్ఘ్యాలు కంటికి చేరుకోవటం. రెండు- నాడీ సంబంధం. అంటే రంగు ఛాయలను మనుషుల మెదడు విడమరచుకోవటం. మూడు- సామాజిక లేదా భాష. అంటే ఆయా రంగులకు పేరు పెట్టటం. మనం ఎరుపు అని పిలుచుకునే రంగును మరొకరు కుంకుమ రంగని అనుకోవచ్చు. వేరొకరు కెంపు లేదా రక్తవర్ణంలో కనిపిస్తుందని చెప్పొచ్చు. మనకు రంగులెలా కనిపిస్తున్నాయో తెలుసుకోవటానికి న్యూరోసైన్స్, ఏఐ పరిశోధకులు పాట్రిక్ మినీయల్ట్ ఓ వినోదాత్మక వెబ్‌సైట్‌ను (https://ismy.blue/) రూపొందించారు. ఇతరులతో పోలిస్తే రంగులు మనకు ఎలా కనిపిస్తున్నాయో పరీక్షించుకోవటానికిది తోడ్పడుతుంది. కావాలంటే మీరూ ప్రయత్నించొచ్చు.

- కాంతి ఉష్ణోగ్రతల తేడాల మూలంగానూ మనం రంగుల తీరును భావిస్తుంటాం. సామాజిక మాధ్యమాల్లో 2015లో వైరల్ అయిన ఒక ఫొటో దుస్తులే దీనికి నిదర్శనం. అవి తెలుపు, బంగారం రంగులో ఉన్నాయని కొందరు భావిస్తే.. నీలం, నలుపుల్లో ఉన్నాయని మరికొందరు వాదించారు. ఆయా కాంతుల్లో తీసిన చిత్రాలు ఎలా ఉంటాయోననే గత భావనలను బట్టి ఈ దుస్తుల రంగులను ఊహించటం ఇందుకు కారణం కావొచ్చన్నది శాస్త్రవేత్తల భావన.

నిజంగా కొత్త రంగేనా?

నిజానికి ఓలో పూర్తిగా కొత్త రంగేమీ కాదు. దీని ఛాయ నిరంతరం ఉంటూనే వస్తోంది. కాకపోతే మన కంటికి కనిపించే ఛాయలకు ఆవల ఉంటుంది. మనకు కనిపించని ఇలాంటి వర్ణచ్ఛాయలు ఇంకా చాలానే ఉన్నాయి కూడా. అందువల్ల శాస్త్రీయ, భౌతిక కోణంలోంచి చూస్తే ఓలోను పూర్తిగా కొత్త రంగని చెప్పలేం. అయితే సామాజిక, భాషా కోణంలోంచి చూస్తే కొత్తదనే చెప్పుకోవచ్చు. ఇంతకు ముందు చూడని రంగులను మనం కొత్త పేరుతో పిలుచుకుంటాం కదా. మొత్తమ్మీద దాన్ని మనమెలా చూస్తున్నామనే దాని మీద కొత్తదా? కాదా? అనేది ఆధారపడి ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు.

మోటరోలా ఎడ్జ్ 60 ప్రొ మనదేశానికీ వచ్చేసింది



ఇటీవల కొన్ని దేశాల్లో ఆవిష్కృతమైన మోటరోలా ఎడ్జ్ 60 ప్రొ స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు మనదేశంలోనూ అడుగు పెట్టింది. నేటి నుంచే ప్రి ఆర్డర్ చేసుకోవటానికి అందుబాటులోకి వచ్చింది. పాంటోన్ డాజ్లింగ్ బ్లూ, పాంటోన్ షాడో, పాంటోన్ స్పార్క్లింగ్ గ్రేప్ రంగుల్లో లభించే దీని ప్రత్యేకతలు ఇవీ..

- 6.67 అంగుళాల 1.5కె 10 బిట్ పీఓఎల్ఈడీ తెర, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 4,500 నిట్స్ వరకూ గరిష్ఠ ప్రకాశం, 720హెచ్‌జెడ్ పీడబ్ల్యూఎం డిమ్మింగ్/డీసీ డిమ్మింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణ.
- ఆండ్రాయిడ్ 15 ఆధారిత హెలో యూఐ.
- మీడియాటెక్ డైమెన్సిటీ 8350 ఎక్స్‌ట్రీమ్ ఎస్ఓసీ ప్రాసెసర్, 6000ఎంఏహెచ్ బ్యాటరీ, 90డబ్ల్యూ టర్బోపవర్ ఫాస్ట్ ఛార్జింగ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్.
- 12జీబీ ర్యామ్, 312జీబీ స్టోరేజ్
- వెనకాల రెండు 50 మెగాపిక్సెల్, ఒక 10 మెగాపిక్సెల్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ.
- ముందు 50 మెగాపిక్సెల్ కెమెరా.. నీరు, దుమ్ము తట్టుకునే ఐపీ68, ఐసీ69 రేటింగ్, మిలిటరీ గ్రేడ్ దృఢత్వం.

రియల్‌మీ మధ్యశ్రేణి ఫోన్



రియల్‌మీ సంస్థ మనదేశంలో 14టీ 5జీ పేరుతో మధ్యశ్రేణి స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. ఆక్టా-కోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్‌తో కూడిన ఇది ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. 6.67 అంగుళాల తెర, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 8జీబీ ర్యామ్, 6,000ఎంఏహెచ్ బ్యాటరీ, 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, వెనకాల 50 మెగాపిక్సెల్, 2 మెగాపిక్సెల్ సామర్థ్యం గల రెండు కెమెరాల వ్యవస్థ, ముందుభాగాన సెల్ఫీల కోసం 2.4 మెగాపిక్సెల్ కెమెరా వంటి ఫీచర్లతో అలరిస్తోంది. 128 జీబీ, 256జీబీ అంతర్గత స్టోరేజీతో సాటిన్ ఇంక్, సిల్కెన్ గ్రీన్, వయొలెట్ గ్రేస్ రంగుల్లో లభిస్తుంది. దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ69 రేటింగ్ కలిగుంది. ప్రారంభ ధర రూ.17,999.

హెచ్‌పీ నుంచి ఏఐ పీసీలు



పెద్ద సంస్థలు, అంకుర సంస్థలు, ఇతరుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని హెచ్‌పీ సంస్థ మనదేశంలో కొత్త ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లను విడుదల చేసింది. హెచ్‌పీ ఎలైట్‌బుక్, హెచ్‌పీ ప్రొబుక్, హెచ్‌పీ ఓమ్నిబుక్ పేరుతో వీటిని తీసుకొచ్చింది. ఇంటెల్ కోర్ అల్ట్రా 200 వి సిరీస్, ఏఎండీ రైజెన్ ఏఐ 300 సిరీస్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఎక్స్, ఎక్స్ ఎలైట్, ఎక్స్ ప్లస్ ప్రాసెసర్లు గల ఇవి ప్రత్యేకమైన ఎన్‌పీయూలతో కూడుకొని ఉన్నాయి. ఇవి ప్రతి సెకండుకు 40 నుంచి 55 ట్రిలియన్ల ప్రక్రియలను నిర్వహించగలవు. కోపైలట్+ పీసీలు కావటం వల్ల మైక్రోసాఫ్ట్ ఏఐ అసిస్టెంట్ సేవలను మరింత ఎక్కువగా పొందొచ్చు. ఫలితంగా ఉత్పాదకత, సృజనాత్మకత, ఇతరులతో కలిసి పనిచేయటం మెరుగవుతాయి. ఎలైట్‌బుక్, ప్రొబుక్ మోడళ్లను వృత్తినిపుణులు, సంస్థల్లో పనిచేసేవారిని దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. క్రియేటర్లు, ఫ్రీలాన్సర్లు, రోజువారీ యూజర్లకు ఉపయోగపడేలా ఓమ్నిబుక్‌ను తీర్చిదిద్దారు. ఇవి రూ.77,200 నుంచి రూ.1,86,499 వరకూ ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

చాట్‌జీపీటీతో రంగుల కళ!

తాతయ్య, నానమ్మ, అమ్మమ్మ ఫొటోలను రంగుల్లోకి మార్చుకోవాలనుకుంటున్నారా? అయితే ఏఐ సాయం తీసుకోవచ్చు. ఇందుకోసం చాలా టూల్స్ అందుబాటులో ఉన్నప్పటికీ చాట్‌జీపీటీని వాడుకోవటం చాలా తేలిక. ఇది నలుపు, తెలుపు ఫొటోలను ఇట్టే రంగుల్లోకి మార్చేస్తుంది. కొత్తగా తోడైన ఇమేజ్ ఎడిటింగ్ సామర్థ్యాలతో జీబ్లీ ఇమేజ్‌లను సృష్టించటమే కాదు, మరెన్నో పనులను సులభంగా చేసేస్తోంది. ఒక్క సవివర ప్రాంప్ట్‌తోనే పోట్రెయిట్, వీధి దృశ్యాలు, ప్రకృతి అందాలను రంగుల్లోకి మార్చేస్తుంది.



ఎలా పనిచేస్తుంది?

నలుపు, తెలుపు ఫొటోలను అప్‌లోడ్ చేయటానికి, వాటిని రంగుల్లోకి మార్చటానికి కచ్చితమైన సూచనలను వర్తింపజేయటానికి చాట్‌జీపీటీలోని ఓపెన్‌ఏఐ ఇమేజ్ టూల్స్ వీలు కల్పిస్తున్నాయి. ఫిల్టర్లు, జనరిక్ యాప్‌ల మాదిరిగా కాకుండా చర్మం రంగు దగ్గరి నుంచి దుస్తులు, నేపథ్య దృశ్యాల వరకూ అన్నింటినీ ఇష్టమైన రంగుల్లోకి మార్చుకోవచ్చు. పాత ఫొటోను అప్‌లోడ్ చేయగానే అంతర్గత ఇమేజ్ ఎడిటింగ్ ఇంజిన్ ద్వారా ప్రాసెస్ చేస్తుంది. ఇచ్చిన సూచనలను కచ్చితంగా పాటిస్తుంది. ముఖ కవళికలు, సహజ కాంతిని కాపాడుతూ రంగుల్లోకి మారుస్తుంది. అయితే ప్రాంప్ట్‌ను ఇవ్వటంలోనే కిటుకు దాగుందని మరవరాదు. ఎంత వివరంగా ప్రాంప్ట్ అందిస్తే అంత అందంగా తీర్చిదిద్దుతుంది.



తొలి ఏఐ దేవత

గుడికి వెళ్తాం. విగ్రహానికి పూజలు చేస్తాం. మొక్కులు సమర్పిస్తాం. కోరికలను తీర్చమని వేడుకుంటాం. మరి ఆ దేవుడు మనతో మాట్లాడితే? ఆశీర్వదిస్తే? అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తే? భవిష్యత్తు ఎలా ఉండబోతోందో చెబితే? ఇది కలలో సాధ్యమేమో గానీ ఇలలో అసాధ్యమనే అంటారంతా. కానీ కృత్రిమ మేధ (ఏఐ) దీన్ని కూడా సాకారం చేస్తోంది. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా మలేసియాలో కొలువు దీరిన ఏఐ ఆధారిత మాజు దేవత గురించి తెలిస్తే నిజమేనని ఒప్పుకోవాల్సిందే. ప్రాచీన ఆధ్యాత్మిక ఆచారాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల కలబోతతో రూపుదిద్దుకున్న చైనా సముద్ర దేవత మాజు ప్రతిరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గుడి ఆవరణలో తెర మీద సంప్రదాయ చైనా దుస్తుల్లో ఆమె ప్రత్యక్షం కావటం అబ్బురపరుస్తోంది. భక్తులు దేవతతో మాట్లాడుతూ ఆశీర్వచనం తీసుకోవచ్చు. వ్యక్తిగత విషయాల గురించి అడగొచ్చు. భవిష్యత్తు ఎలా ఉండబోతోందో తెలుసుకోవచ్చు. అన్నింటికీ ఏఐ దేవత మృదువుగా జవాబులిస్తుంది. ధైర్యం చెబుతుంది. సలహాలు, సూచనలు అందజేస్తుంది. మలేసియా టెక్ కంపెనీ ఏఐమజిన్ ఈ దేవతను రూపొందించింది. న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ సాయంతో మాండరిన్, ఇతర భాషల్లో మాట్లాడేలా తీర్చిదిద్దింది. చారిత్రక గ్రంథాలు, జానపద కథలు, మత బోధనలతో ఏఐ దేవతకు శిక్షణ ఇచ్చారు. ఈ మాజు దేవతతో మాట్లాడినవారు చాలా సంతృప్తిని వ్యక్త పరుస్తుండటం గమనార్హం. ఏఐమజిన్ వ్యవస్థాపకుడు అనూహ్య భవిష్యత్తు గురించి అడగ్గా.. 'నువ్వు ఇంట్లో ఉంటే అనూహ్య భవిష్యత్తు విషయంలో అంతా మంచే జరుగుతుందని' దేవత సావధానంగా సలహా ఇచ్చింది. మరొకరు తనకు నిద్ర పట్టటం లేదని అడగితే 'పడుకునే ముందు కాస్త గోరువెచ్చటి నీరు తాగు బిడ్డా' అని సూచించింది. సామాజిక మాధ్యమాల్లో ఈ దేవత వీడియోలూ వైరల్ అవుతున్నాయి. ఎంతోమంది ప్రార్థన ఎమోజీలు, ఆశీర్వచన అభ్యర్థనలు, భక్తి పూర్వక భావనలతో

అంతరిక్షంలో విద్యుత్తు తయారీ

అంతరిక్షంలోనే విద్యుత్తు తయారుచేస్తే? అది నేరుగా అక్కడి నుంచే భూమికి సరఫరా అయితే? ఇదేదో కాల్పనిక కథలా అనిపిస్తున్నప్పటికీ జపాన్ ఇలాంటి ప్రయత్నానికే సిద్ధమైంది. సౌరశక్తితో అంతరిక్షంలో విద్యుత్తు తయారు చేయాలని సంకల్పించింది.

వినూత్నంగా ఆలోచించగలిగితే సాధ్యం కానిదంటూ ఏముంటుంది? జపాన్ శాస్త్రవేత్తల అంతరిక్ష విద్యుత్తు తయారీ విధానమే దీనికి చక్కటి నిదర్శనం. ఇంతకీ ఈ ప్రయోగం పేరేంటో తెలుసా? ఒహిసామా. అంటే జపాన్ భాషలో సూర్యుడని అర్థం. పేరుకు తగ్గట్టుగానే ఇది సౌరశక్తి సాయంతో విద్యుత్తును తయారుచేస్తుంది. ఒక చిన్న ఉపగ్రహం, సౌర ఫలకంతో దీన్ని సుసాధ్యం చేయనున్నారు. ఇందుకోసం త్వరలోనే 2 చదరపు మీటర్ల సౌర ఫలకంతో కూడిన 180 కిలోల బరువైన ఉపగ్రహాన్ని దిగువ భూ కక్ష్యలోకి ప్రయోగించాలని భావిస్తున్నారు. ఈ సౌర ఫలకం సౌరశక్తిని సంగ్రహించి, ఉపగ్రహంలోని బ్యాటరీని ఛార్జ్ చేస్తుంది. ఇది అంత ఎత్తు నుంచి ఒక కిలోవాట్ విద్యుత్తును భూమ్మీదికి సరఫరా చేస్తుంది.



భూమ్మీదికి ఎలా పంపుతారు?

విద్యుత్తు తయారీ సంగతి సరే. అది భూమ్మీదికి ఎలా సరఫరా అవుతుంది? అక్కడి నుంచి తీగలను వేయటం సాధ్యం కాదు కదా. ఇదేగా మీ సందేహం. సూక్ష్మ తరంగాల (మైక్రోవేవ్స్) రూపంలో సరఫరా చేయగలిగితే తీగలతో పనేముంది? ఈ ప్రయోగంలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఇదే. మామూలు సౌర ఫలకాలు శక్తిని విద్యుత్తు రూపంలోకి మారుస్తాయి. దాన్ని తీగల ద్వారా సరఫరా చేస్తాయి. కానీ ఇది అంతరిక్షం నుంచి సాధ్యం కాదు. అక్కడి నుంచి తీగలు వేయటం అసాధ్యం. ఇక్కడే జపాన్ శాస్త్రవేత్తలు వినూత్నంగా ఆలోచించారు. వీళ్లు పంపించే ఉపగ్రహం విద్యుత్తును మైక్రోవేవ్స్‌గా మారుస్తుంది. దాన్ని శక్తి పుంజం రూపంలో వైర్‌లెస్‌గా కిందికి పంపిస్తుంది. భూమ్మీద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాంటెన్నాలు దాన్ని ఒడిసి పట్టుకుంటాయి. ఉపగ్రహం గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అంటే అది పంపించే తరంగాలను పట్టుకోవటానికి యాంటెన్నా కూడా చాలా కిలోమీటర్లు పరుగెత్తాల్సి ఉంటుందన్నమాట. అయితే ప్రస్తుతానికి ఈ పద్ధతి సాధ్యమవుతుందో లేదో తెలుసుకోవటం మీదే శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. అందుకే చిన్న చిన్న యాంటెన్నాలతోనే ప్రయత్నాలు చేస్తున్నారు. సువా అనే ప్రాంతంలో 600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 13 రిసీవర్లను ఏర్పాటు చేసి, విద్యుత్తును సంగ్రహించాలని చూస్తున్నారు.

పరిమితులు లేకపోలేదు

ఒహిసామా ఉపగ్రహం నుంచి వచ్చే విద్యుత్తు తక్కువే. ఇది వంటపాత్రలను శుభ్రం చేసే పరికరం గంట సేపు పనిచేయటానికే సరిపోతుంది. కానీ ఈ పద్ధతి పనిచేస్తున్నట్టు రుజువైతే మాత్రం పెద్దఎత్తున అంతరిక్షంలో విద్యుత్తును తయారు చేయటానికి మార్గం సుగమమవుతుంది. నిజానికి ఆకాశంలో సూర్యశక్తి సాయంతో విద్యుత్తు తయారు చేయాలనే ప్రయత్నం ఇదే తొలిసారి కాదు. అమెరికా నావల్ రిసెర్చ్ ల్యాబోరేటరీ 2020లో ఎక్స్-378 ఆర్బిటల్ టెస్ట్ వెహికిల్‌ను ప్రయోగించింది. ఇది సౌరశక్తిని విజయవంతంగా మైక్రోవేవ్ శక్తిగా మార్చింది. దాన్ని భూమికి తిరిగి పంపించింది కూడా. అయితే దీనికి ఎక్కువ ఖర్చు అవుతుండటంతో పనికిరాదని భావించింది. అంతరిక్ష విద్యుత్తు తయారీ ప్రక్రియలో ఒక కిలోవాట్-అవర్ విద్యుత్తుకు 61 సెంట్లు ఖర్చవుతుంది. అదే భూమ్మీద ప్రస్తుతం సౌర, పవన విద్యుత్తు తయారీ 5 సెంట్లతోనే పూర్తవుతుంది. ఏదేమైనా అంతరిక్షంలో విద్యుత్తు తయారీ అనేది ఆసక్తికరమైన విషయమే. మున్ముందు పరిమితులు, లోపాలను అధిగమించి, పెద్దఎత్తున విద్యుత్తును తయారు చేయగలిగే పరిజ్ఞానాలు పుట్టుకొస్తే.. పర్యావరణానికి హాని చేయని శక్తిని పొందొచ్చు. టీవీ యాంటెన్నాల మాదిరిగా ఇళ్ల మీద విద్యుత్తు యాంటెన్నాలు వెలిసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఆరు గంటల్లోనే రైల్వే స్టేషన్ నిర్మాణం



రైల్వే స్టేషన్ కట్టటానికి ఎంత సమయం పడుతుంది? కనీసం ఏడాదైనా పడుతుంది. కానీ కేవలం ఆరు రోజుల్లోనే పూర్తి చేస్తే? జపాన్‌కు చెందిన వెస్ట్ రైల్వే కంపెనీ 3డీ ముద్రిత భాగాలతో అలాంటి అద్భుతమే సృష్టించింది. అరిడా పట్టణంలోని హట్సుషిమా రైల్వే స్టేషన్‌ను కేవలం ఆరు గంటల్లోనే నిర్మించి ఆశ్చర్య పరిచింది. కలపతో కట్టిన పాత రైల్వేస్టేషన్ స్థానంలో కొత్త స్టేషన్‌ను పూర్తిగా పునర్నిర్మించింది. చవకగా, అతి వేగంగా మౌలిక సదుపాయలను కల్పించటంలో 3డీ ముద్రణ ప్రాధాన్యాన్ని ఇది కళ్లకు కట్టింది.

ఎలా నిర్మించారు?

- ముందుగా రైల్వే స్టేషన్ భాగాలను 3డీ ప్రింటర్‌తో ముద్రించారు. వాటిని స్టేషన్ వద్దకు తరలించారు.
- క్రేను, కార్మికుల సాయంతో ఆ భాగాలను డిజైన్ ప్రకారం జోడించారు.
- కేవలం ఆరు గంటల్లోనే కొత్త

ఎన్నో లాభాలు

- 3డీ ముద్రణ పద్ధతిలో నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతాయనటానికిదో ఉదాహరణ. ఈ రైల్వేస్టేషన్ నిర్మాణానికి మామూలుగానైతే కొన్ని నెలలైనా పడుతుంది. ఆరు రోజుల్లోనే పూర్తి చేయగలిగారంటే ఎంత వేగంగా పని జరిగిందో కదా. అంటే చాలా సమయం ఆదా అయినట్టే.
- తక్కువ మంది కార్మికులతోనే పూర్తి చేయటం,

చాలావరకూ తగ్గిపోయింది.

- రాత్రి చివరి రైలు, ఉదయం మొదటి రైలు వచ్చే సమయంలోనే నిర్మాణ పనులు పూర్తి చేయటం వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయమేదీ కలగలేదు.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురవుతున్న కార్మికుల కొరత వంటి సమస్యలకు 3డీ ముద్రణ పద్ధతి కళ్లెం వేయగలదని ఇది నిరూపిస్తోంది.

అంధులకు కృత్రిమ చూపు

చూపు కోల్పోయినవారూ అందరిలాగా స్వేచ్ఛగా, ధైర్యంగా ఎక్కడికైనా వెళ్లగలిగితే? చైనా పరిశోధకులు కళ్లకు ధరించే అలాంటి ఏఐ వ్యవస్థనే ఆవిష్కరించారు. ఇది వీడియో, వైబ్రేషన్స్, ఆడియో ప్రాంప్ట్‌లతో అంధులు, చూపు కోల్పోయిన వారికి సాయం చేస్తుంది. ఇందులో ఏఐ కెమెరా, ఏఐ ప్రాసెసర్, హెడ్‌ఫోన్స్ ఉంటాయి. యూజర్ కనుబొమ్మల మధ్య ఉండే కెమెరా ప్రత్యక్షంగా దృశ్యాలను గ్రహిస్తుంది. వీటిని ఏఐ ప్రాసెసర్ వెంటనే విశ్లేషిస్తుంది. ప్రతి 250 మిల్లీసెకండ్లకు ఒకసారి చుట్టుపక్కల వివరాలు చిన్న చిన్న మాటల రూపంలో హెడ్‌ఫోన్ల ద్వారా చెవులకు చేరవేస్తాయి. ఎడమ వైపు అడ్డంకులుంటే ఎడమ హెడ్‌ఫోన్, కుడివైపు అడ్డంకులుంటే కుడి హెడ్‌ఫోన్‌లో మాటలు వినిపిస్తాయి. దీంతో దారి మళ్లటం సాధ్యమవుతుంది. ఇదొక్కటే కాదు సమీపంలోని వస్తువులను పసిగట్టటానికి 'ఏఐ స్కిన్' పట్టీలనూ పరిశోధకులు రూపొందించారు. వీటిని వేళ్లకు గానీ మణికట్టుకు గానీ చుట్టుకోవచ్చు. వీటిలోనూ కెమెరాలుంటాయి. ఇవి దగ్గరలో ఏవైనా అడ్డంకులుంటే గుర్తిస్తాయి. ఆ వెంటనే చేతికి చుట్టుకున్న బ్రాస్‌లెట్ కంపిస్తుంది. ఏదైనా వస్తువును పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడూ ఇవి కంపనల ద్వారా



ఈనాడు బిజినెస్

జీఎంఆర్ ఏరోసిటీలో టెక్నిప్‌ఎఫ్‌ఎంసీ కార్యకలాపాలు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలోని జీఎంఆర్ ఏరోసిటీలో ఇంధన రంగానికి చెందిన అంతర్జాతీయ సంస్థ టెక్నిప్‌ఎఫ్‌ఎంసీ తన కార్యకలాపాలు ప్రారంభించింది. దాదాపు 4.11 ఎకరాల విస్తీర్ణంలో, 1.02 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెక్నిప్ ఎఫ్‌ఎంసీ ప్లాంట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్మించారు. ఇంధన రంగానికి అవసరమైన కీలక ఇంజినీరింగ్ విడిభాగాలను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తారు. ఎస్ఈజడ్ పారిశ్రామిక పార్కు హోదా ఉన్న జీఎంఆర్ ఏరోసిటీలో దీన్ని నెలకొల్పడం వల్ల పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇప్పటికే ఇక్కడ ష్నైడర్ ఎలక్ట్రిక్, శాఫ్రాన్ ఇంజిన్ ఎంఆర్ఓ, ప్రాట్ అండ్ విట్నీ, అమరరాజా.. తదితర సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. జీఎంఆర్ ఏరోసిటీ 277 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు కూడా ఇక్కడ కొలువు తీరుతున్నాయి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఎండీ రాజీనామా

దిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఎండీ-సీఈఓ సుమంత్ కత్‌పాలియా మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌లో జరిగిన రూ.1,960 కోట్ల అకౌంటింగ్ లోపాలకు బాధ్యత వహిస్తూ ఆయన తప్పుకున్నారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ సమాచారమిచ్చింది. బ్యాంక్ డిప్యూటీ సీఈఓ అరుణ్ ఖురానా సోమవారం రాజీనామా చేయగా, ఒక రోజు వ్యవధిలోనే ఎండీ, సీఈఓ కూడా వైదొలిగారు. అకౌంటింగ్ లోపాలు బయటకు రావడానికి ముందే జనవరిలో బ్యాంక్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) గోవింద్ జైన్ కూడా బయటకు వెళ్లిపోయారు.

భారత్‌లో మేధోహక్కుల రక్షణ అంతంతే

'పరిశీలనా జాబితా'లో పెట్టిన అమెరికా

దిల్లీ: ప్రపంచంలో మేధోపర హక్కుల (ఐపీఆర్) రక్షణ, అమలు విషయంలో అత్యంత సవాళ్లు విసిరే దేశాల్లో భారత్ కూడా ఉందని, అందుకే మళ్లీ 'ప్రాధాన్య పరిశీలనా దేశాల జాబితా'లో చేర్చినట్లు అమెరికా స్పష్టం చేసింది. 'గత ఏడాది కాలంగా మేధోహక్కుల రక్షణ, అమలు విషయంలో భారత్ అస్థిరత్వంగా ఉంద'ని ద యూఎస్ ట్రేడ్ రెప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) 2025 స్పెషల్ 301 నివేదిక పేర్కొంది. 'ఈ అంశం ప్రాధాన్యతపై ప్రజల్లో స్పృహ పెంచడంతో పాటు, ఐపీ విధానాన్ని బలోపేతం చేయడంపై భారత్ పనిచేసింది. అమెరికాతో ఐపీ వివాదాలపై చర్చించడమూ పెరిగింది. అయితే ఎప్పటి నుంచో పరిష్కారం కాని ఐపీ అంశాల విషయంలో పెద్దగా ప్రగతి కనిపించడం లేద'ని నివేదిక పేర్కొంది. 'కొన్ని పేటెంట్ అంశాల విషయంలో భారత్‌లో ఇబ్బంది ఉంది. పేటెంట్ రద్దు అవకాశాలు, ఇతర ప్రక్రియలపైనా సమస్యలున్నాయి. పేటెంట్ దరఖాస్తుదారులకు పేటెంట్ గ్రాంట్ లభించడానికి ఎక్కువ సమయం పడుతుండడమూ ఒక సవాలుగా ఉంద'ని వివరించింది. 'ఇండియన్ పేటెంట్స్ యాక్ట్'ను అర్థం చేసుకోవడంపైనా అస్పష్టత ఉందని పలు వర్గాలు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆరోపించింది.

✦ భారత్‌తో పాటు చైనా, ఇండొనేషియా, రష్యా, అర్జెంటీనా, వెనెజువెలా, పాకిస్థాన్, తుర్కియే వంటి 25 దేశాలనూ ఈ జాబితాలో అమెరికా చేర్చింది.

కోడి గుడ్లు

30న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	425
వరంగల్	427
విజయవాడ	440
గోదావరి	425
విశాఖపట్నం	435
చిత్తూరు	493

చైనా నుంచి భారత్‌కు వయా థాయిలాండ్

- దొడ్డి దారిన 'డంపింగ్'
- యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, స్టీలు ఉత్పత్తులు, రసాయనాలు, ఇంకా ఎన్నో
- బీఐఎస్‌కు జోరుగా ఫిర్యాదులు
- అప్రమత్తంగా లేకపోతే నష్టమే

చైనా.. ఎన్నో రకాల వస్తువులను దొడ్డిదారిలో మనదేశంలోకి కుమ్మరిస్తోంది. దీంతో దేశీయ పరిశ్రమలకు సమస్యలు ఎదురవుతున్నాయి. చైనా తమ ఉత్పత్తులను మనదేశంలో కుమ్మరించడం (డంపింగ్) కొత్తేమీ కాదు. కానీ ఇటీవల నేరుగా కాకుండా, ఆగ్నేయాసియా దేశాల నుంచి పంపుతోంది. ప్రధానంగా థాయిలాండ్, వియత్నాం, మలేషియా, కాంబోడియా దేశాల ద్వారా చైనా కంపెనీలు మనదేశానికి ఎన్నో రకాల వస్తువులను పంపుతున్నాయి. ఈ పరిస్థితిపై దేశీయ పరిశ్రమల ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై అధిక సుంకాలు విధిస్తున్నందున, మనదేశంలోకి డంపింగ్ ఇంకా పెరుగుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే, దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరిస్తున్నాయి.

జరుగుతోంది ఇదీ

ఇటీవల మనదేశంతో ఆగ్నేయాసియా దేశాల వర్తకం బాగా పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం చైనా కంపెనీలు, ఆ దేశాల మీదుగా మనదేశానికి అన్ని రకాల వస్తువులను ఎగుమతి చేయడమే. 2021-23 మధ్య చైనా నుంచి మనదేశంలోకి దిగుమతులు 9.5% పెరిగితే, వియత్నాం నుంచి 13.4% పెరగడం గమనార్హం. కాంబోడియా ఎంతో చిన్న, అభివృద్ధి చెందుతున్న దేశం. ఆ దేశం నుంచి మనదేశానికి ఎగుమతులు 38% పెరగడం గమనార్హం. థాయిలాండ్, ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి కూడా దిగుమతులు వేగంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం చైనా కంపెనీలు యాంటీ-డంపింగ్ డ్యూటీలు తప్పించుకోవడానికి.. ఆయా దేశాల్లో కంపెనీలు పెట్టి లేదా అక్కడి కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని, వాటిద్వారా మనదేశంలోకి అన్ని రకాల వస్తువులను కుమ్మరించడమే.



ఫిర్యాదులు భారీగా

మనదేశంలో డంపింగ్‌కు దిగుతున్న కంపెనీలపై స్థానిక అధికార వర్గాలకు ఫిర్యాదులు వస్తున్నాయి. గత ఏడాదిలో చైనా కంపెనీ జినాన్ బొడోర్ మెషీన్ కంపెనీ లిమిటెడ్, మనదేశానికి లేజర్ కటింగ్ యంత్రాలు (సీఎన్‌సీ మెషీన్లు) సరఫరా చేసింది. వీటిని చైనా నుంచి మనకు పంపాలంటే, యాంటీ-డంపింగ్ డ్యూటీ చెల్లించాలి. అందుకే థాయిలాండ్ కంపెనీ ద్వారా ఇక్కడకు పంపింది. ఇందుకోసం తన భారతీయ అనుబంధ కంపెనీ బొడోర్ లేజర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను వినియోగించుకుంది. ఈ యంత్రాలు తగినంత నాణ్యత కలిగి లేవని, బాధిత కంపెనీ ఒకటి గత నెలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)కు ఫిర్యాదు చేసింది. చైనా కంపెనీ పంపిన వాటిల్లో 'పి', 'సి' సిరీస్‌లకు చెందిన యంత్రాలను వెనక్కి తీసుకోవాలని అమెరికాలోని ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆదేశించినట్లు వివరించింది. ఇదే సిరీస్ యంత్రాలు ఇప్పుడు మనదేశంలో పంపిణీ అవుతున్నాయని, నాణ్యత లేని యంత్రాలతో కార్మికులకూ నష్టం జరుగుతుందని ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఎన్నో వస్తువుల విషయంలో ఇలా జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి. ట్రంప్ విధించిన సుంకాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే, ఇటువంటి ఉదంతాలు ఇంకా పెరుగుతాయని.. తగిన సన్నాహాలతో ఈ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నాయి.



- ఈనాడు, హైదరాబాద్

24% తగ్గిన బీపీసీఎల్ లాభం

దిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), మార్చి త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.3,214.06 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.4,224.18 కోట్లతో పోలిస్తే ఇది 24% తక్కువ. వ్యయం కంటే తక్కువకు వంటగ్యాస్‌ను సంస్థ విక్రయిస్తుండగా.. ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం ఇంకా బీపీసీఎల్‌కు చెల్లించలేదు. ఫలితంగా నాలుగో త్రైమాసికంలో రూ.3,217.82 కోట్లు, పూర్తి ఆర్థిక సంవత్సరంలో రూ.10,446.38 కోట్ల భారం కంపెనీపై పడింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ఆదాయం 4% తగ్గి రూ.1.26 లక్షల కోట్లకు చేరింది.

✦ 2024-25లో కంపెనీ లాభం రూ.13,275.26 కోట్లుగా, ఆదాయం రూ.5 లక్షల కోట్లుగా నమోదైంది. 2023-24 లాభం రూ.26,673.50 కోట్లతో పోలిస్తే ఈసారి దాదాపు సగమే నమోదు చేసింది. బ్యారెల్ ముడిచమురును ఇంధనంగా మార్చడం ద్వారా 2024-25లో బీపీసీఎల్ సగటున 6.82 డాలర్లు ఆర్జించింది. 2023-24లో ఇది 14.14 డాలర్లుగా ఉంది.

✦ ఒక్కో షేరుపై రూ.5 తుది డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది. ఇంతకు ముందు ఇచ్చిన రూ.5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

ఆజాద్ ఇంజినీరింగ్‌లో 'లీన్ మ్యానుఫ్యాక్చరింగ్'

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్ కొత్తగా 'లీన్ మ్యానుఫ్యాక్చరింగ్' సదుపాయాన్ని ప్రారంభించింది. జీఈ వెర్నోవా స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ యూనిట్ అవసరాల కోసం హైదరాబాద్ (తునికిబొల్లారం)లోని ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సదుపాయం వల్ల దీర్ఘకాలంలో ఏరోస్పేస్, రక్షణ, ఇంధన, ఆయిల్-గ్యాస్ రంగాల వినియోగదార్లకు సేవలు అందించే అవకాశం ఉంటుందని సంస్థ వెల్లడించింది.

బజాజ్ ఫైనాన్స్ ఒక్కో షేరుకు 4 బోనస్ షేర్లు

తుది డివిడెండ్ రూ.44

దిల్లీ: బజాజ్ ఫైనాన్స్, మార్చి త్రైమాసికంలో రూ.3,940 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.3,402 కోట్లతో పోలిస్తే ఇది 16% అధికం. మొత్తం ఆదాయం రూ.12,764 కోట్ల నుంచి రూ.15,808 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.11,201 కోట్ల నుంచి రూ.13,824 కోట్లకు పెరిగింది. ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం రూ.3,825 కోట్ల నుంచి 19% పెరిగి రూ.4,546 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 0.96%, నికర నిరర్థక ఆస్తులు 0.44 శాతంగా ఉన్నాయి.

✦ గత ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.44 తుది డివిడెండును చెల్లించేందుకు బోర్డు సిఫారసు చేసింది. అలాగే రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.1 ముఖ విలువ కలిగిన రెండు షేర్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు 4 షేర్లను బోనస్‌గా ఇవ్వాలనీ నిర్ణయించింది.

టాటా ఏఐజీ నుంచి మెడికేర్ సెలెక్ట్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోనూ ఆరోగ్య బీమా పాలసీల విస్తృతి పెరుగుతోందని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమా తీసుకుంటున్న వారి సంఖ్య 5 శాతమైతే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇది 3.5 శాతంగా ఉందని పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 82,000 మందికి పైగా పాలసీదారులకు టాటా ఏఐజీ బీమా రక్షణ అందిస్తోందని హెడ్ ఆఫ్ ఏజెన్సీ ప్రతీక్ గుప్తా తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో నూతన పాలసీ మెడికేర్ సెలెక్ట్‌ని ఆయన ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో వైద్య ద్రవ్యోల్బణం 13 శాతమైతే, తెలంగాణ, ఏపీల్లో 16 శాతంగా ఉన్నందున, ఆరోగ్య బీమా తప్పనిసరి అని గుర్తించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1600కు పైగా ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకున్నామని యాక్సిడెంట్ అండ్ హెల్త్ క్లెయిమ్స్ హెడ్ రుద్రరాజు రాజగోపాల్ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 81%, ఏపీలో 68% నగదు రహిత చికిత్సలకు క్లెయిం అందించినట్లు తెలిపారు. 37 ఏళ్ల వ్యక్తి తన జీవిత భాగస్వామి, ఒక అమ్మాయి/అబ్బాయికి కలిపి రూ.10 లక్షలకు ఈ పాలసీ తీసుకుంటే హైదరాబాద్‌లో రూ.16,117 ప్రీమియం అవుతుందని, తెలుగు రాష్ట్రాల్లోని మిగతా ప్రాంతాల్లో ఇది రూ.14,447 అని తెలిపారు.

అంబుజా సిమెంట్స్ రూ.1,282.24 కోట్లు

దిల్లీ: అదానీ గ్రూపు సంస్థ అంబుజా సిమెంట్స్, జనవరి-మార్చి త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.1,282.24 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.9,802.47 కోట్లుగా నమోదైంది. 2023-24 జనవరి-మార్చిలో నికర లాభం రూ.1,521.21 కోట్లు కాగా.. ఆదాయం రూ.8,785.28 కోట్లుగా ఉన్నాయి. పెన్నా సిమెంట్, మై హోమ్ ఇండస్ట్రీస్ సహా పలు కంపెనీలను కొనుగోలు చేసినందున సమీక్షా త్రైమాసిక ఏకీకృత ఫలితాలను, ఏడాది క్రితం ఇదే కాల ఫలితాలతో పోల్చకూడదని కంపెనీ తెలిపింది. ఈసారి ఫలితాల్లో ఏసీసీ లిమిటెడ్, సంఘీ ఇండస్ట్రీస్, పెన్నా ఇండస్ట్రీస్ ఫలితాలూ కలిసి ఉన్నాయని పేర్కొంది. అంబుజా మొత్తం వ్యయాలు రూ.8,821.70 కోట్లుగా ఉన్నాయి. ఇతర ఆదాయంతో కలిపి మొత్తం ఆదాయం రూ.10,461.87 కోట్లుగా నమోదైంది. ఏకీకృత ప్రాతిపదికన 18.7 మిలియన్ టన్నుల సిమెంట్, క్లింకర్‌ను అంబుజా విక్రయించింది.

✦ 2024-25లో ఏకీకృత ప్రాతిపదికన లాభం రూ.5,158.41 కోట్లుగాను, ఆదాయం రూ.37,649.01 కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో సంస్థ లాభం రూ.4,734.63 కోట్లుగా ఉంది.

118 మి.టన్నుల వార్షిక సామర్థ్య లక్ష్యం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరికి వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 118 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని అంబుజా సిమెంట్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే పలు చిన్న సంస్థలను కొనుగోలు చేయడం ద్వారా సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 100 మిలియన్ టన్నుల మైలురాయిని అధిగమించింది.

ఐపీఓకు కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్

దిల్లీ: కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐపీఓకు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో 23.75 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, పెట్టుబడిదార్లు విక్రయించనున్నారని కంపెనీ పత్రాల్లో పేర్కొంది. కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు, హెచ్‌ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఆసియా-పసిఫిక్) హోల్డింగ్స్ లిమిటెడ్ 47.5 లక్షల షేర్లను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 9.5 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నాయి.

ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ రూ.2,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ

దిల్లీ: భారత్, మలేషియాల్లో క్విక్-సర్వీస్ రెస్టారెంట్లు, లాంజ్ బిజినెస్ నిర్వహిస్తున్న ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ రూ.2,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఆమోదం లభించింది. 2024 జూన్ 30 నాటికి మనదేశంలో దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై విమానాశ్రయాలతో పాటు మొత్తం 14 విమానాశ్రయాల్లో ఈ సంస్థ సేవలు అందిస్తోంది. మలేషియాలో 3 విమానాశ్రయాల్లోనూ వ్యాపారం నిర్వహిస్తోంది.

అక్షయ తృతీయ వ్యాపారం.. రూ.16,000 కోట్లు!

కెయిట్ అంచనా

దిల్లీ: అక్షయ తృతీయ రోజున (బుధవారం) దేశీయ ఆభరణాల విపణిలో రూ.16,000 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కెయిట్) అంచనా వేస్తోంది.



పసిడి, వెండి ధరలు బాగా పెరిగినందున, తక్కువ పరిమాణంలో అయినా కొనుగోళ్లకు ప్రజలు ముందుకొస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. గతేడాది అక్షయ తృతీయ రోజున 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.73,500 ఉండగా.. ప్రస్తుతం రూ.1 లక్ష సమీపంలో ఉంది. వెండి కిలో ధర కూడా రూ.86,000 నుంచి ప్రస్తుతం రూ.99,800కు పెరిగింది. 'సాధారణంగా అక్షయ తృతీయ రోజున బంగారం, వెండి అమ్మకాలు పెరుగుతాయి. అయితే ధరలు బాగా పెరగడం వల్ల ఈఏడాది వినియోగదారు గిరాకీపై ప్రభావం పడొచ్చ'ని ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా తెలిపారు. ఈ అక్షయ తృతీయ రోజున దాదాపు రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4000 కోట్ల విలువైన 40 టన్నుల వెండి అమ్మకాలు నమోదుకావచ్చుని ఆయన అంచనా వేశారు. మొత్తంగా రూ.16,000 కోట్ల మేర వ్యాపారం జరగొచ్చని తెలిపారు. పసిడి, వెండి అధిక ధరల కారణంగా వినియోగదారు కొనుగోలు సెంటిమెంట్ నెమ్మదించొచ్చని తెలిపారు.

✦ శుభముహూర్తంగా భావిస్తారు కనుక, అక్షయ తృతీయ నాడు వాహనాల కొనుగోళ్లూ ఎక్కువగానే జరుగుతాయి. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు, ఇళ్లు/ప్లాట్‌ల కోసం అడ్వాన్సులు ఇవ్వడాలు, శంకుస్థాపనలు, గృహ ప్రవేశాల వంటివీ నిర్వహిస్తారు.

ల్యాండ్‌పోర్ట్‌లలో ఎస్‌బీఐ సేవలు

దిల్లీ: బ్యాంకింగ్ సేవలను 26 ల్యాండ్ పోర్ట్‌లలో విస్తరించేందుకు ఎస్‌బీఐ, ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎల్‌పీఏఐ) అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎల్‌పీఏఐ ప్రస్తుతం 8 రాష్ట్రాల్లో 15 ల్యాండ్ పోర్ట్‌లను నిర్వహిస్తోంది. ఇవి నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్ సరిహద్దుల్లో ఉన్నాయి. వీటితో పాటు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మిజోరం, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లలో మరో 11 పోర్ట్‌లను మంజూరు చేశారు.

మ్యాక్స్ హెల్త్‌కేర్ రూ.6,000 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: 2028 నాటికి రూ.6,000 కోట్ల పెట్టుబడులు పెట్టడం ద్వారా మరో 3,700 వైద్య పడకలను జత చేసుకోవాలనుకుంటున్నట్లు మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ సీఎండీ అభయ్ సోయ్ వెల్లడించారు. ప్రస్తుతం దేశీయంగా 22 ఆసుపత్రుల్లో 5,000 వైద్య పడకలతో సేవలు అందిస్తున్నామని, 2028కి 30 ఆసుపత్రులకు చేరాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు.

దేశంలో 'యాపిల్' విరగ్గాసింది

- ఏడాదిలో రూ.1.7 లక్షల కోట్ల ఆదాయం
- 80,000కు చేరిన ఫాక్స్‌కాన్ ఉద్యోగుల సంఖ్య

దిల్లీ: దేశంలో గత ఆర్థిక సంవత్సరంలో ఐఫోన్ల ఉత్పత్తి భారీగా పెరిగింది. వాటిని తయారు చేస్తున్న తైవాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఫాక్స్‌కాన్ ఆదాయం రెండింతలకు పైగా పెరిగి, 20 బిలియన్ డాలర్లకు (రూ.1.7 లక్షల కోట్లకు)చేరింది. మన దేశంలో ఈ కంపెనీ ఉద్యోగుల సంఖ్య ఏడాది వ్యవధిలో 65% పెరిగి 80,000కు చేరిందని పరిశ్రమ, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



2024-25లో మనదేశం నుంచి మొబైల్ ఫోన్ల ఎగుమతులు జీవనకాల గరిష్ఠ స్థాయి అయిన రూ.2 లక్షల కోట్లకు చేరాయని, ఇందులో రూ.1.5 లక్షల కోట్ల మేర ఐఫోన్లే ఉన్నాయని ఇటీవల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి విదితమే. చైనాపై అమెరికా అధిక సుంకాలు విధిస్తున్నందున, అమెరికా విపణి కోసం ఐఫోన్లను పూర్తిగా మనదేశంలో తయారు చేయాలని ఫాక్స్‌కాన్ భావిస్తోంది. అందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింత ఆదాయాన్ని సంస్థ దక్కించుకోవచ్చని సమాచారం.

రెండో ప్లాంటు ఏర్పాటులో: ఇప్పటివరకు చైనాలో అత్యధికంగా ఐఫోన్లను తయారు చేస్తుండగా, ఇప్పుడు మనదేశంలో రెండో అతిపెద్ద ప్లాంటును బెంగళూరు సమీపంలో రూ.25,000 కోట్లతో ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటు వల్ల 40,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఉత్తర ప్రదేశ్‌లోనూ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంతో సంస్థ చర్చలు జరుపుతోంది. హైదరాబాద్‌లో ఈ సంస్థ ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తిని ప్రారంభించింది.

ఇన్ఫోసిస్‌లో మరో 195 మంది ట్రైనీల తొలగింపు



దిల్లీ: ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్, తమ మైసూరు క్యాంపస్‌లో మరో 195 మంది ట్రైనీలను తొలగించినట్లు ఆంగ్లపత్రికలు తెలిపాయి. అంతర్గత మదింపు పరీక్షల్లో వారు విఫలం కావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మొత్తం 680 మంది ఉన్న బ్యాచ్‌లో 195 మందిని కంపెనీ తొలగించింది. ఇన్ఫోసిస్ తమ ట్రైనీలను తొలగించడం ఈ ఏడాదిలో ఇది నాలుగోసారి. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 800 మంది ట్రైనీలు ఉద్వాసనకు గురయ్యారు. తొలగించిన వారిలో దాదాపు 250 మందికి అప్‌గ్రేడ్, ఎన్ఐఐటీ సంస్థల ద్వారా నైపుణ్యాల్లో శిక్షణ పొందే అవకాశాన్ని ఇన్ఫోసిస్ ఇస్తోంది. మరో 150 మంది ఔట్‌ప్లేస్‌మెంట్ సేవల కోసం నమోదు చేసుకున్నారు. బీపీఎం శిక్షణ కోసం అప్‌గ్రేడ్‌తో, ఐటీ శిక్షణ కోసం ఎన్ఐఐటీతో ఇన్ఫోసిస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

✦ ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటిసారి కంపెనీ 300 మంది ట్రైనీలను తొలగించింది. మార్చిలో మరో 30-35 మందికి, ఈనెల 18న 240 మందికి ఉద్వాసన పలికింది. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్-గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్ ఇస్తోంది. ట్రైనీల తొలగింపులో కార్మిక చట్టాలను ఇన్ఫోసిస్ ఉల్లంఘించలేదని కర్ణాటక కార్మిక శాఖ ఇప్పటికే క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఒడుదొడుకుల్లో స్వల్ప లాభాలు

డాలర్ @ 84.96

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.2,386 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,369 కోట్లు

సెన్సెక్స్ ▲ 70 — 80288

నిఫ్టీ ▲ 07 — 24336



సమీక్ష

దేశీయ సూచీలు ఒడుదొడుకుల నడుమ స్వల్ప లాభాలతో ముగిశాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలపై ఆందోళనలతో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించారు. బ్లూచిప్ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ నిధుల ప్రవాహం దేశీయ మార్కెట్‌కు మద్దతుగా నిలిచింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 27 పైసలు పెరిగి 84.96 వద్ద ముగిసింది. డిసెంబరు తరవాత డాలర్ రూ.85 లోపునకు రావడం ఇప్పుడే. బ్యారెల్ ముడి చమురు 1.59% తగ్గి 64.81 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు సానుకూలంగా, షాంఘై సూచీ ప్రతికూలంగా కదలాడాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ట్రేడ [illegible] గంటలకు అమెరికా సూచీలైన డోజోన్స్, నాస్‌డాక్, ఎస్ అండ్ పీ సానుకూలంగా కదలాడుతున్నాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1,000 కోట్లు పెరిగి, రూ.426.11 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 80,396.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,218.37) సానుకూలంగా ప్రారంభమైంది. 80,661.31 వద్ద గరిష్ఠ స్థాయిని తాకినా, ఒక దశలో 80,122.02 పాయింట్ల కనిష్ఠానికి చేరింది. చివరకు 70.01 పాయింట్ల లాభంతో 80,288.38 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 7.45 పాయింట్లు లాభపడి 24,335.95 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,457.65-24,290.75 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 14 లాభపడ్డాయి. రిలయన్స్ 2.32%, టెక్ మహీంద్రా 2.14%, ఎటెర్నల్ 1.72%, హెచ్‌సీఎల్ టెక్ 1.42%, ఇన్ఫోసిస్ 1.03%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.82%, టీసీఎస్ 0.81%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.79% చొప్పున పెరిగాయి. సన్ ఫార్మా 2.01%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.99%, పవర్‌గ్రిడ్ 1.75%, ఎన్‌టీపీసీ 1.22%, కోటక్ బ్యాంక్ 0.93%, ఎం అండ్ ఎం 0.91%, నెస్లే ఇండియా 0.80%, ఎస్‌బీఐ 0.72%, ఐటీసీ 0.68% నష్టపోయాయి.

రూ.19 లక్షల కోట్లకు చేరువైన రిలయన్స్

ఆర్థిక ఫలితాల అండతో **రిలయన్స్ ఇండస్ట్రీస్** షేరు వరుసగా రెండో రోజూ లాభపడింది. బీఎస్ఈలో 2.32% పెరిగి రూ.1,400.30 వద్ద స్థిరపడింది. 2 రోజుల్లో మార్కెట్ విలువ రూ.1,35,662.05 కోట్లు పెరిగి రూ.18,94,938.18 కోట్లకు చేరింది. గత జూన్‌లో సంస్థ మార్కెట్ విలువ జీవనకాల గరిష్ఠమైన రూ.21 లక్షల కోట్లను మించిన సంగతి విదితమే.

✦ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో 4.45% లాభపడి రూ.1,030.65 వద్ద ముగిసింది. ఒక దశలో 9.99% పెరిగి రూ.1,085.40 స్థాయిని తాకింది.

✦ చట్టబద్ధ సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్న **జెన్సోల్ ఇంజినీరింగ్** షేరు వరుసగా 14వ రోజూ బీఎస్ఈలో 5% లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.82.20 వద్ద ముగిసింది.

నేటి బోర్డు సమావేశాలు

అదానీ పవర్, ఐటీసీ, వేదాంతా, జిందాల్ స్టీల్ అండ్ పవర్, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫెడరల్ బ్యాంక్, అజంతా ఫార్మా, క్రిసిల్, బంధన్ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్

జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
బజాజ్ ఫిన్‌సర్వ్1	2,417	2,119	35,596	32,042
సియట్2	99	102	3,421	2,992
ట్రెంట్	311.60	712.09	4,216.94	3,297.70


ఈనాడు సినిమా

'పెద్ది'.. బరిలోకి మళ్లీ అప్పుడే!


రామ్‌చరణ్

కథానాయకుడు రామ్‌చరణ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా.. తదుపరి షెడ్యూల్‌ను మే రెండో వారంలో ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఈలోగా చరణ్ మే 9న లండన్ టుస్సాడ్స్‌లో జరిగే తన మైనపు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ.. 11న రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరగనున్న 'ఆర్ఆర్ఆర్' రాయల్ ఫిల్హార్మోనిక్ లైవ్ కన్సర్ట్‌లోనూ పాల్గొననున్నారు. ఈ వేడుకలో చెర్రీతో పాటు ఎన్టీఆర్, రాజమౌళి, కీరవాణి సందడి చేయడమే కాక ప్రీ-ఫిల్మ్ టాక్‌లో భాగంగా ప్రేక్షకులతోనూ ముచ్చటించనున్నారు. మే 14తర్వాత రామ్‌చరణ్ మళ్లీ 'పెద్ది' చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు తెలిసింది. ఇది ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే బలమైన భావోద్వేగాలు నిండిన క్రీడా నేపథ్య చిత్రంగా ముస్తాబవుతోంది. దీంట్లో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు.

ఒకేసారి రెండు చిత్రాలతో..


విజయ్ దేవరకొండ

కథానాయకుడు విజయ్ దేవరకొండ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. గతేడాది కాలంగా ఒక్క 'కింగ్‌డమ్' చిత్రం కోసమే సమయం కేటాయించిన ఆయన.. ఇప్పుడు ఒకేసారి సమాంతరంగా రెండు సినిమాల్ని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన చేయాల్సి ఉన్న చిత్రాల్లో దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ సినిమా ఒకటుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. మరోవైపు విజయ్ - రవికిరణ్ కోలా కలయికలో రూపొందనున్న 'రౌడీ జనార్దన్' కూడా ఆ వెంటనే చిత్రీకరణ ప్రారంభించుకోనుందని తెలిసింది. ఇది దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమా. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ రూరల్ డ్రామా జూన్ నుంచి షూట్ ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఇది హైదరాబాద్‌తో పాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేసుకోనున్నట్లు తెలిసింది. విజయ్ ఈ రెండు సినిమాల్ని సమాంతరంగా పూర్తి చేయాలని లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్టీఆర్ - నీల్ చిత్రం... వచ్చే ఏడాది జూన్‌లో


ఎన్టీఆర్

ఎన్టీఆర్ కథానాయకుడిగా... ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా వచ్చే ఏడాది జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం ఈ కొత్త తేదీని ప్రకటించింది. ముందుగా జనవరి 9న విడుదల చేయాలనుకున్నా, చిత్రీకరణ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆ మేరకు విడుదల తేదీని జూన్ 25కి మార్చారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే ఎన్టీఆర్ ఈ సినిమా సెట్లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం కర్ణాటకలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'కె.జి.ఎఫ్' చిత్రాలతోపాటు, 'సలార్' తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్... 'దేవర' తర్వాత కథానాయకుడు ఎన్టీఆర్ చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న గ్లింప్స్‌ని విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థలు వెల్లడించాయి. ఈ సినిమా పేరు, ఇందులో కథానాయిక వివరాల్ని ఇంకా వెల్లడించలేదు. కన్నడ భామ రుక్మిణీ వసంత్ ఇందులో కథానాయికగా నటించే అవకాశాలున్నట్టు సమాచారం. కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఛాయా గ్రహణం: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి.

కొడుకు జాడ కోసం ఓ తల్లి యుద్ధం





చిత్రం: 'ఎక్స్‌టెరిటోరియల్'
నటీనటులు: జీనో గౌర్నాడ్, డౌగ్రే స్కాట్
విడుదల ఎప్పుడు: బుధవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

కథాంశం: మాజీ స్పెషల్ ఫోర్సెస్ సైనికురాలు సారా. యుద్ధంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్న ఆమె ఆ బాధను భరించలేక ఆ ఉద్యోగాన్ని వదిలేసి తన కొడుకుతో మళ్లీ కొత్త జీవితాన్ని మొదలు పెట్టాలని అనుకుంటుంది. కోరుకున్నట్లుగానే సారా జీవితం సంతోషంగా సాగుతుంటుంది. ఒక రోజు ఫ్రాంక్‌ఫర్ట్‌లోని అమెరికా కాన్సులేట్‌ను సందర్శించడానికి ఈ తల్లీకొడుకులు వెళ్తారు. అక్కడ తన కొడుకు అదృశ్యమవుతాడు. అతను ఎక్కడ ఉన్నాడో కనిపెట్టాలని ఒక మిషన్‌ను ప్రారంభిస్తుంది సారా. మరి ఈ క్రమంలో ఆమె ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంది? చివరకు తన కుమారుడి జాడను కనిపెట్టిందా? అనే ప్రశ్నలకు సమాధానమే 'ఎక్స్‌టెరిటోరియల్' చిత్రం. జర్మన్ కథానాయిక జీనో గౌర్నాడ్, డౌగ్రే స్కాట్, లెరా అబోవా ప్రధాన పాత్రలు పోషించారు. క్రిస్టియన్ జుబెర్ట్ దర్శకత్వం వహించారు. ఇందులో సారా పాత్రలో కనిపించనుంది జీనో గౌర్నాడ్. యాక్షన్‌తో ముడిపడిన భావోద్వేగ చిత్రంగా దీన్ని తీర్చిదిద్దారు. మరి "ఓ అబద్ధాల గోడ.. తప్పిపోయిన కొడుకు.. ప్రతీది పణంగా పెట్టే తల్లి" అంటూ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సినిమా కథపై మీరూ ఓ లుక్కేయ్యండి.

డాక్టర్ డూమ్ యాక్షన్ మొదలు

హాలీవుడ్ సూపర్ హీరో చిత్రాలకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉంటారనే విషయం తెలిసిందే. ఇప్పుడు వారందరికి మరో కొత్త ఊహాలోకాన్ని పరిచయం చేయడానికి సన్నద్ధమవుతున్నారు దర్శకనిర్మాతలు రుస్సో బ్రదర్స్. వీరి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే'. క్రిస్ హమ్స్ వర్త్, వెనెస్సా కిర్బీ, రాబర్ట్


రాబర్ట్ డౌనీ జూనియర్

డౌనీ జూనియర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా తెర వెనుక ఫొటోను పంచుకున్నారు దర్శకులు రుస్సో బ్రదర్స్. ఇందులో భాగంగా మొదటి షెడ్యూల్‌లో ఈ సినిమాకి కీలకంగా నిలిచే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో రాబర్ట్ డౌనీ.. డాక్టర్ డూమ్ అనే ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. మార్వెల్ స్టూడియోస్, వాల్ట్ డిస్నీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సూపర్ హీరో చిత్రం వచ్చే ఏడాది మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నేను రాజకీయాల్లోకి వెళ్లట్లేదు -ప్రీతి జింటా



విదేశాల్లో ఉండటం వల్ల దేశం విలువ తెలిసింది. దేవాలయాలను సందర్శించారంటే రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు కాదని పేర్కొన్నారు బాలీవుడ్ నటి ప్రీతి జింటా. ఇటీవలే ఈమె మహాకుంభ మేళాను సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గతకొన్ని రోజులుగా ఆమె భారతీయ జనతా పార్టీ (భాజపా)లో చేరనున్నట్లు నెట్టింట్లో ప్రచారం జరుగుతోంది. సోమవారం రాత్రి ఎక్స్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో ఓ సోషల్ మీడియా యూజర్ మీరు భవిష్యత్తులో బీజేపీలో చేరబోతున్నారా? అని అడిగారు. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ.. "సోషల్ మీడియా ప్రజలతో ఇదే సమస్య. ఈ మధ్య అందరూ ఎవరికి వారే తీర్పులు చెబుతున్నారు. నేను గతంలో చెప్పినట్లుగా మహాకుంభ మేళాకు వెళ్లింది నేను ఎవరు? నా గుర్తింపు ఏమిటి? అని తెలుసుకోవడానికి అంతేగానీ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నాని, బీజేపీలో చేరతానని కాదు. విదేశాల్లో ఉండడం వల్ల నా దేశం విలువ నాకు అర్థమయ్యింది. అందరిలాగే నేను కూడా భారతదేశ సంస్కృతిని, భారతీయులందరినీ గౌరవిస్తున్నాను" అని అన్నారు.

నా సమాధానం బాధపెడితే క్షమించండి

"నా సమాధానం మీకు కఠినంగా అనిపిస్తే నన్ను క్షమించండి. మీ ప్రశ్నకు నాకు కోపం వచ్చింది. విదేశాల్లో ఉన్నాకూడా ఓ తల్లిగా నేను నా పిల్లలను భారతీయులుగానే పెంచుతున్నాను. వారికి దేశ గొప్పతనం తెలియాలని దేవాలయాలకు తీసుకెళ్తాను. కానీ ఈ విషయంలో నేను ఎప్పుడూ విమర్శలు ఎదుర్కొంటున్నాను. దీన్ని రాజకీయం చేయడం ద్వారా నా ఆనందాన్ని కోల్పోతున్నాను. మీరంటే నాకు ఎప్పుడూ గౌరవమే" అంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారామె.

యాక్షన్ 'దీక్ష'

కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా రూపొందుతున్న చిత్రం 'దీక్ష'. ఆక్సఖాన్, తులసి, అనూష, కీర్తన, రోహిత్ శర్మ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వం వహిస్తూ, పి.అశోక్‌కుమార్‌తో కలిసి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మే నెలలో విడుదలకు సిద్ధమైంది. దర్శకనిర్మాత మాట్లాడుతూ "పురాణాలతో ముడిపడిన కథ ఇది. ప్రేమ, యాక్షన్ కోణం ఈ సినిమాకి కీలకం. భీముడు పాత్రలో కథానాయకుడి నటన గుర్తుండిపోతుంది. రోహిత్ శర్మని ప్రతినాయకుడిగా పరిచయం చేస్తున్నాం. దీక్ష, పట్టుదలతో పని చేస్తే ఏదైనా సాధ్యమే అనే అంశం ఇందులో కీలకం" అన్నారు. బలమైన కథ, కథనాలున్న ఈ సినిమాలో తాము పోషించిన పాత్రలు ఎంతో ప్రత్యేకమైనవని చెప్పారు ఆక్సఖాన్, తులసి, రోహిత్ శర్మ.



ఆక్సఖాన్

సువర్ణమాయలో సవాళ్లు


సాయిశ్రీనివాస్, అనుపమ

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కిస్తున్న చిత్రం 'కిష్కింధపురి'. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. నెల్లూరు సుదర్శన్, హైపర్ ఆది తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఈ చిత్ర ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అందులో నాయకానాయికలిద్దరూ కొంతమంది మిత్రులతో కలిసి సువర్ణమాయ అనే ఓ పాడుబడ్డ భవంతిలోకి అడుగు పెట్టడం.. ఈ క్రమంలో అక్కడ ఎదురయ్యే భయానక అనుభవాలు.. ఆ తర్వాత వాళ్లు ఎదుర్కొన్న సవాళ్లను గ్లింప్స్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. ఆఖర్లో "అహం మృత్యువు.." అంటూ బెల్లంకొండ శ్రీనివాస్ దెయ్యం లుక్‌లో కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. మొత్తంగా ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానాన్ని బట్టి.. ఇదొక ఆసక్తికర హారర్ మిస్టరీ కథాంశంతో ముస్తాబవుతున్నట్లు అర్థమవుతోంది. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలో తెరపైకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సిఎస్, ఛాయాగ్రహణం: చిన్మయ్ సలాస్కర్.

సైకో కిల్లర్.. నమ్మశక్యం కాని ఐక్యూ!


నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ తెరకెక్కించిన తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా సంయుక్తంగా నిర్మించారు. రేయా హరి కథానాయిక. అభిరామి, రవివర్మ, కిరీటి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మే 16న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో కమల్‌హాసన్ ఈ చిత్ర ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. "వైజాగ్‌లో లాస్ట్ వన్ ఇయర్‌లో ఎనిమిది హత్యలు జరిగాయి. సీరియల్ కిల్లింగ్స్" అంటూ నవీన్ చంద్ర చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ ఉత్కంఠభరితంగా సాగింది. ఆ వరుస హత్యల్ని ఛేదించే క్రమంలో పోలీస్ ఆఫీసర్‌గా నవీన్ చంద్రకు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి.. ఆ సైకో కిల్లర్‌ను తనెలా పట్టుకున్నాడన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. 'సైకో కిల్లర్ విత్ అన్‌బిలీవబుల్ ఐక్యూ" అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్ కథపై మరింత ఆసక్తి పెంచేలా ఉంది. ఈ చిత్రానికి సంగీతం: డి. ఇమ్మాన్, ఛాయాగ్రహణం: కార్తీక్ అశోకన్.

సిద్ధార్థ్‌కు జోడీ ఎవరు?


అనన్య పాండే


శ్రీలీల

ప్రేమకథా చిత్రాలను తెరకెక్కిస్తూ ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకున్న దర్శకుడు రాజ్ శాండిల్య. ఇప్పుడాయన బాలీవుడ్ కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో ఓ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాను మహావీర్ జైన్, మృగ్‌దీప్ సింగ్ సంయుక్తంగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సిద్ధార్థ్‌కు జోడీగా నటించే కథానాయిక కోసం వెతుకుతోంది చిత్రబృందం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు విషయమై శ్రీలీల, అనన్య పాండేలతో చర్చలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ చిత్రంలో సిద్ధార్థ్ సరసన నటించే కథానాయిక ఎవరో తెలియాలంటే మరి కొద్ది రోజులు వేచి చూడాల్సిందే. ఇంకా పేరు ఖరారు కానీ ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఓటమి మా రక్తంలోనే లేదు


'కేసరివీర్: లెజెండ్స్ ఆఫ్ సోమనాథ్'

"మేం రాజ్‌పుత్‌లం.. ఓటమి మా రక్తంలోనే లేదు" అంటున్నారు బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి. మరి ఆయన ఎందుకు అలా అంటున్నారో తెలియాలంటే 'కేసరివీర్: లెజెండ్స్ ఆఫ్ సోమనాథ్' సినిమా చూడాల్సిందే. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో ప్రిన్స్ ధీమన్ తెరకెక్కిస్తున్నారు. కాను చౌహాన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "బంగారం అంతా ఎక్కడో దేవాలయాల్లో ఉంది. ఒక యోధుడి గుర్తు అతని కత్తి మీద ఉన్న రక్తంతో తెలుస్తుంది, ఈ యుద్ధం మనకు, మన ప్రజలకు, మన మతానికి వ్యతిరేకంగా జరుగుతోంది" అంటూ సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియులను ఆకట్టుకుంటోంది. హిందూ మతాన్ని, సోమనాథ్ ఆలయాన్ని రక్షించేందుకు తుగ్లక్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడి కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. సూరజ్ పంచోలి, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా మే 16న విడుదల కానుంది.

ప్రేమ కథ చుట్టూ తిరిగే హత్య కేసు


పంకజ్ త్రిపాఠి

బాలీవుడ్ విలక్షణ నటుడు పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'క్రిమినల్ జస్టిస్ సీజన్ 4'. 'ఏ ఫ్యామిలీ మ్యాటర్' ఉపశీర్షిక. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రోహన్ సిప్పీ తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌ను అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ జియో హాట్‌స్టార్ వేదికగా మే 22నుంచి ప్రసారం కానున్నట్లు తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను పంచుకుంది సిరీస్ బృందం. ప్రేమ వ్యవహారం చుట్టూ తిరిగే హత్య కేసును వాదించే న్యాయవాది మాధవ్ మిశ్రా పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు పంకజ్. ఇప్పటికే మూడు భాగాలుగా విడుదలై విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ సిరీస్‌లో శ్వేతాబసు ప్రసాద్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, సుర్వీన్ చావ్లా,

డీఎస్సీ- గ్రూప్స్... ఏది ఎంచుకోవాలి?

నా వయసు 38 ఏళ్లు. బీకామ్, బీఈడీ చేశాను. టెట్ క్వాలిఫై అవలేదు. ఏపీ డీఎస్సీకి కోచింగ్ తీసుకుని ప్రిపేరవ్వాలా, దీన్ని వదిలేసి గ్రూప్ – 2కి సిద్ధమవ్వాలా? సందిగ్ధంలో ఉన్నాను. - ప్రసన్న, విశాఖపట్నం.

■ మీ ప్రస్తుత వయసు 38 సంవత్సరాలు కాబట్టి, మరో ఆరేళ్ల లోపు ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి ప్రయత్నం చేయాలి. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 ఉద్యోగాల కోసం ప్రిలిమ్స్, మెయిన్స్ రూపంలో రెండు దశలుంటాయి. కొన్ని వందల ఉద్యోగాల కోసం లక్షల మంది పోటీ పడతారు. ఈ పరీక్షకు సన్నద్ధమవ్వడానికి మీరు బీకామ్, బీఈడీలో చదివిన విషయాలతో సంబంధం లేని సిలబస్ చదవవలసివుంటుంది. గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీల్లో ఉంటుంది. మెయిన్స్ పరీక్ష చరిత్ర, సంస్కృతి, భారత, ఏపీ ఆర్థిక వ్యవస్థ, భారత రాజ్యాంగం, సైన్స్ అండ్ టెక్నాలజీల్లో ఉంటుంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించాలంటే కనీసం రెండేళ్లపాటు ప్రణాళికాబద్ధంగా చదవాల్సి ఉంటుంది.



డీఎస్సీ విషయానికి వస్తే- టెట్‌లో ఉత్తీర్ణత సాధించకుండా డీఎస్సీ రాయలేరు. అందుకని ముందుగా టెట్ మీద దృష్టి పెట్టండి. మీరు బీఈడీ విద్యార్హతతో తక్కువ సంఖ్యలో అందుబాటులో ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు మాత్రమే అర్హులవుతారు కాబట్టి, పోటీ తీవ్రంగానే ఉంటుంది. టెట్‌లో కానీ, డీఎస్సీలో కానీ ఉత్తీర్ణత పొందడానికి మీరు బీఈడీలో చదివిన సిలబస్ బాగా ఉపయోగపడుతుంది.

డీఎస్సీ, గ్రూప్-2ల్లో దేన్ని ఎంచుకోవాలనేది మీ దీర్ఘకాలిక కెరియర్ లక్ష్యంపై ఆధారపడి ఉంటుంది. బోధన ఇష్టమైతే డీఎస్సీపై, పరిపాలనా పరమైన ఉద్యోగంపై ఆసక్తి ఉంటే గ్రూప్-2పై దృష్టి పెట్టండి. డీఎస్సీ పరీక్షకు బీఈడీ చేసినవారితో మాత్రమే పోటీ పడితే గ్రూప్-2కు డిగ్రీ/ పీజీ చదివిన వారితో పోటీ పడాల్సి ఉంటుంది. ఏ పోటీ పరీక్షకైనా రోజుకు కనీసం 12 గంటలపాటు సన్నద్ధత అవసరం. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉంటే ముందుగా టెట్, డీఎస్సీలకు సన్నద్ధం అవ్వండి. ఈ ప్రయత్నంలో విఫలమైతే గ్రూప్-2 పై దృష్టి పెట్టండి. గ్రూప్-2 కోసం నేర్చుకునే అంశాలు గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలు రాయడానికి కూడా ఉపయోగపడతాయి. టెట్, డీఎస్సీ, గ్రూప్ 2లు మూడూ రాయాలనుకుంటే రోజుకు కనీసం ఆరు గంటలు టెట్, డీఎస్సీకీ, మరో ఆరు గంటలు గ్రూప్-2కూ కేటాయించి చదవండి. ఆసక్తి, ప్రేరణ, పట్టుదల, పరిశ్రమ, సమయపాలన ఉంటే పోటీ పరీక్షల్లో విజయం సాధించడం పెద్ద కష్టమేమీ కాదు.


- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

విద్యా బోధనకు మొదటి మెట్టు!

ఉపాధ్యాయ వృత్తిపై మీకు ఆసక్తి ఉందా? అయితే ఇంటర్మీడియట్ తర్వాత డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సులో చేరొచ్చు! ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి. డీఈఈ సెట్‌లో చూపే ప్రతిభతో ప్రవేశాలుంటాయి. ఇటీవలే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ప్రకటనలు వెలువడ్డాయి.

స్థిరమైన కెరియర్ జీవితం పొందడానికి డీఎడ్ కోర్సు దారిచూపుతుంది. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో అందిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో చదివిన గ్రూపు, పరీక్ష రాయడానికి ఎంచుకున్న మాధ్యమం ప్రకారం రెండేళ్ల డీఎడ్ కోర్సును సంబంధిత భాషలో పూర్తి చేసుకోవచ్చు. డీఈఈ సెట్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్లతో సీట్లు కేటాయిస్తారు.

ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (డైట్)లు నడుస్తున్నాయి. ఇవి కాకుండా ఎయిడెడ్, మైనార్టీ, ప్రైవేటు సంస్థలూ డీఎడ్ కోర్సు అందిస్తున్నాయి. వీటిలో ఏ సంస్థలో ప్రవేశానికైనా డీఈఈ సెట్ రాయాల్సిందే. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు.



ఏపీ
గడువు తేదీ: మే 7లోగా ఫీజు చెల్లించి, మే 8 లోపు దరఖాస్తు చేసుకోవాలి. **ఫీజు:** రూ.750
పరీక్షలు: జూన్ 2, 3 తేదీల్లో నిర్వహిస్తారు
వెబ్‌సైట్: https://apdeecet.apcfss.in/

తెలంగాణ
దరఖాస్తులు: మే 15 వరకు స్వీకరిస్తారు
ఫీజు: రూ.500 **పరీక్ష తేదీ:** మే 25
వెబ్‌సైట్: https://deecet.cdse.telangana.gov.in/TSDEECET/TSDEECET_HomePage.aspx

అవకాశాలిలా...

రెండేళ్ల డీఎడ్ కోర్సును విజయవంతంగా పూర్తిచేసుకున్నవారు ప్రాథమిక స్థాయిలో బోధించవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాల ప్రకటన వెలువడినప్పుడు సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు కేంద్రీయ విద్యా సంస్థల్లో ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ) పోస్టులకు పోటీ పడవచ్చు. డీఎడ్ విద్యార్హతతోనే పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆకర్షణీయ వేతనంతో బోధన రంగంలో రాణించగలరు. డీఎడ్ మార్కుల శాతం, టెట్/సీటెట్ స్కోరు, ఆంగ్ల ప్రావీణ్యాల ఆధారంగా వేతనం ఉంటుంది. డీఎడ్ తర్వాత నేరుగా లేదా దూరవిద్యలో బీఏ/ బీఎస్సీ... తదితర కోర్సులు పూర్తిచేసుకోవచ్చు. రెండు మూడేళ్ల బోధనానుభవంతో దూరవిద్యలో బీఎడ్‌నూ చదువుకోవచ్చు. ఎస్‌జీటీగా చేరినవారు అనుభవం, విద్యార్హతలతో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) కావచ్చు.

డీఈఈ సెట్ తెలంగాణ

ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. అభ్యర్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్ష రాసుకోవచ్చు. ఇందులో మొత్తం 3 విభాగాలు ఉంటాయి.

- పార్ట్-1లో జనరల్ నాలెడ్జ్, టీచింగ్ ఆప్టిట్యూడ్ 10 ప్రశ్నలు వస్తాయి.
- పార్ట్-2లో తెలుగు మీడియంలో పరీక్ష రాసేవారికి జనరల్ ఇంగ్లిష్ 10, జనరల్ తెలుగు 20 ప్రశ్నలు వస్తాయి. అదే ఇంగ్లిష్ మీడియం అయితే జనరల్ ఇంగ్లిష్ 20, జనరల్ తెలుగు లేదా ఉర్దూ 10 ప్రశ్నలు ఉంటాయి.
- పార్ట్-3లో మ్యాథ్స్ 20, ఫిజికల్ సైన్సెస్ 10, బయలాజికల్ సైన్సెస్ 10, సోషల్ స్టడీస్ 20 చొప్పున ప్రశ్నలు వస్తాయి.

సన్నద్ధత..

సబ్జెక్టు, లాంగ్వేజ్ ప్రశ్నలన్నీ తెలంగాణ పదో తరగతి సిలబస్ స్థాయిలోపే ఉంటాయి. అందువల్ల 6 నుంచి 10 తరగతుల పాఠ్యపుస్తకాలు బాగా చదువుకుంటే సరిపోతుంది. ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలు చదవాల్సిన పని లేదు. తెలంగాణ డీఈఈసెట్ పాత ప్రశ్నపత్రాలు అధ్యయనం చేయాలి. ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాతప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లు సన్నద్ధతలో ఉపయోగపడతాయి. పరీక్షకు ముందు మీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి.

డీఈఈ సెట్ ఏపీ

వంద మార్కుల ఆన్‌లైన్ ప్రశ్నపత్రంలో రెండు భాగాలుంటాయి. పార్ట్- ఏలో 60, పార్ట్ బీలో 40 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు.

- పార్ట్ ఏలో టీచింగ్ ఆప్టిట్యూడ్ 5, జనరల్ నాలెడ్జ్ 5, ఇంగ్లిష్ 5, తెలుగు 5, ఆప్షనల్ లాంగ్వేజ్ (తెలుగు, ఇంగ్లిష్, తమిళం, ఉర్దూల్లో ఏదో ఒకటి) 10, మ్యాథ్స్ 10, జనరల్ సైన్స్ 10, సోషల్ స్టడీస్ 10 ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టు, లాంగ్వేజ్ ప్రశ్నలన్నీ 6 నుంచి పదో తరగతి సిలబస్‌లో ఉన్న అంశాల నుంచే అడుగుతారు.
- పార్ట్- బీ అభ్యర్థి ఇంటర్మీడియట్‌లో చదివిన గ్రూపు, ఎంచుకున్న విభాగం బట్టి మారుతుంది. మ్యాథ్స్/ ఫిజికల్ సైన్స్/ బయాలజీ/ సోషల్ స్టడీస్‌లో 40 ప్రశ్నలు ఇంటర్మీడియట్ పాఠ్యాంశాల నుంచే అడుగుతారు. మ్యాథ్స్ తీసుకున్నవారికి మొదటి ఏడాది నుంచి 20, రెండో సంవత్సరం నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. ఫిజికల్ సైన్స్ ఎంచుకుంటే ఫిజిక్స్ 20, కెమిస్ట్రీ 20 ప్రశ్నలు అడుగుతారు. బయాలజీ వారికి బోటనీ 20, జువాలజీ 20 ప్రశ్నలు ఉంటాయి. సోషల్ స్టడీస్‌లో హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ ఒక్కో సబ్జెక్టు నుంచి 13 లేదా 14 ప్రశ్నలు చొప్పున మొత్తం 40 వస్తాయి. పరీక్ష కోసం తెలుగు, ఇంగ్లిష్, తమిళం, ఉర్దూలలో ఏ మాధ్యమాన్నైనా ఎంచుకోవచ్చు.

గరిష్ఠ మార్కులకు..

ఈ పరీక్షలో విజయానికి ఇంటర్మీడియట్ సిలబస్‌పై పట్టు తప్పనిసరి. అభ్యర్థి ఎంచుకున్న గ్రూపు ప్రకారం ఇంటర్ పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి. పరీక్షలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సమాన ప్రాధాన్యం ఉంది. అందువల్ల రెండేళ్ల పాఠ్యపుస్తకాలపైనా సమానంగా శ్రద్ధ వహించాలి. వీటిని చదివిన తర్వాత పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. పాఠ్యాంశాలవారీ లభిస్తోన్న ప్రాధాన్యం, ప్రశ్నల స్థాయి గమనించాలి. అందుకు తగ్గట్టు మరోసారి సన్నద్ధం కావాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు, మోడల్ పేపర్లను సాధన చేయాలి. సంబంధిత గ్రూపుల వారీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల ప్రవేశాల ప్రశ్నపత్రాలూ అధ్యయనంలో ఉపయోగపడతాయి. పార్ట్ ఏలో సబ్జెక్టు ప్రశ్నలకు హైస్కూలు 8,9,10 తరగతుల మ్యాథ్స్, సైన్స్, సోషల్, తెలుగు, ఇంగ్లిష్ పుస్తకాలు బాగా చదివితే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం. ఒకేషనల్ విద్యార్థులు అనర్హులు. సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండాలి. గరిష్ఠ వయసు నిబంధన లేదు.

నిట్స్‌లో నాన్-టీచింగ్ పోస్టులు

అస్సాంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సిల్చర్ (నిట్స్) 21 నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయనుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్-1, హిందీ ఆఫీసర్-1, సూపరింటెండెంట్-1, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, సీనియర్ టెక్నీషియన్-3, టెక్నీషియన్-4, జూనియర్ అసిస్టెంట్-7, సీనియర్ అసిస్టెంట్-3 పోస్టులున్నాయి. ఇవి సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ విభాగాల్లో ఉన్నాయి.

ఏయే అర్హతలు?

✦ **సీనియర్ టెక్నీషియన్:** సైన్స్ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. లేదా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, ఏడాది ఐటీఐ కోర్సు పూర్తిచేయాలి. లేదా మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్.



✦ **టెక్నీషియన్:** సైన్స్ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. లేదా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, ఏడాది ఐటీఐ కోర్సు. లేదా మూడేళ్ల డిప్లొమా ఇంజినీరింగ్.

✦ **సీనియర్ అసిస్టెంట్:** ఇంటర్మీడియట్ పాసై.. నిమిషానికి 35 పదాలు టైప్ చేయగలగాలి. కంప్యూటర్ వర్డ్ ప్రాసెసింగ్, స్ప్రెడ్ షీట్ పరిజ్ఞానం ఉండాలి. కంప్యూటర్, స్టెనోగ్రఫీ నైపుణ్యాలు ఉన్నవారికీ, డిగ్రీ పాసైనవారికి ప్రాధాన్యమిస్తారు.

✦ **జూనియర్ అసిస్టెంట్:** ఇంటర్మీడియట్ పాసై.. టైపింగ్ వేగం నిమిషానికి 35 పదాలు ఉండాలి. కంప్యూటర్ వర్డ్ ప్రాసెసింగ్, స్ప్రెడ్‌షీట్ పరిజ్ఞానం ఉండాలి. కంప్యూటర్, స్టెనోగ్రఫీ నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

వయసు: అసిస్టెంట్ రిజిస్ట్రార్, హిందీ ఆఫీసర్‌లకు 35 ఏళ్లు, సూపరింటెండెంట్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌లకు 30 ఏళ్లు, సీనియర్ టెక్నీషియన్, సీనియర్ అసిస్టెంట్‌లకు 33 ఏళ్లు, టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌లకు 27 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.750.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. విద్యార్హతలు, అనుభవం ఆధారంగా అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్ష తేదీ, వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు.

▲ దరఖాస్తు హార్డ్‌కాపీకి, సంబంధిత ధ్రువపత్రాల కాపీలను జతచేసి.. స్పీడ్ పోస్టులో పంపాలి. **చిరునామా:** ద రిజిస్ట్రార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చర్, పీఓ: నిట్ సిల్చర్, కచర్, అస్సాం- 788 010.

▲ 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను రాత పరీక్ష/ ఇంటర్వ్యూ సమయంలో సమర్పించాలి.

▲ ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసేవారు.. హార్డ్‌కాపీలను వేర్వేరుగా పోస్టులో పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.05.2025
హార్డ్‌కాపీ స్వీకరణకు చివరి తేదీ: 23.05.2025
వెబ్‌సైట్: http://recruitment.nits.ac.in/staff/

ఫెర్రో స్క్రాప్ నిగమ్‌లో ఎగ్జిక్యూటివ్ అవుతారా?

భిలాయ్‌లోని ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్).. 44 ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనుంది. రాత పరీక్ష/ ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఎగ్జిక్యూటివ్/ జూనియర్ మేనేజర్/ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు 36, మేనేజర్/ సీనియర్ మేనేజర్/ డిప్యూటీ మేనేజర్ పోస్టులు 8 ఉన్నాయి.

అర్హతలు

- ఆపరేషన్ విభాగంలో.. మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మైనింగ్/ మెటలర్జికల్/ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేయాలి.



- అన్ని విభాగాల్లోని పోస్టులకూ డిప్లొమా హోల్డర్లు, ఓపెన్-డిస్టెన్స్ విధానంలో చదివినవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- మెయింటెనెన్స్ విభాగంలో..మెకానికల్/ ఆటోమొబైల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిగ్రీ.
- ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో..సీఏ/ ఐసీఎంఏ/ ఎంబీఏ (ఫైనాన్స్) .
- మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో.. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ/ మేనేజ్‌మెంట్ పీజీ డిప్లొమా. స్పెషలైజేషన్ ఇన్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్/ లాజిస్టిక్స్/ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్/ మార్కెటింగ్/ ఇంటర్నేషనల్ ట్రేడ్.
- పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో.. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ/ పీజీడీబీఏ.
- అసిస్టెంట్ మేనేజర్.. డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు, డిప్లొమావారికి ఏడేళ్ల అనుభవం ఉండాలి. మేనేజర్.. డిగ్రీ అభ్యర్థులకు ఎనిమిదేళ్లు, డిప్లొమావారికి పదహారేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: జూనియర్ మేనేజర్‌కు 30 సంవత్సరాలు, అసిస్టెంట్ మేనేజర్‌కు 34 ఏళ్లు, మేనేజర్‌కు 42 సంవత్సరాలు, సీనియర్ మేనేజర్‌కు 46 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్‌కు 28 సంవత్సరాలు, డిప్యూటీ మేనేజర్‌కు 38 ఏళ్లు, మించకూడదు.

వేతన శ్రేణి: ఎగ్జిక్యూటివ్‌కు నెలకు రూ.30,000-1,20,000. జూనియర్ మేనేజర్‌కు రూ.40,000-1,40,000. అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000-1,60,000. డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000-1,80,000. మేనేజర్‌కు రూ.70,000-2,00,000. సీనియర్ మేనేజర్‌కు రూ.80,000-2,20,000.

ఎంపిక

- విద్యార్హతలు, అనుభవం ఆధారంగా రాత పరీక్ష/ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. వీటికి హాజరయ్యేవారికి ఏసీ-3 టైర్ రైలు ఛార్జీలను చెల్లిస్తారు. అన్ని పోస్టులకూ వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.
- రాత పరీక్ష/ ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.
- రాత పరీక్ష తేదీ, వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. అభ్యర్థులు తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- ఉద్యోగ సమాచారాన్ని అభ్యర్థి ఈమెయిల్/ మొబైల్ నంబర్‌కు తెలియజేస్తారు.
- ఎంపికైనవారిని భిలాయ్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న యూనిట్లు/ ఆఫీస్‌లు/ ప్రాజెక్టుల్లో ఎక్కడైనా నియమించవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.05.2025
వెబ్‌సైట్: https://fsnl.co.in/career.php

ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ఇండియాలో అవకాశాలు

ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ఇండియా లిమిటెడ్ (ఈపీఐఎల్).. 68 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన ఏడాది కాలానికి ఎంపికచేస్తారు. అభ్యర్థి విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి కాలపరిమితిని మరో నాలుగేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.

మొత్తం ఉద్యోగాల్లో అసిస్టెంట్ మేనేజర్-22, మేనేజర్ గ్రేడ్-2-10, మేనేజర్ గ్రేడ్-1-18, సీనియర్ మేనేజర్-18 ఉన్నాయి. ఎలక్ట్రికల్, మెకానికల్, ఫైనాన్స్, లీగల్, ఐసీటీ సపోర్ట్ సర్వీసెస్ విభాగాల్లోనివి ఈ ఖాళీలు.



అర్హతలు

▼ సివిల్/ ఎలక్ట్రికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లతో బీఈ/ బీటెక్.
▼ ఫైనాన్స్ విభాగంలో.. 55 శాతం మార్కులతో సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ ఎంబీఏ (ఫైనాన్స్) చేయాలి.
▼ లీగల్ విభాగంలో పోస్టులకు ఎల్ఎల్ఎం పూర్తిచేయాలి.
▼ విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీలను 55 శాతం మార్కులతో పాసవ్వాలి.

వయసు: 31.03.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 32 ఏళ్లు, మేనేజర్ గ్రేడ్-2కు 35 సంవత్సరాలు, మేనేజర్ గ్రేడ్-1కు 37 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు

వేతన శ్రేణి: అసిస్టెంట్ మేనేజర్‌కు నెలకు రూ.40,000, మేనేజర్ గ్రేడ్-2కు రూ.50,000, మేనేజర్ గ్రేడ్-1కు రూ.60,000, సీనియర్ మేనేజర్‌కు రూ.70,000. మూల వేతనానికి అదనంగా హెచ్ఆర్ఏ, ప్రావిడెంట్ ఫండ్, మెడికల్ ఇన్స్యూరెన్స్ సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక ఎలా?

ఇంటర్వ్యూ ఆధారంగా ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారు. దరఖాస్తుదారులు ఎక్కువమంది ఉంటే రాత పరీక్ష కూడా ఉంటుంది. దీంట్లో అర్హత సాధిస్తే తర్వాతి దశ.. మౌఖిక పరీక్ష. ఇంటర్వ్యూలను న్యూదిల్లీలోని కార్పొరేట్ ఆఫీస్‌తోపాటు ముంబయి, చెన్నై, కోల్‌కతా, గువాహటీ, భువనేశ్వర్‌ల్లోని ప్రాంతీయ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తారు.

▼ అభ్యర్థుల షార్ట్‌లిస్టు చేసి.. ఇంటర్వ్యూ తేదీ, వేదికల వివరాలను ఈ-మెయిల్ చేస్తారు.
▼ విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
▼ ప్రత్యేక వర్గాలకు చెందినవారు సంబంధిత సర్టిఫికెట్లను, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నవారు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్‌ను ఇంటర్వ్యూ సమయంలో సమర్పించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.05.2025

నోటీస్ బోర్డు
ఉద్యోగాలు

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో..

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, కేరళ 3 ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఎలక్ట్రికల్): 01
- సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్: 01
- ప్రాజెక్టు ఆఫీసర్ (సేఫ్టీ): 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం.
వయసు: 2025 మే 12వ తేదీ నాటికి 30 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్‌కు రూ.59,000 - రూ.67,000, ప్రాజెక్టు ఆఫీసర్‌కు రూ.46,000 - రూ.54,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12-05-2025.
దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
వెబ్‌సైట్: https://cochinshipyard.in/careerdetail/career_locations/679

ఇస్రోలో సైంటిస్టులు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 63 సైంటిస్ట్/ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ఎలక్ట్రానిక్స్: 22
- మెకానికల్: 33
- కంప్యూటర్ సైన్స్: 08

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సీఎస్)తో పాటు గేట్ స్కోరు.
గరిష్ఠ వయసు: 28 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.56,100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 19. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.250.
వెబ్‌సైట్: https://www.isro.gov.in/ICRB_Recruitment8.html

ఇంటర్న్‌షిప్స్
వర్క్ ఫ్రమ్ హోమ్

ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: గిగ్‌డే గ్లోబల్ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, రియాక్ట్ **స్టైపెండ్:** రూ.7,000-10,000
☛ https://shorturl.at/EBxbT

స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్
సంస్థ: పాజ్
నైపుణ్యాలు: బిజినెస్ అనలిటిక్స్, క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మార్కెటింగ్, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, సేల్స్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.1,500-15,000
☛ https://bit.ly/4lLpVtl

బ్లాక్‌చెయిన్ డెవలప్‌మెంట్
సంస్థ: ఎమ్యూలార్ టెక్నాలజీ ప్రై.లి.
నైపుణ్యం: బ్లాక్‌చెయిన్
స్టైపెండ్: రూ.5,000-7,000
☛ https://bit.ly/4jtCubl

రియాక్ట్‌జేఎస్ డెవలప్‌మెంట్
సంస్థ: హబ్‌నైన్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫాస్ట్‌ఏపీఐ, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, నెక్స్ట్.జేఎస్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, రెస్ట్ ఏపీఐ, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.5,000-15,000
☛ https://bit.ly/4jnvuMR

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: విరాజో ఆటోసాఫ్ట్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫోటోషాప్, అడోబ్ ఎక్స్‌డి, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వైర్‌ఫ్రేమింగ్
స్టైపెండ్: రూ.2,000-5,000
☛ https://bit.ly/3YPRZlp

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: మే 25

మోషన్ గ్రాఫిక్స్
సంస్థ: సెట్ అప్ డిజిటల్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, యానిమేట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ https://shorturl.at/J4CLt

మోషన్ గ్రాఫిక్స్
సంస్థ: క్రియేటివైజ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్
స్టైపెండ్: రూ.10,000-25,000
☛ https://shorturl.at/kpnJD

3డీ విజువలైజర్ (ఆర్కిటెక్ట్)
సంస్థ: సీసీ యార్డ్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ 3డీస్ మ్యాక్స్, ఆటోడెస్క్ రెవిట్, గూగుల్ స్కెచప్
స్టైపెండ్: రూ.12,000
☛ https://shorturl.at/S5TgR

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: మే 19

చదువు
ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?
మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -
501 512
edc@eenadu.in

ఆయుష్మాన్ భారత్ దివస్

ఏప్రిల్ 30
చరిత్రలో ఈనాడు


మన దేశంలో 'ఆయుష్మాన్ భారత్ దివస్'ను ఏటా ఏప్రిల్ 30న నిర్వహిస్తారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్యం, శ్రేయస్సు అందించడంతోపాటు ఆరోగ్య బీమాపై అవగాహన కల్పించడం, మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్య సదుపాయాలు అందించడం ఈ రోజు లక్ష్యం.

☛ ఈ రోజు ముఖ్యంగా 'ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ - పీఎంజేఏవై)' పథకం, దాని లక్ష్యాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పిస్తారు.

☛ దేశంలోని తక్కువ ఆదాయ వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనేది ఏబీ - పీఎంజేఏవై లక్ష్యం. దీని ద్వారా కుటుంబానికి ఏడాదికి అయిదు లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య కవరేజీ దక్కుతుంది. అధికారిక గణాంకాల ప్రకారం పీఎంజేఏవై ద్వారా 2025, ఏప్రిల్ వరకు 9 కోట్లమంది ప్రజలు రూ.1.29 లక్షల కోట్లకుపైగా విలువైన ఉచిత ఆసుపత్రి చికిత్స ప్రయోజనాలు పొందారు. ఈ పథకం ద్వారా తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల ప్రజలు ఎక్కువ లబ్ధి పొందారు. సుమారు 1500 వ్యాధులు ఇందులో కవర్ అవుతాయి.


☛ 2023-24లో దేశంలో 1,54,000 ఆయుష్మాన్ భారత్ - హెల్త్ అండ్ వెల్‌నెస్ (ఏబీ-హెచ్‌డబ్ల్యూసీ) సెంటర్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వైద్య సేవలు అందించేందుకు వీటిని ఏర్పాటు చేశారు.

చారిత్రక నేపథ్యం:



☛ ప్రధాని మోదీ 2018, సెప్టెంబరు 23న ఏబీ - పీఎంజేఏవై పథకాన్ని ఝార్ఖండ్‌లో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా దాదాపు 10.74 కోట్ల కుటుంబాలకు (సుమారు 50 కోట్ల ప్రజలు) లబ్ధి చేకూరేలా చేపట్టిన ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య హామీ పథకంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం, పశ్చిమ్ బెంగాల్ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇది అమల్లో ఉంది. ఏబీ - పీఎంజేఏవై, ఏబీ-హెచ్‌డబ్ల్యూసీ లక్ష్యాలను సాధించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏప్రిల్ 30న 'ఆయుష్మాన్ భారత్ దివస్'గా జరుపుకోవాలని 2019లో తీర్మానించింది.

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో చిత్రాలకు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో ఒక క్రమాన్ని అనుసరించిన చిత్రాలను అసంపూర్ణంగా ఇస్తారు. ఈ పటాల్లోని ఒక భాగంలో ప్రశ్నార్థకం గుర్తు ఇచ్చి, దాని స్థానంలో సరిగ్గా సరిపోయే అక్షరం, సంఖ్యలను కనుక్కోమంటారు. కొన్నిసార్లు చిత్రాలకు ప్రతిబింబాన్ని గుర్తించమని అడుగుతారు. గణిత పరిజ్ఞానం ఉండి, తార్కికంగా ఆలోచించగలిగితే ఈ రకమైన ప్రశ్నలకు సులువుగా సమాధానాలు కనుక్కోవచ్చు. అభ్యర్థులు నిత్య అభ్యసనం చేస్తే, పరీక్షల్లో మార్కుల సాధన తేలికవుతుంది.




పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

సరైన ఐచ్ఛికంతో.. సంపూర్ణ చిత్రం..!

చిత్ర సమీకరణ, ప్రతిబింబ చిత్రాలు


1. దిగువ ఇచ్చిన చిత్రంలో ప్రశ్న గుర్తు స్థానంలో ఇమిడే చిత్రాన్ని ఐచ్ఛికాల నుంచి ఎంచుకోండి.



సాధన: ప్రశ్నలోని చిత్రం, ఐచ్ఛికాలను పరిశీలిస్తే...
ఐచ్ఛికం 2లోని చిత్రాన్ని ఉపయోగిస్తే ప్రశ్నలోని చిత్రం సంపూర్ణం అవుతుంది.

సమాధానం: 2

2. కింద ఇచ్చిన వృత్త చిత్రాన్ని గమనించి, ప్రశ్నార్థకం స్థానంలో ఇమిడే చిత్రాన్ని ఐచ్ఛికాల నుంచి ఎంచుకోండి.



సాధన: ప్రశ్నలోని చిత్రాన్ని పరిశీలించినప్పుడు వృత్త పైభాగంలోని కుడి భాగం, వృత్త కింది భాగంలోని ఎడమ భాగం వ్యతిరేక దిశలో ఉన్నాయి. అదేవిధంగా వృత్త పైభాగంలోని ఎడమ భాగం, వృత్త కింది భాగంలోని కుడి భాగం వ్యతిరేక దిశలో ఉంటాయి. ఐచ్ఛికం 4 లోని చిత్రం ప్రశ్నార్థక స్థానాన్ని సంపూర్ణం చేస్తుంది.

సమాధానం: 4

3. కింది అక్షర సంఖ్యాక్రమాన్ని అద్దంలో చూసినప్పుడు వచ్చే ప్రతిబింబాన్ని ఐచ్ఛికాల నుంచి ఎంచుకోండి.

Ma37CF (M/N)

1) ƎƆ7ƐaM 2) ꟻƆ7ƐaM
3) ꟻƆ37aM 4) ꟻƆ7ƐaM

సాధన: ఏదైనా వస్తువును అద్దంలో చూసినప్పుడు దాని ఎడమవైపు భాగం కుడివైపునకు, కుడివైపు భాగం ఎడమవైపునకు మారుతుంది.

Ma37CF (M/N) ꟻƆ7ƐaM

సమాధానం: 4

4. కింది అక్షర సంఖ్యాక్రమాన్ని అద్దంలో చూసినప్పుడు వచ్చే ప్రతిబింబాన్ని ఐచ్ఛికాల నుంచి ఎంచుకోండి.


hE1d7% (M/N)


1) %7b1Ǝh 2) %7b1Eh
3) hƎ1d7% 4) %7b1Ǝh

సాధన: hE1d7% (M/N) %7b1Ǝh

సమాధానం: 1

5. దిగువ ఇచ్చిన చిత్రక్రమంలో ప్రశ్నార్థకం స్థానంలో వచ్చే చిత్రాన్ని గుర్తించండి.






సాధన: ఇచ్చిన చిత్రాలను గమనిస్తే, మొదటి నుంచి నాలుగు వరకు ఉన్న చిత్రాల్లోని గడులు అపసవ్య దిశలో షేడ్ చేసి ఉన్నాయి. దీని ప్రకారం ఐచ్ఛికం 2 లోని చిత్రం ప్రశ్నార్థకం స్థానంలో సరిగ్గా సరిపోతుంది.

సమాధానం: 2

6. కింది చిత్రంలో ప్రశ్నార్థకం స్థానంలో రావాల్సిన అంకె లేదా సంఖ్యను గుర్తించండి.



1) 20 2) 11 3) 31 4) 10

సాధన: మొదటి చిత్రంలో $36 = 9 \times \left(\frac{8}{2}\right)$


రెండో చిత్రంలో $21 = 7 \times \left(\frac{6}{2}\right)$

ఈ రెండింటి ఆధారంగా ? స్థానంలో ఉండాల్సిన సంఖ్య

$= 5 \times \left(\frac{4}{2}\right) = 5 \times 2 = 10$

సమాధానం: 4

7. కింది చిత్రాలను పరిశీలించి ప్రశ్నార్థకం స్థానంలో రావాల్సిన సంఖ్యను ఐచ్ఛికాల నుంచి ఎంచుకోండి.




1) 36 2) 72 3) 100 4) 90

సాధన: మొదటి చిత్రంలోని సంఖ్య 48 అనేది $4 \times 4 \times 3$కి సమానం.
రెండో చిత్రంలోని సంఖ్య 60 అనేది $4 \times 3 \times 5$కి సమానం.
అదేవిధంగా, చివరి చిత్రంలోని ? స్థానంలో ఉండాల్సిన సంఖ్య
$= 3 \times 3 \times 4 = 36$

సమాధానం: 1

8. కింది చిత్రాలను పరిశీలించి ? స్థానంలో వచ్చే సంఖ్యలను కనుక్కోండి?



1) 16, 15 2) 30, 29
3) 18, 10 4) 40, 42

సాధన: మొదటి చిత్రం
$= 6 \times 4 = 24,$
$3 \times 5 = 15$
రెండో చిత్రం $= 5 \times 4 = 20,$
$4 \times 5 = 20$
మూడో చిత్రం $= 4 \times 4 = 16,$
$3 \times 5 = 15$

సమాధానం: 1



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

కరెంట్ అఫైర్స్

భారతదేశ సైనిక వ్యయం పాకిస్థాన్ సైనిక వ్యయం కంటే దాదాపు తొమ్మిది రెట్లు ఎక్కువని ప్రముఖ స్వీడిష్ అధ్యయన సంస్థ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) వెల్లడించింది. ఈ మేరకు 2024 ఏడాదికి సంబంధించిన నివేదికను 2025, ఏప్రిల్ 28న విడుదల చేసింది.



భారత నౌకాదళానికి అధునాతనమైన రఫేల్-మెరైన్ జెట్‌ల కోసం భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య రూ.64 వేల కోట్ల ఒప్పందంపై 2025, ఏప్రిల్ 28న సంతకాలు జరిగాయి. దీని కింద 26 రఫేల్-ఎం జెట్‌లు మన దేశానికి అందుతాయి. రఫేల్-ఎంను ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. భారత వైమానిక దళం వద్ద ఇప్పటికే 36 రఫేల్ జెట్‌లు ఉన్నాయి.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు 2025, ఏప్రిల్ 27న నియమితులయ్యారు. ఆర్థికశాఖ పదవిలోనూ ఆయనే అదనపు బాధ్యతలతో కొనసాగుతారు. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనుండటంతో ప్రభుత్వం ఆమె స్థానంలో ఈ నియామకం చేపట్టింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

635 Word of the Day

Juggle

Telugu meaning: సంతులనం చేయు, నిర్వహించు

English meaning: The word juggle (జగల్) is a verb that describes managing multiple tasks or responsibilities at the same time, often with difficulty.

Synonyms: Balance, Handle

Antonyms: Ignore, Overlook


Usage: **1.** She had to juggle her full-time job, evening classes, and family responsibilities every day.

2. Parents often juggle multiple roles, from being caregivers to breadwinners, without a break.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. ఈ ప్రజల ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయి. అసమానతలను తగ్గించి, అవకాశాల్లో వ్యత్యాసాలను తొలగించాలని, రిజర్వేషన్ల కల్పన కోసం ప్రభుత్వాలు పలు కమిషన్లను ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా కమిషన్లు, అవి నిర్వర్తించిన విధులు, వాటి అధికారాలు, చేసిన సిఫార్సులపై పోటీపరీక్షార్థులకు పూర్తి అవగాహన ఉండాలి.

సంక్షేమ యంత్రాంగం



వెనుకబాటుతనం లక్షణాలు:

1. నిరక్షరాస్యత
2. విద్యలేమి
3. పేదరికం
4. శ్రమదోపిడీ
5. సేవారంగంలో ప్రాతినిధ్యం లేకపోవడం
6. అస్పృశ్యత/ అంటరానితనం

కాకా కాలేల్కర్ కమిషన్

☛ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం 1953 జనవరి 29న కాకా కాలేల్కర్ అధ్యక్షతన మొదటి వెనకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

☛ వెనకబడిన తరగతులను గుర్తించడం, వారి అభివృద్ధికి తగిన సూచనలు ఇవ్వడం ఈ కమిషన్ విధి.

మండల్ కమిషన్

☛ మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో 1979లో బి.పి. మండల్ అధ్యక్షతన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటైంది.

☛ దీని ప్రధాన ఉద్దేశం - సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిని గుర్తించి, రిజర్వేషన్లు కల్పించడం.

ఇందిరా సహానీ కేసు 1992

☛ మండల్ కమిషన్ సిఫార్సులను 1992లో ఇందిరా సహానీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

☛ ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి క్రీమీలేయర్ విధానాన్ని పాటించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. అంతేకాకుండా చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.

జాతీయ మహిళా కమిషన్

☛ మహిళల హక్కులను, చట్టపరమైన అధికారాలను పరిరక్షించడానికి 1990లో పార్లమెంట్ జాతీయ మహిళా చట్టాన్ని రూపొందించింది.

☛ 1990 ఆగస్టు 30న ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందింది. 1992 జనవరి 31న జాతీయ మహిళా కమిషన్ ఏర్పడింది.

ఓబీసీలకు సంబంధించిన అంశాలు, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ), జాతీయ మైనారిటీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Teaching Posts

Indira Gandhi Institute of Development Research (IGIDR), Mumbai, is inviting applications for teaching posts. The total no. of posts is 17. Eligible candidates can apply online before 5 May 2025.

Diploma Courses

Visakhapatnam invites applications for admissions in the following diploma courses for the academic year 2025-26. The application fee is Rs.500. The last date for receipt of online applications is 6 May 2025.

Did You Apply..?

Today (April 30) is the last date for the following jobs/ Admissions

☛ 63 Junior Executive posts in HPCL.
Eligibility: diploma.

☛ 400 Executive Trainee posts in NPCIL, Mumbai.
Eligibility: BE, B.Tech.

☛ 122 Apprentice posts in NPCIL.
Eligibility: ITI, Diploma, Degree.

☛ Andhra Pradesh Postgraduate Engineering Common Entrance Test (APPGECET) - 2025

For more information and other notifications - scan QR code

Bank Exams
English

Word Swapping

Directions (Qs. 1 - 10): *In the questions given below, a paragraph is given with four words labelled (A), (B), (C) and (D), arranged not necessarily in the correct order. You have to find the correct order of arrangement from the options given below. In case, the sentence is correct in its original form, please select (E) as your answer. Ignore the errors in punctuation, if any.*

1. Renewable (A) bonds are financial instruments designed to fund **green** (B) energy projects and environmental conservation efforts. They encourage private investment into climate-resilient infrastructure. These bonds help governments combat **climate** (C) change and promote **sustainable** (D) development globally.
A) BDAC B) CABD
C) BACD D) DBAC
E) No correction required

2. The **metaverse** (A) is a collective digital space aiming to create **immersive** (B) experiences where people interact virtually. It blends social media, gaming, work, and education in a 3-D environment. Combining virtual **reality** (C), augmented reality, and online **communities** (D), it promises a new frontier in technology.
A) ACBD B) BCDA
C) BDCA D) ACDB
E) No correction required

3. Central banks worldwide are exploring blockchain technology to launch their own **finance** (A), offering users reliable digital assets. Unlike cryptocurrencies, stablecoins provide **stablecoins** (B) stability and minimize risks. They help avoid the extreme **exchange** (C) often associated with decentralized **volatility** (D)
A) BCDA B) CBAD C) BACD
D) BCAD E) No correction required

4. Electric **noise** (A) could revolutionize short-haul flights by reducing carbon emissions and minimizing airport **congestion** (B). Aircrafts powered by electricity also decrease urban **aviation** (C) levels, improving environmental health. However, challenges remain regarding **energy** (D) density and battery technology.
A) BACD B) CBAD C) DCBA
D) ACDB E) No correction required

5. Ocean **biodiversity** (A) results from increased CO_2 absorption by seawater, significantly harming marine **ecosystems** (B). It weakens coral **reefs** (C) and disrupts biodiversity patterns. This growing threat to aquatic **acidification** (D) demands urgent global attention.
A) CBDA B) BDAC C) DCAB
D) DBCA E) No correction required

6. Digital **assets** (A) are real-time digital replicas of physical **twins** (B), helping industries monitor and optimize processes. They can detect faults before they occur, minimizing downtime. These systems prevent cyberattacks by identifying operational **risks** (C) and improving **maintenance** (D) efficiency.
A) BACD B) ABDC C) BDCA
D) CBAD E) No correction required

7. The pandemic **flexibility** (A) the global shift towards remote work, forcing companies to redesign operations. Organizations adapted to employee **innovation** (B), fostering a culture of **accelerated** (C) and changing traditional working **expectations** (D).
A) DCBA B) CABD C) ABCD
D) CBDA E) No correction required

8. Global semiconductor **crises** (A) severely impacted automotive **production** (B) and caused delays across smartphone manufacturing. This **bottleneck** (C) affected supply chains globally, creating major electronics **shortages** (D) and slowing down industries.
A) BDAC B) CABD
C) DBCA D) DCAB
E) No correction required

9. The tourism sector must **reinvent** (A) itself after the pandemic, using resilient **marketing** (B) strategies and promoting safe travel models. Health **security** (C) measures and sustainable travel **priorities** (D) are now crucial for long-term revival.
A) ABDC B) DACB C) BDAC
D) CBDA E) No correction required

10. Artificial **organs** (A) are engineered devices designed to replace malfunctioning biological tissues. Rapid advances in **medical** (B) medicine have made organ bioengineering more practical. This innovation improves patient survival and boosts **regenerative** (C) science **capabilities** (D).
A) BDAC B) CBAD
C) BCAD D) ACBD
E) No correction required

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



- న్యూదిల్లీలోని ప్రముఖ పరిశోధన, శిక్షణ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ (ఐఈజీ) నూతన డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? జ: ప్రొఫెసర్ సవ్యసాచి కర్
- భారత తీర రక్షకదళం (ఐసీజీ) 2025, ఫిబ్రవరి 21, 22 తేదీల్లో పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో ఏ పేరుతో భద్రతా విన్యాసాలను నిర్వహించింది? జ: సాగర్ కవచ్
- టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) వరల్డ్ రెప్యుటేషన్ ర్యాంకింగ్స్ 2025 ప్రకారం ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాల జాబితాలో ఏ యూనివర్సిటీ వరుసగా 14వ సారి అగ్రస్థానంలో నిలిచింది? జ: హార్వర్డ్ విశ్వవిద్యాలయం (రెండు, మూడు స్థానాల్లో వరుసగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు నిలిచాయి.)
- నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌సీఐ) ఇటీవల ప్రదానం చేసిన సేఫ్టీ అవార్డ్స్ - 2024లో సర్వీస్ సెక్టార్ విభాగంలో సర్వశ్రేష్ఠ సురక్ష పురస్కార్ (గోల్డెన్ ట్రోఫీ)ను గెలుచుకున్న విమానాశ్రయం ఏది? జ: మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (గోవా)

మరింత సమాచారం

జీవుల మనుగడకు ముంచుకొస్తున్న ముప్పు!

పర్యావరణ క్షీణత

భూమిపై జీవరాశుల ఉనికి, మనుగడకు ఉన్న సహజ అనుకూల వాతావరణ పరిస్థితినే పర్యావరణంగా చెప్పవచ్చు. నేల, నీరు, గాలి, చలి, వేడి వంటివన్నీ ఇందులో ప్రధాన అంశాలు. భూమిపై కొన్ని మిలియన్ల సంవత్సరాల పాటు సహజ కారకాలతో పర్యావరణం ప్రభావితమవుతూ, మార్పులకు గురవుతూ వచ్చింది. పారిశ్రామిక విప్లవం తర్వాత అనూహ్య పరిణామాలతో ప్రమాదం మొదలైంది. ఆధునిక యుగంలో ఒక వైపు పలు రకాల కాలుష్యాలు అధికమవుతుంటే, మరోవైపు అడవులు, జీవవైవిధ్యం తగ్గిపోతున్నాయి. హానికర వాయువులతో భూగోళం వేడెక్కిపోయి విపత్తులు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంపై, పర్యావరణ క్షీణతతో తలెత్తుతున్న అనర్థాలపై పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. దేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లు, దుష్ఫలితాలను అధిగమించేందుకు అటవీ విస్తీర్ణం పెంపు నుంచి అంతరిక్ష పరిజ్ఞానం వినియోగం వరకు చేపడుతున్న వివిధ చర్యలు, సంబంధిత వివరాలు, నివేదికలు, గణాంకాల గురించి తెలుసుకోవాలి.



భూమి పుట్టి సుమారు 4600 మిలియన్ సంవత్సరాలని అంచనా. అప్పటి నుంచి పర్యావరణంలో మార్పులు వస్తూనే ఉన్నాయని, ఇది నిరంతర ప్రక్రియ అని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. భూమి చరిత్రలో ఈ మార్పులకు కారకాలుగా అగ్నిపర్వతాలు, భూకంపాలు, వరదలు, తుపానులు, హిమానీనదాలు, సముద్ర తరంగాలు, మొక్కలు, ఇంకా జంతువులు లాంటి సహజ శక్తులను పేర్కొనవచ్చు. మానవ పరిణామక్రమంలో హోమోసైడ్స్ నుంచి నేటి ఆధునిక మానవుడిగా మారడమనేది ఈ పర్యావరణ మార్పులకు ప్రధాన కారణంగా అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. మనిషి తన పరిణామక్రమంలో భూమికి సంబంధించిన సాంస్కృతిక, భౌతిక మార్పులకు కారకుడయ్యాడు. పర్యావరణంపై ఆధిపత్యాన్ని ప్రదర్శించి భూమికి సంబంధించి అత్యవసర పరిస్థితులను సృష్టించాడు. పెరుగుతున్న మానవ జనాభాకు అనుగుణంగా కుగ్రామాల నుంచి మెగాసిటీల స్థాయికి నివాసాలు మార్పు చెందాయి. మనిషి రోజువారీ అవసరాల కోసం భూమి, అడవులపై ఆధారపడే స్థాయి నుంచి శాస్త్ర సాంకేతిక అభివృద్ధి వల్ల ఆధునిక కర్మాగారాలు, పరిశ్రమలు, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో భూమి, భూమిపై ఉన్న వృక్ష, జంతు, జలసంపదపై తన ప్రభావాన్ని చూపుతున్నాడు. 1779లో ఐరోపాలో పారిశ్రామిక విప్లవం ఫలితంగా పారిశ్రామికీకరణ, పట్టణీకరణ జరిగాయి. ఈ విప్లవం ఐరోపాతో పాటు ఆసియా, అమెరికా, ఆస్ట్రేలియాలోని పర్యావరణాన్ని ఎక్కువగా ప్రభావితం చేసింది. వ్యవసాయ విస్తరణ, పరిశ్రమల స్థాపనకు అడవులను ఎక్కువగా నరికేశారు. పారిశ్రామిక అవసరాల కోసం ఖనిజాలు అవసరమయ్యాయి. అందుకు పెద్దఎత్తున ఖనిజాల వెలికితీత ప్రారంభమైంది. మైనింగ్ ప్రదేశాల్లో పర్యావరణం పెద్దఎత్తున ప్రభావానికి గురై మార్పులు సంభవించాయి. హరిత వాయువులు, సీసం, కాడ్మియం, పాదరసం వంటి భారలోహాల వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడింది.

పర్యావరణంలో ఏర్పడిన ప్రతికూల అంశాలు:

గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదల: పెట్రోలియం, డీజిల్, కిరోసిన్, బొగ్గు లాంటి శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువగా విడుదలై వాతావరణం మార్పులకు గురవుతోంది. తద్వారా సముద్ర మట్టాలు పెరిగి జీవావరణం, జలావరణంపై ప్రభావం చూపుతోంది.

ఆమ్లీకరణ: దీని వల్ల సరస్సులు, నదుల్లో సముద్ర జలాలు కలుషితమై, మొత్తం పర్యావరణం దెబ్బతింటుంది. ఉదా: భారతదేశంలోని నదుల కాలుష్యం వల్ల మత్స్యసంపద గణనీయంగా తగ్గుతోంది.

ఓజోన్ పొర క్షీణత: సూర్యుడి అతినీలలోహిత కిరణాలు (యూవీ) భూవాతావరణంలోకి రాకుండా ఓజోన్ పొర అడ్డుకుని మానవులు, జంతువులకు అనేక చర్మ, కంటివ్యాధులు రాకుండా కాపాడుతోంది. అయితే వాతావరణ మార్పులు, కొన్నిరకాల వాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోంది.

జనరల్ స్టడీస్-ఇండియన్ జాగ్రఫీ

గాలి, నీరు, ధ్వని, నేల కాలుష్యం: గాలి, నీరు, నేల నాణ్యత పల్లె, పట్టణాలనే తేడా లేకుండా క్షీణిస్తోంది. గాలి, నీటి కాలుష్యం కారణంగా అనేక అనారోగ్య సమస్యలు ఉద్భవిస్తున్నాయి. దేశంలో పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, భోపాల్, దిల్లీ, చెన్నై, హైదరాబాద్‌లో వీటి నాణ్యత క్షీణిస్తోంది. ప్రపంచంలోని 20 అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే ఉండగా, వాటిలో మేఘాలయలోని బెర్నిహట్ అగ్రస్థానంలో ఉందని 'ప్రపంచ వాయునాణ్యత నివేదిక - 2024' పేర్కొంది. అత్యంత కలుషితమైన రాజధాని నగరాల్లో దిల్లీ ప్రథమ స్థానంలో ఉంది.

వ్యర్థ పదార్థాల నిర్వహణ సమస్య: వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పెరుగుతున్న పారిశ్రామికీకరణ ఫలితంగా భారీమొత్తంలో గృహ, పారిశ్రామిక, అణు వ్యర్థాలు పెరుగుతున్నాయి.

నేలకోత: దేశంలో ఏటా సుమారు 6000 మిలియన్ టన్నుల నేల కోతకు గురవుతుందని అంచనా. సుమారు 80 మిలియన్ హెక్టార్లు నేలకోత కారణంగా ప్రతికూల ఫలితాలను ఇస్తున్నాయి. దేశంలో గంగా, గోదావరి, కృష్ణా, బ్రహ్మపుత్ర నదుల పరీవాహక ప్రాంతాల్లో ఈ ప్రభావాన్ని గమనించవచ్చు.

లవణీయత: ఏటా అధిక మోతాదులో రసాయన ఎరువుల వాడకం వల్ల నదులు, సరస్సులు, చెరువులు, భూగర్భజలాలు లవణీయతకు గురవుతున్నాయి. చిత్తడి నేలలకు ప్రతికూలంగా మారుతున్నాయి. ఉదా: గంగా, యమునా, కృష్ణా నదులు ఈ ప్రభావానికి గురవుతున్నాయి.

ఎడారీకరణ: అడవుల నరికివేత, వ్యవసాయ విస్తరణ కోసం చెట్లు నరకడం లాంటి కారణాలతో అనేక ప్రాంతాలు పొడి వాతావరణంలో ఎడారి ప్రాంతాలుగా మారుతున్నాయి.

తగ్గుతున్న జీవవైవిధ్యం: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యవసాయ భూములు, నివాసాల విస్తరణతో దేశంలో గతంలో ఉన్న అనేక వేలరకాల మొక్కలు, ఔషధ మొక్కలు, చెట్లు, ఇతర జీవ జంతుజాలం కనుమరుగయ్యాయి. ఫలితంగా ఆహారగొలుసు దెబ్బతిని జీవవైవిధ్యం తగ్గింది.

అటవీ నిర్మూలన



మనిషి అడవులను ఇష్టారీతిగా నరికివేయడంతో వాతావరణ, పర్యావరణాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. గాలి ఉష్ణోగ్రతలు పెరగడం, అవి వ్యవసాయ భూములు, జలవనరులపై ప్రభావం చూపడంతో మొత్తం పర్యావరణం దెబ్బతింటోంది. దేశ అటవీ విధానం ప్రకారం దేశ భూభాగంలో 33% అడవులు/పచ్చదనం ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం 25% భూభాగంలోనే అడవుల విస్తరణ/పచ్చదనం ఉందని అంచనా. ఉండాల్సినంత అటవీ విస్తరణ లేకపోవడంతో వాతావరణంలో, రుతువుల్లో, వ్యవసాయ ఉత్పాదకతలో మార్పులు ఏర్పడుతున్నాయి.

వేగంగా కరుగుతున్న మంచు



భూగోళంపై అత్యధికంగా మంచుతో ఉన్న మూడో అతి పెద్ద ప్రాంతం హిమాలయాలు. కాలుష్యం, ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఇవి వేగంగా కరుగుతున్నాయని, ఆసియా ఖండంలో సుమారు 200 కోట్ల మంది దీనివల్ల తీవ్ర ప్రభావానికి గురవుతారని, 2013-2022 మధ్యకాలంలో భారత్‌లో సంభవించిన ప్రకృతి విపత్తుల్లో 44% ఘటనలకు హియాలయాల్లో కరుగుతున్న మంచే కారణమని భారత పర్యావరణ నివేదిక-2024 పేర్కొంది. 2100 నాటికి హిమాలయాల్లోని మంచు 75% కరిగే ప్రమాదం ఉందని ఈ నివేదిక తెలిపింది.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

వాయుసేనలో వాయిద్యకారులు!

టెన్త్ తర్వాత? ఉద్యోగాలు ఎయిర్‌ఫోర్స్

యువతను ఎక్కువగా ఆకర్షించే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వాయుసేన ఒకటి. ఉద్యోగ భరోసా, ఆకర్షణీయమైన జీతం, క్రమశిక్షణతో కూడిన జీవనంతో పాటు సమాజంలో గౌరవం, దేశరక్షణలో ఉన్నామన్న తృప్తి వంటివన్నీ వాయుసేన కొలువు ఇస్తుంది. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణతతోనే ఎయిర్‌ఫోర్స్‌లో చేరే అవకాశం ఉంది. వాయుసేన నిర్వహించే వివిధ మిషన్లు, సన్నద్ధత కార్యక్రమాల్లో పదో తరగతి అర్హతతో ఎంపికయ్యే అభ్యర్థులు కీలక పాత్ర పోషిస్తారు. లాజిస్టిక్స్ నుంచి సాంకేతిక సహకారం వరకు వివిధ అవసరాల్లో వీరి సహకారం ఉంటుంది. అగ్నివీర్ పథకంలో భాగంగా ప్రస్తుతం భారత వాయుసేన 'ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్' (మ్యుజీషియన్) పోస్టులను భర్తీ చేస్తోంది. అధికారిక కార్యక్రమాలు, సమావేశాల్లో సంగీత ప్రదర్శనలివ్వడం, కచేరీలు నిర్వహించడం వీరి ప్రధాన విధి.



కావాల్సిన అర్హతలు

వయోపరిమితి: 17.5 నుంచి 21 ఏళ్లలోపు ఉండాలి.

విద్యార్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి ఉత్తీర్ణత.

సంగీత ప్రావీణ్యం: సంగీతంలో ప్రాథమిక పరిజ్ఞానం, కనీసం ఒక సంగీత పరికరాన్ని వాయించే సామర్థ్యం ఉండాలి.

భౌతిక ప్రమాణాలు: వాయుసేన నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్: నిర్దేశిత తేదీల్లో ఐఏఎఫ్ అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.

సంగీత నైపుణ్య పరీక్ష: అభ్యర్థి సంగీత ప్రావీణ్యాన్ని, సంగీత పరికరం వాయించే సామర్థ్యాన్ని పరిశీలించే పరీక్ష.

శారీరక సామర్థ్య పరీక్ష (పీఎఫ్‌టీ): పరుగు, పుష్-అప్స్, ఇతర శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించి అభ్యర్థి యోగ్యతను గుర్తిస్తారు.

వైద్య పరీక్ష: వాయుసేన ఉద్యోగానికి సరిపడే విధంగా ఆరోగ్య సామర్థ్యాలు పరిశీలిస్తారు.

ధ్రువపత్రాల పరిశీలన: వ్యక్తిగత, విద్యార్హతల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది.

మరిన్ని వివరాలు

ప్రస్తుత నోటిఫికేషన్

అగ్నివీర్‌వాయు (మ్యుజీషియన్)– 2025

దరఖాస్తు చివరి తేదీ: మే 11, 2025

దరఖాస్తు రుసుం: రూ.250

వెబ్‌సైట్: www.agnipathvayu.cdac.in

Deep engagement with content

DSC 2025 - English

Writing of discourses - Story, Essay, Letter, Editorial Precis writing, Note making, Autobiography and Biography

Writing discourses like stories, essays, letters, editorials, précis writing, note-making, autobiographies, and biographies in English is crucial for developing clear expression, critical thinking, creativity, and organization of ideas. These forms sharpen communication skills, promote logical structuring, and encourage deep engagement with content, enabling learners to articulate thoughts effectively and tailor their writing for different audiences and purposes.

1. Which one refers to the logical development of the storyline?
1) proportion 2) order
3) environment 4) plot

2. Choose the literary form which is highly personal form of writing.
1) Report writing 2) Essay writing
3) Diary writing 4) Precis writing

3. "To get students acquainted with the lives and deeds of great men and women" This specific aim is achieved through teaching. This is known as
1) Report writing 2) Biographies
3) Letters 4) Precis writing

4. Choose the correct complimentary close for a personal letter to a close friend.
1) Yours faithfully 2) Yours obediently
3) Yours affectionately
4) Yours sincere friend

5. In which type of essay, "the reader is convinced that the position taken by the writer on a subject is right".
1) Argumentative essay
2) Expository essay
3) Reflective essay 4) Narrative essay

6. Which of the following is not a rule of precis writing?
1) always have a heading
2) Remove any irrelevant information
3) Do not use any short forms or abbreviations
4) Replacing single words/ phrases with complex sentences

7. Which of the following is not a characteristic of good note-making?
1) using of abbreviations
2) focusing on the main points
3) presenting the text in a nutshell
4) using long detailed sentences

8. Which of the following writing is related to a newspaper?
1) editorial writing 2) story writing

9. What is the most important thing that should be kept in mind before you begin to write a story?
1) length 2) plot
3) dialogues 4) characters

10. A short Prose of fictional writingis commonly referred to as......
1) note-making 2) biography
3) short story 4) diary

11. The crucial part of a short story is ....
1) beginning 2) ending 3) climax 4) plot

12. Which of the following is not a characteristic of an autobiography?
1) written in the first person point of view
2) based on the author's personal memories and experience
3) it is a form of introspection
4) it is typically fictional in nature

13. The language used to write a business letter is
1) colloquial 2) slang
3) formal 4) informal

14. While writing a precis, the purpose of replacing the long phrases with single words is...
1) to make the meaning clearer
2) to make the text shorter
3) to make the reader curious
4) to increase the length of the text

15. Identify the first step in writing an effective news report.
1) research and gather information
2) write the conclusion
3) edit and proofread
4) understand the structure

16. The final part of a diary entry usually includes



Choose the option that fits the blank.
1) review of upcoming deadlines
2) a list of things to do tomorrow
3) a closing line or sign-off
4) a detailed description of the day's weather

17. One of the following is not a feature of the setting.
1) time 2) place 3) climate 4) technique

18. Choose a private letter from the following.
1) A letter of invitation
2) A letter of complaint
3) A letter to the class teacher
4) A letter to officer

19. The subscription in a letter should be written .....
1) at the end of the letter on the left-hand side
2) after the heading on the right-hand side
3) at the end of the body on the right-hand side
4) after the superscription on the left-hand side

20. The aim of an expository essay is ......
1) to explain, describe, or inform the reader
2) to convince the reader that the position you have taken on a subject is right
3) to vividly describe a person, place, object, event, or experience
4) to narrate an incident or an event

21. Match the following.

A	B
1) Autobiography	p) helps us to preserve a large text in a simple
2) Biography	q) self-reflection
3) Precis writing	r) written one-third of the original in length
4) Diary writing	s) a non-fiction account of a person's life
5) Note making	t) First-person point of view

1) 1-t, 2-r, 3-s, 4-q, 5-p 2) 1-p, 2-q, 3-r, 4-s, 5-t
3) 1-p, 2-s, 3-r, 4-q, 5-t 4) 1-t, 2-s, 3-r, 4-q, 5-p

22. In a story the character antagonist ......
1) creates obstacles
2) opposes the protagonist
3) creates conflict 4) above all

23. ...... is a brief account of an event that has already taken place.
1) precis writing 2) report writing
3) letter writing 4) essay writing

24. The salutation in an official/formal letter always appears ......
1) at the right-hand side
2) at the top right-hand side corner
3) at the left-hand side
4) after the subscription

25. In the story, "What is point of view"?
1) The angle from which the author tells the story
2) The background where the action takes place
3) The sequence of events that occur in the story
4) The central problem/ challenge that characters face in the story

26. Note-making helps an individual ....
1) to develop the skill of comprehension analysis and presentation of a text in a concise note form
2) to rewrite a paragraph in a freestyle
3) to develop listening and writing abilities
4) to write personal feelings and emotions

27. What is the primary perspective used in Biography?
1) First-person point of view
2) Second-person point of view
3) Third-person point of view
4) None of the above

28. How does a biographer gather information about the central figure?
1) By imaginations
2) By conducting interviews
3) By focusing only on personal opinions
4) By making up fictional events

29. Choose the incorrect statement of the following.
1) heading consists of place and time
2) most of the official letters carry a subject line just below the salutation
3) the address of the receiver is called superscription
4) the formal letter should be brief and impersonal

30. The following is important in the process of note-making.
1) suggesting suitable title
2) provide many more examples
3) using compound, complex sentences
4) using complete sentences

31. "Respected headmaster, teachers and friends. I would like to speak a few words on the occasion of ......"
The above information is ......
1) a part of the letter
2) a part of a diary entry
3) a part of a news report
4) a part of speech

32. In which of the following does not have the date?
1) the letter 2) the diary entry
3) the news report 4) the essay

33. Choose the discourse you write when you want to keep your feelings in written form.
1) a diary 2) a letter
3) a story 4) a news report



Writer: Putnam Ravikumar

Answers

1-4, 2-3, 3-2, 4-3, 5-1, 6-4, 7-4, 8-1, 9-2, 10-3, 11-3, 12-4, 13-3, 14-2, 15-1, 16-3, 17-4, 18-1, 19-3, 20-1, 21-4, 22-4, 23-2, 24-3, 25-1, 26-

ప్రజల భద్రతకు రోబోటిక్ కాప్


రెడ్ బటన్ రోబోటిక్ కాప్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ప్రజల భద్రత కోసం చెన్నైలో 'రెడ్ బటన్ రోబోటిక్ కాప్' జూన్‌లో అందుబాటులోకి రానుంది. తొలుత 200 చోట్ల ఈ పోలీసు రోబోలను ఏర్పాటుచేస్తున్నారు. ఇంటర్నెట్ సాయంతో పనిచేసే ఇది 24 గంటల పాటు 360 డిగ్రీల కోణంలో పర్యవేక్షిస్తుంది. జన సంచారాన్ని వీడియో తీయడంతోపాటు వాయిస్ రికార్డు చేస్తుంది. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకుంటే ఈ యంత్రంలోని బటన్ నొక్కితే ఎమర్జెన్సీ అలెర్ట్ మోగి దగ్గర్లో ఉన్న పోలీసులు అప్రమత్తమవుతారు. ప్రమాదంలో ఉన్నవారు పోలీసులతో మాట్లాడటంతోపాటు వీడియో కాల్‌లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించే సౌకర్యాలు ఈ యంత్రంలో ఉన్నాయి. ఈ రోబో పరిధిలో ఏదైనా నేర సంఘటన జరిగితే రికార్డయిన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టవచ్చు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

- వ్యవసాయరంగ లక్ష్యం రూ.3.06 లక్షల కోట్లు
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు


రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఏపీ వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్, బ్యాంకుల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ.6.60 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 22 శాతం అదనంగా రుణ ప్రణాళికను రూపొందించింది. సచివాలయంలో మంగళవారం జరిగిన 231వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2025-26 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. 2024-25 రుణ ప్రణాళిక అమల్లో 127 శాతం వృద్ధి సాధించిన బ్యాంకర్లను అభినందించారు.

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం లక్ష్యానికి అనుగుణంగా వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి రుణాలిస్తామని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు విరివిగా రుణాలు అందిస్తామని వివరించారు. విద్యారుణాలు, గృహ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

- ఎంఎస్ఎంఈ రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 వేల కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా.. రూ.95,620 కోట్లు ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. వ్యవసాయ రుణాల్లో 116 శాతం వృద్ధి సాధించామని.. గతేడాది ఖరీఫ్‌లో రూ.1,69,177 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణంగా అందించామని నివేదించారు.
- గత ఆర్థిక సంవత్సరంలో 2,54,527 మంది కౌలు రైతులకు రూ.4,411 కోట్ల రుణాలు ఇచ్చారు.

వృద్ధి ఎందుకు తగ్గుతోంది?

వార్షిక రుణ ప్రణాళిక అమలులో వృద్ధి ఎందుకు తగ్గుతోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 2021-22 సంవత్సరం లక్ష్యంలో వృద్ధి 133శాతం, 2022-23లో 163 శాతం, 2023-24లో 138 శాతం వృద్ధి ఉండగా.. 2024-25లో 127 శాతం మాత్రమే ఉండటాన్ని ప్రస్తావించారు.

ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిలు ఇవ్వొద్దు

- హైకోర్టులో పోలీసుల వాదన



ఈనాడు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ముందస్తు బెయిలు పొందడానికి అనారోగ్యాన్ని సాకుగా చూపుతున్నారని హైకోర్టుకు పోలీసులు మంగళవారం నివేదించారు. 2024 ఫిబ్రవరి-మార్చి మధ్య ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఎలాంటి వైద్య నివేదికలు లేవని, జూన్‌లో చిన్న చిన్న సమస్యలున్నట్లు యాంజియోగ్రాం తదితరాలతో నివేదిక సమర్పించారని, దేశం విడిచి ప్రయాణం చేయవద్దని వైద్యులు చెప్పినా అమెరికాకు వెళ్లిపోయారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు టి.ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు వాదనలు వినిపిస్తూ ప్రభాకర్‌రావు క్యాన్సర్‌తో బాధపడుతున్నారని చెబుతున్నారని.. కానీ, పదవీ విరమణ తర్వాత కూడా ఓఎస్‌డీగా విధుల్లో కొనసాగారని తెలిపారు. సీఆర్‌పీసీ 41ఏ నోటీసు ఇవ్వలేదన్న ఆరోపణను తోసిపుచ్చారు. కోర్టు ఎన్నిసార్లు సమన్లు పంపినా హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయిందన్నారు. మార్చి 10న రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయిందన్నారు. అమెరికాలో పాస్‌పోర్టు రద్దయిన నేపథ్యంలో ఇక్కడి కోర్టు ఉత్తర్వుల ద్వారా తిరిగిరావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరంలో పిటిషనర్ సూత్రధారిగా వ్యవహరించారంటూ పలువురి వాంగ్మూలాలను కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై సమాచారం రాబట్టడానికి కస్టోడియల్ విచారణ అవసరమని.. ముందస్తు బెయిలు పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

సంధ్య కన్వెన్షన్ ఎండీ ఇంప్లీడ్ పిటిషన్

ప్రభాకర్‌రావు బెయిలు పిటిషన్‌లో తనను ప్రతివాదిగా చేర్చుకోవాలంటూ సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభాకర్‌రావు బెదిరించడంతో భారాసకు చెందిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తన వాదనను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీనిపై ప్రభాకర్‌రావు తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ముందస్తు బెయిలు పిటిషన్ అని, ఇంప్లీడ్ పిటిషన్‌కు దీంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. కోర్టు సమయం ముగిసిన నేపథ్యంలో వీటన్నింటిపై బుధవారం విచారణ చేపడతామని న్యాయమూర్తి తెలిపారు.

పీఎస్ఆర్.. రెండు రోజూ అదే తీరు

- సీఐడీ విచారణకు సహకరించని వైనం
- 4 గంటలు.. 34 ప్రశ్నలు
- నిధులు ఎవరు సమకూర్చారో నన్నెందుకు అడుగుతున్నారు?
- ఆంజనేయులు ఎదురు ప్రశ్నలు



ఈనాడు, అమరావతి: 'కాదంబరీ జెత్వానీపై కేసు నమోదు, అరెస్టుతో నాకెలాంటి సంబంధమూ లేదని చెప్పా కదా! అయినా సరే ఆమెను అరెస్టు చేయటానికి ముంబయి వెళ్లిన పోలీసు బృందాలకు నిధులు ఎవరు సమకూర్చారని నన్ను ఎందుకు అడుగుతున్నారు?' అంటూ సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు సీఐడీ అధికారులను ఎదురు ప్రశ్నించారు. వారు ఏ పద్దుల నుంచి నిధులు వాడారో తనకెలా తెలుస్తుందంటూ దబాయించారు. ఏదైనా ఉంటే సంబంధిత అధికారులను అడగాలని చెప్పారు. 'నిఘా విభాగం నుంచి మీరే ఆ నిధులు సమకూర్చారట కదా' అని దర్యాప్తు అధికారులు అడగ్గా.. అలాంటిదేమీ లేదంటూ దాటవేశారు. జెత్వానీ కేసులో అరెస్టయిన పీఎస్ఆర్ ఆంజనేయులును కస్టడీకి తీసుకున్న సీఐడీ అధికారులు రెండో రోజైన మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విచారించారు. దాదాపు 4గంటల విచారణలో మొత్తం 34 ప్రశ్నలడిగారు. వాటిలో ఏ ఒక్కదానికీ ఆయన సరిగ్గా సమాధానం చెప్పలేదు.

ఎన్ని ఫోన్లు వాడారు.. అవి ఎక్కడున్నాయి?

'జెత్వానీపై కేసు నమోదు కాకముందే మీ ఆదేశాలతోనే విశాల్ గున్ని, ఆయన బృందానికి విమాన టికెట్లు బుక్ చేసినట్లు మా దర్యాప్తులో తేలింది. అక్కడి నుంచి వారు మీతో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నట్లు సీడీఆర్ విశ్లేషణలో వెల్లడైంది' అని సీఐడీ అధికారులు ప్రస్తావించగా ఆ విషయాలపై తానెప్పుడూ మాట్లాడలేదని సమాధానమిచ్చారు.

◆ 'గత అయిదేళ్లలో మొత్తం ఎన్ని ఫోన్లు ఉపయోగించారు? ఎన్ని ఐపాడ్‌లు వాడారు? అవి ఎక్కడున్నాయి?' అని ప్రశ్నించగా.. తాను ఒక్క ఫోనే వాడానని, ఐపాడ్ వినియోగించలేదని పీఎస్ఆర్ సమాధానమిచ్చారు. అధికారిక నంబర్‌ను వినియోగించిన ఫోన్ గురించి ప్రశ్నించగా సరిగ్గా సమాధానం చెప్పలేదు.

మళ్లీ కస్టడీకి తీసుకున్నా సహకరిస్తా

కస్టడీ గడువు ముగియటంతో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఎదుట ఆయన మాట్లాడుతూ. . విచారణకు తాను పూర్తిగా సహకరిస్తున్నానని చెప్పారు. మరోసారి కస్టడీకి తీసుకున్నా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. విచారణ సందర్భంగా ఇబ్బంది పెట్టారా? అని న్యాయాధికారి ప్రశ్నించగా లేదని సమాధానమిచ్చారు. తాను పూజ చేసుకునేందుకు అవసరమైన పుస్తకాలు, బొట్టు ఇవ్వట్లేదని, టీవీ కూడా తీసేశారని న్యాయాధికారికి పీఎస్ఆర్ వివరించారు. వీటికి సంబంధించి ప్రత్యేకంగా పిటిషన్ వేయాలని న్యాయాధికారి ఆయనకు సూచించారు. అనంతరం సీఐడీ అధికారులు పీఎస్ఆర్‌ను విజయవాడ జైలుకు తరలించారు.

వివేకా కేసులో బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితులుగా ఉన్న డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిల బెయిళ్లు రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంలో విచారణ జులై 21కి వాయిదా పడింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా తాము ఈ కేసులను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ కేసులోని నిందితులు సాక్షులను బెదిరిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ ఇందులో కొందరు నిందితులు సాక్షులను బెదిరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరుగుతోందని నివేదికను కోర్టుకు సమర్పించామని తెలిపారు. తర్వాత సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుంటూ ఇందులో ప్రధాన నిందితుడైన డి.శివశంకర్‌రెడ్డి కుమారుడు జైలుకు వెళ్లి ఈ కేసులో అప్రూవర్‌గా ఉన్న వ్యక్తి (దస్తగిరి)ని ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని చెప్పారు. బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితులు ఇలా సాక్షులను బెదిరిస్తుండటం వల్లే వారి బెయిల్ రద్దు కోసం సునీత పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. అవినాష్‌రెడ్డి తరఫున హాజరైన న్యాయవాది రంజిత్ కుమార్ కౌంటర్ వేయడానికి సమయం కోరారు. దీంతో ధర్మాసనం కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈలోపు ఇరుపక్షాలు తమ వాదనలను సమర్పించాలని ఆదేశించింది.

జైలులోనే పెళ్లి చేసుకున్న విచారణ ఖైదీ

- వధువు.. అతడిపై అత్యాచార కేసు పెట్టిన యువతే
- ఒడిశాలోని గంజాం జిల్లాలో ఘటన

ఈటీవీ భారత్: అత్యాచార కేసులో విచారణ ఖైదీగా ఉన్న ఓ నిందితుడు. . ఫిర్యాదు చేసిన బాధితురాలినే జైలు ప్రాంగణంలో వివాహం చేసుకున్నాడు. ఈ ఘటన ఒడిశాలోని గంజాం జిల్లా కొడాలా సబ్‌జైలు ప్రాంగణంలో చోటు చేసుకుంది. ఆ వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని పోలసర పరిధి గోచాబాది గ్రామానికి చెందిన సూర్యకాంత్ బెహెరా తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 22 ఏళ్ల యువతి ఆరోపణలు చేస్తూ.. పోలసర పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు. . సూర్యకాంత్‌ను 2024 నవంబరులో అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతడు కొడాలా సబ్‌జైలులో విచారణ ఖైదీగా ఉన్నాడు. అయితే ఈ కేసును సామరస్యంగా పరిష్కరించుకునేందుకు నిందితుడు, ఫిర్యాదు చేసిన యువతి కుటుంబాల మధ్య కొన్నాళ్ల నుంచి చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ ప్రయత్నాలు ఫలించాయి. దాంతో నిందితుడు సూర్యకాంత్, బాధిత యువతి పెళ్లికి అంగీకరించారని కోర్టులో వారు పిటిషన్ వేశారు. దీనికి న్యాయస్థానం అనుమతి ఇవ్వడంతో ఆదివారం కొడాలా సబ్‌జైలులోని హనుమాన్ ఆలయంలో వారిద్దరికీ హిందూ సంప్రదాయం ప్రకారం అధికారులు పెళ్లి జరిపించారు. ఈ వివాహం అయ్యాక వరుడు జైలులోని తన గదికి తిరిగి వెళ్లగా.. వధువు తన అత్తవారింటికి వెళ్లింది. ఈ కేసును సామరస్యంగా పరిష్కరించుకున్న తర్వాత నిందితుడు, బాధితురాలి కుటుంబాలు కోర్టుకు తమ వాంగ్మూలాలను సమర్పించాయని, తుది తీర్పు వెలువడే వరకు నిందితుడు సూర్యకాంత్ జైలులోనే ఉంటాడని సీనియర్ న్యాయవాది ప్రఫుల్ల కుమార్ మిశ్రా పేర్కొన్నారు. దీనిపై కొడాలా సబ్‌జైలు జైలర్ తరణిసేన్ దేహూరీ మాట్లాడుతూ.. 'అత్యాచార కేసు నిందితుడు సూర్యకాంత్‌కు, ఈ కేసులోని బాధితురాలికి పెళ్లి జరిగింది. ఇద్దరూ ఇష్టపూర్వకంగానే చేసుకున్నారు. అయితే అత్యాచార కేసుల్లో ఈ విధంగా వివాహాల ద్వారా నేరాన్ని తప్పించుకునే యత్నం చేయడం సరికాదు' అని అభిప్రాయపడ్డారు.



సౌర పందిరి!

ఇంట్లో ఎండ తీవ్రత తగ్గేందుకు సహజంగా పైకప్పుపై పందిరి వేసుకుంటారు. లేదంటే చల్లదనం కోసం తెల్లని పెయింట్ వేసుకుని ఎండ నుంచి రక్షణ పొందుతారు. వేడినుంచి ఉపశమనం పొందడంతోపాటు సౌర విద్యుత్తు తయారీ కోసం ఆయన ఇంటి పైభాగంలో ఎత్తున సౌర పలకలను ఇలా బిగించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల ప్రధాన కూడలిలో నివసించే తుపాకుల సుబ్బారావు ప్రయత్నమిది. తనకున్న మూడంతస్తుల భవనం మొత్తానికి ఉపయోగపడేలా పైన 20 కిలోవాట్ల సామర్థ్యమున్న సౌరపలకలను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో దిగువన ఉన్న దుకాణానికి కలిపి భవనానికి విద్యుత్తు బిల్లు నెలకు రూ.20 వేల వరకు వచ్చేది. ప్రస్తుతం విద్యుత్తు బిల్లు గణనీయంగా తగ్గడంతోపాటు ఆయనే మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు ఇస్తున్నారు.

-ఈనాడు, అమరావతి

రెండు రైల్వే లైన్లు జాతికి అంకితం చేయనున్న ప్రధాని

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. రెండు రైల్వే లైన్లు జాతికి అంకితం చేసి, ఓ రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) వంతెన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయనున్నారు. రాజధాని పనుల ప్రారంభ వేదిక నుంచే వర్చువల్‌గా రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితం చేస్తారు. గుంటూరు- గుంతకల్లు డబ్లింగ్‌లో భాగంగా పాణ్యం-కృష్ణమ్మకోన- బుగ్గనపల్లి సెక్షన్‌లో 18 కి.మీ. మేర డబ్లింగ్ పూర్తయ్యింది. అలాగే విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద నార్త్, వెస్ట్ క్యాబిన్ నుంచి.. సికింద్రాబాద్ వైపు 4.5 కి.మీ. మేర మూడో లైన్ నిర్మించారు. ఈ రెండింటిని ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. గుంతకల్లు సమీపంలోని మల్లప్పగేట్ వద్ద 10 కి.మీ. మేర నిర్మించే ఆర్వోఆర్ బ్రిడ్జికి ఆయన శంకుస్థాపన చేస్తారు.

పాకిస్థాన్‌పై ప్రేమ ఎక్కువైతే అక్కడికే వెళ్లిపోండి

- సూడో సెక్యులరిస్టులు ఏదో మాట్లాడుతున్నారు
- కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోం
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతా ఏకమవ్వాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు


ఉగ్రదాడిలో మరణించిన మధుసూదన్‌రావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'కశ్మీర్‌లో పర్యాటకుల్ని ఉగ్రవాదులు అతి క్రూరంగా కాల్చి చంపారు. హిందువా.. ముస్లిమా.. అని అడిగి మరీ తూటాలు దింపారు. స్వయంగా బాధితులే ఈ విషయం చెబుతోంటే దేశంలోనే ఉంటూ కొందరు అలా జరగలేదంటున్నారు. భారతదేశంలో ఉంటూనే సూడో సెక్యులరిస్టులు పాకిస్థాన్‌పై ప్రేమ చూపిస్తున్నారు. అలాంటి వాళ్లు ఈ దేశాన్ని వదిలి పాకిస్థాన్‌కు వెళ్లిపోండి' అని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్సీలు ఇలా మాట్లాడుతున్నారని.. వారిలో దక్షిణాది నాయకులూ ఉన్నారన్నారు. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా అంతా ఏకమై దేశ నాయకత్వానికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం పహల్గాం మృతులకు సంతాప సభ నిర్వహించారు. మృతుల్లో జనసేన క్రియాశీల కార్యకర్త మధుసూదన్‌రావు ఉండటంతో ఆయన కుటుంబానికి పవన్ కల్యాణ్ రూ.50 లక్షలు పార్టీ తరఫున విరాళం ప్రకటించారు.

మనం భద్రంగా ఉన్నామనుకోలేం

'ఎక్కడో కశ్మీర్‌లో జరిగింది కదా మనకేంటి అనుకోకూడదు. హైదరాబాద్ గోకుల్ చాట్‌కు వెళ్లిన వారు ఉగ్రదాడిలో చనిపోయారు. లుంబినీ పార్కులో సేద తీరేందుకు వెళ్లినవారూ ప్రాణాలు విడిచారు. ఉగ్రవాద పంజా అందరిపైనా ఉంటుంది. సరిహద్దుల్లో ఏం జరిగినా ఆ ప్రకంపనలు దేశమంతటా ఉంటాయి. సరిహద్దుల నిర్వహణ చాలా క్లిష్టమైన పని. మన పొలం గట్టు జరిపారంటేనే పోరాడతాం. అలాంటిది దేశ సరిహద్దులు దాటి వచ్చి ఇలా చేస్తే ఊరుకోవాలా? కశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమే. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఉండాలంటే అంతా ఏకమై ప్రధానికి అండగా నిలవాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు.

హిందువులకు ఉన్నది ఒకటే దేశం..

దేశ విభజనప్పుడు జిన్నా పాక్‌లో అందరినీ సమానంగా ఆదరిస్తామన్నారు. ఇప్పుడు అక్కడ హిందువులు కేవలం లక్షల్లోనే ఉన్నారు. వారిపైనా దాడులు జరుగుతున్నాయి. భారతదేశంలో ముస్లింలు పాకిస్థాన్ జనాభా అంత ఉన్నారు. హిందువులకే వివక్ష ఉంటే ఇంతమంది ముస్లింలు ఇక్కడ ఉండగలరా? హిందువులకు భారతదేశం ఒక్కటే దేశం. ఇక్కడా వారిని చంపితే ఎక్కడికి పోతారు? దేశంలో మతసామరస్యం చాలా అవసరం. అలాగని హిందువులకు నష్టం వాటిల్లితే మాట్లాడకూడదా? సెక్యులరిజానికి పడికట్టు పదజాలం తీసుకోవద్దు. కొత్త భారతదేశం ఇది. ఇదివరకటి దేశం కాదు. ఇప్పటికే విసిగిపోయి ఉన్నాం. కాల్చుకుంటూ పోతామంటే చూస్తూ ఊరుకోం' అన్నారు. 'ముస్లింలకు కష్టమొస్తే మొదట స్పందించేది నేనే. పాత్రికేయులతో సహా కొంతమంది ఒక వర్గం అంటూ లోపాయికారీగా మాట్లాడుతున్నారు. నిజం మాట్లాడినంత మాత్రాన అది ద్వేషం అవదు. ఇది ఉగ్రవాదుల మీద ద్వేషం మాత్రమే. మన దేశంలో ఇంత మంది ముస్లిం నాయకులు ఉన్నారు. వారిపై ఎప్పుడైనా ద్వేషం చూపామా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. 'హిందువులుగా పుట్టడమే మేం చేసిన పాపమా' అని మధుసూదన్ భార్య ప్రశ్నించారు. మనకు సహనం ఎక్కువైంది. మితిమీరిన మంచితనం కూడా మంచిది కాదు. వారు ఇష్టారీతిన కాల్చుకుంటూ వెళ్లిపోతుంటే మనం ఎందుకు మౌనంగా ఉండాలి' అని ప్రశ్నించారు.

మార్క్ శంకర్ ఇంకా తేరుకోలేదు

'కొన్ని దుర్ఘటనలు మనసుపై చెరగని ముద్ర వేస్తాయి. నా చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఇటీవల అగ్నిప్రమాదంలో చిక్కుకున్నాడు. మానసికంగా అతను ఇంకా తేరుకోలేదు. మేడ పైనుంచి పడిపోతున్నట్లు కలలు వస్తున్నాయంటున్నాడు. అలాంటిది కన్న తండ్రి ప్రాణాలు కళ్లెదుటే పోతే ఆ పిల్లల మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. నిద్రపట్టినా కలలో తుపాకుల శబ్దాలే వినిపిస్తాయి' అన్నారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా మూడు రోజుల పాటు సంతాప దినాలు పాటించామని, కొవ్వొత్తుల ర్యాలీలు, మౌన దీక్షలు, మానవహారాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

నిన్నటి కానిస్టేబుల్.. రేపటి ఐపీఎస్

- ఉదయ్‌కృష్ణారెడ్డి ప్రయాణం స్ఫూర్తిదాయకం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందనలు

ఈనాడు డిజిటల్, అమరావతి: సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఓ యువకుడిని పైఅధికారి అవమానించారు.. అది అతడిని కుంగదీయలేదు. సరికదా సరికొత్త పట్టుదలకు పురిగొల్పింది. ఎలాగైనా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నిర్ణయించుకున్నాడు. పట్టుదలతో కృషి చేసి సివిల్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. ఫలితంగా నిన్నటి కానిస్టేబుల్ రేపు ఐపీఎస్ అధికారి కానున్నాడు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలేనికి చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి తల్లిదండ్రులు చనిపోవడంతో నానమ్మ రమణమ్మ వద్ద పెరిగాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూనే ఖాళీ సమయంలో నాయనమ్మకు తోడుగా కూరగాయలు అమ్మేవాడు. అనంతరం మెరైన్ కానిస్టేబుల్ కొలువు సాధించి 2013-18 మధ్య విధులు నిర్వహించాడు. అప్పటి సీఐ ఒకరు ఉదయ్ కృష్ణారెడ్డిని తోటి సిబ్బంది ఎదుట అవమానకరంగా మాట్లాడి కించపరిచారు. దీంతో తాను ఎప్పటికైనా ఉన్నత స్థానానికి ఎదగాలని నిర్ణయించుకున్న ఉదయ్ ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ పరీక్షకు సిద్ధమయ్యాడు. హైదరాబాద్‌లో వసతి గృహంలో ఉంటూ శిక్షణ పొందారు.

సమగ్ర శిక్షా అమలు మరో ఐదేళ్లు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖకు సంబంధించి కీలకమైన సమగ్ర శిక్షా ప్రాజెక్టు అమలును కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించింది. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 60:40తో అమలవుతున్న సమగ్ర శిక్షా పథకం 2025-26తో ముగుస్తుంది. 'జాతీయ విద్యా విధానం-2020' అమల్లోకి వచ్చిన నేపథ్యంలో దాన్ని నిజమైన స్ఫూర్తితో 2026-27 నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు అమలు చేసి సత్ఫలితాలను సాధించాలని కేంద్రం నిర్ణయించింది. అందుకు మే 7వ తేదీ నాటికి సూచనలు, సలహాలు పంపాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. దానిపై చర్చించేందుకు మే 16, 17 తేదీల్లో అన్ని రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులతో సదస్సు నిర్వహిస్తామని, ప్రతి కార్యదర్శి ఐదు నిమిషాల పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపొందించుకొని రావాలని సూచించింది. గత ఐదేళ్ల కాలంలో సమగ్ర శిక్షాలో భాగంగా నిపుణ్ భారత్ మిషన్, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, బ్యాగ్‌లెస్ డేస్, ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక స్టైపెండ్, స్మార్ట్ క్లాసరూమ్‌ల ఏర్పాటు, ఎస్‌సీఈఆర్‌టీలో అసెస్‌మెంట్ సెల్, డైట్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా తీర్చిదిద్దడం తదితర కార్యక్రమాలను కొత్తగా తీసుకొచ్చారు.

మెడకు చున్నీ చుట్టుకుపోయి యువతి మృతి

భర్తతో కలిసి బైక్‌పై వెళుతుండగా ఘటన


కళ్యాణపు రామదుర్గ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భర్తకు ఉద్యోగం రావడంతో కొత్త జీవితం ప్రారంభించాలని కలలు గన్న యువతిని చున్నీ రూపంలో మృత్యువు కబళించింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ నమ్మి గణేష్ మంగళవారం తెలిపిన ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కేసనకుర్రుకు చెందిన కళ్యాణపు రామదుర్గ (28)కు కోనసీమ జిల్లా పోలవరానికి చెందిన విన్నకోట మోహన్‌కృష్ణతో 9 నెలల క్రితం వివాహం జరిగింది. మోహన్‌కృష్ణకు అచ్యుతాపురం సెజ్‌లో ఉద్యోగం రావడంతో దంపతులు ఇక్కడకు సమీపంలోనే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సోమవారం రామదుర్గకు చెవి నొప్పిగా ఉండటంతో రాత్రి 7 గంటలకు భర్త ఆమెను ఆసుపత్రికి బయలుదేరారు. వారి బైక్ హరిపాలెం వచ్చిన సమయంలో రామదుర్గ వేసుకున్న చున్నీ బైక్ వెనుక చక్రంలో పడి మెడను చుట్టేసింది. స్థానికులు గమనించేటప్పటికే ఆమె కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. వారు వెంటనే చున్నీని కత్తిరించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెళ్లయిన 9 నెలలకే నూరేళ్లు నిండాయా అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కన్నీరుపెట్టించింది. పోలీసులు కేసు

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి

ముగ్గురి దుర్మరణం

తిరుపతిలో విషాదం


ప్రమాదం జరిగిన భవనం


భవనం వద్ద మృతదేహాలు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: తిరుపతి నగరం మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో నిర్మాణంలో ఉన్న భవంతిపై నుంచి పడి ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మంగళవారం తుడా క్వార్టర్స్ ప్లాట్‌నంబరు 63లో శ్రీకాళహస్తికి చెందిన యజమాని ఆండాలయ్యకు చెందిన ఐదంతస్తుల భవనంపై వారు పనిచేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. భవన యజమాని బంధువు తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం అక్కగిరిపేటకు చెందిన బొడితొట్టి శ్రీనివాసులు(39), ప్రస్తుతం శ్రీకాళహస్తిలో నివసిస్తున్న ప్రకాశం జిల్లా కొండేపి మండలం ఆకర్లపూడి గ్రామానికి చెందిన బావ బావమరుదులు కుంచాల శ్రీనివాసులు(45), తన్నీరు వసంత్(35), నెల్లూరు జిల్లా కావలికి చెందిన మాధవ ఉదయం ఐదో అంతస్తులో పనులు చేపట్టారు. అటకపైకి ఎక్కి ప్లాస్టరింగ్ చేస్తుండగా.. వారు నిల్చున్నచోట తాడు తెగి ఒక్కసారిగా శ్రీనివాసులు, కుంచాల శ్రీనివాసులు, వసంత్ అదుపు తప్పి 60 అడుగుల ఎత్తు నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మాధవ మాత్రం జారిపడే సమయంలో చేతికందిన కర్రను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. మూడంతస్తులకు అనుమతులు తీసుకుని ఐదంతస్తులు నిర్మిస్తున్నారని గుర్తించి భవన యజమానిపై కేసు నమోదుకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీని సస్పెండ్

కంచి కామకోటి పీఠాధిపతిగా.. నేడు గణేశశర్మ బాధ్యతల స్వీకరణ

అన్నవరం, న్యూస్‌టుడే: తమిళనాడులోని కంచి కామకోటి పీఠం 71వ పీఠాధిపతిగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశశర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. తొలుత కాంచీపురం కామాక్షీ అమ్మవారి ఆలయంలో ప్రస్తుత పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా సన్యాస దీక్ష మహోత్సవం జరగనుంది. ఉదయం 6 గంటల నుంచి 7:30 లోపు ఆలయంలోని పంచ గంగ సరస్సు తీరాన ఈ క్రతువు ఉంటుంది. అనంతరం కామాక్షి అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. ఆలయ ప్రాంగణంలోని ఆదిశంకరుడి సన్నిధిలో 71వ పీఠాధిపతికి నామకరణం చేస్తారు. తర్వాత ఊరేగింపుగా శంకరమఠం చేరుకుంటారు. అక్కడ మహా త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి దర్శనం చేసుకుని పీఠాధిపతి బాధ్యతలు స్వీకరిస్తారు. బృందావనం వద్ద ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాల నుంచి ప్రత్యేక ప్రతినిధులు తీసుకువచ్చిన ప్రసాదాలు స్వీకరిస్తారు. చంద్రమౌళీశ్వర పూజ, పాద పూజ సమర్పణ తర్వాత భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. అన్నవరం ఆలయానికి, కంచి పీఠానికి అనుబంధం ఉండటం, కొత్త పీఠాధిపతి అన్నవరానికి చెందిన వారు కావడంతో ఈవో సుబ్బారావు, పండితులు సత్యదే

సముద్రం అడుగున నృత్యం


నృత్యం చేస్తున్న బాలలు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: అంతర్జాతీయ నృత్య దినోత్సవం(ఏప్రిల్ 29) సందర్భంగా మంగళవారం తమిళనాడులోని రామేశ్వరానికి చెందిన తారాగై ఆరాధన(9), అశ్విన్ బాలా(14) సముద్రంలో నృత్యం చేశారు. స్కూబా డైవర్ల సాయంతో అన్ని రక్షణ చర్యలు తీసుకొని సముద్రంలో 20 అడుగుల లోతుకు వెళ్లి డ్యాన్స్ చేశారు. సముద్ర కాలుష్యం, సముద్ర జీవుల రక్షణ, నాట్యంపై అవగాహన కల్పించేం